మణిమంజరి

వాఙ్మయ, యోగ పరిశోధన పత్రిక

(Feb & March 2022)

ప్రధాన సంపాదకులు

శ్రీ ఎ.వి. ధర్మారెడ్డి, I.D.E.S.

కులపతులు

శ్రీవేటూరి ప్రభాకర శాస్త్రి వాఙ్మయ పీఠం మరియు పరిశోధన కేంద్రం

శ్రీవేంకటేశ్వర వేదవిశ్వవిద్యాలయము

తిరుపతి - 517 502

MANIMANJARI

Chief Editor	:	Sri A.V. Dharma Reddy I.D.E.S. Vice - Chancellor
Editors	:	Dr. A.Venkata Radheshyam Dr. R.V. Ramakrishna Sastry
Copies	:	200
Price	:	Rs.200/-

© Sri Venkateswara Vedic University, Tirupati, A.P.

Produced by	:	Sri Veturi Prabhakara Sastri Vanjmayapeetham and Research Centre
Published by	:	The Registrar Sri Venkateswara Vedic University, Tirupati - 517502, Andhra Pradesh.
Published by	:	Sri Veturi Prabhakara Sastri Vanjmaya Peetham and Research Centre Sri Venkateswara Vedic University
Email	:	svvupublications@gmail.com
Website	:	www.svvedicuniversity.ac.in
Phone	:	0877-2264404
Printed at	:	

మున్నుడి

మానవజాతి మనుగడకు భాషాసంస్కృతులు మూలకందములు, ఆ రెండిటికి శాశ్వతత్వమును కల్పించునది సాహిత్యము.

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు బహుముఖ ప్రజ్ఞాశాలి. సంస్కృతాంధ్రభాషలలో గొప్ప పండితులు. తెలుగు భాషా సాహిత్యాలలో గొప్ప పరిశోధకుడు. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసింపబడుతున్న శ్రీమాన్ తాళ్ళపాక అన్నమాచార్యులవారి సంకీర్తనలు వెలుగుచూడడానికి గొప్ప కృషిచేసిన మహామనీషి. వీరు ఎన్నో ప్రాచీన గ్రంథాలను తాళపత్రాలనుండి సేకరించి పరిష్కరించారు. ఊరూరా తిరిగి తాళపత్రాలను సేకరించడమేగాక, ఆయా ప్రజల వ్యవహారంలో ఉన్న తెలుగు పలుకుబళ్ళు, సామెతలు, జాతీయాలు, జానపదగేయాలు, పెండ్లిపాటలు మున్నగు వానిని సేకరించి గ్రంథస్థం చేసారు. శాసనాలను పరిశీలించి ఆయాకవుల కాలాలను నిర్దుష్టంగా నిర్ణయించారు. భాషాసాహిత్య పరిశోధకులేకాక, వీరు స్వయంగా ఖండకావ్యాలను, కథలను రచించి కవిగా గుర్తింపును పొందారు. మాస్టర్ సి.వి.వి.గారి శిష్యరికంలో యోగవిద్యనభ్యసించి, యోగాచార్యునిగా ఎందరికో యోగవిద్యలో శిక్షణనివ్వడమేగాక, తన యోగశక్తిచేత ఎందరికో ఆరోగ్యసమస్యలను తీర్చారు.

శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయపీఠం మరియు పరిశోధనాలయం 2007వ సం॥నుండి తిరుమల తిరుపతి దేవస్థానములచే నిర్వహింపబడుతోంది. శ్రీశాస్త్రిగారు రచించిన, పరిష్కరించిన సుమారు 35 గ్రంథములను తి.తి.దే. ప్రచురించింది. ఇంకా మరికొన్ని గ్రంథాలను త్వరలోనే ప్రచురింపబోతోంది. శ్రీశాస్త్రిగారి ఆంధ్రభాషాసాహిత్యాల కృషిని ప్రస్తుత తరంవారికి తెలియజేయడానికి ప్రతిసంవత్సరం శ్రీశాస్త్రిగారి జయంతి, వర్ధంతి ఉత్సవాలను పీఠంపక్షాన నిర్వహిస్తున్నాం. ఆ సందర్భంగా 'మణిమంజరి' సాహిత్య, యోగ పత్రికను ఆవిష్కరిస్తున్నాం. శ్రీ శాస్త్రిగారి 72వ వర్ధంతి సందర్భంగా ఈ 'మణిమంజరి' పత్రిక ప్రచురింపబడింది. ఇందలి వ్యాసాలు ప్రముఖ పరిశోధకులు రచించారు. వాటిని చదివి నేటితరంవారు శాస్త్రిగారి కృషిని, సాహిత్యపు విలువలను గ్రహింపగలరని భావిస్తున్నాము.

సదా శ్రీవారినేవలో

కులపతి

శ్రీ వేంకటేశ్వర వేదవిశ్వవిద్యాలయం
తిరుమల తిరుపతి దేవస్థానములు,
తిరుపతి.

విషయసూచిక

1.	శ్రీనివాసస్తుతి పంచరత్నాలు	1
2.	వేటూరి ప్రభాకరశాస్త్రి శ్రీనివాసస్తుతి పంచరత్నాలు విశేషాంశాలు	3
3.	శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి – జీవనరేఖలు	9
4.	వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ప్రాచ్యపరిశోధనసంస్థకు చేసినసేవ	20
5.	వాఙ్మయ శిఖరం వేటూరి – "నీతినిధి"	28
6.	సాహిత్య పరిణిత బుద్ధి – అమృతయోగ సిద్ధి – శ్రీ వేటురి ప్రభాకర శాస్త్రి	39
7.	మృత్యోర్మా అమృతం గమయ	46
8.	శ్రీ శాస్త్రి గారి యోగము – ప్రార్థన	51
9.	స్వతఃప్రమాణము	56
10.	శ్రీవేటూరి ప్రభాకర శాస్త్రి గారి అమూల్యరచన – గాలికబుర్లు : భాషా పరిశీలన	59
11.	ప్రజ్ఞా ప్రభాకరము (శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రిగారు)	78
12.	వేటూరి ప్రభాకరశాస్త్రి – ఉత్తరహరివంశ వ్యాఖ్య	80
13.	ప్రభావ ప్రభాకరుడు	88
14.	**Yorkshire-Rangoli Radio Gosti**	98
15.	'శ్రీపదార్చన' అన్నమయ్య ఆధ్యాత్మిక సంకీర్తనలు – ఒక పరిచయం	105
16.	తాళ్లపాక సంకీర్తనలు – తి.తి.దే ప్రత్యేక సంపుటం – పరిశోధనాత్మక పరిశీలన	123
17.	'అన్నమయ్య' పద వ్యుత్పత్తి – విచారణ	132
18.	అన్నమయ్య కీర్తనలు – సమాజ చిత్రణ	136
19.	అన్నమాచార్యస్వామి వేంకటేశ్వర శతకం	142
20.	అన్నమయ్య సంకీర్తనల్లో లోకజ్ఞాత	147
21.	అన్నమయ్యలోని సమాస విశేషములు	154
22.	అన్నమయ్య సంకీర్తనల్లో శ్రీరాముడు	163
23.	తాళ్ళపాక పదకవుల సంకీర్తనలు – కాలం విలువ	173
24.	అన్నమయ్య – వైష్ణవ భక్తితత్త్వం	178

విన్నపము

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయపీఠం మరియు పరిశోధనాలయం – 'మణిమంజరి' అనే సాహిత్యయోగపత్రికను ప్రతి సంవత్సరం ఫిబ్రవరి, ఆగష్టు నెలలో షాణ్మాసిక పత్రికగా శ్రీశాస్త్రిగారి జయంతి, వర్ధంతి సందర్భములలో ప్రకటించుచున్నది. ఇంతవరకు 12 పత్రికలు వెలువడినవి. ఈ సంవత్సరము 2022లో అనివార్యకారణములవలన ఫిబ్రవరి నెలలో ఈ పత్రికను ప్రకటింపలేదు. కావున ఇప్పుడు ఫిబ్రవరి మరియు ఆగష్టు నెలల సంయుక్త సంచికను (14&15) ప్రకటించుచున్నాము.

ఇందు ప్రభాకరశాస్త్రి గారి జీవిత విశేషములను గూర్చి, వారి శిష్యుల యోగానుభవములను గూర్చి, వారి సాహిత్యమును గూర్చి, అన్నమయ్య సాహిత్యమును గూర్చి ప్రముఖులైన పండితులు, పరిశోధకులు వ్రాసిన వివిధ వ్యాసములను పొందుపరచినాము. దీనిని పాఠకులు సద్వినియోగము చేసికొనగలరని భావించుచున్నాము.

ఇట్లు

ఆర్.వి.రామకృష్ణశాస్త్రి

ప్రత్యేకాధికారి (I/C)

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయపీఠం

మరియు పరిశోధనాలయం.

1. శ్రీనివాసస్తుతి పంచరత్నాలు

– కీ।।శే।। శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి

సీ।। చెక్కిళ్ళఁ జిఱునవ్వు చిందుద్రొక్కెడుఱేఁడ!
యేడుకొండలవాఁడ! యేలుకొమ్ము
అలమేలు మంగాంబ చెలికాఁడ! యదుగడ్డు
దండాలవాఁడ! మాకండ వగుము
ఆమటమ్రొక్కులస్వామి! గోవింద గో
వింద సందడివేల్ప! వందనమ్ము
కలియుగప్రత్యక్షకులదైవమా! యెల్ల
డెందాలవిహరించువింద! శరణు

గీ।। పిండివంటకములు కుండలవండిన
యోరెములను మాత్ర లారగించి
భక్తులకుఁ బ్రసాదపఱుచు మహాభోగి
వరకటాక్ష! పరమపురుష! రక్ష! 1

సీ।। నిలువుదోపుడు దోచు నెఱదొంగతన మేమి?
పాపముల్ హరియించు భావ మొక్కొ
వడ్డికాసులఁ గూర్చు వ్యాపార మది యేమి?
మేలు పెంపొందించు లీల యొక్కొ
తలమీఁది నీలాలఁ దొలఁచిపుచ్చుట యేమి?
చిక్కులం దెగటార్చు ఫక్కి యొక్కొ
ఏడుకొండలమీఁద వీడొటయేమి? స
హస్రారవసతిరహస్య మొక్కొ

గీ।। ఏటివో యివి పెద్దలనాఁటిమాట
లీశ్వరుఁడు సర్వభూతసుహృత్తు, సుహృదు
డాపదపహర్త, యనవార్త కలరి యట్టి
వాఁడ వను కన్నెఱిఁగి కొల్చినాఁడ నిన్నె! 2

శా।। ఏరీ కోరి మనోజ్ఞపుష్పములు నీ కీయెన్నిదే[1] యంచు నా
త్మారామమ్మునఁ బూవఁజేసితి నహింసాదిప్రసూనంబు లే
నారాధించెద వీనిచే నిను ననంతాళ్వార్ల కైంకర్యపుం
దీరుల్ గా వని వేఱుచేసెదవె తండ్రీ! వేంకటాధీశ్వరా! 3

చ।। దూరంబేల పరంబు నీ విహమునందున్ భక్తరక్షార్థ మ
ర్చారూపంబు ధరించి యుంటివన నిచ్చల్ నిన్నెలోకన్ను చె
న్నారం గాంచెద దేహదేవకులమూలాధారమం దాసహ
స్రారంబున్ సుఖసత్యచిత్కలిత దీపారాధనల్ సేయుచున్! 4

చ।। కరకరపల్కులన్ బిరుసు గల్గినశర్కర నన్ను బాగుగాఁ
గరఁచి పొరంటికొంటివి నిగన్నిగమీఁగడపాల వీవు ని
ల్వరమున నాకు మార్దవము వచ్చెను నీకు ఘనత్వ మబ్బె ని
ర్భరము రసాయనం బగుటపోలదె యుర్వికిఁ గ్రొత్తకోవగాన్. 5

* * *

---

1. అహింసా ప్రథమం పుష్పం పుష్ప మింద్రియనిగ్రహః
క్షాంతిః పుష్పం దయా పుష్పం జ్ఞానం పుష్ప మతః పరమ్ ।
సత్యం పుష్పం తపః పుష్పం భావపుష్ప మథాష్టమమ్
ఏవ మష్టవిధం పుష్పం విష్ణోః ప్రీతకరం పరమ్ ॥

2. వేటూరి ప్రభాకరశాస్త్రి శ్రీనివాసస్తుతి పంచరత్నాలు - విశేషాంశాలు

- ఆచార్య కె. సర్వోత్తమరావు

సంస్కృతాంధ్ర కవిపండిత విమర్శకుల ప్రశంసా గౌరవాదుల నందుకొన్నవారిలో శ్రీవేటూరి ప్రభాకర శాస్త్రిగారొకరు. శాస్త్రిగారు ఆంధ్రావనికి అందించిన గ్రంథపీఠికలలో శ్రీ తాళ్లపాక చినతిరువేంగళనాథుడు (చిన్నన్న) రచించిన శ్రీతాళ్లపాక అన్నమాచార్యుల జీవితచరిత్రకు వెలువరించిన పీఠిక అత్యంత విశిష్టమయిన పీఠికగా నాడు కాదు నేడుకూడా సమ్మాన్యమై ఎంతో మంది పరిశోధకులకు కల్పవృక్షంగా ఉందనడం ఏ మాత్రమూ అతిశయోక్తికాదు. శ్రీశాస్త్రిగారు చిన్నన్న రచనను పరిష్కరించి 133 పేజీల బృహత్ పీఠికను కూర్చి 1949 వ సంవత్సరం తి.తి.దే ప్రచురణగా సహృదయులకు అందచేశారు. పీఠికాంతంలో ఐదు పద్యాలను జోడించి చివర ఈ పద్యాలు చిన్నన్నవి అని భ్రమపడతారని వే.ప్రభాకరశాస్త్రి అని ముద్రించారు. ఈ పద్యాలలోని అంశం శ్రీనివాసపరదైవానికి సంబంధించినవి కావడం వల్లను, ఒక అంశానికి సంబంధించినవి కావడం వల్లను నేను వేటూరి ప్రభాకరశాస్త్రి శ్రీనివాసస్తుతిపంచరత్నాలుగా భావించి నా వ్యాస శీర్షికగా ఎన్నుకొని ఈ స్తుతిలోని విశేషాంశాలను ఎరుకపరచదలచాను. ఈ పద్యాలకు తగిన శీర్షికలను ఎంపిక చేసుకొన్నాను.

అద్భుతానంద వీక్షణం

తిరుముల చేరుకొనేవారు స్వామిని దర్శించడానికి తహతహలాడతారు. తన కంటే ముందున్నవారు చరచరా కదలితే సంతోషిస్తారు. ఆలయంలోపల నిత్యోత్సవాలు జరుగుతుంటే ఎపుడా పూజలు పూర్తి అవుతాయో అని నిరీక్షిస్తుంటారు. పూజలయ్యాక మహా మణిమంటపంలో అడుగుపెట్టాక అన్నీ మరచి స్వామి సర్వావయవ సౌందర్యవీక్షణలో సర్వం మరచిపోతారు. ఆ అనుభూతి అనుభవైకవేద్యం.

శాస్త్రిగారు మొదటవ్రాసిన పద్యం. 'చెక్కిళ్ళు జిఱునవ్వు చిందు బ్రాక్కెదు ఱేడ, అనే సీసపద్యం. సీసం శీర్షిక భవమను కొంటే శాస్త్రిగారు శిరసునుండి స్వామిని వీక్షించారనవచ్చు. అదే సందర్భంలో నిలుచున్న దేవుని శీర్షం నుండి చూడాలనే నియమాన్ని కూడా పాటించారని భావించవచ్చు. పద్యమంతా పరిశీలిస్తే శాస్త్రిగారు స్వామి నివేదనానంతరం మూలమూర్తిని దర్శించిన తీరు స్పష్టమవుతున్నది. నివేదననంతరం క్యూకదలుతుంది. వెనుకటి రోజులలో మహామణిమంటపంలోని రెండుగంటలున్న ప్రాంగణంలో ప్రసాదాల హండీలు కనిపించేవి. క్యూలో ప్రవేశించేవారికి ఇవన్నీ కనులవిందుచేసేవే. లోకంలో భగవత్ ద్దర్శనం కోరేవారు భగవత్ ప్రసాదం కాసంత దొరికితే తెగ సంబర పడిపోవడం అందరికి తెలిసిందే. దర్శనానంతరం వీక్ష్యమాణమయిన ప్రసాదాలు కనుక సీసపద్యం చివరి అనుసంభవించే ఆటవెలచి పద్యంలో తాను దర్శించిన ప్రసాద భాండాలలోని రకరకాల నైవేద్యాలను వర్ణించడం సబబని పించింది. ఇక ఇతర విశేషాలు.

నవ్వు అనేకరకాలు. చిర్నగవు అనేక భావాల ప్రచర్యనలకు సంకేతం. నాస్తికుడయిన వ్యక్తి చివరకు ఆస్తికుడై స్వామిదర్శనానికి వస్తుంటే ఇన్నాళ్ళకయినా వచ్చావులే. ఇంతకాలం నీవుదారి తప్పి వైరభక్తిలో నడయాడావు. చివరకు సుపథంలో వచ్చావులే అన్నట్టుగా చిర్నగవు. నా నివాసస్థానానికి సుదారంగా వుంటూ గృహసీమలోనే పూజాదికలు నిర్వహిస్తూ ప్రార్థనలు చేసుకొనే నీవు రావడం నాకూ సంతోషమే అన్నట్టు చిర్నగవు పలుకరింపు. మరి శాస్త్రిగారికి చెక్కిళ్ళ౮ జిరునవ్వు చిందు ద్రొక్కెడు రూపంలో కనిపించడానికి కారణం నీ కత్యంత ఆప్తుడు, నందకాంశసంభవుడయిన నావాడు, 32 వేల పదాలు వ్రాసినా ఒక్క సంకీర్తనం, బొద్దికనుండ చాలు తక్కినవి భండారాననుండనీ అన్న అన్నమయ్య చరిత్రను, చిన్నన్న రచనను పరిష్కరించి కవులకు, గాయకులకు, పండితులకు భక్తులకు అందచేసేలా చేసిన నీ కృషికి, నా పట్ల నీకున్న భక్తికి సమాధానంగా ఆప్యాయతరూపంలో 'చిర్నవ్వు', స్వామి తోడు. రాజన్నమాట పూజాదులలో చివరగా 'రాజాధిరాజాయ' అని మంత్రాలు అర్చక స్వాములు పఠించడం పూజావిధనంలోని ఒక ఉపచారం.

రెండవది 'ఏడుకొండలవాఁడ' అనే సంబోధన. ఏడుకొండలేవీ అనడంలో అభిప్రాయభేదాలున్నాయి. వేంకటేశ్వరత్మకపురాణాలలో ఒక్కొక్క యుగంలో ఈ కొండకు ఒక్కొక్క పేరంటుంది. కాని రోజూ ఉషఃకాలంలో పఠింపబడే సుప్రభాత శ్లోకాలలో శ్రీశేషశైల గరుడాచల వేంకటాద్రి నారాయణాద్రి వృషభాద్రి వృషాద్రి ముఖ్యామ్ అని సప్త పర్వతాలు పేర్కొనబడ్డాయి. అయితే ఈ రంగంలో విస్తృత పరిశోధన చేసిన ఆచార్య ఎస్.బి.రఘునాథాచార్యగారు తిరుమలకు 20 పేర్లున్నట్లు గుర్తించారు. అయినా వాటిని అంతగా పట్టించుకోని తెలుగువారు కొండలెక్కేవేళ 'ఏడుకొండలవాడ'. వెంకటరమణ! గోవింద గోవింద అంటూ పర్వాతారోహణం చేస్తారు. ఆళ్వార్ల పాశురాలలో 'తిరువేంగతం' అనడానికే ప్రసిద్ధి. తమిళభక్తులు తెలుగువారిలాగా. ఏళు మలైయాన్! తిరువేంగడవా అంటూ పర్వతాధిరోహణం చేస్తారు. కన్నడిగులు మెట్లోత్సవానికి ప్రాధాన్యమిస్తారు.

తరువాతి సంబోధన 'అడుగడ్డుదండాల వాడ! ఇది సోపాన అధిరోహణ సమయంలో ప్రతిమెట్టుకు పసువుకుంకుమలు పెట్టి సర్వమూ శ్రీమయమని భావిస్తూ దండంపెడుతూ ఎక్కడం కావచ్చు. లేదా నేటికీ భక్తులు పాటించే 'పొరలు దండాలు' కావచ్చు లేదా వైష్ణవులు ఆచార్య వర్యులకు, దేవునికి భక్తితో సమర్పించే సాష్టాంగదండ ప్రణామం కావచ్చు.

తరువాతిది 'ఆమట మొక్కుల స్వామి' మా కవులు తమ ప్రయత్నమంతా వ్యర్థమనుకొన్నప్పుడు చివరకు దైవాన్ని ఆశ్రయించడం సహజం. ముఖ్యంగా చికత్సలతో నయంకాని వ్యాధి విముక్తి కోసం చేసే చివరిప్రయత్నం. ఇదేగాక రకరకాల వాంఛలు తీరడాని కోసం, తీరిన తరువాత మొక్కులు తీర్చుకోవడమూ కావచ్చు. ఇవి నానారకాలు. తలనీలాల సమర్పణ, ఒంటినగలెల్ల హుండీలో వేయడం, నిర్ణీత ఉత్సవాదులలో ఆర్జితసేవగా పాల్గునడం, మూడు రాత్రులు తిరుమలలో వాసం చేయడం, అనేక రకాల దానాలు చేయడం లాంటివి. ఇటీవలి కాలంలో అయితే తి.తి.దే వివిధ ట్రస్టులకు చెక్కుల ద్వారా వితరణలు కావచ్చు. అన్నమయ్య వేడుకొందామా వెంకటగిరి వెంకటేశ్వరుని కీర్తనలో భక్తుల కాంక్షలు, వారి విశ్వాసాలను వర్ణించాడు.

ఆపైది గోవింద! గోవింద సందడి వేల్పు. ఈ నినాదం ఇతర వైష్ణవాలయాలలో లేదు. తిరుమలేశునికే అన్వర్థం. ఇందుకు ప్రధాన కారణం గొల్లవాడు. తనదృష్టిలో పాలనకోసం ఆదేశించిన గోవు ఒక పుట్టపై నిలబడి పుట్టలోని స్వామి కోసం క్షీరం స్రవిస్తుండడం చూసి కోపంతో గొడ్డలితో కొట్టబోయిన వేళ స్వామి పుట్టలో నుండి ఆవిర్భవించి ఆవుకు ఏలాంటి దెబ్బతగలకుండా తాను అడ్డుపడడమనే వృత్తాంతం ఆచారంగా ఏర్పడింది. స్వామి రక్షణ చేసిన దేవుడు. గోవుకు ఆనందం కలిగించినదేవుడు కనుక తిరుమలేశుని గోవింద నామంతో స్మరించడం. ప్రస్తుతానికి పండితులు విశదీకరించే వ్యుత్పత్తులు పామరుల కవసరం లేనివి. తరువాతి సంబోధనలు కలౌ వేంకట నాయకః అనడాన్ని స్పష్టపరిచేది. 'ఎల్లడెందాల విహరించు విందా' అనడంలో స్వామిని తమతమ దేవునిగా భావించడాన్ని స్పష్టం చేసేది. ఈ అంశాన్ని అన్నమయ్య 'ఎంతమాత్రమున నెవ్వరు దలచిన అంతమాత్రమే నీవు, కీర్తనలో స్పష్టం చేశాడు.

చివరి ఆటవెలదిలో స్వామివారికి సమర్పించే వంటకాలు, వంటలు, విశేషప్రసాదాల కథనముంది. ఈ అంశాన్ని శాస్త్రిగారు 'అరిసెలు నూనే బూరియలు నోఁగులుఁ జెక్కర మందెనోల్, బురుడలు, పాలమండేణము లపుండములు. పరమాన్న శతంబులు సూపకోట్లు.....నిరతవినిర్మలాన్న ములనే తులసోనలు' అనే వర్ణనగల శ్రీవేంకటేశ్వరశతక పద్యాన్ని ఉదాహరించినవారే –

భారతదేశంలో రకరకాలయిన ప్రసాదాలు 'పూరిలోనే జగన్నాథ స్వామికే అనడం. వండడానికి వాడేవి కొత్తమట్టి పాత్రలని, వాడిన వస్తువులను మరల వాడరని, ఇటీవల వ్యాఖ్యాతలు చెప్పడాన్ని చాల మంది విన్నవారే.

కొండ మీద ఇన్ని ప్రసాదా లెంచు కనడం కుతూహలం కలిగించే అంశం. ఇందుకు రెండు మూడు కారణాలున్నాయి. ఆర్ష సిద్ధాంతం ప్రకారం 'అన్నం అమ్మడం' పాపకృత్యం. పాతరోజుల్లో హోటళ్ళు లేవు. మఠాలే కేంద్రాలు లేదా కొందరు అన్నదానం చేయడం. ఇవన్నీ చాలవు. అందుకే భక్తులకు అటవీప్రాంతమయిన తిరుమలలో దేవస్థానంవారే ప్రసాదాల రూపేణ ఆహారమందించడం – గతంలో అడిగినంత ప్రసాదాలిచ్చే సంప్రదాయాన్ని నేనూ చూసినవాణ్ణే.

పాతకాలంలో తమిళులు, కన్నడిగులు, ఆంధ్రులే తిరుమలకు విచ్చేసే భక్తులు కనుక ఆయా ప్రాంతాల ఆహార వైవిధ్యం ప్రసాదాదులలో జోక్యం చేసుకొందనడం సబబు.

అంతరార్థ సంవీక్షణం

శాస్త్రిగారు మొదటిపద్యంలో వర్ణించినవన్నీ భౌతిక నేత్రాలతో దర్శనీయ మయినవే. ఇవన్నీ భక్తి సాధనలో తొలిమెట్టుమాత్రమే. స్వామికి సమర్పించే ముడుపులు, మొక్కులలోని అంతరార్థాన్ని స్వామిసేవలో అంతర్భాగంగా మారిన అంశాలను 'నిలువు దోపుడు దోచు' అనే పద్యంలో తర్కించారు. సమర్పణలోని అంతరార్థాన్ని అరటిపండు ఒలిచినట్లు' చెప్పారు.

మానవులు రకరకాల పాపాలు మనసా, వచసా, కర్మణా చేస్తుంటారు. అలాగే సంపదలపై వ్యమోహం ఏమాత్రముండకూడదని వేదాంతుల తుది బోధన. అంతే కాదు కోరికలు నెరవేరగా అర్పించే మొక్కుబడి, వీటన్నిటిని దృష్టిలో పెట్టుకొని, పాపముల్ హరియించుభావ మొక్కొ అన్నారు.

ఇక రెండవపాదంలో వడ్డీకాసుల వ్యాపారాన్ని' చెప్పారు. ఇది ఎప్పటి దనడంలో అభిప్రాయ భేదాలున్నాయి. స్వామి పద్మావతిని విహహమాడేవేళ సంపన్నులతోడి వియ్యము కనుక కుబేరుని దగ్గర అప్పు చేశాడని వేంకటేశ్వర సంబంధి పురాణాలు చెబుతున్నాయి. తరిగొండ వెంగమాంబ ఈ ఘట్టాన్ని రమ్యంగా తన మాహాత్మ్య గ్రంథంలో వర్ణించింది.

ఈ వడ్డీపత్రం ప్రపంచంలోనే అతి ప్రాచీనమయిన 'ప్రామిసరీ నోట్‌గా' న్యాయవాదులు చమత్కరించారు. మరికొందరు స్వామి సేవకు అవసరమయిన ధాన్యం, క్షీర సంబంధి వస్తువులను సమకూర్చడాని కోసం తిరుమల పరిసరాలలోని రైతులకు 'వడ్డీ ఇచ్చే అప్పుగా' ఇచ్చే వారని అదే వడ్డికాసుల వ్యాపారము అంటారు. శాసనాలలో రెంటికీ ఆధారాలున్నాయి.

మూడవది 'తలమీద నీలాలు తొలగి పుచ్చుట. ఈ మొక్కు కూడా చాల కారణాలున్నాయి. మనిషికి చెడు ఆలోచనలన్నీ మెదడులో పుడతాయి. మెదడనే నేలనుండి పుట్టినవే శిరోజాలు. ఈ చెడు ఆలోచనలు వదలి స్వామిని సేవించు కోవాలనే తలంపుతో 'ముండనం'. మరికొందరు స్వామి ఒక బీబీనాంచారిని పెళ్ళాడితే ఆవిడ వచ్చేవారంతా మీ వారయిన వెళ్ళేవారు నావారు కావాలని కోరితే స్వామి సరేనన్నాడని అందుకే శిరోజసమర్పణ అంటారు. మరికొందరు ఇది బౌద్ధుల కారణంగా వచ్చిన సంప్రదాయమంటారు. వారికి ఇది 'కల్యాణప్రద' కార్యక్రమం. తమిళులలో కొందరు ఈ కార్యక్రమాన్ని 'తిరుక్కల్యాణం' అని చమత్కరిస్తుంటారు. వీటినన్నిటిని దృష్టిలో పెట్టుకొని 'చిక్కులం దెగటార్చు ఫక్కిగా' శాస్త్రి గారు భావించారు. అలాగే ఏడుకొండల మీఁద వీడౌటను యాణికంగా భావించి 'సహస్రార వసతి రహస్యంగా' ఊహించారు చివరకు ఇవన్నీ పెద్దల నాటి మాటగా' భావిస్తున్నానని ఈ దృష్టి దివ్యచక్షుఃప్రసాదితమని లోచూపు అని చివరకు పద్యం ముగించారు.

సంశయాత్మక వీక్షణం

ఆలయానికి సంబంధించిన అన్ని విషయాలలోను తాత్త్వికుల దృష్టి భిన్నంగానే ఉంటుంది. మొక్కులు, మొక్కుబడుల కారణాలను ఊహించిన శాస్త్రి గారు పూజాదుల గురించి సరి అయిన నిర్వచనం చేశారు' ఏరీకోరి మనోజ్ఞపుష్పములు' పద్యంలోని అంశాలు పరిశీలించదగ్గవి.

తెలుగులో బహుళంగా వాడబడే ద్రావిడ శబ్దం పూజ తమిళంలో పూసేయ్ పూవోడు సెయ్యుం కార్యమ్' పూలతో చేసే పవిత్రకార్యం. పూజలో పువ్వులకే ప్రాధాన్యం. ఒక మహాకవి పూలను భగవంతుని 'దరహాసంగా' కీర్తించారు. పూలు రోజూ పూస్తాయి. అవి పరిమళభరితం. దర్శనీయం ఆహ్లాదకరం.

మానవ జీవితంలో పుట్టిన లగాయితు చివర దాకా పూలకు ప్రాధాన్యం. అన్నిటికన్నా ఆలయాలలో పూల సమర్పణ, అగరువత్తులు, గంధాదులు అన్నీ ఆరోగ్య పరిసర రక్షకాలే, సేవించేవారికి వినూత్న అనుభూతిని కలిగించేవే.

శాస్త్రిగారు ఈ పద్యంలో నేను అర్పించే అహింసాది పుష్పాలను స్వీకరిస్తావా? అనంతాళ్వార్ పుష్ప కైంకర్యం లాంటిది కాదని, వేఱు చేసేదవే' అని నిలదీశారు. కనుక ఈ పద్యం సంశయాత్మక సంవీక్షణమయింది.

తిరుమలకు పుష్పమండపమని పేరు. కనుకనే ఇక్కడి పూలన్నీ స్వామి పూజలకే. సామాన్యులు కొండమీద పూలు ముడువరాదని ఆంక్షలు కూడా వెనుకటి రోజుల్లో ఉండేవి.

తిరుమలలో మొదట స్థిరనివాసం ఏర్పరుచుకొన్నవారు రామానుజుల మేనమామ' తిరుమలనంబి' ఆతడు స్వామికి తోయకైంకర్యం పుష్పకైంకర్యం చేసిన వాడు. అయినా స్వామికి తగిన రీతిగా పుష్పకైంకర్యం ఉపందుకోలేదు. రామానుజులవారు శ్రీ రంగంలో ఒక గోష్టిలో తిరుమలలో పుష్పకైంకర్యం చేయడానికి సమర్థులు మీలో ఎవరున్నారా అని ప్రశ్నిస్తే అక్కడి చలికి, భయంకర మృగసంచారానికి భయపడి ఇతరులు నోరు మెదపకుండా వుంటే అనంతాళ్వార్ ఆచార్యులు ఆనను శిరసావహిస్తానని భార్యతో సహా తిరుమలకు విచ్చేసి ఒక బావి త్రవ్వి, తోట నిర్మించి పుష్పకైంకర్యం చేశాడని శ్రీవేంకటాచల ఇతిహాసమాల స్పష్టం చేస్తుంది. పుక్కిటి పురాణాలను గాక చారిత్రక ఆధారాలను మాత్రము స్వీకరించే మనస్తత్వం గల శాస్త్రిగారు ఈ పద్యంలో 'అనంతాళ్వన్' కైంకర్యాన్ని మాత్రం ఈ పద్యంలో ప్రస్తావించారు. ఇక్కడ 'కైంకర్య' శబ్దం శ్రీవైష్ణవులకు సంప్రీతికరమయిన శబ్దం. ఇక్కడొక చమత్కార విశేషముంది. కర్ణాలుక ప్రాంతం నుండి రామానుజులు ఆనతో తిరుమల చేరిన వైదేశికుడు అనంతాళ్వార్ అయితే, చెన్నపురినుండి తాళ్లపాక వాఙ్మయ ముద్రణకోసం, పరిష్కరణ కోసం వచ్చిన వేటూరి వారు కూడా వైదేశికుడే. ఇద్దరిని కృపాకటాక్షాలతో ఆశీర్వదించినవాడు తిరుమలగిరీశుడు.

యౌగిక సంవీక్షణం

బాహ్యపూజల కంటె ఆంతరంగికమయిన పూజ సర్వశ్రేష్ఠం. ఇహలోక జాడ్యాలను దగ్గరికి చేర్చనిది ఆంతరంగిక భక్తి. ఈ దృష్టితో శాస్త్రిగారు వ్రాసిన పద్యం 'దూరంబేల పదంబు' అనే పద్యం.

'పదం' ఎక్కడో అనడాన్ని నిరూపించలేం. అది సుదూరమని మాత్రం చెప్పగలం. కాని స్వామీ! నీవే పరుడివి పరమాత్ముడివి. సమీపస్థుడికి. అర్చామూర్తిగా ఆరాధనలందుకొంటున్నవాడివి. అయినా నేను నిన్ను 'దేహదేవకురు మూలాధారమందు, ఆ సహస్రారంబులో దీపారాధనలు చేస్తానన్నారు. పూజలో పూలకంటే దీపారాధనం సర్వశ్రేష్ఠం. సామాన్య దీపారాధనతో ప్రాకృతిక సంవీక్షణం చేయవచ్చు. కాని యౌగిక దృష్టిలో కానవచ్చే సత్యం శివాత్మకం సుందరం. శాశ్వతం 'చిత్కలిత దీపారాధన సమాసానికి వివరణ ఇవ్వడానికి ఎన్ని పుటలయినా చాలవు. దీపం అంధకార నిర్మూలనాత్మకం ఉద్దిష్టవస్తు దర్శనానికి సహాయపడేది.

దీపం ఆరిపోయేది. కాని చిక్కలిత దీపారాధన సర్వతేజోవంతం శాశ్వతం. జ్ఞానమార్గమే సర్వశ్రేష్ఠమని శాస్త్రిగారు భావించి ఈ ప్రార్థన చేశారు.

శాంతరసాత్మక సంవీక్షణం

ఆలంకారికులు తమ గ్రంథాలలో రసచర్చను విపులంగా ఉటంకించినా, రసము లెనిమిది అని చెప్పినా చివరకు నిర్ధారితమయిన వాదపు తీర్పు 'శాంతోఽపి నవమోరసః' అన్నదే. మహావిష్ణువు 'శాంతా కారుడు' కాలిదాసు శాంతమిదం ఆశ్రమ పదమ్మని ప్రయోగించాడు. అన్నీ శాంతసముద్రంలో ఉరుకులు, పరుగులు, దూకుడులను ఉపసంహరించుకొని లీనమవుతాయి. అలాగే మానవుడుండాలని పెద్దల బోధన. త్యాగరాజస్వామి శాంతములేక సౌఖ్యము లేదు' అనే సత్యాన్ని కీర్తన ద్వారా సలలితోదాహరణాలతో చెప్పిన ప్రసిద్ధ వాగ్గేయ కారుడు. ఈ దృష్టితోనే శాస్త్రిగారు చివరి పద్యంగా

కరకర పల్కులన్ బిరుసు గల్గిన శర్కర నన్నుఁ బాగుగా
గరచి పొరంటి కొంటివి నిగన్నిగ మీఁగడ పాలవీవు ని
ల్వరమున నాకు మార్దవము వచ్చెను; నీకు ఘనత్వమబ్బె; ని
ర్వురము రసాయనంబగుట పోలదె యుర్విఁకిఁ గ్రొత్తకోవగన్ అని వ్రాశారు.

స్వామి! నీవు నిగనిగ మెరసే మీఁగడపాలవు. మరినేనో బాహ్యశాబ్దిక జాల పల్కులతో బిరుసు కలిగిన శర్కర లాంటివాడను నన్ను చాంచలరహిత్యుణ్ణి చేయడంతో నాకు మార్దవం కలిగింది. పాలుకాగగా కాగగా ఏర్పడిన మీగడవు కావడంతో నీకు ఘనత్వమే. అయినా ఇరువురము రసాయనమయ్యాం. సమస్త రసాలు శాంతంలోనే లీనమవుతాయి కనుక నీవు రసాయనమే. దృఢత్వము తొలి మార్దనం కలగడమూ రసాయన స్వభావమే. అని ఈ పద్యానికి స్థూలార్థం.

శాస్త్రిగారు కవితాభిమచులయినా కడుపుతీపి, కపోతకథ లాంటి సందేశాత్మక ఖండకావ్యాలు వ్రాసిన అవి ప్రజాదరణకు నోచుకొన్నా అత్యుత్తమ సంయమనంగల పరిశోధనకులు గానే నిలిచిపోయారనడం సామాన్యుల అభిప్రాయం.

* * *

3. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి - జీవనరేఖలు

- డా॥ సముద్రాల లక్ష్మణయ్య

జననం - బాల్యం

శ్రీ శాస్త్రిగారిది కృష్ణాజిల్లా దివితాలూకాలోని పెదకళ్ళేపల్లి గ్రామం. 7-02-1888 తేదిన వారు జన్మించారు. జననీ జనకులు శ్రీమతి శేషమ్మగారు, శ్రీ వేటూరి సుందరశాస్త్రిగారు. తండ్రిగారు సుప్రిసిద్ధులైన ఆయుర్వేదవైద్యులు.

వారి ఎనిమిదిమంది సంతానములో ప్రభాకరులు మూడవవారు. వీరికి ఒక అక్క, ఒక అగ్రజుడు, ఇద్దరు అనుజులు, ముగ్గురు చెల్లెండ్రు కలిగారు. అన్నగారు తర్క వేదాంత నిపుణులు. అనుజులలో ఒకరైన శ్రీచంద్రశేఖరశాస్త్రిగారు ప్రసిద్ధ నేత్రవైద్యులు. మరొకరు ఆయుర్వేదవైద్య నిష్ణాతులు.

విద్యాభ్యాసం

శ్రీ ప్రభాకరులు బాల్యంలోనే సంస్కృతాంధ్రభాషలను క్షుణ్ణంగా అభ్యసించారు. 12 సంవత్సరాల ప్రాయంలోనే సంస్కృతంలో కవితలల్లి గురువుల అభినందనలందుకొన్నారు.

శ్రీ మద్దూరి రామావధానులవద్ద, శ్రీ అద్దేపల్లి సోమనాథశాస్త్రుల చెంత సంస్కృతకావ్యనాటకాలు, వ్యాకరణం, యోగసూత్రాలు మున్నగు గ్రంథాలు అభ్యసించారు.

శ్రీ చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారు వద్ద శిష్యరికం చేసే అదృష్టం కూడా వారికి కలిగింది. శాస్త్రిగారి వద్ద అవధానవిద్య సభ్యసించి 'శతావధాని' గా కీర్తి గడించారు. 16 ఏండ్ల వయస్సుకే శ్రీ ప్రభాకరశాస్త్రిగారు సంస్కృతాంధ్రభాషలలో నిష్ణాతులయ్యారు.

శ్రీ చెళ్ళపిళ్ళవారివద్ద చేసిన విద్యాభ్యాసాన్ని గూర్చి ప్రభాకరులు తరువాతి కాలంలో ఇలా వ్రాశారు -

"తెలుగులో నాకేమేని ఎఱుక యేర్పడె నన్నచో అది శ్రీ వేంకటశాస్త్రిగారి గురుత్వానుగ్రహ ప్రాప్తమే. వారి దగ్గఱ పుస్తకము పట్టి చదివినదాని కంటే వారి ముఖతః విద్వద్గోష్టిలో విని నేర్చినది చాలా ..... అంతే కాదు, శ్రీ శాస్త్రిగారి సన్నిధిని అవధాన ధారణలు, పద్యరచనలు, ఉపన్యాసవినోదములు, కవితాకల్పనములు, వాదప్రతివాదములు, అహంతలు, మమతలు బలసి అధ్యాత్మచింత అంతర్ధానమందిన దనవలెను. శ్రీ శాస్త్రిగారు మాయామర్మము నెఱుగని స్వచ్ఛ హృదయులు". (ప్రజ్ఞా ప్రభాకరము - పుటలు, 29,30)

విద్యాభ్యాసానంతరం ఉద్యోగాపేక్షతో శ్రీవల్లూరి సూర్యనారాయణగారి ప్రేరణతో శ్రీశాస్త్రిగారు చెన్నపురికి వెళ్ళారు. అక్కడ వెస్లీ మిషన్ పాఠశాలలో పండితులుగా 1907 నుండి 1909 వరకూ పనిచేశారు.

1910లో చెన్నపురి ప్రభుత్వ ప్రాచ్యలిఖిత భాండాగారంలో మొదట కాపీయిస్టుగా చేరారు. తరువాత కేటలాగర్‌గా ఉండి ఆపై అక్కడే పండితుడుగా నియమించబడ్డారు. చెన్నపురిలో వారికి పెక్కుమంది సుప్రసిద్ధ విద్వన్మణులతో పరిచయం ఏర్పడింది. కందుకూరు వీరేశలింగంపంతులు, పండిత డి.గోపాలాచార్యులు, కాశీనాథుని నాగేశ్వరరావు, మానవల్లి రామకృష్ణకవి, టంగుటూరి ప్రకాశం మున్నగు వారితో ఏర్పడిన పరిచయం శాస్త్రిగారి ప్రజ్ఞావికాసానికి ఎంతగానో తోడ్పడింది.

వివాహం

ఇర్వది రెండు సంవత్సరాల ప్రాయంలో చెన్నపురిలో ఉన్న సమయంలోనే శ్రీశాస్త్రిగారికి పిసుపాటివారి ఆడపడుచు మహాలక్ష్మమ్మగారితో వివాహం జరిగింది. ఈ పుణ్యదంపతులకు ముగ్గురు పుత్రులు, ముగ్గురు పుత్రికలు జన్మించారు.

పరిశోధన – గ్రంథసేకరణ

చెన్నపురిలో ఉన్నప్పుడు శ్రీమానపల్లి రామకృష్ణకవిగారితో కలిసి అనేక ప్రాంతాలు పర్యటించి ప్రాచీన తాళపత్రగ్రంథాల నెన్నింటినో సేకరించారు. అముద్రితగ్రంథాలను క్షుణ్ణంగా పరశీలించి ఇరువది సంపుటాల వివరణ గ్రంథపట్టికలను సమకూర్చారు. ఈరీతిగా చెన్నపురిలోని పుస్తకభాండాగారంలోని ఉద్యోగం వారి జీవితాన్ని పూర్తిగా సాహిత్య పరిశోధనకు అంకితం కావించింది.

కవితావ్యాసంగం

గ్రంథపరిశోధనం, గ్రంధవిమర్శ, పలుగ్రంథాలకు చారిత్రకాంశాద్యనేక విషయాలతో గూడిన పీఠికల రచన, గ్రంథముద్రణ ఇత్యాదికార్యకలాపాలతోపాటు శాస్త్రిగారు కవితావ్యాసంగం కూడా దీక్షతో కొనసాగించారు. బాల్యమాదిగా వారు సంస్కృతాంధ్రాలలో కవితలల్లారు. ఒకసారి రెంటాల వెంకటసుబ్బారావు గారు సరస్సులో శుద్ధిస్నానం చేస్తున్న ఒక చెరగుమాసిన చిగురుబోడిని చూపి వర్ణించమంటే ఆశువుగా ఇలా వర్ణించారు –

కొనగోట గురుల జిక్కులు దీర్చి ముడిసుట్టి
నలుగెలంకుల జూపు లొలయజేసి
ఉదుటు గుబ్బల రైక వదలించి దుసికిళ్ళు
వెలయ బయ్యెంట చేగలయబొదివి
గుమురెత్తు పులకల నిమిరి పొక్కిలిబంటి
నీట లేయెండ మైనాట డిగ్గి

గుమ్మడిమూటగా గూర్చుండి చిగురాకు
దొప్ప దోయిళుల నీరప్పళించి

కరిగి పోసిన కొంగుబంగారనంగ
యెరపు మైకాంతి తరగల బొరలి యాడ
గొలన గనుగొమ్ము చెలికాడ! జలకమాడు
చెఱగుమాసిన చిన్నారి చిగురుబోడి.

(వాఙ్మయశిఖరం – ప్రభాకరం – 21పుట) ఈ పద్యంలో సువ్యక్తంగా కనిపించే అచ్చతెలుగుదనం వారికి తెలుగుభాషపట్ల గల అభిరుచికి తార్కాణం –

'కడుపుతీపి' కృతిలోవారు గోంగూర పచ్చడిని వర్ణించిన తీరు ఇలా సహృదయహృదయావర్జకంగా సాగింది –

పయరకూర వేచి పచ్చి మిరెపపండ్ల
నుక్కళించి పోసి యూరనిచ్చి,
కొంతకొంత పొసగికొను గోగుపచ్చడి
చవికి నింత నోరు చివికి తీరు (కడుపుతీపి)

శాస్త్రిగారు యోగమార్గంలోని అడుగిడిన పిమ్మట వారి కవితాదృక్పథం పూర్తిగా ఆధ్యాత్మికతను సంతరించుకొన్నది. కవిత్వం కల్పన లేకుండా కొనసాగదు. కల్లబొల్లిమాటలే కవితకు చమత్కారం ఆపాదిస్తాయి. మొదట అట్టి కవితవైపు మొగ్గు చూపినా క్రమంగా వారి దృష్టిలో మార్పు వచ్చింది. జన్మకు సాఫల్యం చేకూర్చే రచనలనే వారు నిజమైన రచనలుగా భావించి ఇలా అన్నారు –

కవితాపట్టము గట్టుకో దొలుత వేడ్కల్‌రేగ నాకుంగృతుల్
చివురొత్తెన్ వెసమోము మొత్తె నికనాచే జెల్లవీ కల్లబొ
ల్లి వినోదంబులివే జరామరణముల్ చీడల్ హతం బార్చి పు
ట్టువు జెట్టుం సఫలీకరించుకొని యంటుల్ గట్టెదన్ మాలినై (పూలవిందు – 104 పుట)

తనకవితా వస్తువు తీరుతెన్ను లెలా వుండాలో నిర్దేశిస్తూ వారు చెప్పిన మరొకపద్యం గమనార్హమై వున్నది –

పురుషము నిప్రయోజన మబద్ధ మనార్యము చేరరాదు నా
విరచనలందు, డెందము పవిత్రముగా విలసిల్లి సత్యసుం
దరము పరార్థయుక్తమగు తత్త్వమునే వెలయింపగావలెన్
గురుచరణారవిందములకున్ ప్రణమిల్లెద నట్టి నేర్మికై. (శతజయంతి సంచిక – పుట – 1)

1946 లో నవ్యసాహిత్య పరిషత్తుకు చెందిన కార్యక్రమంలో ప్రారంభోపన్యాసం చేస్తూ శ్రీశాస్త్రిగారు తమ కవితాదృథాన్ని ఇలా స్పష్టం కావించారు –

"సత్యోద్బోధము కాని, జ్ఞానోద్బోధము కాని, ఆనందోద్బోధము కాని రచనలు కాలప్రవాహములో రాలిపోతవి కాని నిలువజాలవు. మహాకవులందరూ పూర్వమెప్పుడో గడచి పోయినారనీ, ఇదేదో పిదపకాలము వచ్చిందనీ, వంకరమూతి పిందే కవిత్వాలు వచ్చినవనీ అఘోరించేవాళ్ళలో వాణ్ణి కాను నేను.....మన పరిపూర్ణత రేపటి రోజులలో ఉన్నది కాని నిన్నటి రోజులలో లేదు....సత్యద్రష్ట కల్పనల జోలికి పోడు. వానికి కల్పన నిస్సారంగా తోస్తుంది. వాని యెరిగిన సత్యమును నిరూపించుటకే భాషకు బలము చాలదేమో అనదగిన ట్లుండాగ, వానికి కల్పనలూ, ఛందోలంకార పరికరమూ ఎందుకు"?

(వాఙ్మయశిఖరం–ప్రభాకరం–పుట–22)

ఈ మాటలను దాహరించి శ్రీ తిరుమల రామచంద్రగారు "కవితలోనూ వారిది సత్య సౌందర్య దృష్టే. ఇలాంటి పరిణతదృక్పథం కలవారు కనుకనే వాస్తవార్థాలనే తమ లఘు కావ్యాలలో వెలయించారు. కల్పనలకు పోలేదు" –

(వాఙ్మయశిఖరం – ప్రభాకరం – పుట – 22) అని వివరించారు.

కవితకు కీర్తి, ధనం, వ్యవహారజ్ఞానం ఇత్యాదిగా పలు ప్రయోజనాలను ఆలంకారికులు పేర్కొన్నారు. అందులో 'హితోపదేశం' కూడా ఒకటి. శ్రీశాస్త్రిగారు కవిత సమాజానికి హితముపదేశించునదిగా ఉండాలి. ఉపదేశమే దానికి ముఖ్యప్రయోజనమని భావించారు.

గ్రంథపరిష్కరణలు - సంకలనాలు

1922 నుండి 1950 వరకు శ్రీ శాస్త్రిగారు 23 ప్రసిద్ధగ్రంథాలను పరిష్కరించారు. వీటిలో భగవదజ్జుకం, నీతిద్విషష్టిక అనేవి సంస్కృతరచనలు, తక్కినవాటిలో ఇంతకు ముందు పేర్కొన్నవే కాక ఉత్తర హరివంశం, రంగనాథరామాయణ, ఆంధ్ర కామందకం, సుభద్రా కల్యాణం, అన్నమాచార్యచరిత్ర మున్నగునవి గూడా ఉన్నాయి.

శ్రీశాస్రిగారు రూపొందించిన సంకలన గ్రంథాలు గూడా ఇట పేర్కొనదగి ఉన్నాయి. సంస్కృతంలో శార్ఙ్గధర పద్ధతి, సూక్తిముక్తావళి, సుభాషితరత్న భాండాగారం వంటి సంకలన గ్రంథాలు సుప్రసిద్ధాలు. అట్లే తెలుగులో గూడా కొన్ని సంకలన గ్రంథాలు ప్రశస్తి వహించి వున్నాయి.

ఇట్టి సంకలన గ్రంథాలను మొదటిసారిగా ప్రకటించినవారు శ్రీమానవల్లి రామకృష్ణకవిగారు. ప్రయోగరత్నాకరం, సకలనీతి సమ్మతం మొదలైనవి వారి ప్రచురణలు. శ్రీ శాస్త్రిగారికి తంజావూరులోని సరస్వతీమహలు భాండాగారంలో ప్రబంధరత్నాకరం, సకలనీతి సమ్మతం మొదలైనవి వారి ప్రచురణలు. శ్రీ శాస్త్రిగారికి తంజావూరులోని సరస్వతీమహలు భాండాగారంలో ప్రబంధరత్నాకరం అనే సంకలనగ్రంథం

లభించింది. దీని సంధానకర్త పెదపాటి జగన్నాథకవి. ఇది అసమగ్రంగా ఉండిపోయింది. కాకినాడలో 'ఉదాహరణపద్యములు' అనే మరొక గ్రంథం దొరికింది. దీన్నీ, పైగ్రంథాన్నీ కలిపి 'ప్రబంధరత్నావళి' అన్న పేరుతో శాస్త్రిగారు ప్రచురించారు.

ఇది మిక్కిలి విశిష్టమైన గ్రంథం. రెండు సంకలనాలను ఒక్కటిగా కూర్చుటలో వారనుసరించిన పద్ధతిని వారి మాటలలోనే గ్రహించండి –

"ఈ యిర్వుర కూర్పులందలి పద్యములను గ్రుచ్చి యెత్తి నేనీ ప్రబంధరత్నావళిని క్రొత్తగా వెలయించితిని, పై యిరువుర సంధానములందుండినను నిప్పటికి ముద్రితములై, సుప్రసిద్ధములై దొరకుచున్న నన్నయాదుల భారతాదులలోని పద్యములనిందు జేకొనలేదు – కవులను, కావ్యములందలి పద్యములను గూడ అకారాద్యక్షరక్రమమునకు దార్చితిని. భాషా చరిత్రాద్యపేక్షులకు ఈ చేత మిక్కిలి సాహాయ్యకమగునని చక్క జర్చించియే సల్పితిని". (వాఙ్మయశిఖరం – ప్రభాకరం – పు–28,29)

ఈ సంకలనంలో శ్రీశాస్త్రిగారు క్రొత్తగా అన్నమాచార్యాదులగు అనేకకవులను సంకలితం కావించారు. ఆయాకవుల కాలాదులను నిర్ణయించడంలో వారి అసాధారణప్రజ్ఞ ప్రకటితమైనది.

శ్రీశాస్త్రిగారి సంకలనాత్మకమైన గ్రంథాలలో 'చాటుపద్యమణిమంజరి' ప్రత్యేకంగా పేర్కొనదగివున్నది. దీని తొలి సంపుటానికి గల తొలిపలుకు చాటు పద్యాలసంకలనం, కూర్పులోగల వారి ఆసక్తిని తెలియజేస్తున్నది. తెలుగువారికి తెలుగులోని మాధుర్యం చవిచూపి వారి నుత్తేజపరచిన సంకలనగ్రంథమిది. దీని మొదటి ప్రచురణ 1913 లో జరిగింది.

సారసంగ్రహగణితం

పావులూరి మల్లన రచన సారసంగ్రహగణితం గణితశాస్త్రానికి సంబంధించినది. ఈ గ్రంథాన్ని ప్రకటించడానికి శాస్త్రిగారు ఎంతో కృషి చేయవలసివచ్చింది. అందలి లెక్కలను శ్రీతిమ్మావజ్ఝల కోదండరామయ్యగారు నరిచేసి సహకరించారు. ఈ గ్రంథకర్త ఎవరు? అన్న విషయంలో భిన్నభిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. నన్నయ సమకాలికుడైన మల్లన గ్రంథకర్త యని శ్రీవిరేశలింగం పంతులుగారన్నారు. ఆ మల్లన పౌత్రుడైన మల్లన కర్తయని శాస్త్రిగారు వాదించారు. అందుకు అనేక తాళపత్రప్రతులను ప్రమాణంగా చూపారు. పండితులు శాస్త్రిగారి వాదాన్నే తుది తీర్పుగా అంగీకరించారు.

శాసనాలు

శ్రీశాస్త్రిగారు తమ పరిశోధనను కేవలం సాహిత్యానికే పరిమితం చేయలేదు. 1928లో వారు 'ప్రాచీనాంధ్ర శాసనములు' అన్న వ్యాసాన్ని 'భారతి' పత్రికలో ప్రచురింపజేశారు. శాసనాలలోని 'నాగబు' అనే శబ్దంపై ఆ రోజుల్లో వాదోపవాదాలు చెలరేగాయి. అది ఒక శిల్పిపేరు కావచ్చునని కొందరు వాదించారు.

శ్రీశాస్త్రిగారు ఆశాసనాన్నీ, అందలి లిపినీ నిశితంగా పరిశీలించి 'బు' అనేది ప్రథమావిభక్తి ప్రత్యయమనీ, 'నాగంబు' అనునది ప్రాచీన శబ్దరూపమనీ, సంస్కృతానికి అది తద్భవరూపమనీ నిరూపించారు. వారు ప్రచురించిన మరొక శాసనంలో అనేకభాషావిశేషాలు అవగతమయ్యాయి. అట్లే 'అహదనకర' తామ్ర శాసనాన్ని పరిశోధించి అందలి పదాలకు అర్థనిర్ణయం చేశారు.

బ్రౌన్ - ప్రశంస

సి.పి.బ్రౌన్, మెకంజీలు ఆంధ్రవాఙ్మయానికి చేసిన సేవలు లోకప్రసిద్ధి పొందాయి. శ్రీశాస్త్రిగారు వారి సేవలను కీర్తిస్తూ 1911 లో కృష్ణాపత్రికలో వ్యాసం వ్రాశారు. 1928లో బ్రౌనును గురించి ప్రత్యేకంగా మరొక వ్యాసం వ్రాస్తూ ఆయననిలా కొనియాడారు –

నూర్లార్లు లెక్క సేయక
పేర్లందిన విబుధవరుల బిలిపించుచు వే
మార్లర్థమిచ్చు వితరణి
చార్లెస్ ఫీలిప్బ్రౌను సాహెబు కరుణన్ –

ఇలా ప్రశంసిచడంలో శ్రీశాస్త్రిగారి గుణజ్ఞత ఎంత విశిష్టమైనదో గ్రహించవచ్చు.

కథాకథనం - చరిత్రరచన

శ్రీశాస్త్రిగారి కథాకథననైపుణ్యం మరువరానిది. కామధేనువు కథ, కరుణకము, కలికి చిలుక, తక్రానందస్వామి, పుణ్యవతి, భాగ్యవతి, మున్నగు వారి కథలు చిరస్మరణీయాలు.

చరిత్ర రచనలో గూడా వారు సిద్ధహస్తులు. తంజావూరి ఆంధ్రరాజుల చరిత్ర, శృంగార శ్రీనాథం, అన్నమాచార్య జీవితచరిత్ర, ఆంధ్రదేశ సంస్కృతకవుల చరిత్ర – ఇట పేర్కొనదగివున్నాయి.

అనువాదాలు

ప్రాచీన సంస్కృతరచనలకు శ్రీశాస్త్రిగారు కావించిన అనువాదాలు గణనీయాలు. ప్రతిమ, మధ్యమవ్యాయోగం, కర్ణభారం, భగవదజ్జుకం, మత్తవిలాసం మున్నగు అమరవాణీకృతులను వారు ఇంపైన తెలుగులోకి అనువదించారు.

జానపద సాహిత్యం

శాస్త్రిగారికి జానపదసాహిత్యం పై మక్కువ ఎక్కువ. సామెతలు, పలుకుబళ్లు, నుడికారాలు, పొడుపు కథలను విరివిగా సేకరించి అందలి విశేషాలు వివరిస్తూ వాటిని ప్రచురించారు. ఈ విషయమై వారేమన్నారో చూడండి.

"చవులొలుకు పలుకుబళ్లు, పాటలు, పదాలు, కథలు, గాథలు, సామెతలు – ఇత్యాదుల పెక్కులు అపరిశోధితములై, అముద్రితములై లోకము వాకులందే పుట్టుచు గిట్టుచున్నవి. అట్టి వానిని పరిశోధించుటలోను, సేకరించుటలోను నాకు కోర్కె కొండంత.

భాషా సస్యపు పంటలలో ఇదివరకు సేకరముగాక గాలికి కొట్టుకొనిపాతూ వుండే చెదురుదు, రాలుదు, పరిగగింజలను బిచ్చగాడనై ఊళ్ళూ నాళ్ళూ తిరుగుతూ ముప్పై ఏళ్ళనుండీ ఎక్కడ పడితే అక్కడల్లా యేరుకు తెచ్చుకొంటూ ఉన్నాను." (ముందుమాట–గాలికబుర్లు)

వారు ఎక్కడికైనా పోతే ఆచోట జనులు మాట్లాడే భాషను శ్రద్ధగా పరిశీలించేవారు. వాటిని సేకరించి వాటిపై వ్యాసాలు వ్రాసి పత్రికలలో ప్రచురించేవారు. ఆ విధంగా ప్రచురించబడిన ఒక సుదీర్ఘ వ్యాసమే "గాలి కబుర్లు".

ఇందులో తాము సేకరించని శబ్దరాశిని అకారాదిక్రమంలో కాకుండా అమరకోశంలో లాగా వర్గాలక్రింద విభజించడం గమనార్హం. బిరుదువర్గం, జాతివర్గం, అవయవవర్గం, జంతువర్గం–ఇత్యాదిగా ఈ వర్గ విభజన చేయడమయింది.

ఇటీవల ఈ గ్రంథాన్ని ఆచార్య పి.నరసింహారెడ్డిగారు పరిష్కరించగా తిరుమల తిరుపతి దేవస్థానంవారు ప్రభాకరశాస్త్రి వాఙ్మయపీఠం తరపున ప్రచురించారు.

వ్యాధిబాధలు - యోగచికిత్స

చెన్నపురిలోని ప్రాచ్యపుస్తకభాండాగారంలో పని చేస్తున్నప్పుడు ప్రభుత్వంవారు వారిని ప్రాచీనపుస్తకాల సేకరణకై నియోగించారు. కాని అనారోగ్యం వల్ల వారా పనిని సంతృప్తికరంగా చేయజాలని స్థితి ఏర్పడింది.

శాస్త్రిగారికి అనారోగ్యం తీవ్రం కావడంవల్లా, దీర్ఘకాలికం అయినందువల్లా ఉద్యోగనిర్వహణం క్లేశకరమయింది. సెలవుమీద వారు యింటికి పోయారు. మూడు సంవత్సరాలపాటు బాధకు గురి అయ్యారు.

ఆ సమయంలో శ్రీపోతరాజు నరసింహంగారు అనే ఆచార్యులు యోగగోష్ఠి ప్రస్తావనకు తెచ్చి అందులో చేరితే ఆరోగ్యం కుదుట పడగలదని శాస్త్రిగారికి సూచించారు. ఈ యోగప్రసావన శాస్త్రిగారి జీవితంలో ఒక కొంగ్రొత్త వెలుగు నింపింది. వారి జీవితం దానితో మలుపు తిరిగింది.

మాస్టర్ సి.వి.వి.గారు

పరిచయార్థమై శ్రీనరసింహంగారిచ్చిన జాబు తీసుకొని వారు రైలెక్కి కుంభకోణం చేరారు. అక్కడ యోగవిద్యలో నిష్ణాతులు, యోగంతో మొండి వ్యాధులను గూడా నయం చేయగలవారు, అయిన మాస్టర్ సి.వి.వి.గారి సన్నిధి చేరుకొన్నారు. వారి అనుగ్రహంవల్ల వీరి వ్యాధి నయమయింది. అంతేకాక, వీరు గూడా యోగవిద్యాధురంధరులైనారు. తీవ్రరోగగ్రస్తుల నెందరినో రోగవిముక్తులను గావించగలిగారు.

శాస్త్రిగారు దయ, ప్రేమ మున్నగు సద్గుణములకు నిలయమై విరాజిల్లారు. వారికి బౌద్ధధర్మములో అమితమైన అనురాగ ముండేది. వారు బుద్ధుణ్ణి స్మరిస్తూ వ్రాసిన పద్యం చూడండి!

ప్రియయువతిన్ ప్రభుత్వమును వీడి వనంబునకేగి తత్త్వని
శ్చయమునకై మహాతపము సల్పి కృతార్థతనంది యెల్లెడన్

దయయు నహింసయున్ పరమధర్మముగా నొనరించెనమ్మహో
దయుడగు బుద్ధదేవుని పదంబుల కేను నమస్కరించెదన్. (శతజయింతి సంచిక పుట - 106)

అధ్యాపకత్వము - శిష్యశిక్షణ

తిరుమల తిరుపతి దేవస్థానంవారి ఆహ్వానంమేరకు శ్రీశాస్త్రిగారు 1939లో తిరుపతి చేరారు. అక్కడ వారు కొనసాగించిన సాహిత్యకృషి అనన్యసామాన్యమైనది. దేవస్థానం ఆధ్వర్యవంలోని శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యకళాశాలలో వారు ఆంధ్రశాఖకు కొంతకాలం ప్రధానాచార్యులుగా పనిచేశారు. ఆ తరువాత ప్రాచ్యపరిశోధన సంస్థలో (ఓరియంటల్ రిసర్చ్ ఇన్‌స్టిట్యూట్) పరిశోధకులుగా విధులు నిర్వర్తించారు.

తమ శిష్యవర్గం శీలసంపదతో విరాజిల్ల వలెనని శాస్త్రిగారి అశయం. అందు కనుగుణంగా శిష్యులను వారు దిద్ది తీర్చేవారు. తెలుగుభాష, తెలుగుజాతి, తెలుగుదేశం – వీటిమీద విద్యార్థులకు ఎక్కువ మక్కువ కలిగించారు. తెలుగుదనంపట్ల వారి ప్రీతి యెట్టిదో వారు చెప్పిన ఈ క్రింది పద్యం నుండి గ్రహించవచ్చు. విద్యార్థుల నుద్దేశించి వారు –

ఆంధ్రభాష యమృత మాంధ్రాక్షరంబులు
మురువులొలుకు గుంద్రముత్తియములు
ఆంధ్రదేశమాయురారోగ్య వర్ధకం
బాంధ్రజాతి నీతి ననుసరించు. అని ఉద్బోధించేవారు.

కళాశాలకు విరామ మిచ్చినప్పుడు విద్యార్థులకు ప్రాచీనశాసనాలను పరిశోధించే విధానంలో శిక్షణ యిచ్చేవారు.

విద్యార్థులలో పరస్పరం విషమభావం ఏర్పడకుండా వారు సమభావసంపన్నులుగా అలరారవలెనని ప్రబోధించేవారు. ఈ విషయమైవారి ముఖ్య శిష్యులు శ్రీసింగరాజు సచ్చిదానందంగారు చెప్పిన ఈ క్రింది మాటలు గమనింపదగి ఉన్నాయి.

"కళాశాలలోని మాకు భాషావైవిధ్యమున గాని, జాతివైవిధ్యమున గాని వైరస్యములు కల్గినచో సర్వ సమతాదృష్టితో స్వపరభేదములు లేక తీర్చుటలోని వారి చాతుర్యము, ఆ జీవితము మాకు ఒరవడి. తమ శిష్యులగువారు శీలసంపన్నులు కావలెనన్నది వారి ఆశయము. విద్వత్పరీక్షకై చదువువార మందరము అధ్యాపకవృత్తి చేపట్టవలసిన వారము గూడ.

ఒక దినము పాఠము చెప్పుచు వారీక్రింది పద్యమును నుడివి మరునాడు దానిని మేము అప్పజెప్పవలసినదిగా కోరినారు –

లాచి పరాంనగల్ వరవిలాసమనోహరరూపసంపదన్
జూచిన జూడ డుత్తముడు, చూచిన జూచును మధ్యముండు తా

జూచిన జూడకుండినను జూచును నీచుడు, వారిలోన నన్
జూచిన జూడకుండు గుణి జూచిన చొప్పున జూడు మంబికా! (రావిపాటి త్రిపురాంతక కవి)

ఈ పద్యమును మాకు జెప్పుటలో వారి భావము తమ శిష్యుల జీవితము ఉండవలసిన తీరు మా కుపదేశించుటయే.'' (శతజయంతి సంచిక – పుట – 82,83)

సమదృష్టి

ఆదినాలలో కులమత భేదాలు ఎక్కువగా ఉండేవి. భగవద్గీతాది గ్రంథాలు ఎంత గొప్పగా సమదర్శనాన్ని ప్రబోధించినా, ఆ ప్రబోధాలు సిద్ధాంతపరంగా నిలిచిపోయినవే కాని సమాజంలో ఆచరణలోకి రాలేదు. ఆరోజుల్లో కళాశాలలో జాతిమతభేదాలు లేకుండా అందరికీ ప్రవేశముండేది కాదు.

శ్రద్ధతో చదువుకోవాలని వచ్చిన షేక్ మస్తాన్ అనే మహమ్మదీయునికీ, దాసి బసవయ్య అనే దళితునికీ ప్రాచ్యకళాశాలలో ప్రవేశం లభించలేదు.

కళాశాలలో ఆధ్యాపకులైన శ్రీశాస్త్రిగారు ఉదారహృదయులు, సర్వసమభావసంపన్నులు. 'పండితాస్సమదర్శినః' అన్న గీతోక్తికి నిదర్శనమైనవారు.

వారు పై యిరువురు విద్యార్థులకూ తమయింటనే చదువు చెప్పారు. ప్రైవేటుగా పరీక్ష వ్రాయుటకు వారిని సిద్ధం చేశారు. బసవయ్యకు తమయింటనే భోజనం ఏర్పాటు కావించారు. ఒక ప్రఖ్యాతన్యాయవాది సాయంతో మస్తాన్ సాహెబ్‌కు కూడ ఒకచో భోజనవసతులు ఏర్పాటు చేశారు. ఆయిరువురు విద్యార్థులా శ్రద్ధగా చదివి ఉత్తీర్ణులై తరువాతి కాలంలో అధ్యాపకవృత్తిని చేపట్టి గౌరవంగా జీవించారు.

తాళ్ళపాక సాహిత్య ప్రచారం

చెన్నపురి నుండి తిరుపతికి రాకముందే తాళ్ళపాకవారి సాహిత్యప్రశస్తిని గూర్చి వినియుండిన శాస్త్రిగారు ఆసాహిత్యాన్ని విస్తృతవ్యాప్తిలోకి తేవాలన్న దృఢ సంకల్పం కల్గివుండేవారు. అన్నమాచార్య చరిత్రకు పీఠిక వ్రాస్తూ అన్నమాచార్య చరిత్ర పరిశోధనను గూర్చి వారిలా వ్రాసియున్నారు –

"మదరాసు నుండి శ్రీతిరుపతి వేంకటేశ్వరుల సన్నిధిసేవ కావింపవచ్చుటలో నా తొల్తటి కోరిక తాళ్ళపాకవారి రచనల నన్నింటినీ వెల్లడించుట. ఎంత ప్రయత్నించినను అడ్డంకులతో నింకిపోవుచున్న నా సంకల్పపు టూటలు చక్కసాగుట ఇప్పటికి గదా సమకూడినది."

(అన్నమాచార్యుల జీవిత చరిత్ర పీఠిక – పు – 130)

తాళ్ళపాక తిమ్మక్క

తిమ్మక్క ప్రథమాంధ్ర కవయిత్రిగా ప్రశస్తి పొందడానికి ముఖ్యకారణం శ్రీశాస్త్రిగారే. ఈమె ద్విపదలలో సుభద్రా కల్యాణం రచించింది. తెలుగు దేశమంతటా మౌఖికంగా వ్యాప్తిలో ఉన్న ఈరచనకు సంబంధించిన

తాళపత్రప్రతి ఒకటి శ్రీకాళహస్తిలో శాస్త్రిగారికి లభించింది. అందలి లేఖక దోషాలను సావధానంగా సవరించి శాస్త్రిగారు తిమ్మక్కకు ఆంధ్రసాహిత్య చరిత్రలో సుస్థిరస్థానం కల్పించారు.

అన్నమయ్య వర్ధంతి - సంగీతోత్సవాలు

అన్నమయ్య సాహిత్యాన్ని ముద్రించడమే కాక దానిని విస్తృతవ్యాప్తిలోనికి తేవడానికి త్యాగయ్యకు చేసినట్లే సంగీతోత్సవాలు నిర్వహించడం ప్రయోజనకారిగా వుంటుందని శాస్త్రిగారు భావించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహించునట్లు ఏర్పాటు చేశారు.

1949లో మొదటిసారిగా తిరుపతి త్యాగరాజమండపంలో ఈ ఉత్సవాలు జరిగాయి. అప్పుడు శ్రీశాస్త్రిగారన్నమాట లివి –

"కార్యకారణమయిన తనను గానరానీయక కార్యమునెల్ల జరుపుకొనుచుండు చైతన్యమూర్తి భగవంతుడే. ఆయనయే ఈ అన్నమాచార్యోత్సవ శరీరమున కంతకును నిర్వాహకుడు, ప్రాణము. ఈ యుత్సవమున పనిగొనియున్న మనమందరము స్వామి అవయవములము. ఇట్లు చూడగా నేనిందు పాదాంగుష్ఠస్థానీయుడనను కొందును." (శతజయంతి సంచిక–పు–67)

ఈ మాటలు వారి నిరహంకారత్వాన్ని తేటతెల్లం చేస్తున్నాయి. "అహంకార విమూఢాత్మా కర్తా–హమితి మన్యతే" అని గీతాచార్యుని మాట. 'అనగా అహంకారముచే విమోహితుడైనవాడే తాను కర్తనని భావిస్తాడు. అన్న సత్యాన్ని శాస్త్రిగారు సువ్యక్తం చేశారు.

మ్యూజియం ఏర్పాటు

శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రిగారి బహుముఖమైన కృషిలో చెప్పుకోదగిన మరొక ముఖ్యాంశం మ్యూజియం నిర్మాణం. వివిధ ప్రాంతాలు సందర్శించి అక్కడ లభించిన సుందరమైన శిలా విగ్రహాలను తెప్పించి ప్రదర్శనశాలలో భద్రపరిచారు. ఈ పని నిర్విరామంగా చాలాకాలం కొనసాగింది.

ఈ ప్రదర్శనశాల ఇప్పటికీ దేవస్థానంవారి ఆధిపత్యంలో నిర్వహింపబడుతున్నది.

వ్యావహారికభాష

భాషా వాఙ్మయ పరిశోధనలకే తన జీవితము నంకితం కావించిన శ్రీశాస్త్రిగారు తమ రచనలను గ్రాంథిక భాషలోనే కొనసాగించారు. కాని వ్యావహారిక భాషపట్ల వారికి విరోధం లేదు. భాషలో మార్పు తప్పదని వారు గట్టిగా విశ్వసించారనడానికి 'మీగడ తఱకలు' లోని ఈ క్రింది పద్యమే నిదర్శనం.

భాషాదేవత సుస్వరూపమిది విస్పష్టంబుగా గానరా
దీషద్ జ్ఞానము యెల్ల వారికిని, మాకీనాడు బహ్వర్థముల్

భాషింపన్ వలసెన్, నిబంధముల నిర్బంధం బసంబద్ధమన్
ఘోషం బేర్పడె ; మార్పు తప్పదిట లగ్గుంగూర్పుమో యీశ్వరా! (మీగడ తఱకలు-పుట-226)

శ్రీగిడుగువారి వ్యావహారికభాషావాదాన్ని శాస్త్రిగారు సమర్థించారు. 1948లో ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచికలో "నేటి తెలుగు, నోటి తెలుగు" అన్న వ్యాసాన్ని శాస్త్రిగారు వ్యావహారిక భాషలోనే వ్రాశారు. వాడుకభాషవల్లనే భాషలోని అందచందాలు వృద్ధి పొందాయని వారి అభిమతం.

శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయపీఠం

శ్రీశాస్త్రిగారు బహుముఖమైన వాఙ్మయసేవలను, విశేషించి శ్రీ వేంకటేశ్వరాంకితమైన అన్నమాచార్యుల సాహిత్యానికి వారు చేసిన వరివస్యనూ గుర్తించి వారి పేరుతో "శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయపీఠం" అనే ప్రాజెక్టును తి.తి.దేవస్థానం వారు 2007 లో స్థాపించారు. శ్రీశాస్త్రిగారి ముద్రితాముద్రితరచనలను పెక్కింటిని ఆ పీఠం పక్షాన ప్రకటించారు.

అస్తమయం

ఇలా లోకోపకారకమైన సత్కార్యాలతో జీవితాన్ని పండించుకొన్న ధన్యజన్ములు, సరస్వతీచరణసేవా ధురీణులూ, యోగిపుంగవులూ, తపోనిధులూ అయిన శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రిగారు తమ అవతారకార్యాలు పూర్తి చేసుకొని 29-8-1950 వ తేదీన శరీరపరిత్యాగం కావించారు. చివరిదశలో గూడ పల్నాటిసీమలో విగ్రహాన్వేషణ కావించి శ్రమపడి జ్వరగ్రస్తులై తిరుపతికి తిరగివచ్చి తనవు చాలించారు.

నాస్తి తేషాం యశఃకాయే జరామరణజం భయమ్ ।

అన్నట్లు శ్రీశాస్త్రిగారివంటి సార్థకజన్ముల భౌతికకాయం కనుమరుగైనా వారి కీర్తికాయానికి జరామరణాదిభయాలు ఉండవు.

శ్రీశాస్త్రిగారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ వారి శిష్యులూ, అనుయాయులూ అనేకులు వారిని స్మరిస్తూ పలుపద్యాలు రచించారు. తిరుమల తిరుపతి దేవస్థానంవారు 2015 లో ప్రచురించిన 'గురుస్తుతి' అన్న పుస్తకంలో ఆపద్యాలు ప్రకటించడమైనది.

అందలి ఒక్క పద్యాన్ని నిర్దేశించడంతో ఈ వ్యాసాన్ని సమాప్తం కావించుకొందాం. శ్రీతిమ్మావజ్ఝల కోదండారామయ్యగారి పద్యమిది -

జగమే యాత్మకుటుంబమై యఖిల విశ్వశ్రేయమే యాయమై
జగదారాధ్యుడు గాంధిదేవుని యహింసాతత్త్వమే మార్గమై
సాగసుల్ నింపగ నీదు జీవితము సంశోభించె దిగ్వ్యాప్తమై
యుగముల్ చన్నను గాని పుట్టని మహాయోగీ! ప్రణామాంజలుల్ (గురుస్తుతి - 10 పుట)

* * *

4. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ప్రాచ్యపరిశోధనసంస్థకు చేసినసేవ

– డా ॥ పి.సి వెంకటేశ్వర్లు

పేరు ప్రతిష్ఠలు రావడం రెండు రకాలుగా ఉంటుంది. మొదటిది వ్యక్తులవల్ల సంస్థలకు పేరు రావడం, రెండోది సంస్థల వల్ల వ్యక్తులకు పేరు రావడం. ఇందులో మొదటి రకానికి చెందినవారు వేటూరి. వారివల్ల తిరుపతిలోని ప్రాచ్య పరిశోధన సంస్థకు ఎనలేని పేరు వచ్చింది. సంస్థ తొలిదశలో ఇద్దరు మహనీయుల కృషివల్ల, పరిశ్రమవల్ల ఈనాటికీ మంచి పేరు ప్రతిష్ఠలతో ముందుకు సాగుతోంది. మానవల్లి రామకృష్ణ కవి, వేటూరి ప్రభాకరశాస్త్రి ఇద్దరూ జోడు గుర్రాల్లా సంస్కృత, తెలుగు, ప్రాచీన గ్రంథాల సేకరణలో దూసుకెళ్ళారు. వేలకొద్ది గ్రంథాలను సంస్థకు చేర్చారు. భారతదేశంలోనే పేరెన్నికగన్న సంస్థగా రూపొందడానికి పునాదులు వేశారు. అయితే వీరిద్దరిలో మానవల్లివారి పరిశోధన నాట్యశాస్త్రంవైపు మళ్ళి 'భరతకోశ' నిర్మాణంతో పరిపూర్ణమైంది. వేటూరివారి పరిశోధన సృజన రచన, గ్రంథ పరిష్కరణ, భాషాశోధన, శాసన చరిత్ర, వ్యాఖ్యాన, యోగవంటి రంగాల్లో బహుముఖాలుగా విస్తరించింది.

శాస్త్రిగారు సంస్థకు చేసిన సేవను గురించి చెప్పాలంటే ఆయన జీవితాన్ని మూడు దశలుగా వర్గీకరించి పరిశీలించాలి.

1. తొలిదశ : చెళ్ళపిళ్ళవారి శిష్యరికం..... 1906 వరకు
2. ఉద్యోగదశ : మద్రాసు ప్రాచ్యపరిశోధనసంస్థలో ఉద్యోగం 1906 – 1939 వరకు
3. మలిదశ : తిరుపతి ప్రాచ్యపరిశోధనసంస్థలో ఉద్యోగం 1940 – 1950 వరకు

ఈ మూడు దశలు ఒకదానితో ఒకటి పెనవేసుకున్నాయి. విడివిడిగా పరిశీలిస్తే పూర్తి సమాచారం దొరకదు. ఒక్కొక్క దశలో ఆయన వేసిన అడుగులు మలిదశవైపు ఎలా మళ్ళించాయో అర్థమవుతుంది.

1. తొలిదశ

వేటూరివారు కృష్ణాజిల్లా పెద్దకళ్ళేపల్లిలో చిన్నప్పుడే వేదవిద్యలన్నీ నేర్చుకున్నా, వైదికాచారాలకు కట్టుబడలేదు. అలా కట్టుబడివుంటే మంటి పురోహితుడై ఉండేవాడేమో. అది జరగలేదు. ఆ తర్వాత పక్కనే ఉన్న 'చల్లపల్లి'లో అద్దేపల్లి సోమనాథశాస్త్రి వద్ద మంత్ర, పతంజలి, యోగశాస్త్రాధ్యయనం 16 ఏళ్ళ వరకు సాగించారు. అదే విద్య కొనసాగించివుంటే ఉపాధ్యాయవృత్తిలోకి వెళ్ళి, మంచి ఉపాధ్యాయుడై ఉండేవారేమో అదీ జరగలేదు. 1904 చల్లపల్లినుండి 'బందరు' వెళ్ళి చెళ్ళపిళ్ళవారి శిష్యులైనారు. ఇక్కడ అవధానం, సాహిత్యచర్చ గోష్ఠుల్లో మంచి అనుభవం సంపాదించాడు. చెళ్ళపిళ్ళవారి వద్దే సాహిత్యంలోని ఎన్నో కోణాల్ని చూశాడు. 1906 దాకా అక్కడేవుండి తర్వాత మద్రాసు వెళ్ళాడు'. ఒకవేళ చెళ్ళపిళ్ళవారి దగ్గరే వుండి ఉంటే మంచి అవధానిగా పేరు పొందేవాడేమో, కానీ అదీ జరగలేదు. తండ్రితో సమానుడైన

వల్లూరి సూర్యనారాయణరావు స్కూల్‌లో పండితపదవి సిఫారసు చేయకపోవడంతో, మద్రాసు వెళ్ళమని సలహా ఇవ్వడంతో శాస్త్రిగారు 1906లో మద్రాసు చేరుకున్నాడు. బావ కాజ వేంకటశేషయ్యగారి దగ్గర ఉంటూ ఉద్యోగప్రయత్నం ప్రారంభించాడు.

2. ఉద్యోగదశ

1906 నాటికి శాస్త్రిగారికి 18 ఏళ్ళు. అక్కడే వెస్లి మిషన్ స్కూల్ తెలుగు పండితుడిగా చేరి, నాలుగేళ్ళు పని చేశాడు. అక్కడ ఆ సమయంలో సూర్యనారాయణరావుగారి సలహాతో మద్రాసు ప్రాచ్యలిఖిత భాండాగారంలో నిరంతం గ్రంథాల్ని చదవడం ప్రారింభించాడు. అక్కడున్న రికార్డులను, గ్రంథాలను గాలించి చదువుతూ స్నేహితులకు వివరాలతో లేఖలు రాయడం ప్రారింభించాడు. ఆ సమయంలో గ్రంథాలయం క్యాటలాగు ఉద్యోగి సెలవు పెట్టడంతో గ్రంథాలయ క్యూరేటర్ శాస్త్రి శ్రద్ధ గమనించి 22.08.1910న తాత్కాలిక కాపియిస్టుగా ఉద్యోగం ఇచ్చాడు. అందివచ్చిన అవకాశాన్ని వినియోగించుకొన్న శాస్త్రిగారు శ్రద్ధతో పనిచేస్తూ, అక్కడే 'పండిత పదవి' పొందాడు. అక్కడ పనిచేస్తున్న కాలంలో న్యాయవాది దేపా రామేశంతో పరిచయంతో ఖగోళ, గణిత, చరిత్ర విషయాలపై మంచి అవగాహన వచ్చింది. ఎపిగ్రాఫిగా ఇండికా, ఇండియన్ ఆంటిక్విరీస్ గ్రంథాల అధ్యయనంతో ఆయన దృష్టి చరిత్ర, శాసన పరిశోధనలవైపు మళ్ళింది. అక్కడే తమిళ, కన్నడ భాషలతో పరిచయంతో 'ఫైలాలజీ' పై పట్టు సాధించాడు. జీర్ణ తాళపత్రాల్లోని పద్యాల్ని సేకరించి, వర్గీకరించి 'చాటు పద్యమణిమంజరి'గా కూర్పు చేశాడు. ఇలాంటి ఎడతెరిపి లేని పనులతో ఆరోగ్యంచెడి సెలవు పెట్టాల్సిన పరిస్థితి వచ్చింది. ఉద్యోగంపోయే పరిస్థితి కూడా వచ్చింది. ఆ సమయంలో 1916 తంజావూరుకు బదిలీ చేశారు. నాలుగు నెలలు తంజావూరు ఉద్యోగం కూడా శాస్త్రిగారికి వరమైంది. లైబ్రరీ గ్రంథాల పట్టికలు, గ్రంథవివరణ తయారుచేయడం పూర్తి చేశాడు.

తంజావూరునుండి మద్రాసు వచ్చాక ఆంధ్రరాష్ట్రమంతా తాళపత్ర సేకరణకోసం ఉద్యమంలా తిరిగాడు. చల్లపల్లి నుండి మొదలుపెట్టి దీపాల పిచ్చయ్యశాస్త్రి వంటి శిష్యవర్గంతో వేలకొలది తాళపత్రాలు సేకరించాడు. సేకరించిన వాటిలో ఏముందో శోధించాడు. కళ్లలో వత్తులేసుకొని వాటిలోని విషయాలు రాసుకొని, పౌర్వాపర్య వివరాలతో 'గ్రంథ వివరణలు' (డిస్క్రిప్టివ్ కేటాలాగ్) తయారుచేశాడు. 20 సంపుటాలు కేటలాగ్‌లు వేటూరివారి చేతులమీదుగా తయారైనా, వాటిపై ఆయన పేరెక్కడా కన్పించదు. దానికి కారణం కేటలాగ్‌లపై క్యూరేటర్ పేరు మాత్రమే ముద్రించేవారు. ఆ సమయంలో వేటూరివారి రాజధాని కళాశాలలో అధ్యాపక ఉద్యోగానికి ప్రయత్నించినా అది రాలేదు. దానివల్ల తెలుగుజాతికి మేలే జరిగింది. ఆయన చేతులపై ఎన్నో గ్రంథాలు పరిష్కరింపబడి వెలుగుచూశాయి.

ఈ కాలంలో ప్రబంధరాత్నావళి, చాటుపద్య మణిమంజరి, మధుర కవితలు, బాలభాష. 11–12 శతాబ్దాల శాసనాల సంకలనం వంటి సంకలన గ్రంథాలు కూర్చాడు. బసవపురాణం, మనుచరిత్ర, సుగ్రీవ విజయం, ఉత్తర హరివంశం, హరవిలాసం, భారతీశతకం, క్రీడాభిరామం, ఉద్భటారాధ్య చరిత్ర, రంగనాథ రామాయణం, చారుచర్య, బసవోదాహరణం మొదలైన గ్రంథాలను పరిష్కరించి ప్రకటించాడు.

మూనాళ్లముచ్చట, అలవాటు, దివ్యదర్శనం, కడుపుతీపి, కపోతకథ, అనుభవం, సేకరించిన గ్రంథాలు, పరిష్కరించిన పుస్తకాలు అన్నీ మద్రాసులో చేసిన కృషిలో భాగమైనా, ఈ శ్రమంతా వృథా పోలేదు. 1953లో ఆంధ్రరాష్ట్రం ఏర్పడ్డాక, ఆ గ్రంథ సంపదంతా తిరుపతిలోని ప్రాచ్య పరిశోధనాసంస్థకు చేరింది. అందుకే తొలిదశలో, రెండోదశలో వేటూరివారి కృషి పరోక్షంగా ప్రాచ్య పరిశోధనసంస్థకు చేసిన సేవలో అంతర్భాగమైంది. ఇక ప్రత్యక్షంగా చేసిన సేవ మలిదశలో జరిగింది.

3. మలిదశ

దీన్ని తిరుపతి శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనసంస్థలో శాస్త్రిగారి ఉద్యోగదశగా చెప్పుకోవాలి. 1940–1950 సంవత్సరాల మధ్య సాగిన వేటూరివారి పరిశోధనవ్యవసాయం ఆశ్చర్యాన్ని కల్గిస్తుంది. 1939లో బెల్వాల్కర్ సిఫారసుతో ఈ సంస్థ ఏర్పాటయ్యాక, మానవల్లి రామకృష్ణ కవి (సంస్కృతం), వేటూరి ప్రభాకరశాస్త్రి (తెలుగు) గార్లను రీడర్లుగా నియమించారు. మాద్రాసునుండి తిరుపతికి శ్రీ వేంకటేశ్వరుని సేవ కావింపరావడంలో తన మొదటి కోరిక తాళ్ళపాకవారి రచనల్ని వెలుగులోకి తేవడంగా శాస్త్రిగారు అన్నమాచార్య చరిత్రలో చెప్పారు. వాస్తవానికి తాళ్ళపాకవారి రచనలపై 1918 లోనే పరిశోధన ప్రారంభించాడు. ఇక్కడకు వచ్చాక క్రమపద్ధతిలో పరిశోధన సాగింది.

శ్రీవేంకటేశ్వర ప్రాచ్య పరిశోధన సంస్థలో సాగిన వేటూరివారి కృషిని ఏడు రకాలుగా వర్గీకరించుకోవచ్చు.

1. తాళపత్ర సేకరణ 2. గ్రంథపరిష్కరణ పీఠికలు 3. వ్యాసాలు ప్రతిపాదనలు 4. వ్యాఖ్యానాలు 5. గ్రంథ రచనలు 6. సంఘసేవ 7. మ్యూజియం ఏర్పాటు

1. తాళపత్రాల సేకరణ : వేటూరివారికి గ్రామగ్రామాలు శ్రమకోర్చి తిరిగి తాళపత్రాలు సేకరించడం వెన్నతో పెట్టిన విద్య, మద్రాసులోలాగానే ఇక్కడకు వచ్చాకకూడా తిరుపతి చుట్టుపక్క ప్రాంతాల్లో ఉన్న సంస్థానాలకు తిరిగి ఎన్నో తాళపత్ర గ్రంథాల్ని సేకరించాడు. ఆయన కాళహస్తి సంస్థానంనుండి సేకరించిన తాళపత్రాలు చాలా ఉన్నాయి.

2. పరిష్కరణ – పీఠికలు : వేటూరివారు మద్రాసులోనే పరిష్కరణవిద్యలో ఆరితేరారు. తిరుపతివచ్చాక దాన్ని వేగవంతం చేశారు. అయితే దృష్టి తాళ్ళపాకవారి రచనలపై ఎక్కువగా పెట్టారు. ప్రాచ్య పరిశోధనసంస్థ పక్షాన పరిష్కరించి ప్రచురించిన గ్రంథాల్లో ముఖ్యమైనవి వేంకటేశ్వర వచనాలు, అన్నమయ్య సంకీర్తనలు, అన్నమాచార్య చరిత్ర, సుభద్రా కల్యాణం, సౌర సంగ్రహ గణితం, శృంగారామరుకం.

వేంకటేశ్వర వచనాలు – శాస్త్రిగారు ఈ గ్రంథాన్ని 1945లో తిరుమల తిరుపతి దేవస్థానంవారి పక్షాన శ్రీవేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనసంస్థలో పరిష్కరించి ప్రచురించారు. అయితే 1917లో డిస్క్రిప్టివ్ కేటలాగ్ 2వ సంపుటం, మూడవ విభాగంలో దీన్ని గురించి ప్రస్తావించాడు. 1925లో భారతి పత్రికలో కొన్ని వచనాలను ప్రకటించాడు. చివరగా 166 వచనాలతో సుప్రభాత స్తవాన్ని చేర్చి ప్రకటించాడు. ఈ

గ్రంథానికి రాసిన పీఠికలో, ఈ వచనాల్లో విశిష్టాద్వైత సిద్ధాంతాలు కరుడుకట్టి ఉన్నాయని, శరణాగతి తత్వం ఉందని చెప్పాడు. ఈ వచనాలు టాగూర్ గీతాంజలిని తలపిస్తున్నాయని, అనంతుని గద్య లక్షణాల్ని కలిగి ఉన్నాయని విశ్లేషించాడు.

అన్నమయ్య శృంగార సంకీర్తనలు – 4వ సంపుటం – శాస్త్రిగారు ఈ గ్రంథాన్ని 1947లో తిరుమల తిరుపతి దేవస్థానంవారి పక్షాన శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనలో పరిష్కరించి ప్రచురించారు. ఈ గ్రంథానికి రాసిన ఉపోద్ఘాతంలో 1935లో తాళ్ళపాక రచనల ముద్రణ ప్రారంభమైందని, అయినా అంతకుముందే శ్రీ మహంత ప్రయాగదాస్‌జీ పాలనాకాలంలో రాగిరేకులను కాగితాలపై రాయించారని చెప్పాడు. ఈ గ్రంథరచనకు ముందు శాస్త్రిగారు దేవస్థానం ఆఫీసునుండి రాగిరేకుల్ని సంస్థకు తెప్పించాడు. అంతకుముందే వచ్చిన మూడు సంపుటాల్లోని కీర్తనల్ని, రాగిరేకుల్లోని సంకీర్తనల్ని పోల్చి పరిశీలించాడు. కొన్ని విషయాలు తేల్చిచెప్పాడు. మొదటి మూడు సంపుటాల్లో ఏమున్నాయో వివరించాడు.

1. మొదటి సంపుటంలో తాళ్ళపాక కవుల లఘుకృతులున్నాయి. వీటిలో కొన్ని రాగిరేకుల్లో ఉన్నాయని చెప్పాడు.
2. రెండవ సంపుటంలోని ఆధ్యాత్మ సంకీర్తనలన్నీ అన్నమయ్యవి కావని, అన్నీ కలగాపులగంగా ఉన్నాయని, అన్నమయ్యవి 391 రాగిరేకులు, పెద తిరుమలయ్యవి 77 రాగిరేకులు, చిన తిరుమలయ్యవి 10 రాగిరేకులు మొత్తం 478 గా లెక్క తేల్చాడు.
3. మూడవ సంపుటంలోని శృంగార సంకీర్తనల్లో అన్నీ అన్నమయ్యవి కావని, వాటిలో 2002 కీర్తనలు అన్నమయ్యవిగా, 100 కీర్తనలు పెదతిరుమలయ్యవిగా, 10 సంకీర్తనలు చిన తిరుమలయ్యవిగా విభజించి మొత్తం 2112గా లెక్కగట్టాడు. వివరమైన పీఠికతో రాగిరేకుల్లోని సంకీర్తనల విషయంలో పరిశోధకులకు స్పష్టతనిచ్చాడు. అన్నమయ్య సంకీర్తనలేవో వివరించాడు.

అన్నమయ్య ఆధ్యాత్మ సంకీర్తనలు 5వ సంపుటం – తేది 22-06-1950న దీన్ని శాస్త్రిగారు ప్రాచ్య పరిశోధసంస్థ ద్వారా వెలువరించారు. అప్పటికే 565 శృంగార సంకీర్తనలు, 180 ఆధ్యాత్మ సంకీర్తనలు తిరుమల తిరుపతి దేవస్థానం ప్రకటించిందని చెప్పి, ఈ సంపుటంలో 331 సంకీర్తనలు ఇచ్చాడు. ఇంకా 1746 ఆధ్యాత్మ సంకీర్తనలు, 11406 శృంగార సంకీర్తనలున్నాయని నిరంతం శ్రమపడి ప్రకటించినా, అన్ని కీర్తనలు రావడానికి 10 సంవత్సరాల కాలం పడుతుందని పీఠికలో తెల్పాడు. ఈ పరిశోధనలో తనకు తోడ్పడిన ఉదయగిరి శ్రీనివాసాచార్యులను గురించి ప్రత్యేకంగా చెప్పాడు.

అన్నమాచార్య చరిత్ర – దీని కర్త చిన తిరువేంగళనాథుడు (చిన్నన్న). దీన్ని వెలుగులోకి తెచ్చింది శాస్త్రిగారే. దీని మూలం 1047 పుటల్లోను, పీఠిక 133 పుటల్లోను ఉంది. ఈ పీఠిక ఎంతో ప్రాధాన్యత గలది. తాళ్ళపాక కవుల చరిత్ర సంకీర్తనల విశిష్టత, నాటి తెలుగు భాషా రీతులు, ఆంధ్రదేశ చరిత్రవంటి అపూర్వ విషయాలతో ఈ పీఠిక సాగింది. గంగమ్మ గుడి, అవ్వాచారి కోన వంటి విషయాలు, అన్నమయ్య

పుట్టుక, మరణపు తేదీలను శాస్త్రిగారే నిర్ధారించారు. ఈ గ్రంథ ముద్రణలో ఏ.వి.శ్రీనివాసాచార్యులు సహకరించినట్లు చెప్పారు.

సుభద్రా కల్యాణం – 1950 ప్రాచ్య పరిశోధనసంస్థ ద్వారా శాస్త్రిగారు ఈ గ్రంథాన్ని పరిష్కరించి ప్రచురించారు. తొలి తెలుగు కవయిత్రి అయిన తాళ్ళపాక తిమ్మక్క రాసిన ఈ తాళపత్ర ప్రతి కాళహస్తినుండి సేకరించిన ప్రతుల్లో దొరికింది.

సారనంగ్రహ గణితం – వేటూరివారు ఈ గ్రంథాన్ని 1912లోనే గుర్తించినా, ప్రాచ్య పరిశోధనసంస్థలో ఉన్నప్పుడే తుది పరిష్కరిణ జరిగింది. పరికర్మ, భిన్నగణితాలు మాత్రం పరిష్కృతమై వెలువడ్డాయి. అంతలో శాస్త్రిగారు మరణించడంతో పీఠిక రాయలేదు.

వ్యాసాలు – ప్రతిపాదనలు – శాస్త్రిగారు మద్రాసులో ఉద్యోగం చేస్తున్నప్పుడే భారతివంటి పత్రికల్లో వ్యాసాలు భిన్నకోణాల్లో రాశారు. అయితే ప్రాచ్యపరిశోధన పత్రికలో రాసిన వ్యాసాల్లో విలక్షణత ఉంది. పరిష్కరణలో పరిపక్వ 'మనస్తత్వం, నిజాన్ని జంకు లేకుండా చెప్పే తీరు ఈ వ్యాసాల్లో కన్పిస్తుంది.

పండితారాధ్య చరిత్రపై ఓ.ఆర్. జర్నల్‌లో రాసిన వ్యాసంలో చిలుకూరివారి పరిష్కరణము విమర్శించాడు. వేటూరివారి విమర్శ శాస్త్రీయంగా సాగింది. చిలుకూరివారు...

"శ్రీ గురులింగ! సంచిత దయాపాంగ!
భాగ మహాధార! పాల్కురికి సూ!"

నాలుగు సంబోధనలు సూచించాడని, రెండే సంబోధనలు ఉండాలని చెప్పాడు. అంతేకాదు 'ఎక్కుగొఱ్ఱు' అనే పదం ఉండకూడదని 'అక్కుగొఱ్ఱు' అని సవరించాలని తెల్పాడు. చాలపద్యపాఠాల్లో యతిభ్రంశమైన చోట్ల, గణాలు తప్పినచోట్ల గుర్తించలేదని, పూర్వోత్తరాలు కుదరనిచోట కుదిర్చ చూశారని విమర్శించాడు.

'కాకతి' అనే వ్యాసం 1950 జనవరి జూన్ సంచికలో వచ్చింది. 'కాకతి' ఓరుగల్లును పాలించిన రాజుల దేవతని చెప్పాడు. దీన్ని నిరూపించడానికి క్రీడాభిరామాన్ని, 'పానుగంటి' శాసనాన్ని, కృష్ణాజిల్లా ముక్త్యాల జమీందారు మ్యూజియంలోని విగ్రహాన్ని ఆధారంగా చూపించాడు. ఏ విషయాన్నయినా సంపూర్ణ ఆధారాలు లేకుండా ప్రతిపాదించడం వేటూరి నైజం కాదు. పూర్వాపరాలతో శోధించి చూపడం ఆయన అలవాటు.

'తెలుగుదనము – సంప్రదాయం' అనే వ్యాసం 1943 (జూలై డిసెంబరు)లో ప్రాచ్యపరిశోధన జర్నల్‌లో వచ్చింది. ఈ వ్యాసం నేటికి కొత్తగానే అన్పిస్తుంది. తెలుగువారి సంప్రదాయంగా మనం చెప్పుకొనె 'పైట' మనది కాదని, మహారాష్ట్ర గుర్జర సంబంధమైందని, పైఠాన్ నాగరికతతో అది తెలుగునాట అడుగుపెట్టిందనే వాస్తవాన్ని వివరించాడు. అదేవిధంగా పూర్వం తాళిబొట్టు, కమ్మలు అన్నీ తాటి ఆకులతో తయారుచేసుకొని ధరించేవారని, అందుకే వాటికి ఆ పేరు వచ్చిందని పరిశోధనాత్మకంగా నిరూపించాడు.

అదేవిధంగా 1943లో అదే సంచికలో రాసిన 'ఆంధ్ర వాఙ్మయం – పురాణయుగం' అనే వ్యాసం డా॥ జి.వి.సుబ్రమణ్యం వంటివారు పరిశోధనలకు ద్వారం తెరిచింది.

'గ్రంథ గ్రంథులు' అనే 1940లో జర్నల్‌లో రాసిన వ్యాసంలో ప్రాచీనగ్రంథాల్లోని అనేక పదాలకు వివరణలు ఇచ్చాడు. ఆ పదాలను కవి ఎందుకు ప్రయోగించాల్సి వచ్చిందో వివరంగా తెల్పాడు. చేర్చుక్కు (చంద్రకళ), కొఱుత, పాలింపగాను, నవ్వజెనక, శక్రసద్రాశుడు, అనుకూలగతి, ఉపాధ్యాయి, బాహుమూలరుచి మొదలైన ప్రయోగార్థాల్ని వివరించాడు.

అలాగే వేటూరివారు ఖచ్చితమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేసేవారు. ఎదుటివ్యక్తి ఎంత గొప్ప పరిశోధకుడైనా తన అభిప్రాయాన్ని తాను స్పష్టంగా చెప్పేవారు. మధువాపంతులవారి 'ఆంధ్ర రచయితలు' గ్రంథానికి తొలిపలుకులు రాస్తూ 'కందుకూరి వారి కవుల చరిత్ర'ను సంస్కరించాల్సిన అవసరం చాలా ఉందని కుండబద్దలు కొట్టినట్టు చెప్పాడు.

4. వ్యాఖ్యలు

సాధారణంగా వ్యాఖ్యలు మూడు రకాలుగా ఉంటాయి. అవి సమగ్ర వ్యాఖ్య, గచ్ఛతోవ్యాఖ్య, ధావత్ వ్యాఖ్య. మల్లినాథుడిలాగా శాస్త్రిగారిది కూడా గచ్ఛత్ వ్యాఖ్య. ఎందుకంటే మూలంలో లేనిది ముట్టుకోడు. అన్వయంతోనే సర్వం వ్యాఖ్యానం చేస్తారు. వీరు రాసిన వ్యాఖ్యల్లో కొన్ని పూర్తికాగా, మరికొన్ని పని ఒత్తిడివల్ల అలాగే మిగిలిపోయాయి.

1. కుమార సంభవ వ్యాఖ్య : తిరుపతి ప్రాచ్య పరిశోధన సంస్థలో ఉద్యోగం చేస్తున్న సమయంలో 1948 ప్రాంతంలో పిఠాపురం రాజారావు వేంకటకుమార మహీపతి సూర్యారావు బహద్దరు కోరికపై ఈ గ్రంథానికి వ్యాఖ్యరాయడం ప్రారంభించాడు. 8 ఆశ్వాసాల వరకు ముద్రించి పాఠాలు, సవరణ పట్టికలు సిద్ధం చేశాడు. ఇంతలో జమీందారీ వ్యవస్థ రద్దుకావడంతో మొదటి ఆశ్వాసం 36వ పద్యం వరకు వ్యాఖ్య సాగి ఆగింది. 1950 తర్వాత తిమ్మావజ్ఝలవారు మొదటి రెండు ఆశ్వాసాల టీక రాసి త్రిలింగలో ప్రకటించారు.

2. ఉత్తర హరివంశం : ఈ గ్రంథాన్ని మద్రాసులో ఉండగా పరిష్కరించారు. దీని వ్యాఖ్య 1946–50 మధ్య ప్రారంభించారు. నాల్గవ ఆశ్వాసం "ఉరముకౌస్తుభరత్న....." అనే పద్యం వరకు సాగింది. పనుల ఒత్తిడిలో ఇదీ పూర్తిగా సాగలేదు.

3. నైషధ పారిజాతం : కృష్ణాధ్వరి రాసిన శ్లేషకావ్యమైన దీన్ని 1915లోనే యథామాతృకంగా రాసుకున్నాక సువ్యాఖ్యానంతో ప్రకటించాలనే ఉద్దేశంతో అలాగే ఉంచారని, ఇంకా ముగించలేదని 'మీగడ తరకల' వ్యాసంలో చెప్పారు.

ఇవే కాకుండా వేటూరివారు ఇంకా కొన్ని గ్రంథాలకు వ్యాఖ్య రాయడానికి ప్రణాళిక సిద్ధం చేసుకున్నాడు.

వ్యాఖ్యన పద్ధతి – శాస్త్రిగారి వ్యాఖ్యన పద్ధతి విలక్షణమైంది. ఒక క్రమ పద్ధతిలో సాగుతుంది.

1. ప్రతి ఆశ్వాసానికి ముందు కథాంశాన్ని శీర్షికరూపంలో సూచించడం.
2. అవసరమైన చోట్ల పద్యాలకు సంస్కృతమూలాల్ని చూపడం.
3. ఆశ్వాసం చివర 'పరిశిష్టము' పేరుతో కొన్ని వివరణలివ్వడం.
4. పాఠభేదాలున్నచోట భిన్న ప్రతులను చూచి సాధురూపాన్ని నిర్ణయించడం.
5. కష్టమైన ఘట్టాలను అరటిపండు ఒలిచినట్లు చెప్పడం.

5. గ్రంథరచనలు : శాస్త్రిగారు తిరుపతి వచ్చాక సంస్కరణపైనే దృష్టి కేంద్రీకరించి స్వతంత్ర రచనలు తక్కువగానే రాశారని చెప్పాలి. ఆయన 1940 తర్వాత ప్రచురించిన రచన 'సీతాఫలం' 'మాతృశ్రీ' అనే రెండు కావ్యాలు కన్పిస్తున్నాయి.

6. సేవాకార్యక్రమాలు : వేటూరివారు మద్రాసులో ఉన్నప్పుడే అనారోగ్యంతో బాగా ఇబ్బందిపడ్డారు. మాస్టర్ సి.వి.వి.గారి అనుగ్రహంతో తిరిగి పరిపూర్ణ ఆరోగ్యవంతులైనారు.. తాను కూడా వైద్యం. యోగ శాస్త్రాల్లో అభ్యాసం ప్రారంభించి పరిపూర్ణుడైనాడు. ఆ అనుభవాలతో తనవద్దకు వచ్చే ఎంతోమందికి వైద్యంతో సేవ చేసేవాడు. వందలమంది అనారోగ్యంతో వచ్చి పరిపూర్ణమైన ఆరోగ్యంతో తిరిగి వెళ్ళారు. తిరుపతిలో ఆయన యోగ, వైద్య సేవల విషయమై మంచి పేరు ప్రతిష్ఠలు వచ్చాయి.

అదేవిధంగా వేటూరివారు సత్ బ్రాహ్మణకుటుంబంలో నుండి పెరిగినా, మూర్ఖమైన ఆలోచనలను ఖండించేవాడు. తిరుపతిలో హరిజన దేవాలయప్రవేశ ఉద్యమానికి నాయకత్వం వహించింది శాస్త్రిగారనేది ఎప్పటికీ గుర్తుంచుకోవలసిన అంశం. హరిజనుల దేవాలయ ప్రవేశం జరిగే వరకు తాను తిరుపతిలో ఉన్నా, శ్రీ వేంకటేశ్వరుని దర్శింతుకోలేదంటే వారిలోని నిబద్ధత ఏమిటో అర్థమౌతుంది.

7. మ్యూజియం ఏర్పాటు : తిరుపతి ప్రాచ్యపరిశోధనసంస్థలో ఉన్నప్పుడే తిరుమల తిరుపతి దేవస్థానం మ్యూజియం ఏర్పాటు తలపెట్టింది, దానికి అంకురార్పణ చేసింది శాస్త్రిగారే. మ్యూజియంలో ఉంచాల్సిన అపూర్వ ప్రాచీన కళాఖండాల కోసం రాష్ట్రం నలుమూలలా అవిశ్రాంతంగా తిరిగారు. 1950 ఆగష్టులో గుంటూరుజిల్లా 'యద్దనపూడి' లోని ఒక బావిలో అపురూపమైన శిల్పాన్ని వెదకడానికి వెళ్ళి జడివానలో తడిసి, నల్లరేగళ్లలో నడిచి ఆరోగ్యం చెడగొట్టుకున్నారు. జ్వరంతో తిరుపతి చేరుకున్నారు. అదే జ్వరంతో 1950 ఆగష్టు 29న పరమపదించారు.

కృషి – వేటూరివారి కృషిని ముఖ్యంగా ప్రాచ్య పరిశోధనసంస్థకు చేసిన సేవ ప్రత్యక్షంగా, పరోక్షంగా సాగింది.

1. చెళ్ళపిళ్లవారితో రెండేళ్ల శిష్యరికం, సంచారంవల్ల ఎన్నో విషయాలను గ్రహించారు. అదే అనుభవం తాళపత్రగ్రంథాల అన్వేషణలో ఉపయోగపడింది.

2. తండ్రిలాంటి సూర్యనారాయణరావు సలహాతో ప్రాచ్య భాండాగారంలోని పుస్తకాలు చదవడం అక్కడే ఉద్యోగానికి మార్గం వేసింది.

3. మద్రాసులో ఉద్యోగంచేస్తూ సేకరించిన గ్రంథాలు, సిద్ధం చేసిన డిస్క్రిప్టివ్ కేటలాగ్‌లు ఆంధ్రరాష్ట్రం ఏర్పాడ్డాక, తిరుపతిలోని ప్రాచ్య పరిశోధనాసంస్థకు చేరాయి. నాటి ఆయన కృషివల్లే దాదాపు 4160 తాళపత్రగ్రంథాలు సంస్థలో నేటికీ సంరక్షింపబడుతున్నాయి.

4. తిరుపతిలోని ప్రాచ్య పరిశోధనసంస్థలోనే తాళ్ళపాకవారి రచనల వర్గీకరణ సాగింది. ఎవరి రచనలు ఏవి అనే స్పష్టతతో పరిష్కరణ సాగింది.

5. బ్రౌన్ సాహిత్యసేవను తొలుత 1940–50 మధ్య గుర్తించింది శాస్త్రిగారే.

వేటూరివారి వ్యక్తిత్వానికి సంబంధించిన ఒక సంఘటన ప్రాచ్య పరిశోధనసంస్థలో పని చేసేటప్పుడు జరిగింది. సంస్థలో రీడరుగా ఉన్నప్పుడు, వారి కింది పనిచేసే ఉద్యోగి పై అధికారులకు ఇలా అర్జీ పెట్టాడు. 'నేను ఎం.ఏ. పాసయ్యాను. నేను రాసిన గ్రంథానికి విశ్వవిద్యాలయంవారు ఉత్తమ బహుమతి ఇచ్చారు. శాస్త్రిగారికి ఎలాంటి డిగ్రీ లేదు. వారి స్థానంలో నన్ను రీడరుగా ఏర్పాటు చేయండి'. ఈ అర్జీ చదివిన ప్రిన్సిపాల్ దరఖాస్తుదారుకు, బహుమతి ఇమ్మని సిఫార్సు చేసింది శాస్త్రిగారే కాబట్టి, మనం ఏమి చేయలేము, అని లేఖ రాశారు. అంటే తన ద్వారా లబ్ధిపొందిన వ్యక్తి తనకు అన్యాయంచేసినా మౌనంగా ఉండిపోయే యోగి వేటూరివారని ఈ విషయం బుజువు చేస్తుంది.

* * *

5. వాఙ్మయ శిఖరం వేటూరి - "నీతినిధి"

- ఆచార్య ఆర్. రాజేశ్వరమ్మ

వేటూరి అనువాద గ్రంథాలలో ప్రసిద్ధమైంది, ప్రయోజనకరమైంది "నీతినిధి". ఆంగ్లంలోని "ది ఎకానమి ఆఫ్ హ్యూమ్‌న్ లైఫ్" అనే గ్రంథానికి ఇది అనువాదం. మూలగ్రంథం అనేక ప్రపంచ భాషల్లోకి అనువదించబడింది. ఈ గ్రంథం ముక్త్యాల కుమారరాజాగారికి అంకితమిచ్చారు. దీని ప్రథమ ముద్రణ 1926లోను, ద్వితీయముద్రణ 1982లో వేటూరి మెమోరియల్ ట్రస్టు ప్రచురించింది. ఈ గ్రంథం శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయ పీఠం పక్షన తి.తి.దే ముద్రించడం జరిగింది.

మానవజీవితం ఎలాంటి ఆటంకాలు లేకుండా హాయిగా జీవయాత్రకు నీతి ఒకటే సాధనం. మోక్షవిషయంలో వివిధమతాలు, వివిధ అభిప్రాయాలను వెల్లడి చేసినా నీతి విషయాల్లో మాత్రం ఎలాంటి అభిప్రాయ భేదాలుండవు. మానవుని జీవనయాత్రను స్వర్గయాత్రగా చేయగలిగినవి నీతిధర్మములే. అలాంటి నీతులకు నిధియైన ఆంగ్లగ్రంథంను "నీతినిధి" పేరుతో తెలుగులోనికి అనువదించి ఆంధ్రులకందించారు వేటూరి ప్రభాకర శాస్త్రిగారు.

ఈ గ్రంథంలో ప్రధానంగా రెండు భాగాలున్నాయి. మొదటి భాగంలో మానవుని ధర్మాలకు సంబంధించిన నీతులను ఏడు అధ్యాయాలలో వివరించారు. రెండవ భాగంలో మానవునికి సంబంధించిన సామాన్య నీతులను ఐదు అధ్యాయాలలో వివరించారు. సామాజిక జీవనంలో భర్తలకు, భార్యలకు, తల్లులకు, పిల్లలకు, చుట్టములకు. రాజులకు ప్రజలకు కావలసిన నీతిధర్మాలు చెప్పబడినవి.

వివిధ మతాలకు మోక్షం విషయంలో భేదాభిప్రాయాలున్నా నీతివిషయమునందు భేదాభిప్రాయయాలు లేవు. సత్యం, శౌచము, శమము, దమము, దయ, వైరాగ్యము, త్యాగము, మొ॥ సద్గుణములను అన్ని మతాలు శ్లాఘిస్తున్నాయి. అహంకారం, అరిషడ్వార్గాలను దుర్గుణములను అన్ని మతాలు నిరసిస్తున్నాయి. దుర్గుణాలను, దుర్భాషలను విడనాడి, సద్గుణాలను, సత్కార్యములను బొందగల విధమును 'నీతినిధి' సులువుగా తెలుపుతూన్నది. దుఃఖాన్ని నివారించి, సుఖప్రాప్తి కలగడానికి మూలకారణాలైన నీతి ధర్మములను ఈ గ్రంథం సృష్టం చేస్తూంది.

ఈ గ్రంథములో ముందుగా 'అవతరణిక'లో ఇలా తెలిపారు. "మానవులారా! పై నుండి వచ్చు దివ్య బోధనలను తలలువంచి, చెవులొగ్గి, అణుకువతో ఆలకింపుడు".

"సూర్యప్రకాశమెక్కడ కలదో, వాయు ప్రచారమెక్కడ నున్నదో వినుటకు వీనులను, గ్రహించుటకు బుద్ధియును, ఎక్కడ పనిచేయునో, అక్కడ నెల్లా జీవిత ధర్మములు తెలియబడుగాక. సత్యోపదేశములు ఆచరింపబడునుగాక".

ఆజ్ఞ, అనుగ్రహము, అందము, ఆయన హస్తము నుండి అవతరించుచున్నవి. ఆయన కార్యములందెల్ల విజ్ఞానము వెల్లివిరియుచున్నది. కాని మానవబుద్ధి దాని నవగతము చేసికొనలేకున్నదని తెలియజేశారు.

మొదటిభాగం, ప్రథమాధ్యాయంలో మానవుని ధర్మాలను గురించి తెలిపారు. అందులో భాగంగా, పర్యాలోచనము, అణుఁకువ, పూనికి, సద్గుణలిప్స, దూరాలోచన, స్థైర్యము, సంతుష్టి, మితభోగము, అను ఎనిమిది ఉపవిభాగాల కింద మానవుడు ఎలా తన ధర్మాన్ని నిర్వర్తించాలి. ఎలాంటి ఆలోచనలను, కర్మలను ఆచరించాలి, అనే విషయాల గురించి సూక్తుల మాదిరిగా చక్కగా వివరించారు.

మానవుడా! నీలోనీవే చర్చించుకొని యెందుకై సృష్టింపబడితివో ఎంచి చూచుకొమ్ము. నీ శక్తులను గూర్చి యోచించుకొనుము. నీ కోరికలను, చేరికలను దలంచుకొనుము. అట్లేని నీవు జీవితధర్మములను ఎరుగగలవు.

నీవు మాటాడు ప్రతిమాటయును ఆచి, యూచి, తూఁచి చూచి మఱి మాట్లాడు. అలాగే నీవు చేయు ప్రతికార్యమును, నరసి, యరసి, అంతరముల నూహించి, మఱి ఆచరింపును. అట్లు చేసితివా చెడు నీచెంతకు రాదు. అవమానం నీ ఇంట అడుగుపెట్టదు. పశ్చాత్తాపం నిన్ను పరికింపదు. చింత నీ చెక్కిలి పైకి చేరదు. ఆలోచన లేనివారు తన నాలుక నాఁచి యుంచుకొనజాలఁడు. వాడు విచ్చల విడిగా నోటికి వచ్చినట్లు మాట్లాడును. మాట్లడి యాపై, తన మాటల అవ్యక్తతలో చిక్కుకొని చీకాకుపడును. కావున పర్యాలోచనపు ఉపదేశములను బాగుగా వినుము. అవి అధికజ్ఞాన పూరితములు.

'ఈ నీతినిధిలోని వాక్యాలను ఎవరు చెప్పారో మనకు తెలియదు. కానీ చెప్పిన తీరును పరికిస్తే జ్ఞాని, దార్శనికుడు, ముని, సత్యమెరిగినవాడు, ప్రపంచ సాహిత్యం పట్ల అవగాహన ఉన్న మహానుభావుడు ఈ వాక్యాలను చెప్పాడని సాధారణ పాఠకుడికి సులభంగా అర్థమవుతుంది.

ఈ అధ్యాయంలో మానవుడు పుట్టుక నేపథ్యాన్ని గురించి చెపుతూ నీవు ఎందుకు సృష్టింపబడితివో నీలో నీవే ఎంచి చూచుకొమ్మని నుడివాడు. మన హిందూ ఆధ్యాత్మిక వేత్తలు చెప్పిన అంశం ప్రకారం మానవుడు తల్లి గర్భంలో జన్మించడానికి ముందు తాను ఒక లక్ష్య సాధన కోసం జన్మిస్తాడని, అతను పెరిగే క్రమంలో ఆ సాధనను, మరచిపోవడం అవసాన దశలో గుర్తుకు వచ్చినా, తీర్చుకునే అవకాశం లేకపోవడంలో జీవి మరలా ఇంకో జన్మను కోరుకోవడం వల్లనే అనేక జన్మలు ఎత్తాల్సివస్తుందని చెప్పారు. దీనిని నివారించడం కోసం ఈ రచన కర్త నీ కోరికలను, చేరికలను తలంచుకొనుమని, అప్పుడే జీవిత ధర్మములను ఎరుగగలవని తెలిపాడు.

జ్ఞానవంతుడిగా మనిషి పరిగణింపబడాలి అంటే మిత భాషిగా ఉండాలని, మాట్లాడే ప్రతిమాట ఆచి తూచి, మాట్లాడాలని, అప్పుడే సమస్యలు మనల్ని దరిచేరవని, అవమానం కూడా పొందకుండూ

ఉంటామని, ఆలోచింప జేసే తెలివైన ఉపదేశములను ఓర్పుతో బాగా వినాలని, ఎక్కువ వినడం ఎప్పుడు అలవాటు చేసుకుంటామో, అప్పుడు తక్కువ మాట్లాడటానికి అవకాశం ఉంటుందని, మాటకు ఉన్న ప్రాముఖ్యాన్ని తెలియజేశారు.

అణుఁకువ

మనుష్యుడు జ్ఞానవంతడగుటకు మొదటి మెట్టు నాకేమియు తెలిదనుకొనుటే సుమా! ఇతరులు ఇతడు తెలివిమాలిన వాడని అనుకొనకుండుటకు, నీవు ముందుగా నేనే జ్ఞానవంతుడు నను అపరాధమునకు ప్రాయశ్చిత్తము చేసికొనుము.

వినీతుని వాక్కులు సత్యమునకు చక్కదన మిచ్చును. మితభాషిత్వము అతనిని తప్పిదముల నుండి తప్పించును.

సోమరితనము, బీదతికమును, బాధను పుట్టించును. సత్కార్య పరిశ్రమము సంతోషము నిచ్చును.

బుద్ధిమంతుడు అలోచనచే బుద్ధికిని, పనిపాటులచే దేహానికి, పని కల్పించి, అతడు తన ఆరోగ్యమును సంరక్షించుకొనును.

సద్గుణలిప్స

గుణములచే నిన్నతిశయించువానిని, అన్యాయం, అనుచితములైన విధములచే అణగ ద్రొక్కజూడకుము. అతనికంటే గుణాతిశయము కలవాడగుటకు యత్నింపుము. అట్లయిన జయముచే కాకున్నా, ఉత్తమముచేతనయినా అలంకృతుడ వగుదువు.

స్థైర్యం

అపాయములు, దురదృష్టములు, లేబరములు, విచారములు, సంకటములు, కొంచెమించుమించుగా మహిమీద పుట్టిన మానవ మాత్రుల కెల్ల సామాన్యములు. కనుక నీవంతు వచ్చెడు చెడుగులను భరించడానికి నీ మనస్సును ఓర్పుతోను, ధైర్యముతోను, బలపఱుచు కొనుము. ఇది నీవు చేయవలసినపని. ఒంటె కష్టమును, వేఁడిమిని, ఆకలిని, దాహమును, ఓర్చుకొని ఇసుకఎడారులందు ఎడ్లబరువును, మోసుకొని పోయి దరిచేర్చునో, అట్లే స్థైర్యము, సకల కష్టములను సహించి మానవుని గట్టెక్కించును.

సంతుష్టి

నరుడా! భూమిమీద నీ ఉనికి, నీహృదయం, నీ కోరికల తీరు నెఱిఁగి దయచేతనే నీ వాంఛితముల నపుడప్పుడు నిరాకరించుచుండుము. అది దేవుడి నియత చేతనే అనుగ్రహింపబడినదని మఱువకుము.

నీకు కలిగెడు కష్టములు, దుఃఖములు, ఎందుండి ఏర్పడుచున్నవో ఎఱుగుదువా? నీ తప్పిదముల నుండియే. నీ గర్వమున నుండియే నీ కలత పాటునుండియే? కనుక విధివిధానమును గూర్చి వెగటుచెందక నీ హృదయమునే నిలువరించుకొని సరిచేసుకొనుము. నాకు భాగ్యము, అధికారముండెనేని, అవకాశముండెనేని, అధిక సుఖములనునుభవింపగల్గుదును గదా అని తలంపకుము. అవి అన్నియు వానికి దగిన సంకటములను కొనితేగలవు. ఇది ఎఱుంగుము.

కొంచెముతో తృప్తిచెందుటే గొప్పజ్ఞానము. న్యాయమును, మితభోగమును, దానమును, వినయమును, చెఱుపకుండునట్లు నీవు చేయగల్గుదువేని సంపద సంకటములను కూర్పజాలదు.

ఈ విభాగంలో మనిషి సహజంగా కల్గి ఉండే రెండు విరుద్ధ స్వభావాలను గురించి తెల్పుతూ రెండింటిని అనుభవించడంలో సమతుల్యతను ఎలా పాటించాలో చక్కగా తెలిపారు. సమతుల్యతను పాటించకపోతే కలిగే అనర్థాలను, ఒడిదుడుకులను, సమస్యలను సైతం తెలియజేశారు. వీటిని అత్యాశ – నిరాశలు కల్గినప్పుడు, సుఖసంతోషాల–దుఃఖములను అనుభవించడంలోను, మితభోగము నందు ఎలాంటి సమతుల్యతను పాటించాలో వివరించారు. అతి ఎందులోనూ మంచిది కాదని, చెపుతూ గర్వమును విడనాడి న్యాయబద్ధంగా జీవిస్తూ, దానగుణమును, వినయాన్ని ఎప్పుడూ అనుసరించాలని వీటిని ఎన్నడూ తృణీకరించకూడదని తెలిపారు. అలాగే కోపం కల్గినప్పుడు ఎలా ప్రవర్తించాలో, కనికరం దాతృత్వాన్ని కలిగి ఉండాలని, కోరికలను తీర్చుకోవడంలోను, ప్రేమ ఔన్నత్యాన్ని సైతం చక్కగా వివరించారు.

ద్వితీయార్థంలో మనోవికారముల గురించి తెలియజేశారు. అవి అన్ని సందర్భములందు ప్రత్యాశ–నిరాశ, సుఖదుఃఖాలను, కోపాన్ని సంయమనంతో భరించాలని, సత్పురుషునిగా జీవించడానికి కావల్సిన ధార్మిక విషయాలను చాలా గొప్పగా తెలియజేశారు.

కనికరము

వసంత ఋతువు భూమిపై పుష్పములను జల్లినట్లు కరుణా విలాసము బీదలపై దీవెనలఁ చల్లును. ఒకని కనికరించువాడు తానొకని కనికరమునకు పాత్రము కాగల్గును.

కట్టుగుడ్డలేక, నిలువనీడలేక, ఎండకు క్రాగుచు, చలికి వణకుచు, బాటలందు తిరుగు బికారులఁ జూచినప్పుడు దాతృత్వముచే నీహృదయము విప్పుము. అట్టివారిని నీధర్మపక్షముల క్రింద చేర్చుకొని కాపాడుము.

కోరిక, ప్రేమ

చిన్నవాడా! విలాసముల వేడుకలందు జాగరూకుడవై ఉండుము. ఆ వేడుక వెల వెలదివంటిదిసుమా! వెఱ్ఱి ఆశ తనప్రయత్నములఁ దానే చెడగొట్టును.

ప్రేమమార్దవము నీ హృదయమున బ్రాముకొననిమ్ము. దాని పవిత్రత నీహృదయమున కౌదార్యం గూర్చును. అనుభవములను గ్రహించుటలకు హృదయమును మృదువు పఱచుకొనుము.

తృతీయాధ్యాయము

ఉవిద

ఇందులో స్త్రీని గురించి ఆమె ఔన్నత్యాన్ని, ఆమె అలవరచుకోవల్సిన, పెంపొందించుకోవల్సిన, సుగుణాల గురించి తెలియజేశారు.

"పురుషునికి నీవు వివేకవతియైన హితురాలవుగc గల్పింప బడితివని జ్ఞాపకమునందుంచుకొమ్ము. పురుషుని కామమునకు నీవు దాసివి కావు. నీవీలోకమున మనుటకు ప్రయోజనము, అథమమైన పురుషుని ఆశను తీర్చుటయేకాదు. మఱివానికి జీవితక్లేశములందెల్ల. జేదోడగుటయు, సౌహార్దముచే వానిని సంతోషపఱుచుటయు, ప్రియోపచారములచే వాని సేదదీర్చుటయును గూడ."

ఇందులో స్త్రీ మనస్తత్వాన్ని, ఇంటిలో ఆమె నిర్వర్తించే బాధ్యతలను తెలపడంతోపాటు ఆమె మాటను గౌరివించి, అనుసరించే కుటుంబాల స్థితిగతులను తెలియజేశారు. స్త్రీ స్పష్టింపబడినది పురుషుని కోరికలను తీర్చడానికి మాత్రమేకాదు. అతని కష్టసుఖాలతో పాలుపంచుకొని, స్థైర్యాన్ని కల్గించి సహృదయతతో ఉపశమం కల్గించడానికి స్పష్టింపబడిదని ప్రతిపురుషుడు గ్రహించి, ఆమెను గౌరవించాలని, సమాజంలో స్త్రీలను సైతం గుర్తించాలని తెలిపారు.

చతుర్థాధ్యాయములో

భర్తగా, తండ్రిగా, పుత్రుడిగా, అన్నదమ్ములుగా ఎలా ప్రవర్తించాలి. బాధ్యతతో ఎలా మసలుకోవాలి. ఎటువంటి సుగుణవతిని వివాహం చేసుకోవాలి. ఏకపత్నీవ్రతుడవై విశ్వాసఘాతుకము చేయక, ఉండాలని పాటించాల్సిన విధ్యుక్త ధర్మాలను సైతం తెలియజేశారు.

పంచమాధ్యాయంలో మనుష్యులలో దైవికములయిన తారతమ్యములు గురించి వివరించారు. ఇందులో భాగంగా జ్ఞానవంతులు, జ్ఞానహీనుల మనస్తత్వాన్ని, చేష్టలను, వారి ప్రవర్తనను, ఆలోచనా తీరును తెలియజేశారు.

భాగ్యవంతులు, దరిద్రుల హృదయావిష్కరణ, యజమాని-సేవకులు, రాజు-ప్రజలు మధ్య ఉండాల్సిన సత్సంబంధాలను, ప్రజాసంక్షేమాల్ని చాలా చక్కగా తెలిపారు.

ఈ మూడు అధ్యాయాలలోను ఈ సమాజంలో భాగస్వామియైన మనిషి, వివిధ స్థితులలో ఎలా బాధ్యతాయుతంగా ప్రవర్తించాలో, ఎటువంటి సుగుణాలను అలవరచుకోవాలో ఎవరికి వారు వ్యక్తిగతంగా పెంపొందించుకోవాల్సిన, పాటించాల్సిన ధర్మాలను వివరించారు. వీటితో పాటు సమాజంలో సభ్యులైన

మనం వివిధ హోదాలలో ప్రవర్తించాల్సిన తీరును, మనుషుల మధ్య ఉండాల్సిన సత్‌సంబంధాలను, రాజుకు–ప్రజలకు మధ్య, యజమాని–సేవకునికి మధ్య ఉండాల్సిన సహృదయత, సామరస్య వాతావరణం గురించి తెలియజేసారు. షష్ఠాధ్యాయము సాంఘిక ధర్మముల గురించి తెలిపారు. ఇందులో ఉపకారబుద్ధి, న్యాయము, త్యాగము, కృతజ్ఞత, నిష్కాపట్యము మొ॥ ధర్మాల గురించి వివరించి, వీటిని ఆచరించడం వలన మనిషి ఎంతటి ఉత్కృష్టమైన మనిషిగా ఎలా ఆరాధింపబడతాడో తెలియజేశారు.

సప్తమాధ్యాం

ఈ సమాజంలో మతం గురించి, దానిని ఎంతవరకు పాటించాలి దాని ప్రయోజనం, మనిషి భగవంతుని పట్ల భయభక్తులతో జీవించాలని, మనిషికున్న కృతజ్ఞతా భావమే భక్తిపరునిగా చేస్తుందని వెల్లడించారు.

ద్వితీయ భాగం

మానవ సామాన్య విషయాలు

మానవ దేహము, దాని నిర్మాణం గురించి తెలియజేశారు. "వెఱుపును వింతను గొల్పునట్టి నీవు సృష్టింపబడితివి. ఇలా సృష్టించిన సృష్టికర్తను నీవు భయభక్తులతో ప్రస్తుతింపుము. ఆయనకు కృతజ్ఞతను సంతోషమును దెలుపుకొనుము.

నీవు చూడగల్గిన వానికంటే, నీ ఇంద్రియములకు గోచరముకానివి, నీ భౌతిక శరీరమునకు ప్రజ్ఞను కల్పించునది అది ఏదో ఎఱుగుము.

ఈశ్వరుని సృష్టికంతకు శిరోభూషణమైన నిన్ను నీవ యెఱింగి కొనుము

"దైవత్వమునకు, జడత్వమునకు, నడుమ నుండి నీవారెండింటిని ఎడకూర్చు వాడవగుచున్నావు. దేవాంశము నీయందు కొంత యుండునని తెలిసికొనుము. నీ ఘనతను నీవు జ్ఞప్తియందుంచుకొనుము నైచ్యమందును, ద్వేషమందును నడుగిడ సాహసింపకుము.

ఈ విభాగంలో మానవ సృష్టి గురించి, అతడు ఎలా భయభక్తులతో జీవించాలో తెలుపుతున్నాడు. భయము ఆశ్చర్యం గొలిపే విధంగా మానవుడు సృష్టింపబడినాడని, ఇలా సృష్టించినందులకు మానవుడు భయభక్తులతో సృష్టికర్తను స్తుతించాలని తెలుపుతున్నాడు. అదే విధంగా మానవుని ఇంద్రియాలకు కన్పించని ఒక దివ్యశక్తి ఏదో ఉందని, దానిని గ్రహించాలని సూచిస్తున్నాడు. మానవుడు దేవుడు కాడు. కానీ దేవాంశ మానవుల యందు కలదని, సృష్టం చేస్తున్నాడు. ఇలాంటి దేవాంశగల మానవుడు విచక్షణతో జీవించాలని, నీచత్వము, దుర్మార్గమైన నడవడికకు దూరంగా ఉండాలని మహోన్నతమైన సందేశాన్ని, తెలుపుతుంది.

ఇంద్రియముల ఉపయోగములు

ఇందులో ఇంద్రియజ్ఞానాన్ని ఇచ్చే ఆత్మ, శరీరం ముక్కు, కన్ను చేయి, మనసు, మొ॥ వాటి పనిని, ప్రాధాన్యాన్ని సన్మార్గములో నడవడానికి వాటిని ఎలా ఉపయోగించుకోవాలో వివరించారు. భగవంతుడు "మీ తరంగములీవైపునకు తరలవలయును ఇంత కంటే ఎత్తునకు ఎగిసిపడరాదని సముద్రములను శాసించినట్లు నీ యాత్మ శరీర వికారమును శాసించి, దారి జూపి, దాని పొగరును దిగ ద్రొక్కునుగాక! అవయవముల కెల్ల ఆత్మ నియామకము ఆ యాత్మ నిదేశములను నీ యవయములనువర్తింపవలెను.

మీ ముక్కు సుగంధ గ్రహణమునకు, నోరు రుచి గ్రహణమునకు ద్వారము కదా! అయినా వీటిని ఏప్పుడూ పీల్చిస్తూ రుచులను తినుచున్నా అది అనాసక్తిని, ఆగిపోతుంది నీ కన్నులు నీకు కావలికాండ్రు గదా! అయినను అవి తప్పును ఒప్పును గనుగొనుటలో తఱచుగా దప్పిపోవు చుండును.

ఈ చేయి నీ సహోదరులకు సహాయము చేయుటకు సృష్టింపబడిన చిత్రసృష్టి.

ప్రకృతిలో ఒకటైన సముద్రములకు భగవంతుని ఆజ్ఞ వలన ఉవ్వెత్తున ఎగిసే తరంగాలకు అడ్డుకట్ట వేసినట్లుగా అవి ఒక హద్దుకు పరిమితమై మరలామరలా అక్కడే ఎగిసిపడుతుండటం దేవుని ఆజ్ఞగా చెపుతున్నాడు. ప్రకృతిలోని ప్రతి వస్తువుకు, పదార్థానికి కొన్ని ధర్మాలున్నట్లునే మానవ పంచేంద్రియాలకు సైతం కొన్ని ధర్మాలున్నాయి. కొన్ని సందర్భాలందు ఈ అవయవాలు సైతం తమ ధర్మాన్ని కచ్చితంగా నిర్వర్తిచకపోవడం మనం గమనిస్తున్నాము. వీటి ప్రాముఖ్యాన్ని గుర్తించి, మన కోరికల బుద్ధి ప్రమేయాన్ని తగ్గిస్తే అవి చేయాల్సిన పనులు అవి చేస్తాయని, దీనికి జాగరూకత అవసరమని తెలుపుతున్నాడు.

మనుజుని ఆత్మ, దాని ఆరంభము, దాని చేష్టితములు

దేహమునకు ఆరోగ్యమెట్టిదో ఆత్మకు సౌశీల్యమట్టిది. పూర్తిగా దీనిని తెలుసుకొనుటకై పోరాటాలు పడకుము దానిని మానవబుద్ధి తెలుసుకొనజాలదు.

ఆత్మకు చావులేదు. మార్పు లేదు. ఎల్లయెడల అవి ఏకమై ఉండును. అరేబియా దేశీయులవలె అత్మయొక్కటే మనష్యులందఱియందును పంచి పెట్టబడి యున్నదని ఎంచకుము. ఐజిప్టు దేశియులవలె ఒక మనుష్యునకే అనేకాత్మ లున్నవని ఎన్నకుము.

మనిషి యొక్క ఘనత, గొప్పదనం మానవునిగా పుట్టడంలోను, అతని ఇంద్రియాలను సరిగా ఉపయోగించుకొనుటలో అతని ఘనత ఉందని" గొప్ప సత్యాన్ని తెలుపుతుంది.

మానవుడా! అని సంబోధిస్తు 'ఆత్మ' స్థితిగతిని గురించి చక్కగా వివరించాడు. దీని గురించి తెలుసుకోవడానికి ప్రయాసపడవద్దని, మానవ బుద్ధికి అతీతమని తెలుపుతున్నాడు. ఆత్మ విషయంలో అరేబియా, ఈజిప్టు దేశాలలో ఉన్న నమ్మకాలను సైతం ప్రస్తావించి, ఆత్మ ప్రత్యేకతను, ఆరోగ్యకరమైన ఆత్మ కావలసిన సౌశీల్యాన్ని, మానవ జన్మ ఔన్నత్యాన్ని తెలుపుతున్నాడు

మానవుని జీవితకాలం, దాని ప్రయోజనముల గురించి ఇలా తెలుపుతున్నాడు.

మనుష్య హృదయానికి 'ప్రాణం' ఎట్లాంటిదో వివిధ ఉపమానాల ద్వారా తెలిపారు. చక్రవాకమునకు తెల్లవారుట ఎట్లాంటిదో, గుడ్లగూబకు బ్రొద్దుక్రుంకుట యెట్టిదో, తేనెటీగకు తేనె యెట్టిదో మనుష్య హృదయమునకు ప్రాణమట్టిది. మనుష్యుని ప్రాణం ప్రయోజనం గురించి "మతిలేని వాని వలె జీవితం కంటే ఎక్కువ విలువ కలది మరేదీలేదని తలంపకుము. పండితంమన్యులవలె జీవతమును తృణీకరింపవలెనని కూడ తలంపకుము.

దానిని నీకొరకు మాత్రమే ప్రేమింపకుము. ప్రధానముగ "ఇతరులకు చేయు హితము కొరకు దానిని ప్రేమింపుము"

"మంచి నీ శక్తియందున్నది. దానిని నీవార్జించుకొన లేకుండుటే చెడుగగును.

జీవితమును దుర్వినియోగ పఱచుటలో మానవున్ని మించిన జీవి లేదు. కాకి, లేడి, మొదలగునవి నీవలె దుండగములు చేయునా? క్రూరముకాగలవా? కృతఘ్నములా? ఇటు వినుము, అపరాధము లేని జీవిక, కపటత్వం లేని నడవడి, చిరజీవితమునకు తెరువులని పయివానివద్దనుండి నేర్చుకొనుము.

అంతమున భాగ్యమనుభవింతు ననుకొని ప్రారంభముననే ధనము కొరకు బాధపడుకుము. ప్రస్తుతముననుభవింపని వాడు తనకు గల దానినెల్ల తొలగద్రోసికొనువాడగును. జనునకు తన బ్రదుకు తెలియరాక మునుపే మృత్యువు వచ్చి ముట్టుకొనును. యౌవనమున సౌశీల్యము గలిగియుండుము. వార్ధకమున గారవింప బడుదువు.

ఇందులో మనుష్యులు 'ప్రాణం' పట్ల ఎలాంటి అభిప్రాయాన్ని కల్గి ఉండాలో నిర్దేశిస్తున్నాడు. ఈ ప్రాణాన్ని పరులకు మేలును ప్రయోజనాన్ని కల్గించుకోవడం కోసమే దానిని ఉపోయోగించుకోవాలని, సందేశమిస్తున్నాడు. జీవితాన్ని సద్వినియోగం చేసుకోవడం కంటే దుర్వినియోగ పరచటంలోను మానవుడిని మించిన వాడు లేడని, ఈ ప్రకృతిలో ఉండే పశు పక్ష్యాది జంతుజాలానికి లేని కపటత్వం, కృతఘ్నత, క్రూరత్వం మనిషి అనుసరిస్తున్నాడని తెలుపుతూ కపట్వం లేని నడవడికను ఈ జంతుజాలంనుండి నేర్చుకోవాలని సూచిస్తున్నాడు.

ద్వితీయాధ్యాయం

మనుష్యుడి మనోవికారములు వాని దోషములు

1. గర్వము

"బ్రతికినంతకాలము నీవు ధర్మపథమును తప్పకుము. దానిని గూర్చి ఇతరులేమనుకొన్నను నీవు లక్ష్యపెట్టకుము. ప్రశంసాపాత్రము కాదగిన ప్రవర్తనతో నీవు పరితృప్తి చెందుము. నీ వెనుకవచ్చు వారాప్రశంసను విని పరితోషింతురు.

చాంచల్యము

మానవుడా ప్రకృతి నిన్ను చంచలత్వమునఁ పడద్రోయుచున్నది. కనుక నీవట్లు పడిపోకుండ నిలువరించుకొనుచుండుము.

నీకు తనువు నిచ్చినవారే దౌర్బల్యమును గూడ నిచ్చిరి. కానీ నీ యాత్మ నిచ్చినవాడు నిశ్చల సంకల్పమను అస్త్రమును కూడ నిచ్చినాడు కావున దానిని ఉపయోగించుకొనుము జ్ఞానవంతుడ వగుదువు. జ్ఞానివైతివా సౌఖ్యమందగలవు.

పరస్పర విరుద్ధములయిన పనులఁ ప్రవర్తించుటకంటె మనస్సునకు దూషితమేమున్నది?

నీలోనీవు కర్తవ్యములఁ గూర్చి ధర్మనిర్ణయము కావించుకొనుము. నిర్ణయించుకున్న ప్రకారం ఆ కార్యములను నెఱవేర్చబూనుము. సముచితములయిన వని నీవు ముందుగా సంకల్పించుకొన్న కార్యములయెడ ఇంచుకైనను చాంచల్యము పూనకుము. ఇలా చేసితివేని నీ యింద్రియములు నీకు లోబడియుండును. స్థిరచిత్తత నీలోని మంచిని స్థిరపఱచును. అప్పుడే నీ దురదృష్టము. కలవరము, కార్యభంగము నీ గృహద్వారమున చేరవు.

చంచలుని ఆత్మకు శాంతిలేదు. వానిలో కూడి యుండు వాడు కూడ సుఖి కాఁబోఁడు. చపల మనస్కుల సౌఖ్యం ఇసుకనేలపై మట్టమున గట్టిన సౌధము వంటివి. గట్టిగా గాలివీచినచో దాని పునాదులు కొట్టుకొనిపోవును. కనుక మనిషి 'స్థిత ప్రజ్ఞుడు' గా ఉండాలి. జీవించడానికి ప్రయత్నించాలి. అలా ఉంటే లోకాతీతమైన విషయాలను, రాబోయే సుఖాన్ని, గుర్తించ గలడని, తెలిపాడు. కనుక మనుజుడా! న్యాయము లైన విషయములందు నీ హృదయమును నాటింప జేయుము.

దౌర్బల్యము

నరుడా! గర్వివి, చంచలుడవు అయిన నీవు దుర్బలుడవుగాక మఱెట్లుండగలవు. ఉన్న సుఖములోని మేలు నీకు విసుగు కల్పించును. రానున్న సుఖములోని కీడు నీకు తెలియరాలేదు. సంతృప్తి నొందియుండుటే గొప్ప సౌఖ్యమని తెలుసుకొనుము.

జ్ఞానము చాలదు

అందమైనది, అపేక్షింపదగినది, మనుష్యుడు పొందదగిన వానిలో బొగడదగినది ఏది? అది జ్ఞానమే కదా! స్వాభావికముగా మనుష్యుడు సత్యమును కోరును కాని అది తన యెదుటనున్నప్పుడు గుర్తింపజాలడు. న్యాయవర్తన మలయపరచుకొనుము అప్పుడు పశ్చాత్తాపమునకు బాల్పడవు.

దౌర్భాగ్యము

వివేచన శక్తిని బాగుగా నీవు వినియోగించితివేని దుఃఖము తొలిగిపోవును. బుద్ధిగలవాడవై యుందువేని సంతోషం నిన్ను దర్శించి, చాలాకాలము నీ సన్నిధినుండును.

చావు వచ్చునన్న భయముచే మునుష్యుడు దానిని సమీపించుచున్నాడు. చావు కంటే చావు భయమే ఎక్కువ బాధకము. నీవు చేయు కార్యముల కెల్లప్పుడును ప్రత్యుత్తరమిచ్చుటకు సంసిద్ధుడవై ఉండుము. ముందుగా విచారమున ముంపకుండ వచ్చెడు చావు మంచి చావు.

వివేకము

అర్హత లేని పనిలో నడుగిడకుము. ఏలనగా అందు అధిక నైపుణ్యముగల వాడు నిన్నవమానించును. జ్ఞానహీనుని మెప్పు కంటే జ్ఞానవంతుని దెప్పు నీవు కోరదగినది. జ్ఞానవంతుడు నీవు త్రిప్పుకొందువనియే నీ తప్పును దెప్పును. జ్ఞానహీనుడు తన్ను పోలిన వాడవని నిన్ను మెచ్చుకొనును.

అహంకారం

జీవకోట్లలో నెల్లా మానవుడే అహంకారి అభవ్యుడు.

అఖండమైన ఈ విశ్వమును మనుష్యుడొక యణుమాత్రము. అట్టివాడు తన కోసమె సృష్టియెల్ల ఏర్పడినదనుకొనును. పొగరుచే మతిc బోగొట్టుకొన్నవాడా! పగలబడకుము అడcకువ గలిగి యుండును. ప్రపంచ ప్రవర్తనమునకు నీవేకాదు ప్రయోజనము. ఇది యెఱుcగుము. ఋతువుల గతి నీకోసమే నెగడలేదు. నీతోడ భూమి మీద నివసించు ఇతర జీవులు నీకంటే తక్కువని తృణీకరింపకుము.

నీకు తెలిసినంత వరకు మంచిని చేయుము సుఖపడుదువు. సౌశీల్యమే ఈ లోకమున నీవు సంపాదింపదగినది.

ఈ అధ్యాయంలో మనుష్యుని మనోవికారాలు అయిన, గర్వం, చంచలత్వం, దౌర్బల్యము, దౌర్భాగ్యము,, వివేకమును గురించి చాలా చక్కగా వివరించారు. మనిషి బ్రతికినంత కాలం ధర్మమార్గాన్నే అనుసరించాలని, ప్రకృతి కల్గించే చంచలత్వంలో పడిపోకుండా ఉండాలని, తల్లిదండ్రుల నుండి వచ్చిన దౌర్బల్యాన్ని జయించడానికి మనకు జీవం పోసిన వాడు నిశ్చల సంకల్పాన్ని ఇచ్చాడని, జ్ఞానవంతుడిగా జీవించాలని తెలుపుతున్నాడు. చంచలత్వం ఉన్న మనిషి జీవితం ఎలా ఉంటుందో తెలిపి స్థిత ప్రజ్ఞుడిగా జీవించడానికి ప్రయత్నించమని సూచిస్తున్నాడు.

తృతీయాధ్యాయం

స్వపరానర్థకములగు వ్యామోహములు

దురాశ మితిమీఱుట, ప్రత్యపకార చింత, క్రూరత్వము, ఏవగింపు, అసూయ, హృదయోద్వేగము, మొదలగు వాటిని ఏ మనిషికి అయినా అనర్థములు కలిగిస్తాయని వీటిని త్యజించవలెనని వీటి ప్రాముఖ్యాన్ని తెలిపారు.

గౌరవములలో కూడ తరతరముల నుండి వచ్చే గౌరవం కంటే కష్టపడి సంపాదించిన గౌరవమే వాస్తవమైన గౌరవమని చెప్పనొప్పును.

గౌరవం అనేది నీవు తలపెట్టిన కార్యములను గావించి విధానములను బట్టి వచ్చును గాని చేసే కార్యములను బట్టి కాదు.

పుస్తకములను చదువుటకు నిండైన జ్ఞానం లభించదు. ప్రకృతిని చదువుటలోనే ఉన్నది.

మానవుడు స్వయంగా తన జీవితంలో తాను సంపాదించుకోవాల్సిన గొప్ప గుణాలను, సత్ప్రవర్తనను, అలవరచుకోవల్సిన నియమాలను ఇందులో చక్కగా వివరించారు.

తప్పించుకోరాని దైవికములు

లాభనష్టములు కల్గినప్పుడు, సంపదలున్నప్పుడు, దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నప్పుడు రెండింటిని సమానంగా ఎదుర్కోవడానికి జాగరూకతగా ఉండాలి. పిరికివాడవై పాఱిపోకుము.

వ్యాధి బాధ

శరీరానికి వ్యాధి కల్గినప్పుడు ఆ బాధను ఎవరికి వారే అనుభవించాలి. అదే మాదిరి మరణం సైతం తప్పించుకోలేరు. ఎక్కువ కాలం జీవించినచో ఎక్కువ సౌఖ్యము గలుగునని యెన్నకుము. మంచిగా గడిచిన జీవితమే మనుజునకు సుఖ గౌరవములు నొసంగునది.

మంచిగా ఇలా జీవితమును గడిపిన వాడు మరణమునకు, పిదప నా మనుగడ వలని లాభముల ననుభవించును. ఆనందించును మానవ జీవితమున కిదియే మంచి క్రమము.

ముగింపు : మానవుడు సంఘజీవి కనుక కొన్ని పనులను, ప్రయోజనాలను సమిష్టిగా అనుభవించగలడు. కానీ ఎక్కువగా చాలా అంశాలకు, ఆచరణలకు వ్యష్టిగానే జీవించాలి ఫలితాలను అనుభవించాలి. వ్యష్టి జీవితం సమర్థవంతంగా కొనసాగిస్తే సమిష్టి జీవితాన్ని సైతం బాధ్యతాయుతందా గడపగలడు. ఈ 'నీతినిధి' లోని 105 పుటలలో తెలిపిన ధర్మాలు ఆయా వ్యక్తులు, ఎవరికి వారుగా నిర్వర్తించాల్సిన ధర్మాలు, పాటించాల్సిన నియమాలని స్పష్టంగా తెలుస్తుంది. ఈ గ్రంథాన్ని చదవడం ద్వారా అనేక ధార్మిక సందేహాలు నివృత్తి అవుతాయి. అనేక మత గ్రంథాలు చెప్పే జీవన విధానాలను, పురాణ, ఇతిహాసాలు బోధించే అంశాలనన్నింటిని, క్రోడీకరించి ఒక చోట కూర్చి అంశాల పరంగా వివరించారు. అనేక సద్గుణాలను అలవరచుకోవడానికి నిధివంటిది కాబట్టే వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ఈ గ్రంథం విలువను గుర్తించి, ఈ గ్రంథాన్ని అనువదించి, ఆంధ్ర ప్రజలకు గొప్ప ప్రయోజనాన్ని కల్గించారు. వేటూరి వారు కేవలం గ్రంథపరిష్కర్త, శాసనసాహిత్యపరిశోధకులు మాత్రమే కాదు. ఆయన ఒక ఆధ్యాత్మిక వేత్త. భగవత్ సాన్నిధ్యాన్ని ఎఱిగిన వారు. అందుకే ఈ రచన విశిష్టతను గుర్తించి, ప్రజల, సమాజ శ్రేయస్సును కోరుకున్న నిజమైన శ్రేయోభిలాషిగా ధార్మికవేత్తగా దర్శనమిస్తున్నారు. దీనిని ప్రతి ఒక్కరు తప్పక చదవదగిన విలువైన రచనగా భావించవచ్చు.

* * *

6. సాహిత్య పరిణిత బుద్ధి - అమృతయోగ సిద్ధి - శ్రీ వేటురి ప్రభాకర శాస్త్రి
(ఉత్తరప్రత్యుత్తరాల ఆధారంగా వ్యక్తిత్వ పరిచయము)

- శ్రీమునుగోటి వేణుగోపాల్

శ్రీ ప్రభాకర శాస్త్రి గారి ప్రజ్ఞామయ జీవితము ఎల్లపుడూ మనకు స్ఫూర్తిదాయకము. చవులూరించే తెలుగు సాహిత్య మాధుర్యమును గ్రోలుటకు ఆయన సాహిత్య ప్రక్రియలు, రచనలు ఎంతగానో ఉపకరిస్తాయి. నా భాష ఇంత గొప్పదా? నా జాతి ఇంత గొప్పదా? నా దేశపు సంస్కృతి ఇంత ఘనమైన వారసత్వము కలిగియున్నాదా? అని మనము ఆశ్చర్యపడి తెలుసుకొనుటకు శ్రీ శాస్త్రి గారి రచనలు ఎంతగానో ఉపయోగపడతాయి. సింధువులాంటి ఆయన వ్యక్తిత్వములో మనకు తెలిసినది బిందువు మాత్రమే. అంటే కొండంతలో కుండంత మాత్రమే. మన సాధారణ పరిధికి అందనంత వ్యక్తిత్వమాయనిది. మహాకవి కాళిదాసు ఇలా అంటాడు "రఘువంశమునే మహా సాగరాన్ని చిన్న తెప్పలో దాటడానికి ప్రయత్నిస్తున్న వాణ్ణి నేను". అలాగే శ్రీ శాస్త్రి గారి మహాసాగర వ్యక్తిత్వాన్ని ఉత్తర ప్రత్యుత్తరల ఆధారంగా పరిచయము జేయుటకు సాహసించుచున్నాను. ఇది ఆంశిక భాగమే. వ్యక్తిత్వాన్ని మూల్యాంకనము జేయుటకు ఉన్న అనేక ఆధారాలలో ఈ ఉత్తర ప్రత్యుత్తరములు ఒక మార్గము. ఐతే అది సమగ్రము కాదు. శ్రీ ప్రభాకర శాస్త్రి గారి వ్యక్తిత్వము, పాండిత్యము, ఉన్నత స్వభావము, యోగములో ఆయన ఉపలబ్ధులు, సమకాలీన సమాజములోని సామాజిక స్థితిగతులు, ఆలోచనా ధోరణులు మొదలగునవి కూడా ఈ ఉత్తర ప్రత్తుత్తరములు ద్వారా మనకు తెలుస్తున్నవి. శాస్త్రి గారి యొక్క బహుముఖమైన అనుభవములు అభిరుచులు, లక్ష్యములు, లేఖలు వ్రాయడంలోని మొళకువలు, ఆప్యాయత, ఆదరణలు, అనుబంధాలను వ్యక్తము చేసే తీరులు, మీదు మిక్కిలి ఆయన స్నిగ్ధ హృదయము, ఆర్ద్రత, దివ్యప్రేమ, అవ్యాజమైన ప్రేమ, యోగసిద్ధి కూడ మనకు తెలియజేయబడుతాయి. ఉత్తమ వ్యక్తిత్వ నిర్మాణానికి, భాషా వికాసమునకు, ఉన్నత లక్ష్యసాధనకు, జీవిత సాఫల్యతకు, లోక కళ్యాణానికి, ఉత్తర ప్రత్యుత్తరాలు చదవడం మనకు ఉపయోగపడుతుంది.

ఆధారపట్టిక

కాలము - ఎవరి నుండి ఎవరికి - ఆధారము - విషయము ప్రత్యేకతలు

1. 09.12.1917 – వీరేశలింగం పంతులు గారి శ్రీ శాస్త్రి గారికి – మణిమంజిరి (ఫిబ్రవరి 1981) – ప్రబంధ రత్నావళి గురించి, పావులూరి మల్లన గురించి వివాదము – కందుకూరి వీరేశలింగం పంతులు గారితో అభిప్రాయ బేధములు, శాస్త్రి గారి పాండిత్య ఘనత వాస్తవ విషయాల గురించి తెలియచేయాలనే తపన.

2. 13.02.1948 – మోచర్ల రామకృష్ణయ్య శ్రీ శాస్త్రి గారికి – మణిమంజరి (ఫిబ్రవరి 1981) – గాంధీగారిని గురించి రేడియోలో శ్రీ శాస్త్రిగారి ప్రసంగము – శ్రీ శాస్త్రి గారిని మెచ్చుకోవడం కవిత్వమంటే ఇది అని శ్రీ దుర్భాసుబ్రహ్మణ్యశర్మ గారి వ్యాఖ్య.

3. 24.03.1944, 08.04.44, 19.08.44, 08.09.49, 13.09.49 – చెళ్ళపల్లి వెంకటశాస్త్రి గారు శ్రీ శాస్త్రి గారికి – మణిమంజరి (ఆగష్టు 1981) – కొప్పరపు కవులతో విభేదాలు, తనకు, తనకు తెలిసిన వారి ఆరోగ్యము కొఱకు సహాయము జేయమని కోరడం – శ్రీశాస్త్రి గారి పట్ల చెళ్ళపల్లి వారికి గల ప్రత్యేక ఆధారము వివాదరహితముగా వుండాలని శాస్త్రి గారి అభిలాష.

4. 05.04.1927 – శ్రీ రాజానల్లపరాజా మీర్జా అచ్యుతరామ రాజ బహాద్దరు తుని గారు శ్రీ శాస్త్రి గారికి – మణిమంజిరి (ఆగష్టు 1981) – చాటు పద్యాలు పంపడం గురించి – చాటు పద్య మణిమంజరి పద్యాల సేకరణము గురించి శ్రీ శాస్త్రిగారి తపన.

5. 17.09.1924 – శ్రీ మామిడి వూడి వెంకట రంగయ్య ఆచార్యులు, మహారాజా కాలేజి, విజయనగరం గారు శ్రీ శాస్త్రి గారికి – మణిమంజిరి (ఆగష్టు 1981) – శ్రీ శాస్త్రి గారి "శృంగార శ్రీనాథ" గ్రంథమును గురించిన ప్రశంస – శాస్త్రి గారి పరిశోధన పరిశ్రమలను గురించి ప్రశంస.

6. 06.06.1947 – జి. వెంకటానంద రాఘవరావు, ఎలమంచిరి వారు శ్రీ శాస్త్రి గారికి – మణిమంజరి (ఆగష్ట 191) – శృంగార శ్రీనాథమును గురించి ప్రశంస – దేశి తెలుగు కవుల ప్రత్యేక సాహిత్య విశేషములతో కావ్యమాలికను రచించుటకు అనుగ్రహించమని కోరడం, స్ఫూర్తిని రగిలించడంలో శ్రీ శాస్త్రిగారి ప్రభావము.

7. 24.01.1948 – శివలెంక శంభుప్రసాదు, ఆంధ్రపత్రిక, శ్రీ శాస్త్రి గారికి – మణిమంజరి (ఫిబ్రవరి 1982) – 'నేటి తెలుగు' అన్న శీర్షికతో వ్యాసము వ్రాయమని శాస్త్రి గారిని కోరడం – శ్రీ శాస్త్రి గారితో ఆంధ్రపత్రికకు వున్న అనుబంధము.

8. 07.03.1924, 06.04.1924, 11.01.1928 – శ్రీ గిడుగు వెంకట రామమూర్తి పర్లాకిమిడి గారు, శ్రీ శాస్త్రిగారికి – మణిమంజరి (ఫిబ్రవరి 1982) – వాడుక భాషను గురించి, శాసనములు గురించి – శ్రీశాస్త్రిగారు వ్యావహారిక భాషా ఉద్యమాన్ని సమర్థించడం గురించి ప్రాచీన కావ్యవాఙ్మయాన్ని పరిరక్షించడంలోను వాడుక భాష వ్యాప్తిని గురించి వీరిద్దరి మౌలిక కృషి. ప్రబంధముల కొఱకు ఒక భాష గద్యాలకు వ్యవహారిక భాష పూర్వులు వాడినారని శ్రీశాస్త్రి గారు తెలియజేయడం. ఇది చాలా ముఖ్యమైన విషయం.

9. 02.06.1950, 28.06.1950 – శ్రీ కోటా సుబ్బారావు, మచిలీపట్నం, శ్రీశాస్త్రి గారికి – మణిమంజిరి (ఆగష్టు 1982) – తిరుమల తిరుపతి దేవస్థానం మ్యూజియమునకు వస్తువుల సేకరణను గురించి – టి.టి.డి తరపున తిరుపతిలో మ్యూజియమును నెలకొల్పడానికి శ్రీశాస్త్రిగారు పడిన ప్రయాస శ్రమ.

10. 08.09.1938, 07.10.38, 30.10.31, 12.12.38, 24.02.32, 28.09.41, 07.10.41, 11.11.41, 12.11.41, 19.11.41 – శ్రీ కట్టమంచి రామలింగారెడ్డి, విశ్వకళాపరిషత్తు, వాల్తేరు, శ్రీ శాస్త్రిగారికి (పరస్పరం) – మణిమంజిరి (ఆగష్టు 1983) – రంగనాథ రామాయణమును గురించి – తెఱమరుగన శ్రీ శాస్త్రిగారు చేసిన అమితమైన కృషి, పరోపకారమై శ్రీ శాస్త్రి గారు పడిన తపన.

11. 12.06.1939 – శ్రీకట్టమంచి రామలింగారెడ్డి, విశ్వకళాపరిషత్తు, వాల్తేరు, శ్రీశాస్త్రిగారికి – మణిమంజిరి (ఫిబ్రవరి 1983) – ఆంధ్రుల జీవితము, సాహిత్యము, చరిత్ర దృక్పథము నుండి ఈ అంశాన్ని గురించి విషయ సేకరణకు సహాయము చేయుట గురించి – శ్రీశాస్త్రి గారు విషయములు సేకరించి పంపించడం ద్వారా వారి నిస్వార్థ సేవ నిరూపణ.

12. శ్రీవేటూరి ప్రభాకర శాస్త్రి గారు, శ్రీ చల్లా సూర్యనారాయణ శాస్త్రి గారికి – మణిమంజిరి (ఫిబ్రవరి 1984) – సరస్వతి పత్రికకు వ్యాసములను పంపుట గురించి – పత్రికాధిపతులు పరిశీలింప దగిన విశేషములు, బలము లేదని, పత్రికా సంపాదకులు చెప్పరాదు. ఖడ్గముకన్నా కలము గొప్పది.

13. 17.07.1947, 06.08.47, 22.08.47, 14.09.47 – శ్రీ చిత్తూరు నాగయ్య గారు ప్రముఖ కళాకారుడు, మద్రాసు, శ్రీ శాస్త్రి గారికి – మణిమంజరి (ఫిబ్రవరి 1984) – తన ఆరోగ్యమును గురించి యోగ సాధనను గురించి – శ్రీ నాగయ్య గారు శ్రీ శాస్త్రి గారి మీద అపారమైన భక్తి ప్రపత్తులు చూపి ఉన్నారు. ఒక ఉత్తరంలో ఆయన శ్రీ శాస్త్రి గారిని పరమపావనులూ, పూజ్యులు అయిన బ్రహ్మశ్రీ గురువుల వారి చరణ సన్నిధికి అని రాసారు.

14. 06.09.1929 – శ్రీశాస్త్రి గారు, శ్రీనిడదవోలు వెంకట్రావు – మణిమంజిరి (ఫిబ్రవరి 1985) – బసవ పురాణమును గురించి కారిక రేఫ విషయముల గురించి – "గుండును కొండ చేయుదురా? ఆంధ్ర వాఙ్మయ హర్మ్య నిర్మాణ ప్రయత్నమును నేనొక కూలీవాడనె – భావి భాషా వ్యవసాయమున మీ కమ్మతకాడు తరచుగా కానరాడు". దీనిని బట్టి చూడ శ్రీ శాస్త్రిగారి వినయ స్వభావము, వాఙ్మయ సేవ పట్ల ఆసక్తి సన్నగిల్లుట తోచుచున్నది.

15. 09.11.1949, 18.11.49 – శ్రీ గిడుగువెంకట సీతాపతి, మద్రాసు, శ్రీశాస్త్రి గారికి – మణిమంజరి (ఆగష్టు 1985) – కుమారసంభవము ముద్రణ గురించి – శాస్త్రి గారు బహుళ కార్యకలాపాలలో నిమగ్నులగుట, పిఠాపురం రాజాకు శ్రీ శాస్త్రి గారి పట్ల ప్రత్యేక గౌరవము.

16. 24.11.1945 – శ్రీశాస్త్రిగారు, శ్రీకొత్త వెంకటేశ్వరరావు, గుంటూరు – మణిమంజిరి (ఆగష్టు 1985) – ట్రీట్‌మెంట్స్ గురించి – శ్రీమతి వెంకటేశ్వరరావు ట్రీట్‌మెంట్ వల్ల సుఖముగ వున్నట్లు శాస్త్రి గారికి గోచరించడం.

17. 11.02.1949 – శ్రీ కొత్త వెంకటేశ్వరరావు గారు, శ్రీ శాస్త్రిగారికి – మణిమంజరి (ఆగష్టు 1985)– కుశల ప్రశ్నల గురించి – పనుల ఒత్తిడి తీవ్రత, ఉన్నవలక్ష్మీ నారాయణ గారి గురించి ప్రస్తావన.

18. 19.12.1949 – శ్రీ వేలూరి శివరామశాస్త్రి, సూరవరం, కృష్ణాజిల్లా గారు, శ్రీ శాస్త్రి గారికి, మణిమంజరి (ఆగష్టు 1985) – త్రిలింగ పత్రికను గురించి – ఇరువరి మధ్య గల స్నేహం, మిత్రత్వం.

19. 26.03.1950 – శ్రీ తిమ్మావజ్జుల కోదండరామయ్య – శ్రీ శాస్త్రి గారికి – మణిమంజిరి (ఆగష్టు 1985) – వావిళ్ళ నిఘంటు ముద్రణ, కుమార సంభవము వ్రాతప్రతుల గురించి, క్షేత్రయ్యపదములను అచ్చువేయుట, పావులూరి గణితము ముద్రణను గురించి – శిష్యులను సొంత బిడ్డలుగా చూచుకొనే స్వభావం శ్రీ శాస్త్రి గారిది.

20. 19.06.50 – శ్రీవావిళ్ళ వెంకటేశ్వర శాస్త్రి, మద్రాసు గారు, శ్రీ శాస్త్రి గారికి – మణిమంజిరి (ఆగష్టు 1985) – చారుచర్య కుమార సంభవము ముద్రణల గురించి – శ్రీ శాస్త్రి గారికి సాహిత్య స్రష్టలైన వివిధ వ్యక్తులతో వున్న సంబంధము.

21. 26.01.1944, 05.04.1944, 05.06.44, 10.08.44, 06.10.44 – శ్రీకోరాడ రామకృష్ణ, మద్రాసు గారు, శ్రీ శాస్త్రి గారికి – మణిమంజిరి (ఆగష్టు 1985) – కుమార సంభవము ప్రచురణను గురించి – నన్నెచోడుని కుమార సంభవమును ముద్రించుటకు పడిన శ్రమ, 'గాలి కబుర్లు' గురించి ఆశ్చర్యము వ్యక్తము జేయుట.

22. 1939 నుండి 1950 వరకు – శ్రీ శాస్త్రి గారు, శ్రీ కొత్త వెంకటేశ్వర రావు గారికి – ప్రజ్ఞా ప్రభాకరం గురు పూజ ఉభయకుశలోపరి – రెండవ ప్రపంచ యుద్ధము, వ్యక్తిగత విషయములు – ట్రీట్‌మెంట్ ఇవ్వడం, సాధన – ఇతరుల ఆరోగ్యము కొఱకు తపన – వృత్తి విషయములో లోక సామాన్య ధర్మాలు పాటించడం – దురన్యాయము చేయకుండుట – ప్రత్యేకమైన ట్రీట్‌మెంట్లు రాత్రివేళ్ళలో, నిరుత్సాహము కంగారు లేకుండుట – భగవదను గ్రహము గురించి వెగటు రోత వుండకుండుట. పవిత్రత, శుచి, ఆరోగ్యః ఈశ్వర మయాలు – ఎట్టి విపరీత పరిస్థితులలో కూడ విశ్వాసము వీడకుండుట. భారత దేశము ద్వారా ప్రపంచమునకు శాశ్వతానందము పొందే రోజులు సమీపములో వున్నవని భావన – మాయా వరణము లేని నిత్య సత్యానుభూతికి తపన – ప్రయాణము, సంక్షోభము, దేశ విప్లవము ముందు శాస్త్రి గారి శరీరములో జరిగినది. –శాస్త్రి గారి యోగ చైతన్యము విస్తరించి యావద్భారత దేశ సంక్షోభాన్ని సరిదిద్దే ఆధ్యాత్మిక శక్తిగా పనిచేయడం. శిష్యుల యోగ క్షేమాల గురించి నిరంతరం తపన పొందటం. స్వల్ప సహాయనికే అనల్ప కృతజ్ఞత శాస్త్రి గారి ఉదార స్వభావాన్ని తెలుపుతాయి. మాస్టర్ గారి పునరవతరణ (వారి స్వరూప ప్రదర్శనము),

మృత్యురాహిత్య తలపు ఫలించాలని కోరుట (శాశ్వత భౌతిక శరీరము), మాస్టరుగారి అనుగ్రహమును స్పష్టముగా ఫిజికల్ లెవల్‌లో తెలియుటకై ప్రతీక్షణ. కామెంట్ తెలియడం. స్థూల శరీరములో మార్పులకై వేచియుండటం, యోగము నివృత్తి మార్గము కాదు. ఒక ప్రక్క తీవ్రముగా ట్రీట్‌మెంట్లూ, ఆరోగ్యములు, విశేషములు. ఇతరులు ఆర్తి, శాస్త్రి గారి అంతఃప్రజ్ఞలో స్ఫురించి దానికి తగిన ట్రీట్‌మెంట్లు అప్రయత్నంగా జరుగుట బాధ నివారణ కూడ అలాగే జరిగినట్లు అనిపిస్తుంది. గురుపూజ సంపుటము వెల్లడించడానికి తోచడం. ప్రజ్ఞా ప్రభాకరానికి ప్రారంభం. మనసు ప్రసన్నముగా ఆప్యాయమానంగా ఉంచుకోవడం, మనకన్నా సుఖానంద పరికరములు లేనివారు ఎందరో, సంకటములతో నలుగుతున్న వారితో పోల్చుకుంటే తెలుస్తుంది. తదేకపరత మనలో నెలకొనవలెను. సరియైన పరమార్థ మార్గములో నడుస్తున్నా నన్న నిశ్చయము కలిగితే చికాకులన్నీ విచ్చిపోతవి. ఆ నిశ్చయము ఒకతూరి కలిగేదికాదు. ఎరుకమరపులుగా – దృశ్యా దృశ్యముగా వెనుకబడి – ముందుకు దూకి – లేదేమో అనిపించి ఉన్నదని ధ్రువీకరించి చిత్ర చిత్రంగా మనలను తీసుకువెళతుంది. నన్ను మీరు, మిమ్ము నేను, నన్ను, సి.వి.వి – దాన్ని నేను, సి.వి.వి – ప్రకృతిని, ప్రకృతి సి.వి.వి.ని విడనాడతరము కాదు. అంతా క్షేమము. బయట అశాంతి ఉంటే దానిలో చిక్కుకోక (కూర్మోంగా నీవ) లోలోనికిపోయి ఏకీభవించి ఆనందము తెచ్చుకోవలెను. ఈక్వినాక్సు దానినే నేర్పుతున్నది. అందరి క్షేమాదికము వ్రాయుము.

వివరణ

శ్రీశాస్త్రి గారు 1916-20 ల మధ్య లబ్ద ప్రసిద్ధులైన కందుకూరి వీరేశలింగం పంతులుతో ప్రబంధరత్నావళి గురించి, పావులూరి మల్లన్న రచనల గురించి విభేదించారు. సాహిత్యమనేది సప్రమాణికంగా ఉండాలనేది వారి తపన. అట్టి దృఢభావనతో ఆయన శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులు గారితో వాద ప్రతివాదనలు గావించారు. ఆయన పాండిత్యానికి తర్కబద్ధమైన భావనలకు ఇది ప్రతీక. ప్రమాణికత అనే గీటురాయి ఆయన వ్యక్తిత్వములో అంతర్భాగముగా అప్పటికే నెలకొనియున్నది. శ్రీ శాస్త్రిగారి శృంగార శ్రీనాథము అనుగ్రంథము తెలుగు సాహిత్య రచనలో కొత్త దారి త్రొక్కింది ఆచార్యులు శ్రీ మామిడిపూడి వెంకట రంగయ్య, శాస్త్రి గారీ పరిశోధనను గురించి ప్రశంసించారు. శ్రీ రాఘవ రావు, యలమంచిలి ఆయన అడుగు జాడలలో నడవాలని యోచించాడు. చాటు పద్యాలను సేకరించి మణిమంజరిలో ప్రచురణ గావించడం శ్రీ శాస్త్రి గారి ప్రతిభకు సృష్టమైన తార్కాణము. వ్యావహారిక భాష ఉపయోగం వ్యాప్తి గురించి గిడుగు పిడుగులతో శాస్త్రి గారి సంపర్కము, ఆయన మౌలిక ప్రజ్ఞకు, దూరచూపుకు నిలువెత్తు తార్కాణము.

శ్రీ నిడదవోలు వెంకట్రావు గారికి వ్రాసిన లేఖలో "గుండును కొండ చేయుదురా?" అని తమాషాగా ప్రశ్నించారు. అదేవిధంగా భాషా వ్యవసాయమున కమతుకాడుగా తనను తాను భావించుకొన్నాడు. ఇది శాస్త్రిగారి వినమ్రతకు గుర్తు. కట్టమంచి రామలింగారెడ్డి, విశ్వకళా పరిషత్తు, వాల్తేర్లులో రంగనాథ

రామాయణమును గురించి జరిగిన ఉత్తర ప్రత్యుత్తరములు శ్రీ శాస్త్రి గారి పరోపకార స్వభావము, రంగనాథ రామాయణాన్ని అచ్చులోనికి తెచ్చుటకు, తెరమరుగైనా సరే కృషి చేయుటకు సిద్ధపడిన భాషా సేవా పరాయణత్వములు ద్యోతకమవుతాయి. పత్రికా సంపాదకులు బలము లేని వారని చెప్పరాదని శ్రీ చల్లా సూర్యనారాయణ శాస్త్రి గారికి వ్రాయడంలో ఆయనకు పత్రికల పట్ల, సాహిత్య కారుల పట్ల వున్న గౌరవము ఆదరముల ప్రస్ఫుటమౌతుంది. కుమార సంభవము ప్రచురణను గురించి తదితరాలను ఆయన శ్రీ కోరాడ రామకృష్ణ గారితో ఆయన జరిపిన ఉత్తర ప్రత్యుత్తరములు ఆయన వాఙ్మయము సేవకు, శాసనాల ఆధ్యయన ప్రతిభకు తార్కాణము. ఎంత పని వత్తిడి వున్ననూ, తీరిక లేకున్నను తనకు ఒప్పచెప్పబడిన బాధ్యతను సరిగా, ససిగా నిర్వహించుటకు ఆయనపడే తపన ఇది తెలియజేస్తుంది. ఆంధ్ర పత్రిక శివలెంక శంభూప్రసాద్ గారు శాస్త్రి గారిని 'నేటి తెలుగు' అన్న శీర్షికతో వ్యాసము వ్రాయమని కోరడంలో శ్రీ శాస్త్రి గారికి సమకాలీన భాషా ధోరణులతో గల సన్నిహిత పరిజ్ఞానమును తెలియజేస్తుంది. కొప్పరపు కవులతో విభేదాలు సర్దుకోమని తన గురువుగారైన శ్రీ చెల్లపిళ్ళ వెంకటశాస్త్రి గారికి వ్రాయడంలో శ్రీ శాస్త్రిగారి సామరస్య ధోరణి, వివాదరహిత గుణము, ఇతరులకు ఆయన పట్ల గల సుహృద్భావమ తెలియజేస్తుంది. శ్రీ వెంకటశాస్త్రి గారు తన ఆరోగ్యాన్ని గురించి, ఇతరుల ఆరోగ్యాన్ని గురించి సహాయము చేయమని కోరడంలో శాస్త్రి గారి యొక్క ట్రీట్‌మెంట్ల శక్తి, ఆర్ద్ర హృదయము స్పష్టమవుతుంది.

ప్రఖ్యాత కళాకారుడు, నటుడు, గాయకుడు, సంగీత దర్శకుడు, సినీ నిర్మాత అయిన పద్మశ్రీ చిత్తూరు నాగయ్య గారికి శ్రీ శాస్త్రి గారు యోగా ట్రీట్‌మెంట్ ద్వారా ఆరోగ్య స్వస్థత జేకూర్చారు. ఆయనకు యోగ సాధనలో సహాయము చేశారు. శ్రీ నాగయ్య గారు శ్రీ శాస్త్రి గారిని ఒక్క ఉత్తరములో "పరమపావనులు, పూజ్యులు అయిన బ్రహ్మశ్రీగురువు గారి చరణ సన్నిధి" అని సంబోధించారు. ఒక మహా కళాకారుడు, బహుముఖ ప్రజ్ఞాశీలి శ్రీ శాస్త్రి గారిని ఇలా సంబోధించటంలో శ్రీ శాస్త్రి గారి ఘనత, మహిత, అత్యున్నత, ఉదాత్త వ్యక్తిత్వాలకు నీరాజనములు పడ్తున్నవి. శిష్యుడు తిమ్మావజ్జుల కోదండరామయ్య గారితో జరిపిన లేఖలో ఆయన శిష్యవాత్సల్యమును, శిక్షణా గరిమములను సూచిస్తూ వుంది. శిష్యుడు గురువు ఒడిలో తలపెట్టుకొని సేదతీరాలనుకోవడంలో మనకనులవెంట నీరు తెప్పిస్తుంది. అవ్యాజ అనుబంధానికి, శిష్యులుకు గురువుపైన గల భక్తి, చనువులను తెలియజేస్తున్నవి – ఆదర్శశిష్యునకు, ఆదర్శ గురువునకు ఇది ఒక నమూనా. శ్రీ శాస్త్రి గారి ఆర్ద్రత, తపన, నిజాయితి, భాషా పటిమ, ప్రభావ పూరిత ప్రసంగములకు ఉదాహరణకు వారి రేడియో ప్రసంగములు. శ్రీ మోచర్ల రామకృష్ణయ్య గారు, నెల్లూరు, శాస్త్రి గారి ప్రసంగములతో చాలా ప్రభావితులైనారు. శ్రీ దుర్భా సుబ్రహ్మణ్యశర్మ కవిత్వమంటే ఇదీ అని ప్రశంసించారు. సత్యము, అహింసలను ఆరాధించే శ్రీ గాంధీగారితో శ్రీ శాస్త్రి గారికి కలమమేకత్వమును తెలియజేస్తుంది. శ్రీ కోటా సుబ్బారావు గారి లేఖలు తిరుపతిలో మ్యూజియమును నెలకొల్పడానికి శ్రీ శాస్త్రి గారు పడిన ఆయాసాలను ప్రయాసలము తెలియజేస్తుంది. "గాలి కబుర్లు" రచన ద్వారా శ్రీ కోరాడ రామకృష్ణ గారిని ఆశ్చర్యపరచడం శ్రీ శాస్త్రి గారి విభిన్న వైదుష్య ప్రజ్ఞకు సోదాహరణము.

శ్రీ కొత్త వేంకటేశ్వరరావు, గుంటూరి వారితో సుదీర్ఘముగా సాగిన ఉత్తర ప్రత్యుత్తరములు వారిరువురి మధ్య గల అన్యోన్యతలను, శ్రీశాస్త్రి గారి అఖండ ప్రేమ సందేశమును, యోగ చైతన్య విస్తృతిని, పరుల బాధలు తనవిగా భావించే అపార, ఉదార, కారుణ్య స్వభావములను ఎల్లెడల తెలియజేస్తుంది. శ్రీ శాస్త్రి గారు తన ఆత్మచింతన పథములో, మాస్టరు గారి యోగమార్గంలో నిరంతరము స్ఫూర్తిని వెదజల్లే మధ్యాహ్న, ప్రచండ భాస్కరునిలాగా ప్రకాశించారు. జాతి, మత, కులములకు అతీతముగా తన వాఙ్మయ సేవను, యోగ సేవను ఆయన లోకానికిచ్చారు.

శ్రీ శాస్త్రి గారు మాస్టరు సి.వి.వి. గారి అనుగ్రహము స్పష్టముగా ఫిజికల్ లెవల్‌లో తెలియాలని ప్రగాఢంగా ఆకాంక్షించారు. "నేను నావశములో లేనని" మాస్టరు గారి యాక్షన్ జరుగుతూ, దాని వలన ఇతరులకు ఉపకారము జరుగుతూ, తనకు సచ్చిదానందము లభ్యమగుచున్నదని ఆయన పేర్కొన్నారు. "మీ ప్రయాణము, సంక్షోభము, దేశ విప్లవములు ముందు నా శరీరములో జరిగింది కదా" అని శ్రీ శాస్త్రి గారు, 30.10.1946 లేఖలో పేర్కొన్నారు. ఇది శాస్త్రి గారి యొక్క యోగ చైతన్య విస్తృతిని యావత్ భారతదేశం సంక్షోభాన్ని సరిదిద్దుటలో ఆధ్యాత్మికశక్తిగా పనిచేయుటను ఆరంభించారని సూచిస్తున్నది. శ్రీ శాస్త్రిగారు తిరుపతిలోనే వుండి ఎంతో దూరంలో వున్న ఇతరులకు ట్రీట్‌మెంట్ చేసేవారు. శ్రీ విస్సా అప్పారావు గారు కొన్ని కేసుల విషయాలను నమోదు చేశారు. శ్రీ శాస్త్రిగారు మాస్టర్ గారు పనరవతరించాలనీ అప్పుడే ఆయన ఇన్నియేషన్ ఇస్తారని పేర్కొన్నారు. మృత్యురాహిత్యపు తలపు అనగా ఫిజికల్ ఇమ్మార్టిలిటి ఫలించాలని శ్రీ మాస్టరు గారు పునరవతరించాలని శ్రీ శాస్త్రి గారు ఎంతో ప్రగాఢముగా కోరుకున్నారు, ప్రార్థించారు, తపించారు, పవిత్రత, శుచి, ఆరోగ్యము ఈశ్వరమయమని ఆయన దృఢ విశ్వాసము. భగవదనుగ్రహము గురించి వెగటు, రోత, విసుగు, కలగరాదని, ఎంతో విపరీత పరిస్థితిలో ఉన్నప్పటికి, విశ్వాసము విడరాదని శ్రీ వెంకటేశ్వర్లు గారికి శ్రీ శాస్త్రి గారు వ్రాశారు. సాహిత్య పరిణత బుద్ధితో పాటు శ్రీ శాస్త్రి గారు యోగములో సాధించిన విశ్వప్రేమ, చైతన్య విస్తృతి, దైవముతో తదేకపరత, సదా సమర్పణ, అమృతతత్వము మానవాళికి అందాలని ప్రార్థన, తపస్సు, తన దరికి చేరిన వారిని, కోరిన వారిని ఆ ఉన్నత లక్ష్యం వైపు నడిపించాలనే ఆర్ధత, ఆయనను ఒక మహోన్నత వ్యక్తిగాను స్ఫూర్తిగానూ నిరంతర స్మరణీయ, రమణీయ దివ్య యోగసిద్ధి కల వ్యక్తిగా జేసింది. సదా ఆయనను అనుసరించుట వెలుగుబాటలో ప్రయాణము.

సె లవ్ (Say Love) ఇది శ్రీ శాస్త్రి గారి చమత్కారం

* * *

7. మృత్యోర్మా అమృతంగమయ

- శ్రీ గిద్దలూరి కృష్ణమూర్తి

బృహదారణ్యకోపనిషత్తు "అసతోమా సద్గమయ - తమసోమా జ్యోతిర్గమయ - మృత్యోర్మా అమృతంగమయ" అని తెలిపింది. అసత్తు నుండి - అంటే నశించే శరీరము నుండి నశించని సత్తు వైపునకు తీసుకు వెళ్ళినా నశించనిది - ఆత్మ (సద్వస్తువు). తమస్సు అంటే చీకటి/అజ్ఞానము. చీకటి నుండి వెలుగులోకి - అంటే అజ్ఞానము నుండి జ్ఞానము లోనికి ప్రయాణము చేసేది ఆత్మ. మృత్యువు నుండి అమృతత్వము లోనికి వెళ్ళేది - అదే నేను, అదే ఆత్మ.

నేను శరీరము అనే భావన నుండి నేను ఆత్మను అనే భావన మానవ జన్మ లో కలుగుతుంది. ఈ మానవ జీవితం పొందిన వారు అదృష్టవంతులు.

మానవ జీవితమును - ముఖ్యంగా గృహస్థులు సంతానము కలిగిన తరువాత పిల్ల/పిల్లవాడికి అక్షరాభ్యాసములో ఓనమాలు దిద్దబెట్టి, మంచి చదువు చదివించి, జీవితములో ఏ రకమైన ఆర్థిక ఇబ్బంది లేకుండా ఉండే ప్రయత్నం చేస్తారు. ఓనమాలు, A,B,C ల వలన నేడు B-Tech, M-Tech, Ph.D లు చదువుతున్నారు. ఇది ఒక చక్రములా జరుగుతున్నది. శరీర పోషణకు ఇచ్చే ఈ గుర్తింపు దైవ విద్యకు (ఆత్మవిద్య) ఇవ్వక, బాధ్యతలు తీరిన తర్వాత చూసుకోవచ్చును అని కాలయాపన చేస్తున్నారు. బాధ్యతలు తీరిపోయిన స్థితి లో మనస్సు ముళ్ళకంప మీద వేసిన గుడ్డ వలె, ఒక చోట తీసిన మరొక చోట పట్టుకొని, తీయడానికి చాలా శ్రమ పడవలసి వచ్చేలాగా ఉంటుంది.

నేను శరీరము అనే భావన వల్ల మానవ జీవితము ఎన్నో ఒడిదుడుకులతో జీవిస్తున్నాము. అంతా బాగుంటే సమస్యే లేదు. కానీ కష్టాలు, ఇబ్బందులు, చీకాకు చింతలు, అలజడులు, శారీరక మానసిక అనారోగ్యాలు కలిగినప్పుడు మానవులు కుంగిపోతున్నారు.

పైన వ్రాయబడినది శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి గారి జీవితములో అనుభవముగా చెప్పబడినది. జీవితమే అనుభవ పాఠాలు నేర్పుతుంది. చెడు నుంచి మంచి లోనికి, అజ్ఞానము నుండి జ్ఞానము లోనికి, మృత్యువు నుండి అమృతత్వము వైపునకు తీసుకొని వెళుతుంది. కవిగా, సాహిత్యవేత్తగా, విమర్శకుడిగా, రీసెర్చివేత్తగా ఉండి ఉన్నారు. ప్రయత్నము చేసినా కొన్ని పనులు కాకుండా ఉండేవి. కానీ అప్రయత్నంగా కొన్ని పనులు కలిసి వచ్చేవి.

ఒకసారి శ్రీ VPS గారు బండిలో వెళ్ళుచుండగా బండివాని అలసత్వముతో పోవుచున్న బండి పడి శ్రీ VPS గారి కుడి భుజము విరిగినది. భుజము విరుగుట కూడా తన మంచికే జరిగినది. వ్యక్తిగత పరంగా అనుభవము తరువాత ప్రయత్నము లేకుండా లోక కల్యాణమయినది.

శ్రీ VPS గారు అప్పటికే ఎంతో గాయత్రి జపము అనుష్ఠానం చేసియున్నారు. ఏ కారణము చేతనో తన కుడి భుజము నొప్పి తగ్గకుండా ఉండేది. మద్రాసులో ఉద్యోగరీత్యా ఉన్నప్పుడు ఎంతో వైద్యం చేయించుకున్నారు. కానీ ఏమాత్రము తగ్గలేదు. దీనితో జీవితము పై విరక్తి కలిగి శరీర త్యాగము చేయవలెనని తలంపు కలిగినది. ఆ తలంపే వారిని ఈడ్చుకొని మద్రాసు రైల్వే స్టేషనుకు నడిపింది. కాని అన్ని గమనిస్తున్న పరమాత్మ (ఇష్టదైవం) వెలుగుబాట చూపిస్తారు. అదే జీవిత మలుపు – మృత్యువు నుంచి అమృతత్వమునకు కొనిపోవుట.

శ్రీ PN గారి బంధువు మద్రాసు స్టేషనులో శ్రీ VPS గారికి కనబడి వారిని కుంభకోణంలో ఉన్న Master CVV గారి వరకు నడిపించారు. శ్రీ Master CVV గారి దర్శనంతో శ్రీ VPS గారికి తెలియకుండానే పరమాత్మ తత్వము వైపు మాస్టర్ గారు నడిపించారు. తాను ఒకటి తలచిన దైవము ఒకటి తలచును. జీవితములో మహత్తరమైన మార్పు వస్తుందని తలంచలేదు.

పరబ్రహ్మ స్వరూపులైన Master CVV గారు ఈ భృక్త రహిత తారక రాజయోగము ఎందుకు ఏర్పాటు చేశారు అంటే తన నుండి వెళ్ళిన అణువులు మరల వచ్చి నన్ను చేరుట లేదు. ఈ అణువులు గృహస్థ ధర్మములో జనన మరణములో చిక్కుకొను కారణము జబ్బులు – అనగా శరీర భావనయే – అని తెలుసుకున్నారు. అందువలన ఈ పవిత్రమైన రాజయోగము స్థాపితమైనది.

Master CVV గారి ప్రార్థన ఉపదేశముతో శ్రీ VPS గారి జీవితములో గొప్ప మార్పు కలిగినది. Master CVV గారి సాంగత్యంతోనే తన జీవితము ఉండవలెను అని చెప్పగా, Master CVV గారు “నేను సదా నీలోనే ఉన్నాను” అని చెప్పినారు. తాను తరించి ఇతరులను కూడా తరింప చేయుట శ్రీ VPS గారు మొదలుపెట్టినారు. తాను ఏ విధముగా శారీరక మానసిక బాధలు అనుభవించారో ఇతరులు తన మాదిరి బాధ పడకూడదు అనే జీవిత పాఠములు మొదలు పెట్టినారు.

మాస్టర్ CVV గారు 1910 లో నూతన రాజయోగము ప్రవేశపెట్టి 752 మందికి ఉపదేశము చేసినారు. అందులో గురుదేవులు శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రి గారు, వారి ధర్మపత్ని శ్రీమతి మహాలక్ష్మమ్మ గారు కలరు.

శాస్త్రిగారు మాస్టర్ గారి గురించి వ్రాయగా నన్ను పూర్తిగా తెలుసుకునే వరకు ఏమియు వ్రాయవద్దు అని చెప్పినారు. శ్రీ శాస్త్రి గారికి 60 ఏండ్లు నిండిన తరువాత ఇప్పుడు నీకు నన్ను గురించి వ్రాసే అర్హత కలిగినది. అదే ప్రజ్ఞ. ప్రజ్ఞ అంటే ఆత్మానుభవము. శ్రీ శాస్త్రిగారు ఆత్మానుభవము పొంది నిలకడ చెందుట అనగా శరీరము ఉన్న లేకపోయినా ఆత్మ ఎప్పుడు నిలిచి ఉండును అని తెలుసుకొనుట. శ్రీ శాస్త్రిగారు ప్రజ్ఞా ప్రభాకరులుగా నిలిచి ఉన్నారు. ఎప్పటికీ ఉంటారు.

తిరుపతిలో ఉదయము, సాయంత్రము ప్రార్థనకు అనేకమంది వచ్చేవారు. అందులో డాక్టర్ ల వల్ల నయం కాని చాలా మొండి జబ్బులు కూడా ప్రార్థనలో తన అంతర్ నేత్రమునకు కనబడి జబ్బుకు

కారణము తెలుసుకొని దానికి తగినట్టు ట్రీట్మెంటు చేసి రిలీఫ్ కలిగించేవారు శాస్త్రి గారు. నిజానికి ఎక్కువ శారీరక మానసిక జబ్బులకు కారణం ఆస్టల్ ట్రబుల్. ఆస్టల్ ట్రబుల్ ఉన్న జబ్బులు బాహ్య డాక్టరు వలన నయం కానేకావు. అటువంటి వాటిని శాస్త్రి గారు తమ ప్రజ్ఞా దృష్టితో నయం చేసేవారు.

శ్రీ శ్రీనివాసాచారి గారు, శ్రీ కొత్త రామకోటయ్య గారు, శ్రీమతి కల్పవల్లి గారు, శ్రీమతి చంద్రకాంతమ్మ గారు, శ్రీ పోచిరాజు శేషగిరి రావు గారు – ఈ ఐదుగురు శ్రీ శాస్త్రి గారి యందు ధృఢ భక్తి కలిగినవారు. శ్రీ శాస్త్రి గారిని ఐదుగురు శ్రద్ధ భక్తులతో నమ్మి ఆ మార్గములో నడిచినారు.

శ్రీ VPS గారి వద్దకు జబ్బులతో వచ్చి నయం చేసుకున్న వారు, అవి నయం అయినాక కూడా ప్రార్థన కొనసాగించేవారు. మాస్టర్ గారి అనుగ్రహము పొందిన శాస్త్రి గారితో వారు కలిసి ప్రార్థన చేసుకోవడం చాలా అదృష్టకరం. ఎందువలన అంటే ప్రార్థనకు వచ్చిన ప్రతి ఒక్కరినీ ప్రార్థనలో గమనించి వారికి తగినంత రిలీఫ్ కలిగించేవారు. ఒకవేళ ఏ వ్యక్తి అయినా శ్రీ VPS వద్దకు రాలేకపోతే వారే స్వయంగా వెళ్ళి ప్రార్థన చేసి రిలీఫ్ కలిగించేవారు. శ్రీ VPS గారి మనస్సు ఇతరుల బాధలు చూడగలిగేది కాదు. వారికి తాను వేరు, ఇతరులు వేరు అనే భేదము ఉండెడిది కాదు. వారిలో తానే ఆ బాధ పడుచున్నానని చెప్పేవారు. వారి ఆఫీస్ పనులు చేసుకుంటూనే ప్రార్థనలో ట్రీట్మెంటు చేసేవారు. వారు ప్రేమ స్వరూపమునకు నిదర్శనము.

ఈ ఐదుగురిలో శ్రీమతి చంద్రకాంతమ్మ గారు నన్ను ప్రార్థనలో ప్రవేశ పెట్టారు. అంతకు ముందు ఎన్నడూ మాస్టర్ CVV గారి పేరు కాని, శ్రీ శాస్త్రి గారి పేరు కాని విని ఉండలేదు. నేను నా కుటుంబము మొదటి నుండి శ్రీ రమణ మహర్షి భక్తులము. నేను ప్రార్థన చేసుకోను అని చెప్పగా, చంద్రకాంతమ్మ గారు నన్ను పసి పిల్లవానిని బుజ్జగించి ఆహారము తినిపించినట్లు, ప్రతిరోజూ ఉదయము, సాయంత్రము ప్రార్థనకు వచ్చి కూర్చోమని చెప్పేవారు. వారి భర్తను, ఇతరులను నన్ను పిలుచుకు రమ్మని పంపేవారు. కానీ నేను వెళ్ళలేదు. ఇక ఆమె బాధ భరించలేక ప్రార్థనకు వెళ్ళి కూర్చునే వాడను. ఆమె ఉదయము ఒక గంట, సాయంత్రము ఒక గంట ప్రార్థనకు కూర్చునేవారు. నేను రెండు రోజులు చూసి, ఆమె కళ్ళు మూసుకోగానే లేచి వెళ్ళిపోయేవాడిని. పది రోజుల తర్వాత ఆవిడ నేను లేచేవరకు నీవు లేవరాదు అని చెప్పారు. అప్పుడు కూడా ప్రార్థన గురించి ఏమీ చెప్పలేదు.

అలా పది రోజుల తర్వాత నన్ను ప్రార్థన జరుగుచున్నదా అని అడిగారు. నాకేమీ ప్రార్థన జరుగుట లేదు అని చెప్పగా ఇతనికి స్వయంప్రకాశము కలగాలని మాస్టర్ CVV ని ప్రార్థించింది. అప్పుడు నాకు ప్రార్థనలో లింకు కలిగి కళ్ళు మూతలు పడి ప్రార్థన జరిగినది. నాతో ఉదయము సాయంత్రము ప్రార్థనకు కూర్చోమని చెప్పి, మొదట నా గురువుగారైన శ్రీ శాస్త్రి గారిని స్మరించి, ఆ తరువాతనే మాస్టర్ గారిని స్మరించి ప్రార్థన చేసుకుంటాను అని చెప్పారు. అప్పటినుండి నేను కూడా మొదట నా గురువుగారైన చంద్రకాంతమ్మ గారిని స్మరించి ఆ తరువాతనే శాస్త్రి గారిని, మాస్టర్ గారిని స్మరించి ప్రార్థన చేయుచున్నాను.

రెండు రోజుల తరువాత గురువుగారి దగ్గర ప్రార్థన చేసుకొని వచ్చి అన్నము తినుటకు కూర్చుని తినబోవుచుండగా లోపల నుంచి Offer it to Master అని లోనుండి అంతర్ వాణి చెప్పినది. అప్పటినుండి ఏది తిన్నా, తాగినా, ఏది తీసుకున్నా, ఎవరికి ఇచ్చినా మాస్టర్ గారికి అర్పించి చేస్తున్నాను. మరలా రెండు రోజుల తరువాత గురువుగారు నన్ను "నాయనా, నువ్వు మాస్టర్ గారికి అర్పించి తినుచున్నావా" అని అడిగారు. మొన్న సాయంత్రము నుండి అర్పిస్తున్నాను అని చెప్తే, నేను అనుకున్నాను. ఆ thought నీకు చేరినదా లేదా అని అడుగుతున్నాను అన్నారు. మామూలుగా తింటే నేను శరీరము అనే భావన బలపడుతుంది. Offer చేసి తినడం వలన జరిగే మార్పు నేడు తెలుస్తోంది. ఆధ్యాత్మిక సాధనలో గురువు చాలా ముఖ్యం. ప్రార్థనలో చేయూత ఇచ్చేది గురువు. జీవితములో బాహ్య గురువులు ప్రాపంచిక విషయాలు, డబ్బు వంటి వాటికొరకు మనలను తీర్చిదిద్దుతారు. బోధ గురువులు మన ఆధ్యాత్మిక సాధనను తీర్చిదిద్దుతారు.

నా భార్య జయలక్ష్మి కి మూడు అబార్షన్లు జరిగినాయి. నాల్గవ సారి గర్భముతో ఉన్నప్పుడు మూడవ నెలలో గురువుగారికి జాబు వ్రాయగా, గురువుగారు జాబులో నాయనా! ఈసారి మగపిల్లవాడు పుడతాడు. వేంకట ప్రభాకరు అని పేరు పెట్టమని జవాబు ఇచ్చారు. పుట్టిన అబ్బాయికి ఆమె చెప్పినట్టే నామకరణం చేశాము.

మాకు 1964 ఫిబ్రవరి 16 న వివాహము జరిగినది. ఉద్యోగము కొరకు నెల్లూరు నుంచి హైదరాబాదు వెళ్ళుచున్నాను అని చెప్పగా, ఆవిడ నాతో నాయనా! నా గురువుగారి కుటుంబం విద్యానగరులో ఉంది. నీవు వెళ్ళి వాళ్ళతో కలిసి ప్రార్థన చేసుకో అని చెప్పారు. విద్యానగరులో అమ్మ శ్రీమతి మహాలక్ష్మమ్మ గారు, శాస్త్రిగారి పెద్ద కుమారుడు శ్రీ సుందరమూర్తి గారి కుటుంబము ఉండేవారు. గురువుగారి ఆజ్ఞ ప్రకారము నేను, నా భార్య మొదట్లో నెలకి ఒకసారి, ఆ తరువాత క్రమంగా ప్రతి ఆదివారము వెళ్ళి ప్రార్థన చేసుకునే వాళ్ళము.

1966లో ఉదయం 6 గంటలకు మాస్టర్ గారికి నమస్కారం చేస్తూ, మాస్టర్ గారు! ఏమిటి ఈ చికాకులు, ఇబ్బందులు అని బాధపడుతూ మాస్టర్ గారికి విన్నవించగా వెంటనే శ్రీ శాస్త్రి గారి ఫోటో ప్రార్థనలో పెట్టమని thought వచ్చింది. వెంటనే నా వద్ద ఉన్న ప్రజ్ఞా ప్రభాకరములోని ఫోటో ప్రార్థనలో పెట్టాను. ఆనాటి నుండి బాధలు, చికాకులు తగ్గుట మొదలైనది. నాటి నుంచి రోజుకు రెండు సార్లు ప్రార్థన చేయుచున్నాను. ఎన్నో అలజడులు ఈ ప్రార్థన వల్ల తొలగిపోతున్నాయి.

ప్రజ్ఞా ప్రభాకరులు శరీరముగా లేకపోయినా ఆత్మ గా ఉన్నారు. ఇది అనుభవము. ప్రార్థనలో ఎన్నో సమస్యలకు దారి చూపుచున్నారు. ఒకమారు ఒక సమస్యని మాస్టర్ గారికి విన్నవించి, మరలా అదే సమస్యను రమణ భగవాన్ కు చెప్పుకోగా – నాకు ఎన్నిసార్లు చెబుతావు అని జవాబు వచ్చింది. ఉన్నది అంతా ఒకటే పరమాత్మ అని అప్పుడు అర్థం అయింది.

నాకొచ్చిన కష్టాలు, అనారోగ్యము అన్నిటిలో నాకు అండగా ఉండి నన్ను అడుగడుగునా ఆదుకున్న నా గురువులకు, శ్రీ వేటూరి సుందరమూర్తి గారు, వారి భార్య శ్రీమతి లక్ష్మీదేవమ్మ గారు, శ్రీమతి సుజాతమ్మ గారు, శ్రీ శ్రీనివాసాచారి గారికి నేను ఎంతో ఋణపడి ఉన్నాను.

మాస్టర్ CVV గారి ప్రార్థన ఎంతో మహత్తరమైనది. ఎవరైతే పది సంవత్సరాలు విడువకుండా ప్రార్థన చేసుకొనుచుందురో వాళ్ళు అన్నీ తెలుసుకుంటారు అని మాస్టర్ CVV గారు చెప్పినారు. మనసును అరికట్టవలదు. అదే తిరిగి పుట్టుక స్థానం వైపు నడుస్తుంది అని తెలిపారు. మాస్టర్ గారు – నాకు నమస్కరించిన వానిని నా అంతటి వాడిని చేస్తాను – అంటే బ్రహ్మజ్ఞానం ఇస్తాను అని చెప్పారు. ప్రార్థన మాత్రం విడువకుండా చేస్తుంటే మనస్సు పరమాత్మ వైపు తిరుగుతుంది. అంటే మనస్సు అంతర్ముఖం అవుతుంది.

* * *

8. శ్రీశాస్త్రి గారి యోగము - ప్రార్థన

- శ్రీమతి గిద్దలూరి జయలక్ష్మీ దేవి

కరుణ రూపంబు శ్రీ ప్రభాకరుల దివ్యతేజము
వరేణ్యమును సదా వినుతింతుమెపుడు
ఇది గదా లోన నుండి మాకెపుడు
మంచి మంచి యుద్బోధముల నొదవించుచుండు!

ఈ పద్యము మా శ్రీవారిని ఈ రాజయోగము లో ప్రవేశ పెట్టిన గురువు శ్రీమతి చంద్రకాంతమ్మగారు రోజూ ప్రార్థనా శ్లోకముగా మననం చేసుకోండి అని చెప్పారు.

ఓంకార స్థిత సర్వవేద జననీ! యోగీంద్ర హృద్వాసినీ
వేంకాస్వామి మనోహరీ! ప్రియకరీ! విజ్ఞస్తుతా భారతీ!
శాంకర్యోదధిజ స్వరూపిణీ! జగజ్జాలంబ! మాయంబ!
ఓ వేంకాంబ! మమ్ముద్ధరింపుమని సీవీవీ కెరింగెంపుమా!

సకల మానవ దివ్యజ్యోతి
నిన్నా త్రిమూర్తులెరుగరు పరంజ్యోతి
కరుణా రససింధువగునో ప్రేమజ్యోతి
దుఃఖ నివారకమగు అమరజ్యోతి

లేమిని పారద్రోలే పూర్ణజ్యోతి
కుండలినికి స్వాతంత్ర్యమిచ్చే స్వేచ్ఛాజ్యోతి
దివ్యతను తేజరిల్లజేసే దివ్యజ్యోతి
మా యీ ప్రేమ కిరణమును అందుకోవమ్మా!

పంచదార నేను, పాల్నీవు
నీలో గరగినాడ, గరడు గట్టితీవు
అధిక రుచుల నేకమయి తిమి
యీ కోవ భూమికింక నమృతమేమి స్వామి!

ఏను కారణముగ నెవ్వడేని సంకటం పడనటు
నన్ను సాకు కొనుము, ఆగ్రహమసూయ
గర్వమిత్యాదులైన చెడుగులుడిగింపు
మిక నన్ను చెందకుండ.

అందక పొందక విడివడి
చిందులు దొక్కెడి మనస్సు
జేకొని, సరిగా నందముగా
నడవంగల చందమునన్ దిద్దుకొనవె సద్గురుమూర్తీ!

ఇతరుల నవమానించెడు
మతిమాన్పుమి పరుల చెడ్డ మాటల సైపన్
ధృతి గూర్పుమి సంతోషామృత
రసమిడి సేదతీర్పుమీ నా స్వామీ!

తలపులు విశుద్ధములుగా దలపింపుము
పలుకు లమృత ధారాలనంగా పలికింపుము
కార్యంబులు సలిపింపుము
పరహిత ప్రశస్తంబులు గాన్!

ఈ విధంగా గురుస్తుతి మననం చేసుకుంటూ, యోగసాధన చేస్తున్నాము. ఈ మధ్యనే ఈ పద్యముల భావార్థ వివరణము తెలుసుకున్నాము.

నేను వారి సాహిత్యమును చదవలేదు. కాని శ్రీ శాస్త్రిగారి శిష్యులు శ్రీ పోచిరాజు శేషగిరి రావు గారు చెబుతుంటే విన్నాను. అన్నయ్యగారు శ్రీ ఆనందమూర్తి గారు, అక్కయ్యగారు శ్రీమతి సుజాతగారు వారి సాహిత్యముపై మాట్లాడుకోవటం విని ఆనందించేదాన్ని. వదినగారు శ్రీమతి లక్ష్మీదేవిగారు (శ్రీ సుందరమూర్తిగారి ధర్మపత్ని), మరో వదినగారు శ్రీమతి చంద్రకళగారు (శ్రీ ఆనందమూర్తి గారి ధర్మపత్ని) అన్నమయ్య పాటలకు బాణీలు, రాగాలు కట్టి, ఈ రాగమైతే బాగుంటుందని చర్చించుకుంటూ పాడటం విని ఆనందించేదాన్ని. అసలు ఆ రాగాలేమిటో, స్వరాలేమిటో సంగీత జ్ఞానం లేని నాకు అర్థమయ్యేదికాదు. కానీ వారిరువురు పాడుతుంటే మరో లోకంలో వున్నట్లుండేది.

అమ్మగారు శ్రీమతి మహాలక్ష్మమ్మ గారితో ప్రార్థన 1 1/2 సం॥లు చేసుకోగలిగిన భాగ్యం కలగటం మా అదృష్టం. ప్రార్థనకు కూర్చునేటప్పుడు "గురువుగారికి నమస్కారం చేసుకోండి నాయనా" అని నమస్కారం చేసుకునేవారు. వారితో కలిసి చేసుకున్న ఫలితమే మాకు ఈ రోజుకీ మాస్టర్స్ రక్ష.

అమ్మగారు శరీరం చాలించిన తరువాత కూడా ప్రతి ఆదివారం, ధనిష్ఠ, శ్రీ శాస్త్రి గారి ఆరాధన, శ్రావణ బహుళ విదియ నాడు, వారు శరీరం చాలించిన ఆగస్టు 29వ తేది, అమ్మ గారి ఆరాధన భాద్రపద బహుళ చతుర్దశి, Mother గారి పుట్టిన రోజైన మహాలయ అమావాస్య రోజు, శ్రీశాస్త్రిగారు మాస్టర్ గారి వద్ద ఉపదేశము పొందిన June 22 వ తేది, జూలై 26 వతేది Merry life day, May 10వ తేది యోగము ప్రారంభించిన రోజు, ఆగస్టు 4వ తేది ఆంగ్ల క్యాలెండరు ప్రకారం Master గారి Birthday రోజు, మే కాల్

29, 30 తేదీలు, డిసెంబర్ కాల్ 29, 30, 31 తేదీలు, న్యూ ఇయర్ జనవరి 1 తేది ప్రార్ధనలు సహసాధకులతో కలిసి చేసుకుంటాము. అన్నయ్యగారు శ్రీ సుందర మూర్తి గారు, వదినగారు శ్రీమతి లక్ష్మీదేవి గారు, అక్కయ్యగారు శ్రీమతి సుజాత గారు కాక యోగ సాధనకు వచ్చే సహ సాధకులతో కలిసి యోగ సాధన చేసుకునేవాళ్ళము. ఇప్పటికీ అలాగే అన్నయ్యగారు, వదినగారు భౌతికంగా లేకపోయినా సాధన మాత్రం మానటం లేదు.

శ్రీ శాస్త్రిగారి శత జయంతి చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో 1988లో చేశారు. ఎందరో మహానుభావులు శ్రీ శాస్త్రిగారి సాహిత్యం పై పరిశోధన చేసినవారు, శ్రీ గుంటూరు శేషేంద్ర శర్మ గారు, శ్రీ జి. వి. సుబ్రహ్మణ్యం గారు, శ్రీ బేతవోలు రామబ్రహ్మం గారు, శ్రీ దేవులపల్లి రామానుజరావుగారు, శ్రీ పోచిరాజు శేషగిరి రావు గారు మొదలైన వారు శ్రీ శాస్త్రిగారి సాహిత్యములోని లోతుపాతులు, చాటు పద్యమణి మంజరి గురించి తరచి తరచి ఎన్నో విధాల చెప్పారు. అలాగే యోగ సాధకులు శ్రీ శాస్త్రిగారు ప్రేమగా 'సీసా' అని పిలుచుకునే శ్రీ A.V. శ్రీనివాసాచార్యులు గారు, శ్రీ పున్నయ్య గారు, శ్రీ తిరుమల రామచంద్ర గారు, శ్రీ కొత్త రామకోటయ్య గారు, శ్రీ శాస్త్రిగారి చిన్న తమ్ముడు శ్రీ శంకర శాస్త్రిగారు, శ్రీ చంద్రశేఖర శాస్త్రిగారు అందరూ అటు సాహిత్యమూ, ఇటు యోగసాధన గురించి, అమ్మగారు మహాలక్ష్మమ్మ గారు అసిధారావ్రతం లాగా శ్రీ శాస్త్రిగారితో పాటు వచ్చిన వారందరికీ అన్న పానాదులు సమయానికి అందించి, అమ్మ ప్రేమను ఎలా చవిచూపారో చెప్పారు.

శ్రీ శాస్త్రిగారు ఆర్తులైన వారిని, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని గురించి తపన పడి, వారికి ఆరోగ్యం చేకూరాలని తమ గురుదేవులు, MCVV గారికి విన్నవించి, వచ్చిన వారికి స్వస్థత చేకూరిన తరువాత వారు పొందిన ఆనందమే ఆనందమని వారి అనుయాయులు చెప్పగా విన్న మాకు వారి శిష్యులు వారిని గురించి వర్ణించి చెబుతుంటే మేము కూడా ఆ సమయంలో శ్రీ శాస్త్రిగారి సన్నిధి లో వున్న అనుభూతి కలిగేది.

శ్రీ శ్రీనివాసాచార్యులు గారు, శ్రీరామకోటయ్యగారు ఎవరికైనా బాగా లేదని వారికి విన్నవిస్తే "మనకెందుకు నాయనా ! గురువుగారు చూసుకుంటారు. మనసా, వచసా నమస్కారం చేసుకోండి" అనే వారే కాని, మేము ప్రార్ధన చేశాము, తగ్గింది అని ఎప్పుడూ అనేవారు కారు. మేము గడ్డిపరకల లాంటి వాళ్ళం. అంతా గురువుగారు చూశారు, చేశారు అనేవారు. ఆ శరణాగతి వల్ల వాళ్ళు ఎంతో ఉన్నత స్థితికి వెళ్ళగలిగారు.

ఒకసారి రెండు చేతులు జోడించి మనసా, వచసా నమ్మకంతో, విశ్వాసంతో నమస్కరిస్తే మనలో వున్న అన్ని వ్యతిరేక ఆలోచనలు తొలగి, మంచి ఆలోచనలు కలిగి మనసు ప్రశాంతంగా వుంటుంది. ఒకసారి వారికి శరణు చెందితే మనలను నడిపే భారం గురువులదే. సద్గురువు అయ్యో! వీడు సన్మార్గమును వదిలి బాధపడుతున్నాడని తపనపడి చేయందించి మనలను సన్మార్గములో నడిచే విధంగా సంస్కరించి,

సరిదిద్దుతారు. అందుకే తల్లిదండ్రుల తరువాత మనలను నడిపించే బాధ్యత గురువులదే. గురువు చెప్పినది యథాతథంగా ఆచరించి పాటించేవాడే సరియైన శిష్యుడు.

అలా గురువు MCVV గారు చెప్పినది చెప్పినట్లు ఆచరించిన మాస్టర్ గారి 752 మంది శిష్యులలో నేను చదివి, విన్నంత వరకు నాకు తెలిసినది Sri VPS గారు, శ్రీ MN గారు. ఇంకా కొంతమంది వుండవచ్చును గాని నాకున్న అల్పజ్ఞానము, విన్న వాటి వల్ల తెలిసినది వీరిద్దరి పేర్లే. నేను చదివిన పుస్తకాలు కూడా వీరిద్దరి గురించే.

ఈ యోగమార్గంలో మనసా, వచసా, కర్మణా శ్రీ శాస్త్రిగార్ని నమ్ముకుని, శ్రద్ధ, భక్తి, విశ్వాసములతో గురువు చెప్పినది పొల్లు పోకుండా ఆచరించిన మహనీయులు ఈ పంచ శిష్యులు. వారే శ్రీమతి చాగంటి కల్పవల్లి గారు (విజయవాడ), శ్రీ A.V శ్రీనివాసాచార్యులుగారు (తిరుపతి), శ్రీ పోచిరాజు శేషగిరి రావు గారు (హైదారాబాద్), శ్రీ కొత్త రామకోటయ్య గారు (చినకాకాని), శ్రీమతి చంద్రకాంతమ్మ గారు (గూడూరు). ఈవిడే మా శ్రీవారిని యోగసాధనలో (Prayer లో) ప్రవేశ పెట్టినవారు. వీరంతా సమయపాలన, ఆర్తుల అనారోగ్యముల గురించి శ్రీ శాస్త్రి గారి వలె తపనపడి "అంతా గురువుగారు చూసుకుంటారు. వారికి నమస్కారం చేసుకోండి నాయనా" అని చెప్పి, సర్వసమస్యలు గురుదేవులకు విన్నవించి, ప్రార్థన చేసుకుంటే సమస్యలతో వచ్చిన వారంతా ఆ సమస్యలు పరిష్కారమై ఎంతో ఆనందంతో వెడుతుంటే ఈ పంచశిష్యుల ఆనందం అనంతం. వారికి సర్దుకోగానే వీరు కృతజ్ఞతా పూర్వకంగా గురువులకు నమస్కరించేవారు.

1988 వ సం॥లో శ్రీ శాస్త్రిగారి శతజయంతి సందర్భంగా శ్రీ శ్రీరంగం గోపాలరత్నంగారు, శ్రీ పారుపల్లి రంగనాధం గారు, శ్రీ నూకల చినసత్యనారాయణ గారు వంటి సంగీతజ్ఞులు గానం చేసిన అన్నమయ్య సంకీర్తనలు ఇంకా నా మనసులో మెదులుతున్నాయి. ఆ సదస్సులలో ఒకరోజు మాన్యశ్రీ ముఖ్యమంత్రి శ్రీ నందమూరి తారకరామారావు గారు కూడా పాల్గొని శ్రీ శాస్త్రిగారి గురించి మాట్లాడారు. ఈ శతజయంతి ఉత్సవాలలో పాల్గొనటం, ఆ సదస్సులో పెద్ద పెద్ద కవులు ప్రవచించినవి వినటం, అన్నమయ్య కీర్తనల శ్రవణం, మీదు మిక్కిలి శ్రీ శాస్త్రి గారి కుటుంబస్థులతో మాకున్న అనుబంధం – ఇవన్నీ మా పెద్దలు చేసిన పుణ్యం వల్ల మాకు లభ్యమగునట్లు చేసిన అ భగవంతునికి మనసా, శిరసా నమస్కరిస్తూ కృతజ్ఞతా పూర్వక అభినందనములు తెలియజేసుకుంటున్నాను.

శ్రీశాస్త్రిగారి 125వ జయంతి పలుచోట్ల నిర్వహించారు. 125వ జయంతి సభ మొదట వారి జన్మ స్థలమైన పెదకళ్ళేపల్లిలో వారి విగ్రహావిష్కరణతో ప్రారంభం చేశారు. ఆ సభలో TTD PRO గారు శ్రీ LV సుబ్రహ్మణ్యం గారు, శ్రీ మండలి బుద్ధ ప్రసాదు గారు, ఆ ఊరి పెద్దలలో ఇద్దరు శ్రీ శాస్త్రి గారి గురించి ప్రసంగించారు. 2వ సభ హైదరాబాదులో ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ లో గల సంస్కృత అకాడెమీలో నిర్వహించారు. ఇక్కడ శ్రీ KV రమణాచారి గారు, మరికొంతమంది ప్రసంగించారు.

పెదకళ్ళేపల్లి కార్యక్రమం సందర్భంగా దాదాపు 30 మందిమి హైదరాబాదు నుండి వెళ్ళాము. మచిలీపట్నంలో దిగి, అక్కడ బస్సు చేసుకుని అందరం మోపిదేవి, చిలకలపూడి, కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర స్వామి నాట్య కళాశాల, అమ్మ గారు మహాలక్ష్మమ్మ గారు జన్మించిన ఊరు ఘంటసాల, మొవ్వ శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం, శ్రీ కృష్ణదేవరాయలు ఆముక్త మాల్యద రచించిన, శ్రీ శ్రీకాకుళ ఆంధ్రమహా విష్ణువు వెలిసిన వూరైన శ్రీకాకుళంలో శ్రీ బాలా త్రిపుర సుందరి ఆలయం, ఘంటసాలలో శ్రీ శాస్త్రిగారు సేకరించిన బుద్ధునికి సంబంధించిన శాసనాలు, విగ్రహాలు, కాక ఆయా క్షేత్రాధిదేవతలను దర్శించాము. పెదకళ్ళేపల్లి లో జన్మించిన శ్రీశాస్త్రి గారిల్లు వున్న స్థలం, సుసర్ల దక్షిణామూర్తి గారు నివసించిన ఇల్లు కాక మహా సంగీత విద్వాంసులు పుట్టిన ఇళ్ళు అన్నీ చూసాము. శ్రీ వేటూరి

సుందరరామ్మూర్తి గారు పెద్దకళ్ళేపల్లిలోని శివాలయానికి ఎదురుగా వున్న కోనేటి ఒడ్డున కూర్చుని పాటలు వ్రాశేవారని తెలిసింది.

3వ సభ మద్రాసులో మెరీనా బీచ్ ఎదురుగా వున్న వివేకానంద ఇన్స్టిట్యూట్ లో జరిగింది. అక్కడ కూడా మద్రాసులో శ్రీ శాస్త్రిగారితో పరిచయం వున్న వారు వచ్చి ప్రసంగించారు. ఆ సభకు శ్రీ శాస్త్రిగారి కుటుంబస్థులందరూ వచ్చారు.

మరో సభ తిరుపతిలో అన్నమాచార్య భవనం లో జరిగింది. అక్కడ శ్వేతసౌధ ఎదురుగా వున్న శ్రీ శాస్త్రిగారి కాంస్య విగ్రహానికి పూలమాల వేసిన తరువాత, అన్నమయ్య భవనంలో సభ జరిగింది. శ్రీ శాస్త్రి గారి వసుధైక కుటుంబం శిష్యులు, బంధువులు అందరూ పాల్గొన్నారు. ఆ సభ అనంతరం కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దర్శనం అద్భుతం. అందరికీ అన్నమయ్య వాఙ్మయ పీఠం తరఫున ప్రత్యేక దర్శనం ఏర్పాటుచేశారు. మా చిన్న తనంలో అంటే 1960 సం॥ ప్రారంభదశలో అంత దగ్గరగా దర్శనం చేసుకున్న నేను మరల 2013 వ సం॥లో శ్రీ శాస్త్రిగారి ఆశీస్సులు, అనుగ్రహంతో అంత దగ్గర నుండి చూడగలగటం నా అదృష్టం. వచ్చిన వారంతా ఆ దివ్య దర్శనంతో ఆనందంలో మునిగారు. అన్నమయ్య వాఙ్మయ పీఠానికి అధికారిగా వున్న అన్న గారు శ్రీ వేటూరి ఆనందమూర్తి గారి ద్వారా మాస్టర్ గారు, శ్రీ శాస్త్రిగారు, ఆ శ్రీనివాసుడు అనుగ్రహించి, దర్శనం చేయించి, మమ్ములను ధన్యులను చేశారు. పెదకళ్ళేపల్లి, తిరుపతి, హైదరాబాదు, మద్రాసు సభలలో శ్రీ శాస్త్రిగారి తమ్ముల పిల్లలు, వారి కుటుంబ సభ్యులు అంతా పాల్గొన్నారు. చివరి సభ దేశ రాజధాని ఢిల్లీలో చాలా బాగా జరిగిందని విని ఆనందించాము.

ఈ విధంగా మాస్టర్ గారి కృప, శ్రీ శాస్త్రి గారి యోగబలం, వారి కుటుంబముతో ఉన్న అనుబంధము కలగడం మా అదృష్టము. మాస్టర్ గారికి, శాస్త్రి గారికి నా నమస్సుమాంజలులు.

* * *

9. స్వతఃప్రమాణము

- శ్రీ చింతగుంట శివానందరావు

పరమ గురువులు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు కారణజన్ములు. వారు ప్రేమకు ప్రతిరూపము. కారుణ్యమూర్తి. దివ్యతతో నిండిన వారి కారుణ్యము వెల్లడైన సందర్భములు ఎన్నో ఉన్నవి. వానిలో కొన్నిటిని ఇక్కడ స్మరించుకుందాము.

ఒకమారు వారికి తేలు కుట్టినది. వెంటనే వారి శిష్యులు ఆ తేలును చంపుటకు ప్రయత్నింపగా శాస్త్రిగారు నివారించినారు. తేలును మనము గమనించక దానిని మనము ఇబ్బంగి కలిగించితిమి కాని అది మనపై శత్రుత్వముతోనో, కక్షతోనో వచ్చి మనలను ఇబ్బంది పెట్టుట లేదు కనుక దానిని బాధించవద్దని వాస్తవికతతో కూడిన విచక్షణతో నివారించిరి.

ఏ సందర్భములోనైనను వారికి పొరపాటు ఆలోచన కలిగినను వెంటనే వారు మనసుకు ఇలాంటి పొరపాటు ఆలోచన వచ్చినది అని తన తప్పును తానుగా గుర్తించుటయే గాక అందరకు వెల్లడి చేసి సరిదిద్దుకొన్న మహానుభావులు. అది వారి వ్యక్తిత్వపు పరిణతి.

వారు అనారోగ్యముతో బాధపడుతూ జీవితముపై విరక్తి కలిగి ఆత్మహత్య చేసుకొనుటకు నిశ్చయించుకుని వారు చేయుచున్న ఉద్యోగమునకు రాజీనామా చేయ సంకల్పించి రాజీనామా పత్రమును వ్రాసి జేబులో పెట్టుకుని అది వారి అటెండరు ద్వారా ఆఫీసరుకు అందచేసి ఆనాటి రాత్రే బయలుదేరి గంగానదిలో దేహత్యాగము చేయ సంకల్పించి వారు అటెండరు ఇంటికి వెళ్ళుచుండగా వారి మిత్రులద్వారా భృక్తరహిత తారక రాజయోగము అను మార్గమును గురించి విని, ఆ యోగమున ఉపాసన ద్వారా సంపూర్ణ ఆరోగ్యము పడయుట జరుగునని తెలుసుకొనిరి. అలా వారి ప్రయాణము గంగాతీరమునకు కాక కావేరీ తీరమున గల కుంభకోణ పట్టణమునకు తద్వారా ఆరోగ్యద్వారమునకు కొనిపోబడిరి. అక్కడ వారి గురుదేవులు శ్రీ మాస్టరు సి.వి.వి గారితో వారి అనారోగ్య పరిస్థితిని విన్నవించగా వారు ఎలాంటి మంత్రోపాసన చేయకయే, నేటి నుండి నీ ఆరోగ్యరక్షణ భారము నేను వహించెదను వెరువక నలుగురితో పాటుగా మామూలు భోజనము చేయుము, అని అభయమిచ్చిరి. ఆనాటి వరకు వారిది ఉప్పు, కారము, పప్పు, పెరుగు తినకూడని, తినలేని స్థితి. రాత్రులందు వారికి నిద్ర పట్టెడిది కాదు. ఆస్థితిలో ఉన్న ప్రభాకర గురుదేవులకు నూనె తిరగమోత కూరలు, ఆవాలు తెట్ట గట్టిన రసము, సాంబారు, మజ్జిగతో భోజనము చేసినను ఏలాటి అస్వస్థతకాని, అనారోగ్యము కాని కలుగలేదు. ఆనాటి రాత్రి వారు హాయిగా నిద్రించిరి. అదీ వారి గురుదేవుల యొక్క దివ్యవాక్ప్రభావము.

ఆనాటి సాయంత్రము వారికి ఉపదేశము ద్వారా శిష్యతానుగ్రహమును మాస్టరుగారు అనుగ్రహించిరి. ఉపదేశమంత్రము మాస్టర్ సి.వి.వి నమస్కారము. ఆ మూడు అక్షరములే యోగపు బీజాక్షరములు. ఉపదేశము తీసుకుని యోగసాధన ప్రారంభించిన మరుక్షణము నుండి అమోఘమైన యోగశక్తి సమకూడటము వారికి అనుభవములోనికి వచ్చినది. శ్రీప్రభాకరులవారు మూడు సంవత్సరముల క్రితము ఎడ్లబండిపై ప్రయాణిస్తూ బండి బోల్తా పడటంతో వారి కుడిభుజము ప్రక్కకు తొలగి చక్కబడక బాధ పెడుతూ ఉండెడిది. ప్రార్థనా సమయమున అది దానంతట అదిగా సరిచేయబడుతూ టక్కు టక్కు మను శబ్దముతో కదలటం ఆరంభించినది. కేవలం ఒక్క స్మరణ మాత్రము చేతనే శరీరము యావత్తూ ప్రాణవంతమై చక్కబడటం మహోద్భుతానుభూతి.

సంస్కృంతాంధ్రములలో సహజపండితులైన శ్రీప్రభాకరులకు యోగపు మంత్రాక్షరములు ఇంగ్లీషులో ఉండటము వారి మనస్సుకు కొంత చీకాకుగా తోచినది. కలిగిన చికాకును వారే సర్దుబాటు చేసుకుని సమాధాన పడిరి. ఇక్కడ మనము తెలుసుకుని గమనిక లోనికి తెచ్చుకోవలసిన విషయము ఏమనగా తమకు పొరపాటు ఆలోచన కలిగినదని వారే స్వయముగా స్వీయచరితలో చెప్పుకొనుట స్వయము దానిని సరిదిద్దుకొనుట. వారు తెలియచెప్పకున్న మనకు తెలిసెడి విషయము కాదది. కానీ, వారు తమకు తోచిన చిన్న పొరపాటు ఆలోచనను లోకానికి తెలియపరచి సర్దుబాటు చేసుకున్న మహామనిషి.

వారి గురుదేవులు స్థాపించిన భృక్తరహిత తారక రాజయోగము యొక్క ముఖ్య ఉద్దేశ్యము అమృతమయజీవనము(మృత్యురాహిత్యము). అది సాధించుటకు ఏ ఒక్క శిష్యుడైనను వారు సూచించిన విధివిధానములను పాటించిన యీ యోగము సక్సెస్ కాగలదని మాస్టరుగారు చెప్పి ఉండిరి.

తన శిష్యులు లోకమునకు విడ్డూరముగా ఉండు వేషధారణ చేయరాదు. అనగా సామాన్యమానవులు ధరించే వస్త్రములు ధరించాలి, ఏలాటి ఆర్భాటము లేకుండా సామాన్య మానవుని వలే జీవించాలి. తాను తనకు అత్యంత ప్రీతిపాత్రమైన వ్యక్తిని ఎంతగా ప్రేమించి వారితో వర్తిస్తామో యావత్ ప్రపంచాన్ని అదే తీరున ప్రేమించగలగాలి. దేశము, కులము, మతము మొదలైన విబేధాలు పనికిరావు. అనగా అవతల వ్యక్తి ఏ దేశస్థుడైననూ, ఏ కులస్థుడైననూ, ఏ మతస్థుడైననూ పరమప్రేమతో వర్తించాలి. బహిర్ముఖముగా మనకు వేరువేరు వ్యక్తులుగా, జీవులుగా కనిపిస్తున్నా అంతరంగంలోనికి తిరిగి అందరిలోను ఏకత్వాన్ని అనగా అందరి యందు ఒకే భగవత్ ప్రజ్ఞ కలదు కనుక అందరూ భగవత్ స్వరూపులుగా వర్తించాలి. అలా ఈ యోగము మానవుని తనకున్న పరిమితులను తొలగించుకుని దివ్యతతో అలరారమని ఉద్బోధిస్తుంది. Deathlessness (దివ్యత్వము – శాశ్వతత్వము) అనేటువంటి స్థితి రావలెనంటే నా శిష్యులలో ఏ ఒక్కరైనను పైన సూచించిన విధముగా నడచుకొనగలిగిన ఎడల వెంటనే యీ యోగము success అగునని మాస్టరుగారు సెలవిచ్చిరి.

ప్రభాకరగురుదేవులు వారి గురుదేవులు సూచించిన యోగవిధానమును త్రికరణశుద్ధిగా అనుసరించుటకు నిరంతరము వర్తించిన మహాయోగిపుంగవులు. అంటే వారు ప్రతి ప్రాణికోటి ఎడల పరమప్రేమతో జీవించిన ప్రేమస్వరూపులు. ఎదుటివారు ఏమాత్రము బాధలకు లోనైనా అది వారికి

కలిగిన బాధగా తోచి విలవిల లాడెడివారు. వారిని బాధా విముక్తులను చేయుటకు పరితపించెడివారు. ప్రతివ్యక్తి యొక్క జీవనము ఆదర్శప్రాయముగా జీవించవలెనని వారు సదా పాటు పడెడివారు. అట్లా అందరూ జీవించిన లోకము క్షేమముగా ఉండునని వారు తపించెడివారు. వారిని ఏ ఒక్కరు విమర్శించుకు అవకాశము కలిగించని విధముగా సత్యజీవనులై నడిచేవారు.

వారిని ఆశ్రయించి ఎందరో తమ ఆరోగ్య సమస్యల నుండి విముక్తులై సుఖజీవనులైరి. ఏలాటి అనారోగ్యములైనను, ఏలాటి సమస్యలైనను వారి సంకల్పమాత్రముననే నివారింపబడగా కొన్ని వందలమంది మేలుపొందిరి. ఇక వారి ఇంట చూడగా ఏ పూటకు జరుగుబాటు ఆ పూటకుగా వుండెడిది. ఒక ధనవంతుని ఇంట ఆహారపదార్థములు నిల్వ ఉన్నట్లుగా ఉండెడివి కావు. కానీ వారి ఇంటికి వచ్చిన వారికి ఏ విధమైన లోటూ ఉండెడిది కాదు. వారికి శిష్యులుగా హైకోర్టు జస్టిస్, టి.టి.డి. ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు వంటి వారు ఎంతో ఉన్నతమైన పదవులలో ఉన్నవారు ఉండేవారు. కానీ వీరి జీవితము అతి సామాన్య కుటుంబము తీరునే సాగెడిది. వీరి వద్దకు అనారోగ్యముతోగాని, సమస్యలతో గాని స్త్రీలు ఒంటరిగా వచ్చినట్లయితే ఇంటిలోనికి రానిచ్చెడివారు కాదు. వారి భర్తగారిని తీసుకుని వస్తేనే వారితో మాట్లాడి వారికి మేలు చేకూర్చేవారు.

వీరు భారత స్వాతంత్రోద్యమమునకు పరోక్షముగా కృషి చేసిన పుణ్యమూర్తి. మహాత్మాగాంధీగారు పలుమార్లు సత్యాగ్రహములు చేసిన సందర్భములలో వీరు యోగశక్తితో గాంధీగారి యొక్క ఆరోగ్యము చెడనీయక ఎనర్జీని సప్లై చేయుచు వారికి ఎలాంటి చీకాకులు కలుగకుండా ప్రార్థన ద్వారా కాపాడిన ధన్యజీవి.

దేశముల మధ్యకానీ, వ్యక్తుల మధ్య కాని ఘర్షణలు లేకుండా లోకము శాంతిమయముగా నడువవలెనని తపించెడివారు. వారి ప్రతిఒక్క రచన లోకమునకు ఆదర్శప్రాయముగా ఉండెడిది. ఆయా రచనల ద్వారా ఉన్నతమైన నడవడికను తెలియచెప్తూ లోకోద్ధరణ కలుగవలెనని ఆశించెడివారు. వాస్తవమును వెల్లడించుటకే రచన చేసెడివారుగానీ రచన ఆకర్షించుటకు ఏలాంటి కల్పితములను, అవాస్తవములను కూర్చెడెవారు గారు. ఎవరైనా కల్పితములను రచించినట్లు తెలిసిన యెడల వాస్తవములను లోకమునకు తెలియపరచి కల్పితములను నమ్మి యిబ్బంది పడకుండా తోటివారిని కాపాడిన మహాపురుషుడు. ఎంతటి గొప్పవారితోనైనను సత్యమును తెలుపుటకు వెనుకాడని ధీమంతుడు. రాజీతనము వారి జీవితమున లేదు. ఏ ఒక్కరితోను ఘర్షణకు పూనుకొనని సమదర్శనుడు. తనకు చెడు సంకల్పించిన వారిని సైతము ఎంతో ప్రేమతో ఆదరముతో మైత్రి నడిపిన యోగబాంధవుడు.

మానవత్వము పెరిగి పెరిగి దివ్యతకు దగ్గర అగుననే దానికి తార్కాణముగా తాను ప్రజ్ఞాప్రభాకరులై ఆ ప్రజ్ఞను అందరకూ పంచుతున్న యోగప్రపూర్ణులు శ్రీశాస్త్రిగారు

మాస్టర్ సి.వి.వి. నమస్కారమ్

* * *

10. శ్రీవేటూరి ప్రభాకర శాస్త్రిగారి అమూల్యరచన - గాలికబుర్లు: భాషా పరిశీలన

- ఆచార్య గాలి రాధాకృష్ణ

శ్రీవేటూరి ప్రభాకర శాస్త్రిగారు (1888–1950) పరిశోధన పరమేశ్వరుడు. పరిష్కరణ సార్వభౌముడు. భాషా శాస్త్రవేత. "భాషా విషయములో పరిశోధన, శాసన విషయములో పరిశోధన, చరిత్ర విషయములో పరిశోధన - నాకు చూడగా శ్రీప్రభాకరశాస్త్రి గారు చేసినది పరిశోధనే. మూర్తీ భవించన పరిశోధన ఆయన" అంటారు మల్లంపల్లి సోమశేఖరశర్మ గారు. శ్రీవేటూరి వారిని గురించి ఆయన మాటలు అక్షరసత్యం. చిరస్మరణీయం.

శ్రీవేటూరి వారు ప్రాచీన సాహిత్యంతో పాటు, జానపద సాహిత్యాన్ని సమానంగా ఆదరించేవారు. వారు ఎక్కడికి వెళ్ళినా, ఆయా ప్రదేశాల్లో భాషను పరిశీలించి, వాటిని సేకరించుకొని వచ్చి పత్రికల్లో వ్యాసాలు రాసేవారు. అలా ప్రచురించబడిన వ్యాసమే 'గాలికబుర్లు' వ్యాసం. సమకాలం నాటి భాషకు వేటూరి వారు చేసిన సేవకు ఒక తార్కాణమే 'గాలికబుర్లు' అనే వారి అమూల్యరచనా వ్యాసం. శాస్త్రి గారు పలుకుబళ్ళనే 'గాలికబుర్లు' అని పేరు పెట్టారు. గాలికి ఉన్నంత వేగం, వ్యాప్తి వాటికి వుండడం ఒక కారణం కావచ్చు. భాషలో ముఖ్యంగా మౌఖిత భాషలో ఉండి గ్రంథస్తం గాని గాలికి కొట్టుకొనిపోయే అత్యంత విలువైన మన పలుకుబళ్ళను ఏర్చి, కూర్చి, పేర్చి ఆంధ్రలోకానికి 'గాలికబుర్లు' అన్న శీర్షికను అందించిన శ్రీవేటూరి వారు వాటిని గురించి ఇలా అంటారు. "పాటలు, పదాలు, పొడుపుకథలు, సామెతలు, పలుకుబళ్ళు,నానుళ్ళు, దేశీయములు, నుడికారములు, జాతి వార్తలు, చమత్కారములు, చాటు ధారలు, లక్షణోదాహరణములు మొదలయిన వాటిని భాషా సస్యపు పంటలలో ఇది వఱకు సేకరణము గాక గాలికి కొట్టుకొని పోతూ ఉండే చెదరుడు, రాలుడు పరిగ గింజలను బిచ్చగాడనై ఊళ్ళూ నాళ్ళూ తిరుగుతూ ముప్పై ఏళ్ళ ముందు నుండి ఎక్కడ పడితే అక్కడల్లా ఏరుకు తెచ్చుకుంటూ ఉన్నాను". శ్రీ వేటూరి వారి 'గాలికబుర్లు' 1944 జనవరి, ఫిబ్రవరి, జూన్ నెలల్లో ఆంధ్రపత్రిక ఆదివారం పత్రికల్లో ప్రచురితమైంది. తర్వాత వ్యాసమంజరి (పు. 137–148), మణిమంజరి గ్రంథాల్లో పునర్ముద్రింపబడ్డాయి. వేటూరి వారి 'గాలికబుర్లు' లోని బిరుదు, జాతి, అవయవ, జంతు, నిందా, ప్రశస్తి అనే ఆరు వర్గాలున్నాయి. ప్రస్తుత వ్యాస రచనా సౌకర్యార్థం వేటూరి వారి రచన, 'గాలికబుర్లు' లోని అంశాలులోని వ్యాస ఉపోద్ఘాతం : (ఉ) ; వ్యాస వర్గవిభాగం (వ.వి), బిరుదువర్గం : (బి.వ), జాతి వర్గం (జా.వ) అవయవ వర్గం (అ.వ) జంతువర్గం (జం.వ), నిందావర్గం (నిం.వ) ప్రశస్తివర్గం: ఊళ్ళ మీద: (ప్ర.వ) - గా వ్యాసంలో బ్రాకెట్ల లోని ఆయా అంశాలకు సంక్షిప్త వివరణ ఇచ్చాను.

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి అత్యంత విలువైన మూల వ్యాసం 'గాలి కబుర్లు' లోని భాషాంశాల్ని కింది పరిశీలనలో స్థూలంగా చూడవచ్చు. ప్రస్తుత భాషా పరిశోధనలో వర్ణవిజ్ఞాన సంబంధమైన - వర్ణవై

విజ్ఞాం సంధి విలాన సంబంధమైన రూపాలుగా, నామవిధ్యన సంబంధమైన – నిష్పన్న నామరూపాలు (భావార్థకనామ; కృత్తద్ధిత రూపాలు), లింగ – వచన – విభక్తిరూపాలు, సర్వనామ – సంఖ్యవాచక రూపాలు, నామవిశేషణ రూపాలు, పదబంధరూపాలు, అన్యదేశ్య రూపాలు; క్రియా సంబంధమైన – సామన్య సంశ్లిష్ట, సంయుక్త క్రియారూపాలు సమాపక, అసమాపక క్రియా రూపాలు; క్రియా విశేషణరూపాలు, పదకల్పరూపాలు ; వాక్య విధాన సంబంధమైన వాక్యరకాలు; ఇతర విధాన సంబంధంమైన – జాతీయాలు, సామెతలు, తిట్లరూపాలు, శాపనార్థరూపాలు, ద్విరుక్తరూపాలు, జంటరూపాలు మొ.వి. పరిశీలించాను.

1.1. వర్ణవైవిధ్యం

ఒక వర్ణం చారిత్రక, కారణాల వల్లగాని, మరో ఇతర కారణాల వల్లగాని భిన్న రుపాలుగా పరివర్తన చెందవచ్చు. 'గాలి కబుర్లు' లోని వర్ణవైవిధ్యాన్ని కింది పరిశీలనలో చూడవచ్చు.

1) అచ్చుపరివర్తన (పదాది గాని, పదమధ్యంగాని, పదాంతంలో గాని) రూపాంతరత

– ఉ – ఓ : ముఖము = సింహముఖము" (జం.వ)

మొఖం = మొఖం చూస్తేనే తెలుస్తుంది మీగాళ్ళవాడు (నిం.వ)

– ఉ – : – ఇ – :– పిచ్చుక "ఉరపిచ్చుక లేహ్యం" (జం.వ) ;

పిచ్చిక "పిచ్చిక గూడువలె ఉంది (జం.వ)

–అ : – ఎ :– గాడిదె "గాడిదగ్రుడ్డు" (నిం.వ) ;

గాడిదె "గాడిదె లాగు" (నిం.వ)

2) హల్లుల ఆదేశ రూపాంతరత

ఖ్ : హ్ : ముఖ – "సింహముఖము" (జం.వ) ;

మొహం "ఏడ్చి మొహం కడుక్కున్నట్టుంది" (నిం.వ)

డ్ : ల్ : రాయడు (బి.వ) ; రాయలు (బి.వ)

3) మహాప్రాణం అల్ప ప్రాణ హల్లు రూపాంతరత

భ్ : బ్ : భుజం – భుజాలు మూడయినవి (అ.వ) ;

బుజం = బుజాలు కలుపుకొన్నారు" (అ.వ)

4) తాలవ్యదంతమూలీయం : దంత్యదంతమూలీయ హల్లు రూపాంతరత

శ్ : స్ : శెట్టి – ఉప్పని మాటలు చెప్పి – శెట్టి వున్న చోటు పట్నం' (నిం.వ);

సెట్టి (బి.వ)

5) కంపితం : తాడిత హల్లు రూపాంతరత

ఱ్ : ర్ : ఱొమ్ము "ఱొమ్ము గూటం" (అ.వ) రొమ్ము = రొమ్ముల కుంపటి" (నిం.వ)

ఱ్ఱ్ : ర్ర్ : గుఱ్ఱము "గుఱపు సవారీ నా మీద" (జం.వ) గుర్రం "గుర్రం అంత వరుగిచ్చి" (నిం.వ)

6) సంశ్లేష హల్లులోని కేవలషల్లోపం

న్స్ : న్స్ : సన్నాసి ; సన్నాసి = సన్నాసి రాయుడు (నిం.వ)

7) పదాది యకారాగమం

ఎ :య్ ఎ : ఎలుక = పిల్లిగుడ్డిదైతే – ఎలుక ఏదో చూపుతుంది" (జం.వ) ;

యెలుక "నేతి కుండపై యెలుక" (నిం.వ)

8) ద్విరుక్తం

అద్విరుక్తం రూపాంతరత మరియు అచ్చుదీర్ఘత

అచ్చుప్రస్వత రూపాంతరత :

య్య్ : య్ ; ఎ : ఏ : చెయ్యి "మోచెయ్యి" (అ.వ)

చేయి "చేయూడ లేదు" (అ.వ)

9) అరసున్న

అరసున్నలోపం రూపాంతరత

కాఁబోలు (ప్ర.వ) ; కాబోలు (వ్ర.వ)

10) సంశ్లేష హల్లులోని శ్వాసహల్లు నాదహల్లు రూపాంతరత

ంట్ర్ : ండ్ర్ – వెంట్రుక "చిట్ట వెంట్రుకలు" (అ.వ) ;

వెంట్రుక "గుఱ్ఱపు వెంట్రుక" (జం.వ)

1.2. సంధిరూపాలు

రెండు రూపాలను సన్నిహితంగా చేరినపుడు ఆ రెండు రూపాల మధ్య మార్పులు, చేర్పులు ప్రక్రియల వల్ల ఏర్పడేవి సంధిరూపాలు.

అడ్డాలు (< అడం+లు) 'అడ్డాల పాప' (నిం.వ)

ఇళ్ళు (< ఇల్లు+లు) 'వేయిళ్ళ పూజారి' (జా.వ)

ఎందాక (< ఎంత+దాక) 'తాడెక్కే వాణ్ణి ఎందాక ఎగసనదోస్తారు (నిం.వ)

ఉండూరు (< ఉన్న+ఊరు) "ఉన్న మాటంటే ఉండూరు అచ్చిరాదు" (నిం.వ)

జందెపు (< జందెము+పు) "జందెపు పోగు' (జా.వ)

నట్టిల్లు (< నడి+ఇల్లు) 'అయ్యవార్లంగారి నట్టిల్లు' (జా.వ)

నీల్ళు (< నీరు+ళు) 'నీళ్ళ బ్రాహ్మడు (జా.వ)

పలుకుబళ్ళు (< పలుకుబడి+ళు) 'నేను సేకరించిన పలుకుబళ్ళను' (వ.వి)

పోట్లు (< పోటు+లు) 'బుగ్గ పోట్లు పొడిచాడు' (అ.వ)

ముక్కోపి (< ముక్క+కోపి) 'ముక్కోపి' (నిం.వ)

వంకాయ (< వంగ+కాయ) "వంకాయ నాడు లేనిది టెంకాయనాడు వస్తుందా?" (నిం.వ)

1.3. భావార్థక నామరూపాలు

సర్వ క్రియలకు భావార్థక ప్రత్యయం –డు అడం చేరి ఏర్పడేవి.

చెదురుడు (< చెదురు+డు) "గాలికి కొట్టుకు పోతూ ఉండే చెదురుడు, రాలుడు వరిగింజలను" (ఉ.)

సెకరించడము (< సేకరించు+అడము అడం) "నిఘంటువుగా సేకరించడములేదు" (ఉ); "వాటిని దేశము నలుమూలలా సేకరించడం మంచిదనీ" (ఉ)

అనిపించుకోవడం (< అనిపించుకొను+అడం) "అని అనిపించుకోవడం అత్తగారా నీపని" (నిం.వ)

1.4 కృదంతరూపాలు

నిర్దిష్ట క్రియలకు కృదంత ప్రత్యయం చేరి లేదా చేరక ఏర్పడేవి.

చదువు (< చదువు+) "చదువు చట్టుబండలైంది" (నిం.వ)

కన్ను (< కను+) "కన్ను లేకపోతే కలిగియుగంలేదు" (నిం.వ)

తల (< తలచు+) "బోడి తలకు బొడ్డుమల్లెలు" (అ.వ)

పోటు (< పొడుచు+) "బుగ్గ పోట్లు" (అ.వ)

పలుకుబడి (< పలుకు+బడి) " వాటికి సంబంధించిన పలుకుబళ్ళను," (వ.వి)

కాయ (< కాయు+అ) "కోతికి కొబ్బరి కాయ" (జం.వ)

ఏడుపు (< ఏడుచు+పు) "ఏడుపు మూతి పెద్దమ్మ" (నిం.వ)

తెలివి (< తెలియు+వి) "తెలివి తెల్లవారింది." (నిం.వ)

తేట (< తేరు+ట) "ఆడవారి మాటలు అద్దంలో తేటలు" (నిం.వ)

ఆట (< ఆడు+ట) "దొమ్మరాట" (జా.వ)

కొక్కరింపు (< కొక్కరించు+పు) "కోడి కొక్కరింపు" (జం.వ)

ఎగిరిపాటు (< ఎగిరిపడు+) "ఎగిరిపాటు ఎక్కువ జరుగుపాటు తక్కువ" (నిం.వ)

1.5. తద్ధిత రూపాలు

నిర్దిష్ట నామాలకు లేదా నామవిశేషణాలకు తద్ధిత ప్రత్యయం చేరి లేదా చేరక ఏర్పడేవి తద్ధిత రూపాలు.

పొట్టకాయ (< పొట్ట+కాయ) "పొట్టకాయ" (నిం.వ)

బడాయి కోరు (< బడాయి+కోరు) "బడాయి కోరు" (నిం.వ)

దున్నపోతు (< దున్న+పోతు) " దున్నపోతు మహారాజులుంగారు" (నిం.వ)

పేలుడుగాయి (< పేలుడు+కాయి) " పేలుడు గాయి" (నిం.వ)

వేటుగాడు (< వేట+కాడు) "నక్కవేటగాడు" (జం.వ)

జమీందారు (< జమీన్+దార్) "జమీందారు" (నిం.వ)

దుండగీడు (< దుండగము+ఈడు) "దుండగీడు" (నిం.వ)

అంకులాడి (< అంకులు+ఆడి) "అంకులాడి" (నిం.వ)

జంభాల రాయడు (< జంభాలు+రాయుడు) " జంభాలరాయడు" (నిం.వ)

పిసిని గొట్టు (< పిసిని+గొట్టు) "పిసినిగొట్టు" (నిం.వ)

1.6. లింగరూపాలు

లింగబోధకతను తెలిపేవి లింగరూపాలు. ఈ రూపాలు పుం, స్త్రీ, స్త్రీ పురుషోభయ సామాన్య, స్త్రీ – పురుషేతరంగా కన్పిస్తాయి.

1) పుంలింగ రూపాలు

కొడుకు – '.ఎదుటున్న వాడు పెండ్లికొడుకు" (నిం.వ)
అయ్య – "అయ్యవార్లంగారి నట్టిల్లు" (జా.వ)
దుండగీడు (నిం.వ) – మేకపాతు : "మేకపోతు గాంభీర్యం"
(నిం.వ) ; మొగుడు : "పుంటికి పుల్ల మొగుడు (నిం.వ)

2) స్త్రీ లింగ రూపాలు

అమ్మ (బి.వ) ; అక్క (బి.వ) ; తల్లి "తల్లి చాటుబిడ్డ"
(నిం.వ) ; అమ్మాయి (బి.వ)

3) స్త్రీ – పురుషోభయ సామన్యలింగ రూపాలు

బిడ్డ 'చంకలో బిడ్డ' (అ.వ); ఎద్దు 'ఎద్దుమొద్దు' (జం.వ)

పుంజు 'కోడిపుంజు' (జం.వ); మంగలి 'తిరుపతి మంగలి (జా.వ)

దొంగ 'గజగొంగ' (నిం.వ); యంబేద (నిం.వ) ; దగకారో (నిం.వ)

4) స్త్రీ – పురుషేతర లింగ రూపాలు

కథ "పాటలు, పదాలు, పొడుపు కథలు" (ఉ)

చెంబు "చెంబు పట్టుక వెళ్ళంది" (అ.వ); భాష "బాలభాష" అనే పేరుతో (ఉ)

నోరు "తెఱ్ఱనోరు" (అ.వ); గుండె "గుండెతాళం" (అ.వ); నిద్ర

"వోడి నిద్ర" (జం.వ); క్రమము" అకారాది క్రమమున" (ఉ).

1.7. వచన రూపాలు

వచన బోధకతను తెలిపేవి వచన రూపాలు. ఈ రూపాలు ఏక, బహువచన బోధకాలు

1) ఏకవచనరూపాలు : ఒక దానిని గూరించి తెలిపేవి ఏకవచన రూపాలు

పాము "మెడ చుట్టిన పాము" (నిం.వ); చిల్లి "చిల్లి పేరే తూటు" (నిం.వ)

సాక్ష్యం "నోమటి సాక్ష్యం" (జా.వ);

ఘాతకుడు "ప్రథమశాఖ ప్రాణ ఘాతకుడు" (జా.వ);

శల్యము "హృదయ శల్యము" (నిం.వ); తుమ్మెద "తుమ్మెద మోత" (జం.వు);

ప్రభువు (బి.వ); మొండి "పరమమొండి" (నిం.వ)

2) బహువచనరూపాలు

ఒకదాని కంటే ఎక్కువను బోధించేవి బహువచన రూపలు

మీసాలు "నూనూగు మీసాలు" (అ.వ); గుండెలు "గుండెలు తీసిన బంటు" (నిం.వ)

ఊళ్ళు "ఊళ్ళూ నాళ్ళూ తిరుగుతూ" (ఉ); ముసళ్ళు "ముందుంది ముసళ్ళ పండగ (నిం.వ)

ఏళ్ళు "ముప్పై యేళ్ల ముందు నుండి" (ఉ);

అయ్యవార్లు "అయ్యవార్లం గారి నట్టిల్లు" (జా.వ)

పొయులు "కంసారి పొయులు" (జా.వా);

పెట్లు "అటు పోతె గోడపెట్టు యిటు పోతే చెంపపెట్లు" (నిం.వ);

భయభక్తులు "భయభక్తులు లేవు" (నిం.వ);

దయాధర్మం "దయాధర్మం లేదు" (నిం.వ); ఇత్యాదులు (నిం.వ.)

3) నిత్యైక వచన రూపాలు

నీరు నీళ్ళు :"కొత్త నీరు వచ్చి పాత నీళ్ళను కొట్టుక పోయింది" (నిం.వ)

పాలు : 'పాల పొంగు వయస్సు" (అ.వ)

ఎక్కడు : "ఎక్కడ లోకం ఎక్కడి కథ" (నిం.వ);

నువులు, నూనె : "నువ్వులూ నూనె ఒకటే తెలకులవాడే తేడా" (నిం.వ);

4) నిత్యబహువచన రూపాలు

తలంబ్రాలు (అ.వ); కోతి కొమ్మచ్చులు (నిం.వ)

1.8. విభక్తి రూపాలు

నామాలకు విభక్తి ప్రత్యయం చేరి ఏర్పడేవి విభక్తిరూపాలు. నామాలకు విభక్తి ప్రత్యయం చేరినపుడు నామంతర్వాత విభక్తి ప్రత్యయం నడుమ ఔపవిభక్తిక ప్రత్యయం చేరి ఔపవిభక్తిక రూపాలు ఏర్పడతాయి.

1) ఔపవిభక్తి రూపాలు

పంటలలో (< పంటలు-అ-లో) "భాషా సస్యపు పంటలలో" (ఉ)

ఇంటికి (< ఇల్లు-ఇ-కి) "ఇంటికి జేష్టాదేవి పొరుగింటికి శ్రీమహాలక్ష్మి" (నిం.వ)

2) కేవల విభక్తిరూపాలు

గాలికి (< గాలి-కి) "గాలికి కొట్టుకొనిపోతూ" (ఉ);

బిడ్డకు (< బిడ్డ-కు) "పుట్టని బిడ్డకు పూల వరహాలు" (నిం.వ)

సముద్రమును (< సముద్రము-ను) "ఆంధ్ర వాఙ్మయ సముద్రమును" (ఉ)

పారతో (< పార-తో) "ఒకడే కొడుకని గడ్డపారతో ముక్కుకుట్టిందట" (నిం.వ)

కుండపై (< కుండ-పై) "నేతి కుండపై యొలుక" (నిం.వ);

తొట్టెలో (< తొట్టెలో) "కుడితి తొట్టెలో బల్లి" (నిం.వ);

తుదుం దగ్గర నుంచి (< తుదుం - దగ్గర - నుంచి);

అర్చన దాకా (< అర్చన-దాకా) "తుదుం దగ్గర నుంచి దేవతార్చన దాకా" (నిం.వ);

రామాకృష్ణా "రామా కృష్ణా అంటాడు" (అ.వ);

ఏ బెస్త గురవమ్మ "తెలివి ఒకరి సొమ్ము ఏ బెస్త గురవమ్మా" (నిం.వ)

1.9. సర్వనామ రూపాలు

'గాలి కబుర్లు' లో పురుషవాచక, నిర్దేశక, ప్రశ్నార్థక రూపాలుగా ఉన్నాయి.

1) పురుషవాచక సర్వనామ రూపాలు

నేను : "నేను చేస్తున్న తీరిది" (వ.వి)

ఆయన : "ఆయన బంగారు పిచ్చిక" (జం.వ)

వాడు : "మాయదారి వాడు" (నిం.వ)

వారు : "నేను సేకరింపగోరినవి వారు సేకరిస్తున్న సామెతలే కావు" (ఉ)

అది : "దాని ముండమొయ్య" (నిం.వ)

అవి : "అప్పుడప్పుడూ ప్రకటిస్తూ వచ్చిన వాటిని" (ఉ)

పై సర్వనామ రూపాల్లో వాడు, వారు, అది, అవి – రూపాలు నిర్దేశక సర్వనామాలుగా పేర్కొనవచ్చు.

2) ప్రశ్నార్థక సర్వనామ రూపాలు

ఎవరు : "ఎవరో ఒకరు ఎత్తి పుస్తకీకరించుకున్నారు" (ఉ)

ఏవి : "ఏవో కొన్ని ప్రకటించాలనుకొంటున్నాను" (ఉ)

3) ఆత్మార్థక సర్వనామ రూపం

తమ : "సామెతలు తమ కియ్యవలసినది కోరిరి" (వ.వి)

1.10. సంఖ్యావాచక రూపాలు

అంకెలను (సంఖ్యలను) తెలిపే రూపాలు సంఖ్యావాచక రూపాలు. 'గాలి కబుర్లు' లో క్రింది సంఖ్యావాచక రూపాలు కన్పిస్తున్నాయి.

1) ప్రాథమిక సంఖ్యావాచక రూపాలు : ఒకటి, రెండు, మూడు, ఏను, ఆరు/ఆఱు, ఏడు, పది, వేయి, లక్ష – "ఒకటికి వెళ్ళింది" (అ.వ), "రెంటికి వెళ్ళింది" (అ.వ), "భూజాలు మూడయినయి" (అ.వ), "కు పూర్వము నేను" (ఉ), "పదహారు పళ్ళు బైటపడ్డవి" (అ.వ), "ఆరు చెవిన పడకుండా" (అ.వ), "ఏడో గ్రహం" (నిం.వ), "వేయిళ్ళ పూజారి" (అ.వ), "అందు లక్ష సామెతలను సంపాదింపబూనినట్లు" (ఉ)

2) సంకలన సంఖ్యావాచక రూపాలు : పదిహేను, పదహారు–"పదిహేనేళ్ళకు పూర్వము నేను" (ఉ), "పదహారు పళ్ళు బైట పడ్డవి" (అ.వ)

3) లింగబోధన సంఖ్యావాచక రూపం : ఒకడు (ఒక–డు) "ఒక్కడే కొడుకుని గడ్డపారతో ముక్కు కుట్టిందట" (నిం.వ)

4) నామ విశేషణ సంఖ్యావాచక రూపాలు : మూడు (మూడు+ఆ) – "మూడు కాళ్ళు", "మూడుకాళ్ళ ముసలి" (అ.వ)

వేయి (వేయి+ఆ) – "వేయిళ్ళు", వేయిళ్ళ పూజారి" (జా.మ)

లక్ష (లక్ష+ఆ) –"లక్ష సామెతలు, "అందు లక్ష సామెతలను సంపాదింపబూనినట్లు" (ఉ)

5) ఓ ప్రత్యయాత్మక సంఖ్యావాచక రూపాలు

మూడో (మూడు+ఓ) "మూడో హస్తం ఉంది (అ.వి)

ఆఱో (ఆఱు+ఓ) "ఆఱో చెవిన పడకుండా" (అ.వి)

1.11. నామవిశేషణ రూపాలు

నామాలకు విశేషంగా వచ్చేవి నామవిశేషణ రూపాలు. వీటిని వ్యాకర్తలు విశేషణాలని వ్యవహరిస్తారు. ఈ రూపాలు స్వతస్సిద్ధంగాను నిష్పన్నంగాను కన్పిస్తాయి.

1) స్వతస్సిద్ధ నామవిశేషణ రూపాలు

కొత్త, పాత : "కొత్త నీరు వచ్చి పాత నీళ్ళను కొట్టుక పోయింది" (నిం.వ)

చిఱు : "చిఱు వెంట్రుకలు" (అ.వ)

కొంటె : "కొంటె కోణంగి" (నిం.వ)

పచ్చి : "పచ్చి దొంగ" (నిం.వ)

వెఱ్ఱి : "వెఱ్ఱి వెంగళప్ప" (నిం.వ)

2) నిష్పన్న నామవిశేషణ రూపాలు

కడవ (కడప+ఆ) "కడప కూజాలు" (ప్ర.వ)

కంచి (కాంచి+ఆ) "కంచి చీరలు" (ప్ర.వ)

చేతి (చేయి+ఆ) "ఎత్తువారి చేతి బిడ్డడు" (నిం.ప)

మద (మదము+ఆ) "మదపిచ్చి" (అ.వ)

గుఱ్ఱపు (గుఱ్ఱము+ఆ) "గుఱ్ఱపు వెంట్రుక" (జం.వ)

ఊరి (ఊరు+ఇ) "నెల్లూరి బియ్యం" (ప్ర.వ)

కంటి (కన్ను+టి) "కంటి అద్దము" (అ.వ)

కాళ్ళు (కాళ్ళు+అ) "చవట కాళ్ళ వెధవ" (నిం.వ్యా)

శకునాల (శకునాలు+అ) "శకునాల పక్షి" (నిం.వ)

వారి (వారు+ఇ) "అది వారి స్వార్జితమే" (ఉ)

కొట్టిన (కొట్టిన+ఆ) "బెల్లం కొట్టిన రాయి" (నిం.వ)

పొయ్యే (పొయ్యే+ఆ) "పొయ్యే కాలము" (నిం.వ)

తరగని (తరగని+ఆ) "తరగని దుంప" (నిం.వ)

రణగుణ (రణగుణ+ఆ) "రణగుణ ధ్వని" (నిం.వ)

1.12. పదబంధ రూపాలు

భాషలో కేవలం ప్రాతిపదికలతో ఏర్పడే పదనిర్మాణ రూపాల్ని పదబంధ రూపాలని పేర్కొనవచ్చు. వీటినే వ్యాకర్తలు సమాసాలు అని వ్యవహరిస్తారు. పదబంధరూపాల్ని భాషా, కారక సంబంధంగా వర్గీకరించవచ్చు.

1) భాషా సంబంధ విశ్లేషణ

భాషా సంబంధ పరంగా క్రింది రకాలుగా విభజించవచ్చు

1) తెలుగు+తెలుగు

తెలుగు + గోంగూర = తెలుగు గోంగూరు (ప్ర.వ)

మెడ + జీవాలు = మెడ జీవాలు (అ.వ)

తెలుగు + సామెతలు = తెలుగు సామెతలు (ఉ)

2) తెలుగు+సంస్కృతం

పొడుపు + కథ-లు = పొడుపు కథలు (ఉ)

3) తెలుగు+పర్షియో-అరబిక్

గుఱ్ఱము + సవారి = గుఱ్ఱపు సవారి (అ.వ)

పొందూరు + ఖద్దరు = పొందూరు ఖద్దరు (ప్ర.వి)

4) సంస్కృతం+సంస్కృతం

ఆంధ్రము + ప్రజ - లు = ఆంధ్ర ప్రజలు (ఉ)

జాతి + వార్త - లు = జాతి వార్తలు (ఉ)

5) తమిళం+తెలుగు

కంచి + మేకులు = కంచి మేకులు (ప్ర.వ)

6) తమిళం+సంస్కృతం

నంబి + వైద్యం = నంబివైద్యం (జా.వ)

7) సంస్కృతం నుంచి తమిళంలోకి వచ్చిన రూపం+సంస్కృతం

తిరు (శ్రీ + పతి = తిరుపతి "తిరుపతి గొడుగులు" (ప్ర.వ)

8) పర్షియో-అరబిక్+తెలుగు

ఫకీరు + నుయ్యి = ఫకీరు నుయ్యి 'పెద్దాపురం ఫకీరు నుయ్యి' (ప్ర.వ)

9) పర్షియో అరబిక్+సంస్కృతం

సాతాని + నీతులు = సాతాని నీతులు (జా.వ)

10) ఇంగ్లీష్+తెలుగు

జులై + నెల = జూలై నెల (ఉ)

(2) కారక సంబంధ విశ్లేషణ

ఇందులో నిర్ధారక (తత్పురుష, కర్మధారయ, ద్విగు), బహువ్రీహి, ద్వంద్వ – పదబంధ రూపాలు కన్పిస్తున్నాయి.

1. తత్పురుష పదబంధ రూపాలు

కాకి పిల్ల : "కాకి పిల్ల కాకికి ముద్దు" (జం.వ)

గొఱ్ఱెల మంద : "గొఱ్ఱెల మంద" (జం.వ)

వారి స్వార్జితము : "అది వారి స్వార్జితము" (ఉ)

2. కర్మధారాయ పదబంధ రూపాలు

తెగిన వెధవ : "చెవులు తెగిన వెధవ" (నిం.వ)

ఎఱ్ఱ కోమటి : "ఎఱ్ఱ కోమటి" (జా.వ)

3. ద్విగు పదబంధ రూపాలు

మూడంకె : "మూడంకె వేశాడు" (అ.వి)

లక్ష సామెతలు : "అందు లక్ష సామెతలను" (ఉ)

4. బహువ్రీహి పదబంధ రూపాం

గంగాధరుడు : "తారుపుల గంగాధరుడు" (నిం.వ)

5. ద్వంద్వ పదబంధ రూపాలు

దయాధర్మం : "దయాధర్మం లేదు" (నిం.వ)

భయభక్తులు : "భయభక్తులు లేవు" (నిం.వ)

1.13. అన్యదేశ్యరూపాలు

దేశ్యం కాని రూపాలు అన్యదేశ్యరూపాలు. ఇందులో సంస్కృత, ప్రాకృత, పర్షియో–అరబిక్, మరాఠీ, పంజాబీ, తమిళం, ఆంగ్ల రూపాలున్నాయి.

1) సంస్కృత రూపాలు : గురువు (బి.వ), చక్రవర్తి (బి.వ), ప్రభువు (బి.వ), మహారాజు (బి.వ), శర్మ (బి.వ), శాస్త్రి (బి.వ), శ్రేష్ఠి (బి.వ) మొదలగునవి.

2) ప్రాకృత రూపాలు : ఒజ్జ (బి.వ), వెజ్జు (బి.వ), బంటు (బి.వ), పెట్టి (బి.వ) మొదలగునవి.

3) పర్షియో – అరబిక్ రూపాలు : వస్తాదు (బి.వ), సాహెబు (బి.వ), రౌతు (బి.వ), జాగీరుదారు (నిం.వ), బహద్దరు (బి.వ), షావుకారు (బి.వ), లడాయి 'గుంటూరు లడాయి' (ప్ర.వ), తివాచీ 'ఏలూరు తివాచీలు' (ప్ర.వ) మొదలగునవి.

4) మరాఠి రూపం : రావు (బి.వ)

5) పంజాబీ రూపం : సింగు (బి.వ)

6) తమిళ రూపాలు : మొదలియారు (బి.వ), పిళ్ళ (బి.వ), అణ్ణి (బి.వ), తాయి (బి.వ) సాపాటు 'సాపాటు రాముడు' (నిం.వ) మొదలగునవి.

7) సంస్కృతం నుంచి తమిళంలోకి వచ్చిన రూపం : తిరు (శ్రీ) తిరుపతి క్షౌరము (ప్ర.వ)

8) ఆంగ్ల రూపాలు : ఏప్రిల్ "ఏప్రిల్ 25 తేదిని" (ఉ), జులై "జులై నెలలో" (ఉ), రేడియో "నేను రేడియోలో" (ఉ), సర్వే : "భాషాక్షేత్రమును సర్వే చేయవలసి ఉన్నదని" (ఉ).

1.14. సామాన్య క్రియారూపాలు

'గాలి కబుర్లు' లోని క్రియారూపాల్ని సామాన్య, సంశ్లిష్ట, సంయుక్త (శబ్దపల్లవ, శబ్దపల్లవ క్రియేతర) క్రియారూపాలుగా పేర్కొనవచ్చు. 'గాలికబుర్లు' లోని సామాన్య క్రియారూపాల్ని క్రింది పరిశీలనలో చూడవచ్చు.

అను : అని అనిపించుకోవడం అత్తగారా నీ స్వభావం (నిం.వ)

ఎగురు : ఎగర్తి పాటు ఎక్కువ జరుగుపాటు తక్కువ (నిం.వ)

ఉండు : "పనిలేని మంగలి కథలా ఉంది" (జా.వ)

ఊదు : "చెవిలో ఊదాడు" (అ.వ)

కదలు : "కడుపులో నీళ్ళు కదలకుండా వచ్చినాము" (అ.వ)

తన్ను : "గాడిద తన్నులు" (జం.వ)

బొక్కు : "దంచినమ్మకు బొక్కినదే కూలి" (నిం.వ)

కోరు : "పిల్లి పిండాలు కోరుతుంది" (జం.వ)

పడు : "శ్రుతిమించి రాగాన పడింది" (నిం.వ)

పొంగు : "పొంగిందంతా పొయ్యిపాలు" (నిం.వ)

పెట్టు : "కంటికి పెట్టేది తుంటికి పెట్టితే" (నిం.వ)

బొంకు : "నిలువెల్లా బొంకుల పుట్ట" (నిం.వ)

1.15. సంశ్లిష్ట క్రియా రూపాలు

ఇందులో ఇంచు ప్రత్యయాత్మక క్రియా రూపాల్ని చూడవచ్చు.

దండించు : "దండించే దాత లేడు – మర్దించే మామలేడు" (నిం.వ)

పుడిసిలించు : "ఆంధ్ర వాఙ్మయ సముద్రమును పుడిసిలించి" (ఉ)

పుస్తకీకరించు : "ఎవరో ఒకరు ఎత్తి పుస్తకీకరించుకొన్నాను" (ఉ)

ప్రకటించు : "ఏవో కొన్ని ప్రకటించినాననుకొంటున్నాను" (ఉ)

ప్రసంగించు : "నేను రేడియోలో ప్రసంగించిన విషయము" (ఉ)

వర్గీకరించు : "ఇత్యాది విధముల వర్గీకరించి" (వ.వి)

సేకరించు : "వారు సేకరించడం మంచిదని" (ఉ)

1.16. సంయుక్త క్రియారూపాలు

ఈ రూపాల్ని శబ్దపల్లవ, శబ్దపల్లవేతర క్రియారూపాలుగా పేర్కొనవచ్చు.

1) శబ్ద పల్లవ క్రియారూపాలు

కాలు సాగు : "కాలు సాగింది" (అ.వ)

గుండెలు తీయి : "గుండెలుతీసిన బంటు" (నిం.వ)

పొట్ట పగులు : "పొట్ట పలిలేతట్టు నవ్వారు" (అ.వ)

తెచ్చుకును : "తెచ్చుకుంటున్నాను" (ఉ)

పట్టుకొను : "అవసరమైతే గాడిద కాళ్ళయినా పట్టుకోవలెను" (జం.వ)

కాళ్ళు సాచుకును : "కాటికి కాళ్ళు సాచుకున్నాడు" (అ.వ)

కొట్టుకొనిపోవు : "ఇది వఱకు సేకరణముగాక గాలికి కొట్టుకొనిపోతూ" (ఉ)

2) శబ్ద పల్లవేతర క్రియారూపాలు

పోట్లు పొడుచు : "బుగ్గ పోట్లు పొడిచాడు" (అ.వ)

మాటలు చెప్పు : "ఉప్పని మాటలు చెప్పి – శెట్టి ఉన్నచోటు పట్నం" (నిం.వ)

1.17. సమాపక క్రియా రూపాలు

క్రియా రూపాల్ని సమాపక, అసమాప క్రియా రూపాలుగా కూడా వర్గీకరించవచ్చు. వీటిల్లో సమాపక క్రియా రూపాల్ని సామాన్య, సంయుక్త క్రియా రూపాలుగా క్రింది పరిశీనలో చూడవచ్చు.

1) సామాన్య సమాపక క్రియా రూపాలు

ప్రకటించితిని :"అటువంటి వాటిని కొన్నింటిని ప్రకటించితిని" (ఉ)

పంపిస్తాను : "అవి అట్లే వారికి పంపిస్తాను" (వ.వి)

లేరు : "అర్చేవారూ తీర్చేవారూ లేరు" (నిం.వ)

2) సంయుక్త సమాపక క్రియా రూపాలు

ఉన్నాను : "యేరుకు తెచ్చుకుంటూ ఉన్నాను" (ఉ)

వెళ్ళింది : "చెంబు పట్టుకు వెళ్ళింది" (అ.వ)

1.18. అసమాపక క్రియారూపాలు

అసమాపక క్రియారూపాల్ని క్రింది రకాలుగా చూడవచ్చు.

1) క్త్వార్థక క్రియారూపాలు

ఏడ్చి : "ఏడ్చి మొహం కడుక్కున్నట్టుంది" (నిం.వ)

లేక : "కన్ను లేక పోతో కలియుగం లేదు" (నిం.వ)

పుట్టి పుట్టక : "పుట్టికొన్ని పుట్టక కొన్ని" (నిం.వ)

2) శత్రర్థక క్రియా రూపాలు

తిరుగుతూ "ఊళ్ళూ నాళ్ళూ తిరుగుతూ" (ఉ)

ప్రకటిస్తూ : "ప్రకటిస్తూ వచ్చినవాటిని (ఉ)

3) అన్నంత క్రియా రూపం

సేకరింప : "నేను సేకరింప గోరినవి" (వ.వి)

4) చేదర్థక క్రియా రూపాలు

ఏడిస్తే : "గారాం గజ్జలకేడిస్తే వీపు దెబ్బలకేడుస్తుంది" (నిం.వ)

పోతే : పుణ్యానికి పోతే పాపం ఎదురు వచ్చింది (నిం.వ)

5) భూతకాలిక క్రియాజన్య విశేషణ రూపం

ఉన్న : "ఉన్న మాటంటే ఉందూరు అచ్చి రాదు" (నిం.వా)

6) వ్యతిరేకార్థక క్రియాజన్య విశేషణ రూపం

లేని : "కర్ర లేని వాణ్ణి గొట్టె కరిచింది" (నిం.వ)

1.19. అకర్మక, సకర్మక, ప్రేరణార్థక క్రియారూపాలు

కర్మ ఆకాంక్ష లేనివి అకర్మక క్రియారూపాలు ఉన్నవి సకర్మక క్రియారూపాలు. ఒక పనిని ఒకరితో చేయించడం ప్రేరణం. కాబట్టి అర్థాన్నిబట్టి ప్రేరణ ఎక్కడుందో చెప్పవచ్చు. వీటిని ప్రేరణవర్ధక క్రియారూపాలని చెప్పవచ్చు.

1) అకర్మక, క్రియా మూలక సకర్మక క్రియారూపాలు

కూరు (అకర్మక క్రియ) = కూర్చు (సకర్మక క్రియ)

"అకారాది క్రమమున కూర్చుచున్నట్లున్ను" (ఉ)

నలుచు (అకర్మక క్రియ) = నలుపు (సకర్మక క్రియ)

"ఒంటి మన్ను నలిపి పెట్టడు" (అ.వ)

2) ప్రేరణార్థక క్రియా రూపాలు

అనిపించు : "అని అనిపించు కోవడం అత్తగారా నీ స్వభావం" (నిం.వ)

పుస్తకీకరించు : "ఎవరో ఒకరు ఎత్తి పుస్తకీకరించుకొన్నారు" (ఉ)

1.20. క్రియా విశేషణ రూపాలు

క్రియ యొక్క విశేషాన్ని తెలిపేది క్రియా విశేషణ రూపాలు.

1) సర్వనామ మూలక క్రియావిశేషణ రూపాలు

అక్కడ, ఎక్కడ : "ఎక్కడ పడితే అక్కడల్లా" (ఉ)

అప్పుడు : "ఆంధ్రపత్రికలో కూడా అప్పుడు ప్రకటితమయినది" (ఉ)

2) గా (కాన్) రూపాత్మక క్రియావిశేషణ రూపాలు

కథగా : "పనిలేని మంగలి కథగా ఉంది" (జా.వ)
మున్నుగా : "తడిమన్ను పొడిమన్నుగా తిరిగినాడు" (నిం.వ)

3) ధ్వన్యనుకరణ రూపాలు

కిచకిచ : "కోతుల కిచకిచ" (జం.వ)
బెకబెక : "కప్పల బెకబెక" (జం.వ)

4) ఇతరం

అట్లు : "వీపు విఱిగేటట్లు మోదాడు" (అ.వ)
అట్లు : "పొట్ట పగిలేటట్టు నవ్వాడు" (అ.వ)
వలె : "పందివలె పాకాడు" (నిం.వ)

1.21. పదకల్ప రూపాలు

1) ప్రశ్నార్థక పదకల్ప రూపాలు

నోరా? తాటిమట్టా? (నిం.వ), కడుపా? కల్లేపల్లి చెరువా? (నిం.వ) స్వర్గమా? మోక్షమా? (నిం.వ), ఎవరికి ఎవరు? (నిం.వ), వాడేమి (నిం.వ), ఇస్తావా? చస్తావా? (నిం.వ), వంకాయనాడు లేనిది టెంకాయనాడు వస్తుందా? (నిం.వ), చేతులు పొడుగని మూతులు పొడుస్తావా? (నిం.వ), పెట్టేవా? పోసేవా? (నిం.వ)

2) సందేహార్థక పదకల్ప రూపం

లోకమో ? పాడో (నిం.వ)

3) సముచ్చయార్థక పదకల్ప రూపం

ఉన్ను : "బాషా వాఙ్మయము చేస్తునట్టున్ను" (ఉ)
అకారాది క్రమమున కూర్చుతున్నట్లున్ను" (ఉ)

1.22. వాక్యాలు

వాక్యాల్ని సామాన్య, సంశ్లిష్ట, సంయుక్త వాక్యాలుగా వర్గీకరించవచ్చు.

1) సామాన్య వాక్యాలు :

"ఆయన బంగారు పిచ్చిక" (జం.వ)
"తలపండు పగిలింది" (అ.వ)

2) సంశ్లిష్ట వాక్యాలు

"ఏరు దాటి తెప్ప తగులవేస్తాడు" (నిం.వ)

"తోక తెగిన నక్కలా అరిచాడు" (జం.వ)

3) సంయుక్త వాక్యాలు

"ఏలేందుకు ఊళ్ళులేవుగాని ఎత్తుకు తినేందుకు లేకపోయినయ్యా!" (నిం.వ)

"భారతిలో పూర్వము నేను బాలభాష అనే పేరుతో అప్పుడప్పుడూ ప్రకటిస్తూ వచ్చిన వాటిని, నేను పుస్తక రూపముగా ప్రకటించవలెననుకుంటూ ఉండగానే అఱకొఱగా ఎవరో ఒకరు ఎత్తి పుస్తకీకరించుకొన్నారు.

1.23. జాతీయాలు

ఊరిబసివి, కప్పలతక్కెడ, కాట్లకుక్క, కూపస్థమండూకం, కొంగజపంగాడు, కొఱకురాని కొయ్య, గయ్యాళిగంప, గాడిదగ్రుడ్డు, గోడమీది పిల్లి, గోముఖ వ్యాఘ్రం, తల్లిచాటు బిడ్డ, తేనెపూసిన కత్తి, దరిద్ర దామోదరుడు, దేవాంతకుడు, నంగనాచి, నక్షత్రకుడు, నిరక్షరకుక్షి, నివురుగప్పిన నిప్పు, పక్కలోబల్లెం, పరమానందయ్య శిష్యులు, పల్లెటూరి గబ్బిలం, పానకంలో పుడక, పాముచెవులు, బెల్లం కొట్టిన రాయి, బొగ్గుల్లో రామచిలక, మెడచుట్టిన పాము, మేకవన్నె పులి, మేకపోతు గాంభీర్యం, మొండి శిఖండి, రామబాణం, రొమ్ములకుంపటి, వెన్నెల విసనకఱ్ఱ, శకునాలపక్షి, శనిగ్రహం, శుక్రాచార్యుడు, శుద్ధ బుద్ధావతారం, శ్రీరంగనీతులు, సవతి తల్లి ప్రేమ, సింహం మెడగంట (నిం.వ) మొదలగునవి.

1.24. సామెతలు

అటుపోతె గోడపెట్టు ఇటుపోతె చెంపపెట్టు, అతిరహస్యం బట్టబయలు, ఆడలేకపోతే మద్దెల వోడు, ఇంటికి జ్యేష్టాదేవి-పొరిగింటికి శ్రీమహాలక్ష్మి, ఇంట్లో వెంకంబట్లు-బయక కుంకంబట్లు, ఉన్నమాటంటే ఉందూరు అచ్చిరాదు, ఎగిరిపాటు ఎక్కువ, జరుగుపాటు తక్కువ, ఏరుదాటి తెప్పతగులవేస్తాడు, ఒకటే కొడుకుని గడ్డపారతో ముక్కుకుట్టిందట, కర్రలేని వాణ్ణి కరిచింది, కలిగే కర్మం లేకా దరిద్రం, కొత్తనీరు వచ్చిపాతనీరు కొట్టుకుపోయింది, గంతుకు తగిన బొంత, గారాల గజ్జల కేడిస్తే-వీపు దెబ్బలకేడుస్తుంది, చెట్టయి వంగనిది మానై వంగుతుందా?, త్వంశుంఠ అంటే త్వం శుంఠ, దంచినమ్మకు బొక్కినదేకూలి, నాలుక బెల్లము ఎదకత్తెర, నువ్వులూ నూనే ఒకటే తెలుకుల వాడే తేడా!, పందిరి ఇల్లవుతుందా?, పుట్టని బిడ్డకు పూల వరహాలు, పుణ్యానికి పోతే పాపం ఎదురు వచ్చింది, పులి పక్క జోరీగ, పైకి బొడబొడ లోపలికి లొడలొడ, పైకి పటారం లోన లొటారం, పొంగిందంతా పొయ్యిపాలు, మాటలు మదూళ్ళు దాట్టవి కాళ్ళు గడపదాటలేవు, ముందుంది ముసళ్ళ పండగ, మొండి గురోర్చండ శిష్యఃి, రాయి గుద్దేదేం? చెయ్యి కట్టేదేం?, లోకులు పలుకాకులు, వంకాయనాడు లేనిది టెంకాయనాడు వస్తుందా?, శుష్క ప్రియాలు శూన్య హస్తాలు, శెట్టి ఉన్న చోట పట్నం సర్వం జగన్నాథం, సూదివెనుక దారం (నిం.వ)

1.25. తిట్లరూపాలు

ఇందులో తిట్ల పదబంధాలు, వాక్యాల్ని క్రింద చూడవచ్చు.

1) తిట్ల పదాలు – పద బంధాలు

అన్న – 'పెద్దన్న', అమ్మ – 'దద్దమ్మ', కాడు – 'చిసింద్రీ గాడు', కాయ – 'శంఠకాయ', కాలము – 'పొయ్యే కాలము', కొడుకు – 'ముండాకొడుకు', కోరు – 'లుచ్చాకోరు', చండాలుడు – 'పరమ చండాలుడు', చీమ – 'కండచీమ', చోరు – 'భట్టాచోరు', జెట్టి – 'జెట్టానజెట్లు', దొంగ – 'గజదొంగ', పుట్ట – 'నిలువెల్లా బొంకులపుట్ట', ముండ – 'బండముండ', మొండి – 'పరమమొండి', రాముడు – 'దద్దిరాముడు', రాయుడు – 'డాబుల రాయుడు', వెధవ – 'త్రాగుబోతు వెధవ', ఇతరం – 'అధికప్రసంగి', అసంబద్ధ ప్రేలాపి ఏబ్రేసి, కుంక, గండరగండడు, గూడుపుఠాణి, ఛాఛా ఛీఛీ, తిక్కశంకరయ్య, దగుల్బాజీ, దున్నపోతు మహారాజులుంగారు, దేశదిమ్మరి, పత్తిత్తు, పిచ్చిపుల్లయ్య, పొట్టలో సున్న, పోరంబోకు, బడుద్దాయి, బోకి, ముండమోపి, ముక్కోపి, మొండిఘటం, యంబేద, అంకులాడి, వెఱ్ఱి వెంగళప్ప (నిం.వ) మొదలగునవి.

2) తిరగమోత తిట్ల రూపాలు

ఈ నుడికట్టు తిట్లరూపాలు తిప్పిరాసినా, చదివినా తిట్లరూపాలు తెలుస్తాయి
'తికో డేవా నసిరా' (నిం.వ) తిప్పి రాసినా, చదివినా 'రాసిన వాడే కోతి' అనే తిట్ల రూపం తెలుస్తుంది.
దడిగా డువా నసిరా (నిం.వ) 'రాసిన వాడు గాడిద' అన్న తిట్ల రూపం తెలుస్తుంది.

1.26. శాపనార్థరూపాలు

ఏ భాషలో అయినా తిట్లు, శాపనార్థాలు అత్యంత విలువైన రూపాలు. దుంపతెగ, తాడుతెగ, దాని ముండమొయ్య, దాని సిగ్గొయ్య, నీ కడుపుడక, నీ కడుపు కందవిత్తుగాను, నీ నోట్లో కరక్కాయ, నీ శ్రాద్ధం, నీ బొడ్డుపొక్క, నీ చావు నిచ్చావుగాను, నీ తలకాయ, నీ తాడూరేగ, నీ ఇల్లు నేలగట్ట, తస్సదియ్య, తస్సచెక్క, తస్సగొయ్య, ధూత్తేరే, పాడెగట్ట, దిష్టిపిడతలా తలకాయ నీవూను (నిం.వ) మొదలగునవి.

2) లేదు, లేడు, లేవు తోటి తిట్లరూపాలు

అతీగతీలేదు, అదుపూ ఆజ్ఞలేదు, ఛీ అంటే సిగ్గులేదు, దండించే దాతలేడు మర్దించే మామ లేడు, దయాధర్మం లేదు, దిక్కులేదు దిశలేదు, నీతి నియమాలు లేవు, న్యాయానికి కాలంలేదు, భయభక్తులు లేవు, పట్టపగ్గాల్లేవు, సిగ్గూలేదు ఎగ్గూలేదు (నిం.వ) మొదలగునవి.

3) చదువు, తెలివి, శక్తిపై తిట్ల రూపాలు

చదువు చట్టుబండలైంది, చదువులేదు, సంధ్యాలేదు, పాండిత్యం లేకపోయినా పలగాకి తనం ఉంది, ఓ అంటే నా రాదు, పొట్టపొడిచినా అక్షరం లేదు, తెలివి తెల్లవారింది, వీలుదంచలేవు, చేతావాతాగాదు (నిం.వ) మొదలగునవి.

1.27. ద్విరుక్త రూపాలు

పట్టపగ్గాలు (పగ్గాలు + పగ్గాలు) "పట్టపగ్గాల్లేవు" (నిం.వ), ఆయా (ఆ+ఆ)

"ఆయా వర్గములలో కూరుస్తున్నాను" (వ.వి), నూనూగు (నూగు+నూగు) "నూనూగు మీసాలు" (ఆ.వ) మొదలగునవి.

1.28. జంటరూపాలు

చీము సీద్రము 'చీము సీద్రము వదిలింది" (అ.వ)

సంధ్యా "చదువూ సంధ్యా లేదు" (నిం.వ), ఏడువులూ పెడబొబ్బలూ

ఇంటా వంటా "ఇంటావంటా లేని బుద్ధులు" (నిం.వ) మొదలగునవి.

శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రి భాషావిజ్ఞాన పరంగా రచించిన అత్యంత విలువైన వ్యాసం 'గాలికబుర్లు'లోని ప్రతి భాషా స్వరూపాన్ని సూక్ష్మ పరిశోధన కావించవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఈ వ్యాసరచన శ్రీ వేటూరి వారి దాదాపు ముప్పై ఏళ్ళ సేకరణ శ్రమ ఫలితం. ఆంధ్రులు గర్వించదగ్గ మన వేటూరివారి ఈ శ్రమ భావి భాషా పరిశోధకులకు మార్గదర్శకం. అత్యంత ఆచరణీయం.

ఉపయుక్త రచనలు

1. అనంత రామశాస్త్రి, నేతి – "శ్రీనాథ భాషా పరిశీలన"
2. చిన్నయసూరి, పరవస్తు – "బాల వ్యాకరణము"
3. ప్రభాకరశాస్త్రి, వేటూరి – "గాలి కబుర్లు"
4. బ్రౌన్, చార్లెస్ ఫిలిప్ – "తెలుగు–ఇంగ్లీషు నిఘంటువు"
5. రాధాకృష్ణ, గాలి – "తెలుగు భాషా వ్యాసాలు (1–2 సంపుటాలు)

* * *

11. ప్రజ్ఞా ప్రభాకరము
(శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రిగారు)

– డా॥ మాడుగుల అనిల్ కుమార్

కవి, పండితులు శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రిగారు కృష్ణాజిల్లా దివిసీమలోని పెదకళేళపల్లిలో 07 ఫిబ్రవరి 1888న జన్మించారు. పన్నెండవ యేటనే పద్యములల్లి "పూవు పుట్టగనే పరిమళిస్తుంది" అన్న నానుడికి ప్రతీకగా నిలిచారు శ్రీవేటూరివారు. పండితులు, కవి, పరిశోధకులు, బహుగ్రంథకర్త, బహుగ్రంథపరిష్కర్త, చరిత్రకారులు, విమర్శకులు, నాటక రచయిత ఐన శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రిగారిని గురించి తెలియని పండితులుండరు. ఎన్నెన్నో బృహత్తర గ్రంథాలను వెలికితీసి, పరిష్కరించి, ప్రపంచానికి అందించిన మహామనిషి శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రిగారు. అన్నమయ్య కీర్తనలు వింటూ, పాడుతూ ఇప్పుడు మనము సంతోషిస్తున్నామంటే వాటిని మన వరకు తెచ్చిన ఘనత ప్రభాకరశాస్త్రిగారికే దక్కుతుంది.

వీరి గురువులు తిరుపతి వేంకట కవులుగా ప్రసిద్ధి చెందిన జంటకవులలో ఒకరైన శ్రీ చెళ్లపిళ్ల వేంకట శాస్త్రిగారు. అవధాన విద్యలో పేరుప్రఖ్యాతులు గాంచినవారు తిరుపతివేంకట కవులు, రెండు సంవత్సరాల పాటు బందరులో శతవధాని చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారి శిష్యరికంలో ప్రభాకరశాస్త్రిగారు అష్టావధాన, శతవధానాలు నేర్చి నిష్ణాతులై విద్యార్ధిదశలేనే అష్టావధాన శతావధానాలు చేశారు. 1911లో పోలవరం జమీందారులు శ్రీరాజా కొచ్చెర్లకోట వేంకట కృష్ణారావు బహద్దూర్ వారు నడిపిన 'సరస్వతి' పత్రిక (జార్జి పట్టాబిషేక సంచిక)లో శాస్త్రిగారు పద్యాలున్నాయి. ఆ పద్యాల దిగువ "శతవధాని వేటూరి ప్రభాకరశాస్త్రి" అని ఉండటమే ఇందుకు నిదర్శనం. అటు పిమ్మట అవధానాలు చేయటం క్రమంగా ఆపివేసిన శాస్త్రిగారు సాహిత్యపరిశోధన, కవితా రచనలపైననే దృష్టి పెట్టారు. ఆ విధంగా పరిశోధనరంగంలో విశేషఖ్యాతినార్జించారు శాస్త్రిగారు.

ప్రభాకరశాస్త్రిగారు 1908 సంవత్సరంలో పదనెనిమిదేండ్ల ప్రాయంలో మద్రాసుకు చేరుకొన్నారు. అక్కడ తిరువళిక్కేణిలోని వెస్లీమిషను హైస్కూలులో పండితులుగా పని చేశారు. 22-9-1910 వ తేదిన మద్రాసు ప్రభుత్వ ఓరియంటల్ మేన్ స్క్రిప్ట్ లైబ్రరీలో లేఖకుడుగా పని చేశారు. అలా శాస్త్రిగారు ప్రాచ్య లిఖితపుస్తక శాలలో లేఖకుడుగా చేరిన కొన్ని మాసాలకే ఆ లైబ్రరీ క్యూరేటరు శాస్త్రిగారిని గూర్చి విని తెలుగు పుస్తకాలకు క్యాటలాగు వ్రాసే గుమాస్తా సెలవు పెట్టగా అందులో తాత్కాలికంగా నియమించారు. 1910 నుండి ముప్పై సంవత్సరాలు మద్రాసు ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారంలో శాస్త్రిగారు పండితులుగా పని చేశారు.

వేటూరి ప్రభాకర శాస్త్రిగారు 1939 డిసెంబరులో మద్రాసు ప్రభుత్వ ప్రాచ్య లిఖిత పుస్తకశాలలోని పండిత పదవి నుంచి పదవీవిరమణగావించి తిరుపతి శ్రీవేంకటేశ్వర ఓరియంటల్ రీసెర్చి ఇన్స్టిట్యూటు తెలుగు శాఖాధిపతిగా నియమితులయ్యారు. 1940 జూలై నెలలో తిరుమల తిరుపతి దేవస్థానమువారు

శ్రీవేంకటశ్వర ప్రాచ్య కళాశాలలో తెలుగు విద్వాన్ తరగతులు ప్రారంభించారు. అందువల్ల కళాశాలలో శాస్త్రిగారి సేవలు కళాశాలకు అవసరమయ్యాయి. అక్కడ వారు ఆంధ్ర శాఖాధ్యక్షులుగా నియమితులయ్యారు. 21-8-1945 సంవత్సరం నుండి పూర్తి కాలంగా పరిశోధన నిమిత్తంగా తి.తి.దేవస్థానములవారు శాస్త్రిగారిని రీడరు పదవిలో నియమించారు. దివంగతులయ్యే వరకు కూడ వారాపదవిలోనే కొనసాగారు.

శాసనాలను చదవడం, పరిశీలన చేయడమంటే శాస్త్రిగారికి మక్కువ ఎక్కువ. అమరావతీ శాసనంలోని "నాగబు" అనే పదాన్ని పరిశీలించి రెండువేల సంవత్సరాల క్రితమే తెలుగుభాషకు లిపి, వ్యవహారము ఉన్నట్లు గుర్తించారు. అలా తొలి తెలుగు పదము శాసనాల్లో గుర్తించిన కీర్తి శాస్త్రి గారికే దక్కింది. శాస్త్రిగారు తమ పరిశోధనలతో ఎన్నో శాసనాలను వెలికి తీశారు.

శ్రీనాథుని మొదలుకొని ఎందరో మహాకవుల చాటువులను సేకరించి, పరిష్కరించి "చాటుపద్య మణిమంజరి"గా ప్రభాకరశాస్త్రిగారు గ్రంథస్థం చేశారు. ఇది కాక క్రీడాభిరామం, శృంగారశ్రీనాథం, రూపక మంజరి, భాసుని ప్రతిమా నాటక అనువాదం, మీగడ తరకలు, ఆంధ్రకామందకం, గౌరీ కళ్యాణం మొదలైనవి కూడ వీరి రచనలే. వీటిలో పాటు వీరి రచించిన పలు గ్రంథాల పీఠికలు కూడా పుస్తకం రూపంలో వెలువడి ఉన్నాయి. నాటికలలో కర్ణభారం, నాగానందం మొదలైనవి ప్రసిద్ధి వహించాయి.

ఇంత మాత్రమే కాక వీరు గొప్ప యోగసాధకులు కూడా. మాస్టర్ సి.వి.వి. గారికి యోగవిద్యలో శిష్యులైన శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రిగారు "భృక్తరహిత తారక రాజ యోగము" అనే యోగవిద్యను బహుళంగా ప్రచారం చేశారు. భృక్తరహిత తారకరాజయోగవిద్యలో పలువురికి శిక్షణనిచ్చారు. యోగవిద్య ద్వారా యోగచికిత్స చేస్తూ ప్రభాకరశాస్త్రిగారు ప్రజ్ఞామయ పూర్ణజీవితాన్ని గడిపి 29-08-1950వ తేది తిరుపతిలో తమ భౌతికకాయత్యాగం చేశారు. సంగీత, సాహిత్య, నాటక, ఆధ్యాత్మిక రంగాలలో ఎంతో కృషి చేసి భావికాలపు పండితులకు బాటను సుగమం చేసిన శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రిగారు యావత్ ప్రపంచానికి ప్రాతఃస్మరణీయులు. శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రిగారు గురించి తెలియజేసి ఈ వ్యాసం టూకీగా మాత్రమే. వారిని గురించి సంపూర్ణంగా తెలియజేయవలెనన్నచో ఒక బృహద్ గ్రంథమే కాగలదు. గ్రంథవిస్తారభీతిచే విరమించడమైనది.

* * *

12. వేటూరి ప్రభాకరశాస్త్రి - ఉత్తరహరివంశ వ్యాఖ్య

- ఆచార్య బూదాటి వెంకటేశ్వర్లు

నేను హిమవన్నగాన్ని చూశాను. కాని పురాణాలలో తరచు ప్రసక్తమయ్యే మేరునగాన్ని చూడలేదు. అయినా నాకు చూడలేదన్న బెంగలేదు. ఎందుకంటే ప్రభాకరశాస్త్రిగారి చారిత్రక సాహిత్య పరిశోధనల్ని చూశాక, చూడని ఆ మేరునగం తెలుగు జాతికి వరమై ప్రభాకరుల రూపంలో వచ్చి కూర్చున్నదనిపించింది. వారొక సారస్వత అఖండ జ్యోతి.

'వెలుగు మరొక్క పేరఖిల విద్యలకున్ బరమార్థ భూతమై
వెలుగులుతన్ను మించి మఱి విశ్వమునందున వేఱు చోట లే
వలఘుఁడు శిష్యవత్సలుడు నంబుధిశోషణ దాహమూర్తి వె
ల్గుల నిధికిన్ గురూత్తమునకున్ జగదక్షునకు నమస్కృతుల్.

(రామాయణ కల్పవృక్షం, సుందరకాండ పూర్వరాత్ర ఖండం 2వ పద్యం)

అని విశ్వనాథ వారు సుందరకాండలో హనుమనోట పలికించిన ఆ సూర్యస్తుతిని విన్నప్పుడల్లా అది ప్రభాకరుల వారిని ఉద్దేశించి చేసిన స్తుతియా? అనిపిస్తుంది. తపస్సంపన్నులు, ప్రజ్ఞాపూర్ణులు, వసుధైక కుటుంబంగా జీవితాన్ని గడిపినవారు, ప్రభాకర గురుదేవులు. ఆధ్యాత్మికసిద్ధి, అమృతసిద్ధి, యోగశక్తిగల పుణ్యపురుషులు.

గ్రంథ పరిష్కర్తగా ప్రభాకరులు మధ్యందినమార్తాండులు. ఎన్నెన్ని పరిష్కరణలు! అన్నమయ్య కీర్తనలు గాక దాదాపు 33 గ్రంథాలను పరిష్కరించినట్లు తెలుస్తోంది. 'వాఙ్మయేతిహాసారామ వాటికలను పర్యటించు పరిష్కార పంచశరుడు' అని ప్రభాకరులవారినుద్దేశించి యస్వీ జోగారావుగారన్నమాట అక్షరసత్యం.

పరిష్కరణమంటే మాటలా? శబ్దశాస్త్రం, నిఘంటు పరిజ్ఞానం, ఛందస్సు - ఇవన్నీ తెలియటంతో పాటు శిథిలపూరణ మూహించగల ప్రజ్ఞ ఉండాలి. మూలకర్త శైలిని పట్టుకోగల వివేకముండాలి. ఇవన్నీ ఏకత్రమూర్తీభవించటం వలననే ప్రభాకరులు అలవోకగా అన్ని గ్రంథాల్ని పరిష్కరించారు.

పరిష్కర్తగా వేటూరి వారికున్న వాసి, వ్యాఖ్యాతగా రాలేదు. కారణం వారి వ్యాఖ్యాన ప్రతిభను చాటే గ్రంథాలు వెలుగు చూడకపోవటమే. ఉత్తర హరివంశానికి ప్రభాకరులవారు రాసిన వ్యాఖ్యానం వంటిదే కుమార సంభవానికి కూడా రాశారని చెపుతారు. ప్రభాకరుల వారు రాసిన 36 పద్యాల వ్యాఖ్యను త్రిలింగ పత్రికలో తిమ్మావజ్ఝల కోదండరామయ్యగారు ప్రకటించారు.

వ్యాఖ్యానమగానే -

"పదచ్ఛేదః పదార్థోక్తిః విగ్రహో వాక్యయోజనా
ఆక్షేపశ్చ సమాధానం వ్యాఖ్యానం పంచలక్షణం"

అన్న శ్లోకం స్ఫురిస్తుంది. పదచ్ఛేదం, ప్రతిపదార్థం, సమాసపదాలకు విగ్రహవాక్యాలు చెప్పటం, చెల్లాచెదురుగా ఉన్న విశేషణ విశేష్య పదాలను ఒక క్రమంలో, కారకానుకూలంగా, వాక్య స్వరూపంగా సమకూర్చటం, ఆక్షేపాలకు సమాధానం చెప్పటం అనే అయిదు లక్షణాలు ప్రధానంగా చెపుతారు.

అయితే వీటిలో ఛందస్సు, అలంకారం, రసం మొదలైన కవిత్వాంశాలకు ప్రమేయం కనిపించదు. అలాగే కథనశిల్పం, పాత్రచిత్రణ, కల్పనా విశిష్టత మొదలైనవి ఈ లక్షణాలలో కనిపించవు. అలాగని వాఖ్యానాల్లో ఈ అంశాలు ప్రస్తావించబడ లేదని అనలేం. రససామగ్రి, భావోదయాలు మొదలైనవి వివరించిన వాఖ్యానాలూ లేకపోలేదు. రసానుభూతి పాఠకునికి సంబంధించినదయితే వివేచన వ్యాఖ్యాతది.

సమగ్రవ్యాఖ్య అంటే ప్రతిపదార్థ తాత్పర్యాలతో పాటు విశేషాంశాలనన్నిటినీ సమగ్రంగా చెప్పటం, అవసరమైన పద్యాలకు లక్షణ నిర్దేశాలివ్వటం, అతిముఖ్యమైన శబ్దాలకు రూప నిష్పాదన ప్రక్రియ వివరించటం, అలంకారం నిర్ణయించటం, మంత్ర-యోగ-నాట్యశాస్త్ర విషయాలు, పౌరాణిక భౌగోళిక చారిత్రక వివరాలు, స్థానిక విషయాలు, పదపాద పద్య సంవాదాలు, పూర్వ కవితా చర్వణ పురస్కారాలు, సమాజ భూయిష్టాలైన సుదీర్ఘ వచనాలకి భావాలు అతి సరళంగా సంతరించటం వంటి విశేషాంశాలతో కూడిన వ్యాఖ్యను ఉత్తమ వ్యాఖ్యానమని పండితులు పేర్కొన్నారు. ఇది కేవల టీక, టుప్పీక, పంజిక, టిప్పణి కంటే భిన్నమైనవి.

ప్రభాకరుల వ్యాఖ్యానంలో ప్రధాన గుణం పాఠ పరిష్కరణ. చాలామంది వ్యాఖ్యానకారులలో పాఠనిర్ణయం చేసి వ్యాఖ్యానించటం చాలా తక్కువగా కనిపిస్తుంది.కాని ప్రభాకరుల వారి విషయంలో అది కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. వారి వ్యాఖ్యాన పద్ధతిని గమనిస్తే సాధుపాఠ నిర్ణయంతో పెనవేసికొని వ్యాఖ్యానం సాగినట్లు అనిపిస్తుంది.

'అలికంబున నక్షిడాచిన సర్వజ్ఞుని'గా పేరుకెక్కిన నాచన సోమనాథుని ఉత్తర హరివంశం ఒక కొరకరాని కొయ్య. దీనిని మొదట 1913లో వావిళ్ళవారు ఆది సరస్వతీ ముద్రాక్షరశాల (తండయార్పేట, మద్రాసు) లో ప్రచురించారు. ఆ పిదప ప్రభాకరశాస్త్రి గారి పీఠికతో 1937లో ప్రచురించారు. ప్రభాకరులు తంజావూరి సరస్వతీ మహల్‌లోని రాత ప్రతులను చూచి పాఠభేదాల్ని తయారు చేసుకున్నట్లు తోస్తుంది. వీరేశలింగంగారి ప్రతి (1857), బహుజనపల్లి సీతారామాచార్యుల వారి ప్రతి ఒకే తీరుగా ఉన్నాయని, రెండింటిలోనూ ప్రథమాశ్వాసం లేదని, మదరాస్ ఓ.ఆర్.ఐ.లోని తాళపత్ర ప్రతితో పోల్చి వావిళ్ళవారికి ఈ ముద్రణను సమకూర్చి పెట్టారు. ఈ అనుభవమే ఉత్తర హరివంశ వ్యాఖ్యానానికి ప్రేరేపించి యుండవచ్చు.

ప్రభాకరులవారు నాచనసోముని కాలనిర్ణయంలోను 'శాసనపరిష్కరణ' ద్వారా ప్రామాణికతను చూపారు. నాచనసోమునికి సంబంధించి లభిస్తున్న ఏకైక శాసనం పెంచుకలదిన్నె శాసనం. అందులో కాలాన్ని నిర్ణయించే పదాల దగ్గరే శాసనాక్షరాలు అరిగిపోయి సందిగ్ధంగా గందరగోళాన్ని కల్పించాయి. "అలంకృత శకస్యాబ్దే రసర్తు నయనేందుభిః" - అన్న పాఠంలో 'రసర్తునయనేందుభిః' - అంటే ఆరు

రసాలు, ఆరు ఋతువులు, రెండు కళ్ళు, ఒక చంద్రుడు ఉన్న శకాబ్దులని అర్థం. అంటే శాలివాహనశకం 1266 (క్రీ.శ.1344). ఈ శాసనంలో సందిగ్ధత కలిగించే 'రసర్తు నయనేందుభిః' – పాఠాన్ని 'రసాభ్రనయనేందుభిః' – అని కొందరు స్వీకరించారు. అప్పుడు ఆరు రసాలు, ఒక ఆకాశం, రెండు కళ్ళు, ఒక చంద్రుడు అంటే శా.శ.1266 (క్రీ.శ.1284) అవుతుంది. ఇంకొందరు 'రసభూనయనేందుభిః' అన్నారు. అప్పుడు క్రీ.శ.1216 అవుతుంది.

ఇటువంటి సందర్భంలో కాల నిర్ణయాన్ని ఎలా చేయాలి? ఈ సమస్యను ప్రభాకరులవారు పరిష్కరించిన తీరును చూడండి. ఈ పై కాలాలలో క్రీ.శ.1284 నాటికి, సోముని పోషించిన బుక్కరాయలు జన్మించలేదు. విద్యానగరం అప్పటికి నిర్మాణమే కాలేదు. క్రీ.శ.1216 అంటే శాసనంలో దానకాలంగా చెప్పబడిన 'తారణ' ఈ సంవత్సరం కాదు కాబట్టి క్రీ.శ.1344ను ఆమోదయోగ్యంగా తర్కబద్ధంగా శాసనకాలంగా నిర్ణయించి 'రసర్తు నయనేందుభిః' – పాఠమే సరయిన శాసనపాఠంగా పరిష్కరించి చెప్పారు. విద్వజ్జనులు ఆ పరిష్కారాన్ని ఆమోదించారు.

ఉత్తరహరివంశం కావ్యానికి వేటూరి ప్రభాకరశాస్త్రిగారు మూడాశ్వాసాలకే వ్యాఖ్యానం రాశారు. వారి వ్యాఖ్యాన పద్ధతి వేరు. ఆశ్వాసానికి ముందు కథాంశాలను, శీర్షికలుగా ఉంచడం, అవసరం అనుకొంటే సంస్కృత మూలాల్నివ్వడం, వాటి మంచి చెడుల పరామర్శ, పరిశిష్టం అనే పేరుతో మరికొన్ని వివరాలను ఇవ్వడం, పాఠభేదాలను చూపడం, సాధుపాఠాన్ని నిర్ణయించడం, అవసరమయినచోట పద్యాన్ని సవరించడం, భాషా శాస్త్ర దృష్ట్యా ఇతర భాషలతో పోల్చి పదచర్చ చేయడం, రస, భావ, ఛందో వ్యాకరణాదులను వివరించడం వేటూరి ప్రభాకరశాస్త్రి గారి వ్యాఖ్యాన విధానం. ఇతర శాస్త్రాలకు సంబంధించిన విశేషాలను అవసరమైన చోట మాత్రమే ప్రస్తావిస్తారు తప్ప, పాండిత్య ప్రదర్శన చేయరు. మల్లబంధవిశేషాలను, కోటనిర్మాణ సంబంధ విశేషాలను, ఆయుధ విశేషాలను, ద్యూత క్రీడా విశేషాలను ప్రభాకరశాస్త్రిగారు వివరించిన తీరు వ్యాఖ్యాతలకు మార్గదర్శకమనిపిస్తుంది. సంస్కృతహరివంశంతో పోల్చి అవసరమైనచోట్ల మూలంలోని శ్లోకాలను పేర్కొంటూ ఔచిత్యాన్ని చర్చించారు. మరికొన్ని చోట్ల ఎర్రనగారి హరివంశంతో పోల్చి ఎర్రన, నాచన సోమన తారతమ్య వివేచన కూడా చేశారు.

ఉదాహరణకు నరకవధ సందర్భంలో విల్లందుకొని శ్రీకృష్ణునికి సాయపడిన సత్యభాను శ్రీకృష్ణుడు కౌగలించుకొని, తన కంఠాభరణాన్ని కానుకగా యిచ్చాడు. అప్పటి ఆ సందర్భాన్ని వ్యాఖ్యానిస్తూ నాచన సోముడు చెప్పిన ఈ క్రింది పద్యానికి ప్రభాకరులవారు చేసిన ఈ వ్యాఖ్యానాన్ని గమనించండి. వారి వ్యాఖ్యానపు తీరు ఎలాంటిదో చెప్పకుండానే తెలుస్తుంది.

ఉ॥ ఏఁచు నుపేంద్రునిం బదక మిమ్మని రుక్మిణి మున్ను, దేవుఁడుం
బూఁచిన పూఁపు దప్పుటకుఁ బోకులఁ బోపుచునుండు నమ్మెయిన్
దాఁచిన సొమ్ము చేరె నిచటన్ మదిఁగోరని సత్యభామకున్
నోఁచిన వారి సొమ్ములవి నోమని వారికి వచ్చునే ధరన్.

వ్యాఖ్య: ఇంతకుముందు రుక్మిణీదేవి శ్రీకృష్ణుని పదకముఁదనకీయవలసినదని వేధించుచుండెను. శ్రీకృష్ణదేవుఁడును ఆమెను (పదకము కావలెనని) పూనిన పూనికి నుండి తప్పించుట కేవేవో పన్నుగడలు పన్నుచుండెను. ఈ విధముగా శ్రీకృష్ణుఁడా పదకము నన్యాయత్తము గాకుండఁదాఁచి యుంచుకొనెను. అట్టి యాసొమ్ము నేఁడు ఇచటన్ యుద్ధరంగమున, సత్యభామ తాను గోరకుండనే కోరి శ్రీకృష్ణుడీయఁగా పారితోషికముగాఁ బడయఁగల్గినది. ఆ పదక మామె మనస్సున నేని కోరకుండఁగనే కంఠమున వచ్చిపడినది. లీలా పరిరంభపు మహావైభవముతో ఆహా! నోఁచిన వారి సొమ్ములు నోమని వారికి రావు గదా! ఆ సత్కారము పడయుటకు రుక్మిణి నోఁచుకో లేదు గాన యామె కది దక్కలేదు. సత్యభామ నోఁచుకొన్నది గానయామె కది దక్కినది.

ఈ పద్యమున 'నోఁచిన వారి సొమ్ములవి నోమని వారికి వచ్చునే ధరన్' అన్న యర్ధాంతరన్యాసపుఁ దుదిచరణము సమస్య యనఁదగినది. నాచన సోమనాథుఁడే యీ సమస్యను దనకుఁబూర్వకాలముననే యున్నదాని నిట్లు గ్రంథప్రసక్తిలోఁ బూరించి యుండుననుకొనఁదగినట్లున్నది. సోమనాథునకుఁ బూర్వకాలముననే మైలమ భీముని ప్రశంసగా నీ చరణమే సమస్యయై పూర్తిఁ జెందినది. తత్కర్త వేములవాడ భీమకవియని పాత వ్రాతలఁబట్టి యైతిహ్యములఁ బట్టి గుర్తింపనగు చున్నది. వేములవాడ భీమన మైలమ భీమన ప్రశంసగా రచించినట్లు ప్రతీతిగన్న పద్యములలో కొన్నింటి చాయలు మన సోమన హరివంశమునున్నవి. ఇదివఱకిట్టి దొక్కటి చూపితిని. ఇప్పుడీ చూచుచున్నది రెండవది. ఇంకొకటి ముందు రానున్నది.

ఉ॥ యాచకఖేచరుండు సుగుణాంబుధి మైలమ భీముఁడీల్గినన్
జూచి వరించె రంభ యెడఁ జొచ్చెఁ దిలోత్తమ, వారి నిద్దఱన్
ద్రోచె ఘృతాచి, ముగ్గురకు నుద్దడి కయ్యముపుట్టె, నింతలో
నాచకుపోయె ముక్తసతి నవ్వీరియిదైసఁ జూచినిర్జరుల్
నోఁచిన వారి సొమ్ములవి నోమని వారికి వచ్చునే ధరన్?

ఈ పద్యమున నర్ధానుస్వారప్రాస సంగతి తొలగినది.

ఇట్టి పద్యమే యింకొకట తాళ్ల ప్రొద్దుటూరి శాసనములో నున్నది.

చ॥ ఇల గజతాపి ఖడ్గమున నీల్గిన వీరుని రంభవుచ్చుకో
దలఁచినఁ దూర్పుదిక్కున ఘృతాచి గిసుక్కునఁదుమ్మె నంతలో
పలఁ జనుదెంచె వాని కులభామిని, నింగి పథంబునందు ని
ష్ఫలతకు రంభయు న్వెలఱువాఱిన నవ్వీరి దోడికామినుల్.

శాసన పద్యమణిమంజరి (91) పుట.

నా చూచిన వ్రాతప్రతులలోఁ బయి పద్యముఁ బయితీరున నున్నది. ఒక ప్రతిలో 'ఏచెనుపేంద్రునిన్' అని పాఠమున్నది. శ్రీరామకృష్ణకవిగారీ పద్యము ఈ క్రింది విధంగా ముద్రించిరి.

ఉ॥ ఎంచిన ప్రేమ నీ పదకమిమ్మని రుక్మిణి మున్ను వేఁడుడున్
బూంచిన పూఁపుదప్పఁ బలుపోకలఁ బోవుచునుండు దేవుఁడున్
దాంచిన సొమ్ము చేరె నకటా! మదిఁ గోరని సత్యభామకున్
నోంచిన వారి సొమ్ములవి నోమని వారికి వచ్చునే యిలన్?

(కుమారసంభవ ప్రథమ ముద్రణ పీఠిక)

దీనిని శ్రీ వీరరాజుగారు ఏఁచిన, పూఁచిన, దాఁచిన, నోఁచిన గా మార్చి యిది యే సరియయిన పాఠమని యీ క్రింది తీరున వ్రాసిరి; "ఏఁచిన ప్రేమ = బాధించుచున్న ప్రీతిచేనని యర్థము, (ఈ బాధించునది పదకముపై ప్రేమ) పదకమునందున్న యాసక్తి నన్ను బాధింపఁగా నని భావము. ముద్రిత గ్రంథములలోని "ఏఁచునుఁబ్రేమన్" (వీరేశ ప్రతి) ఏఁచునుపేంద్రునిన్ (వావిళ్ళ ప్రతి) అను పాఠములు సోమనాథుని శబ్దాలంకార నియమమునకు (ఏఁచిన, పూఁచిన, దాఁచిన, నోఁచిన అను క్రమమునకు) భంగకరములు గావున నసంగతము. కావున 'ఏచిన ప్రేమ' అని యుండఁదగును అని వ్రాసిరి. కాని యీ క్రింది కారణములచే నేను గ్రహించిన పాఠమే సరియయినదని తలఁచుచున్నాను.

1. శ్రీరామకృష్ణ కవిగారి పాఠము నేను జూచిన వ్రాతప్రతులందుఁ గానరాలేదు. నేను ప్రకటించిన పాఠమే ఉన్నది.

2. కవిగారి పాఠములో ఇమ్మొయిన్ దాఁచిన సొమ్ము అన్న వాక్య సంఘటన సౌందర్యము చెడును. ఇట్టెన్నో పోకలుపోయి రుక్మిణికి యియ్యక దాఁచిన ధనము అన్న యర్థమేర్పడదు గదా?

3. ఏఁచిన ప్రేమ యనుటకు వీరరాజుగారు చెప్పిన యర్థము క్లిష్టార్థము. కవి గారి పాఠమేయిది గాన దానఁగల కొఱఁతలు దానను గలవు. వీరరాజుగారు ప్రాసనియమ సంరక్షణమే పరమార్థముగాఁ గొనిరి. కాని

4. నాచన సోమనాథుఁడీ ప్రాసనియమమునుఁ బెక్కుచోట్ల నజ్ఞీయమము తప్పునట్లు ప్రయోగించియే యున్నాఁడు. మాదిరికిఁ గొన్ని చూపుచున్నాఁడను:

క॥ తెండను.. ఖండిత, తెం డను, తెండను, 1. ఆశ్వా. 105 ప.
క॥ అమరారి– కొమరారి, తిమిరారి, ఎత్తి మురారి 1. ఆశ్వా. 180ప.
క॥ తనయునికిం, తన యునికిం, వనజోదర, కనుఁగొని
చ॥ ఎద్రిచిన, పద్రిచిన, విద్రుపగ, చిద్రుపలు, 4 ఆశ్వా 109 ప.
క॥ దానము, జ్ఞానము, పానము, దానఁగదా 4 ఆశ్వా 113 ప.
క॥ మానితి, మానితి, పూనితి, నేనేయుఁడు 4 ఆశ్వా 185 ప.

ఈ తీరున ద్విప్రాసాది నియతిలో నజ్నియమము సరిగా పాటింపక పోవుట యీ కవిరచనలో ననివార్యమే కాని యర్థస్వారస్య విశేషము కలదియు ప్రాఁత వ్రాఁతప్రతులలో నున్నదియునగు పాఠమునే నేను గ్రహించినాను. కవిగారి పాఠము చొప్పున వీరరాజు గారి సంస్కరణము చొప్పున బద్యమిట్లుండును.

ఉ॥ **"ఏఁచిన ప్రేమ నీపదకమిమ్మని రుక్మిణిమున్ను వేఁడుడుం**
బూఁచిన పూఁపు దప్పఁబలు పోకులఁ బోవుచు నుండు దేవుఁడున్
డాఁచిన సొమ్ము బేర్మినకటా మదిఁగోరని సత్యభామకున్
నోఁచిన వారి సొమ్ములవి నోమని వారికి వచ్చునే ధరన్".

విశే: ఉపేంద్రుఁడు: ఉపేంద్ర ఇంద్రావరజః – అని అమరకోశము. వామనావతారమున మహావిష్ణువు ఇంద్రునికి తమ్ముఁడుగాఁ బుట్టెనని పురాణగాథ. కాని, హరివంశమున ఉపేంద్ర శబ్దమునకు విభిన్నమగు వ్యాఖ్య కానవచ్చుచున్నది.

"మమోపరి యధేంద్రస్త్వం స్థాపితో గోభిరీశ్వరః
ఉపేంద్ర ఇతి కృష్ణస్త్వాం గాయంతి దివి దేవతాః"

అనగా ఇంద్రుని పైన ఇంద్రుఁడని అర్థము – (ఇంద్రస్య) ఉపరి + ఇంద్రః = ఉపేంద్రః

అలం: అర్థాంతరన్యాసము. కోరిన రుక్మిణికి పదకము లభింపకపోవుట, కోరని సత్యభామకు లభించుట యను విశేష వాక్యార్థము నోఁచిన సొమ్ము అను సామాన్య వాక్యార్థముతో సమర్థించఁ బడినది. "ఉక్తిరర్థాంతరన్యాసః స్యాత్సామాన్య విశేషయోఃు" – అని లక్షణము. కోరినను ఇష్టార్థము సిద్ధింపలేదు. కోరకయే ఇష్టార్థము సిద్ధించినది. అనుట వలన విషమాలంకారము. ఇది అర్థాంతర న్యాసమునకు అంగము.

ప్రభాకరులవారి ప్రాకృత భాషాజ్ఞానము కూడా అపారమైనది. చదరంగపు పరిభాష దాదాపు ప్రాకృతంనుండే తెలుగులోనికి వచ్చింది. శ్రీకృష్ణుడు తన దేవేరులతో పాచికలాట ఆడే సందర్భంలోని పద్యాన్ని వ్యాఖ్యానిస్తూ, పద్యాన్నే పూర్తిగా సవరించవలసి ఉందని చెప్పి చేసిన ఈ పద్య వ్యాఖ్యానాన్ని గమనించండిఫ

కం॥ **అత్తీవం చ తిగ దుగయు**
సత్తా దచ్చొక వంచి చౌవం చీరై
దిత్తిగ యిద్దుగ బద్రలు
చిత్తంబునఁ దలఁచినట్లు చేతికిఁ దెచ్చున్. (ఉత్తర హరివంశం 3-121)

ఈ పద్యపు పాఠనిర్ణయము, అర్థనిర్ణయము చిక్కు గూర్చినది. ఆనాటి యాట తీరు, పందెముల పద్ధతి, పరిభాషాపదములు, నేఁడు మనకుఁ దెలియరావు. ఇప్పటి యాట తీరును బట్టియు, సోమననాఁటికించుమించు కాలము వారగుకవుల రచనలలోని జూదపు వర్ణనలఁబట్టియు గుర్తింపఁదగినంత గుర్తించి యిది వ్రాయుచున్నాను.

నేఁడు సొగటాల 'దాయకట్టు' – అని పేర్కొనఁబడుచున్న యాటలో పాచికలు రెండుండును. ఆరెంటను 1, 1, 3, 3, 4, 4, 6, 6 బొట్టులుండును. కొందఱు 1, 1, 2, 2, 3, 3, 6, 6, బొట్టులుండు పాచికలను వాడుటయు కలదు. తొలితీరే మిక్కిలి వ్యాపకముగా నున్నది. శబ్దరత్నాకరకారులు, తొలితీరునే బద్రలు అను పదాలయర్థము వ్రాయుచో వివరించిరి. కాని, మరల, 'సత్తా' అర్థము వ్రాయునప్పుడా తొలి వివరణమును త్యజింపవలసిన దని చివర జెప్పిరి.

1,1,3,3,4, 4, 6, 6 బొట్లతీరు చొప్పునఁజూడఁగా పందెములు తొమ్మిది తెఱఁగులఁబడును. ఆ తొమ్మిదియునివి. 1,4,5,7,8,9,10,12 పై పద్యమున ఈ సంఖ్యలే యున్నట్లు గుర్తింపనగును.

అత్తీవంచ = ఆ+తీవంచ, తీ= మూఁడు, పంచ, ఒకటి, మూఁడు నొక్కటి – అనగా నాలుగు, పంచ, వంచి, రూపాంతరములు – ఈ రూపాంతరములు, పండితారాధ్య చరిత్ర గ్రంథభాగమును జూచినఁ దెలియును.

ఇత్తిగ= ఇరు+తిగ, రెండు మూళ్లు ఆరు –

దుగ= రెండు; సత్తా= ఏడు; దచ్చొకవంచి= ద్విచతుష్క పదభావము దచ్చొక, అనఁగా నెనిమిది మీద; పంచ= ఒక్కటి; వెరసి తొమ్మిది; చౌవంచి= నాలుగున్నొక్కటి; అయిదు; ఈరైదు= పది; ఇత్తిగ= ఇరు+తిగ= ఆఱు పద్యమున రెండవ సంఖ్య 'యద్దుగ' వచ్చినదిగాన యిక్కడ బద్రలు= పంద్రెండు, భద్రలు కూడనుండును.

అత్తీవంచినుండి బద్రలు దాక నొకటే ద్వంద్వ సమాసము. ఈ సంఖ్యలను చిత్తంబునన్ తలఁచినట్లు, చేతికిన్= (పందెమునఁబడునట్లు) పందెమువేయు చేతికి, తెచ్చున్.

ఇందు 4,6,2,7,9,5,10,8,12 అనే పందెపు సంఖ్యలన్నియు వచ్చినవి.

ఒండెఁబద్యమిట్లుండఁదగును.

క. ఇత్తీవం (8) చిత్తిగ (6) దుగ (2)
సత్తా (7) దచ్చొకవంచి (9) చౌవంచీ (5) రై (10)
దత్తుగ నిత్తిగ భద్రలు
చిత్తంబునఁదలఁచినట్టు చేతికిఁ దెచ్చున్

క. ఇత్తీవంచ, చవుక, దుగ
(ఇత్తీవం, చిద్దుగ, దుగ)
సత్తాదచ్చొకవంచి, చౌవం, చీరై
దత్తుగ నిత్తిగ భద్రలు
చిత్తంబునఁ దలఁచినట్లు చేతికిఁ దెచ్చున్.

పై బాఠముండఁదగుననుకొందును. అర్థము పై పాఠముల కన్నింటికిని సమానమే.

ఈ ఘట్టమున నుపయోగింపబడిన ద్యూతపరిభాషా పదములు ప్రాకృత పదములు. ఇట్లే యింతకుముందు వచ్చిన మల్లయుద్ధపరిభాషా పదములను ఇంకను సంగీత నృత్త పరిభాషా పదములు, దేశీ ప్రబంధనామ పదములు, గణితపరిభాషా పదములును బ్రాయికముగా ప్రాకృత పదములే. ఇవియెల్ల నిన్ననేఁడు వ్యవహారమునకు వచ్చినవిగావు. చాళుక్యరాజుల పరిపాలన కాలమునుండి కూడ వ్యవహారముననుండినవి. బృహద్దేశి, మానసోల్లాసము, సంగీత చూడామణి, నృత్తరత్నావళి, శివతత్త్వరత్నాకరము, మొదలగు గ్రంథములిందుకుఁదార్కాణ – శాతవాహనులు ప్రతిష్ఠాన నగరమును గైకొని, యాంధ్రకర్ణాట మహారాష్ట్ర దేశములు పాలించు కాలముననుండి యీ పరిభాషా పదములు వ్యాప్తిఁబడసియుండబోలును. ఇది సంస్కృతమునలేని పద్యమే.

ఇలా గమనించి చూచినప్పుడు ప్రభాకరులవారి వ్యాఖ్యలో

1. 'పాఠకమిత్ర' వ్యాఖ్యానపద్ధతిలో తాత్పర్యం చెపుతూనే కఠిన పదాలకు అర్థాన్నివ్వటం.
2. అలంకార నిర్ణయం చేయటం.
3. శబ్దాల సాధుత్వాన్ని గురించిన చర్చ అవసరమైన సందర్భాలలో మాత్రమే చేయటం
4. కొన్ని శబ్దాల మూలరూపాదుల్ని చెప్పటం

   ఉదా: 'గండారపు బొమ్మ'లోని 'గండరువు' శబ్దం గంధారము > గండారో అని చెప్పటం
5. పాఠాంతరాలతోపాటు, అవసరమైన చోట్ల మూల పద్యం లోని తప్పు నిరూపించి సరయిన పాఠాన్ని చెప్పటం.

   ఉదా: (2ఆ. 2–166)
6. సంస్కృత హరివంశ మూలాన్ని, ఎఱ్ఱనగారి హరివంశాన్ని సరిపోల్చి చెప్పటం
7. పూర్వ పరిష్కర్తల పాఠాలతో పోల్చి పాఠాంతరాల్ని చర్చించటం
8. వచనంలోని అఖండ వాక్యాల్ని, వర్ణనాశబలతను చిన్న చిన్న విభాగాలుగా చేసి తాత్పర్యాన్ని సుబోధకం చేయటం.
9. పాండిత్యస్ఫోరకంగానో, ప్రదర్శకంగానో గాక విషయ వివరణ చేసేదిగా ఉండటం.
10. పదప్రయోగ ఔచితిని చర్చించటం, అవసరమైచోట్ల నిఘంటు ప్రమాణాన్ని చూపటం.
11. అవసరమైన చోట్ల సాంస్కృతిక వికాసాదుల్ని వివరించి చెప్పటం.

ఇలా కావ్యాన్ని పరిపూర్ణంగా సాక్షాత్కరింపచేసే సరస్వతి సాక్షాత్కారం వేటూరి వారి వ్యాఖ్యానం.

* * *

13. ప్రభావ ప్రభాకరుడు

– ఆచార్య జక్కంపూడి మునిరత్నం

తే.గీ. అన్నమయ్యా! యనెడు వారి కన్నమిడుచు
ఆదరించెడు హరిభక్తు నమల చరితు
తాళ్ళపాకన్నమాచార్యు ధన్యతముని
ప్రస్తుతించెద సద్భక్తి ప్రస్ఫుటింప

తాళ్ళపాక అన్నమాచార్యుడు ఆంధ్ర పదకవితా పితామహుడుగా అభినుతికెక్కాడు. అనుపమ హరిభక్తుడిగా ఆనందనిలయుని అంతరంగానికెక్కాడు. మహిమలతో మానవుల మనసులకెక్కాడు. తన రచనలతో తరువాతి వారిని ప్రభావితం చేశాడు. ఒక్క మాటలో చెప్పాలంటే తన ప్రతిభాప్రభావ ప్రభను దశదిశలా వ్యాపింప చేశాడు.

అన్నమయ్య ఇంటిపేరేగాక ఊరిపేరుకూడా తాళ్ళపాకే. నందవరీక బ్రాహ్మణ కుటుంబంగా వీరికుటుంబం ప్రసిద్ధికెక్కింది. మొదటవీరిది వైదికకుటుంబం. అన్నమయ్యతో వైష్ణవ కుటుంబంగా వాసికెక్కింది. వీరది ఋగ్వేదశాఖ, ఆశ్వలాయన సూత్రం. భారద్వజస గోత్రం. తల్లి లక్కమాంబ. తండ్రి నారాయణ సూరి.

అన్నమయ్య బాల్యం తిరుమలయ్య భక్తితోనే దినదిన ప్రవర్ధమానమైంది. జన్మంతా అనుపమ అపారభక్తితో వేంకటేశ్వరుని సేవించి, వినుతించి వినుతికెక్కిన మహాపురుషుడీయన శ్రీవేంకటేశ్వరాంకితంగా 32 వేల సంకీర్తనలు వెలయించి ముక్కోటి దేవతలను ముక్కుమీద వేలెట్టు కొనేట్టు చేశాడు. నన్నయ తెలుగు సాహత్యానికి శ్రీకారం చుడుతూ తెలుగు వ్యాకరణాన్ని 'ఆంధ్ర శబ్ద చింతామణి' అనే పేరుతో సంస్కృతం లోనేరచించాడు. అదే విధంగానే సలక్షణాంధ్ర సంకీర్తనకు శ్రీకారం చుడుతూ అన్నమయ్య కూడా సంస్కృతంలోనే సంకీర్తన లక్షణం వెలయించడం గమనార్హం. పన్నెండు శతకాలీ మహనీయుని మధుర రచనలు. అయితే వేంకటేశ్వర శతకం మాత్రమే ఇప్పటికి మిగిలింది. అన్నమయ్య శృంగార మంజరి కూడా ప్రస్తుతం వ్యాప్తిలో ఉంది. ద్విపద రామాయణం, నానా ప్రబంధాలు కాలగర్భంలో కలసిపోయాయి. బహుముఖ ప్రజ్ఞాశాలిగా భాసిల్లిన ఈ మహావ్యక్తి ప్రభావం తరువాతి వారిమీద ఏ విధంగా ఉందో రేఖా మాత్రంగా ఆవిష్కరించడమే ఈ వ్యాసోద్దేశం.

తొలితెలుగు వాగ్గేయ కారుడు

తెలుగుపదం మొదట శాసనాల్లోనే దర్శనమిచ్చింది. అయితే అది వస్తువులోను, అభివ్యక్తిలోను పాఠకులను ఆకట్టుకోలేకపోయింది. నన్నయ, నన్నెచోడుడు, పాల్కురికి సోమనాథుడు, నాచన సోమన,

శ్రీనాథుడు తమ రచనల్లో వివిధ గేయరూపాలు ప్రస్తావించారు. అయితే వాటి స్వరూప స్వభావాలు అందుబాటులో లేవు.

12వ శతాబ్దంలో కృష్ణమాచార్యులు రచించిన సింహగిరి నరహరి వచనాలే తొలితెలుగు పదాలుగా తోస్తూ ఉంది. ఇవి వచనంలో ఉన్నాయి. వీటిని చూర్ణాలని చిన తిరుమలయ్య పేర్కొన్నాడు. ఇవి తాళబంధ ఛందోవిరహిత గేయగంధులుగా మాత్రమే కనిపిస్తున్నాయి. ఆ గేయగంధం కూడా మన వరకు రాలేదు. తరువాత పేర్కొన దగినవి యాగంటి వారి పదాలు. ఇవిదాదాపు కీర్తనకు పూర్వరూపాలుగానే కనిపిస్తాయి.

తాళ్ళపాక అన్నమాచార్యులు తెలుగు సంకీర్తనలు సలక్షణంగా వెలయించాడు. పల్లవి, చరణాలు, చివరి చరణంలో అంకిత ముద్ర ఈయన కీర్తనలోని అంశాలు. అన్నమయ్య కీర్తనలు అధ్యాత్మ సంకీర్తనలు, శృంగార సంకీర్తనలు అని రెండు విభాగాలుగా ఉంటాయి. తన భావాలతో జానపదుల హృదయాలను స్పృశించే ఉద్దేశంతే అనేక జానపద బాణీలను అన్నమయ్య వాడుకున్నాడు. ఈయన కీర్తనల్లో ప్రౌఢభాష, సరళ భాష, జానపద భాష, మాండలిక భాష, సంస్కృత భాష చోటు చేసుకొన్నాయి. సమకాలీనాంశాలకు కూడా అన్నమయ్య తన కీర్తనల్లో స్థానం కల్పించాడు. అందువల్ల ఆదర్శవాగ్గేయ కారుడయ్యాడు. తొలి తెలుగు వాగ్గేయకారుడిగా ప్రఖ్యాతుడయ్యాడు. ఒక పాటను రచించి స్వయంగా పాడే వాడే వాగ్గేయ కారుడని స్థూలంగా చెప్పుకోవచ్చు.

ప్రభావం

అన్నమయ్య మీద పూర్వవైష్ణవుల ప్రభావం ఉంది. ఆళ్వార్ల ప్రభావము తదనంతర ఆచార్య పురుషుల ప్రభావం కొట్టొచ్చినట్టు గోచరిస్తూ ఉంది. అందుకే ఆయన పన్నిద్దరాళ్వార్ల సరసన 13వ ఆళ్వార్‌గా స్థానం సంపాదించాడు. అన్నమయ్య మీదపూర్వుల ప్రభావం ఉన్నట్లే ఆయన తర్వాతివారి మీద కూడా అన్నమయ్య ప్రభావం స్పష్టంగా కనిపిస్తూ ఉంది. అన్నమయ్య పుత్ర పౌత్రులైన పెదతిరుమలయ్య, చినతిరుమలయ్యలు ఆయన రచనలను అనుకరించారు. క్షేత్రయ్య, రామదాసు, సారంగపాణి, త్యాగయ్య, అన్నమయ్య రచనలను తలపించే విధంగా రచనలు చేశారు.

అన్నమయ్య ప్రభావం పెదతిరుమలయ్య, చినతిరుమలయ్యల మీద ప్రత్యక్షంగా ఉండేందుకు ఎక్కువ అవకాశం ఉంది. క్షేత్రయ్య, రామదాసు, సారంగపాణి, త్యాగరాజుల మీద అన్నమయ్య ప్రభావం ప్రత్యక్షంగా ఉండేందుకు అవకాశంలేదు. ఎందుకంటే వీరంతా భిన్నప్రాంతాలకు, భిన్న కాలాలకు చెందినవారు. ఇంతవరకు లభించిన వీరిగేయాల్లో ఎక్కడగాని అన్నమయ్య ప్రస్తావన కనిపించదు. అంత మాత్రాన అన్నమయ్య ప్రభావం వీరిమీద ఉండటానికి వీల్లేదని కొట్టిపారవేయడానిక్కూడా వీల్లేదు. అన్నమయ్య కీర్తనలు వినే అవకాశం తరువాతి వాగ్గేయకారులకు కలిగి ఉండవచ్చు. దానివల్ల అన్నమయ్య ప్రభావం వారిమీద కూడా ఉండేందుకు అవకాశం మెండు. ఇప్పుడా ప్రభావాన్ని పరిశీలించేందుకు ప్రయత్నించడం ముదావహం.

నాయికామోహం

అన్నమయ్య నాయికానాయకుల దివ్య ప్రణయాన్ని అభివర్ణించాడు. అనేక శృంగార పదాలు రాశాడు. పెదతిరుమలయ్య, చిన తిరుమలయ్య, క్షేత్రయ్య, సారంగపాణి త్యాగయ్య కూడా మధురభక్తి భరితమైన మధుర కీర్తనలను రచించారు. వాటిలో నాయికా మోహాన్ని ఆవిష్కరించే పదాలను స్మృతి పథంలో మెదలిద్దాం.

అన్నమయ్య

అన్నమయ్య నాయిక తిరుమలయ్యను వరించింది. మక్కువ ఎక్కువ కాగా తన మోహం వెల్లడి చేసింది.

చక్కని నీరూపు జూచి చొక్కివున్న దాననేను
పక్కన నీవే నన్నుఁ బైకొను మీ
. . . . . .
. . . . . **(శృంగార సంకీర్తనలు – 27వ సంపుటం కీర్తన – 225)**

పెదతిరుమలయ్య

మోహావస్థలో ఉన్న మోహనాంగికి సంబంధించిన పెదతిరుమలయ్య ఊహ ఇది.

"ఏమి సేతు నా భాగ్యము యెఱిగీ నెఱుగ నీదు
నామోహమె మిక్కుటమై నన్నుదడబరచెను
భావించి నిన్నుఁ జూచితే పరవశమౌదు గాని
ఆవేళ నీతో సరసమాడ మరతు
. . . . . .
. . . . . **" (తాళ్ళపాకవారి సంకీర్తనలు 23 సంపుటం కీర్తన – 245)**

చినతిరుమలయ్య

చినతిరుమలయ్యనాయిక తిరుమలేశుని మీద ఆశపడింది. ఆమె మోహం అగ్గలించింది. దుర్భరమై తోచింది. తన మోహస్థితి పర్యవసానంగా కలిగిన దుర్భరావస్థను జగన్మోహనాకారునితో మొరపెట్టుకొంది.

" . . . . . .
. . . . . .
చిమ్మిరేగె జగడాలఁ చీకటైన మోహము
దిమ్మరి యెడమాటలఁ దేటవారెరా
. . . . . .
. . . . . **."** **(తాళ్ళపాక కవుల సంకీర్తనలు – 16వ కీర్తన 78)**

క్షేత్రయ్య

ఇంతింతన రాని మోహం క్షేత్రయ్య నాయికను వంతకు గురిచేసింది. తన దయనీయస్థితిని ఆమె ఆవిష్కరిస్తున్న వైనం అందరి హృదయాలను పలకరిస్తూ ఉంది.

“. . . . . .
. . . . . .
ఎంతసేపని తాళదానురా మోహము – ఇంతనరాదు నీయచరా
చెంతచేరి కెమ్మోవి ఆనరా నన్ను
చింతల బెట్టేది మానరా నా సామి
. . . . . .
. . . . . .” **(క్షేత్రయ్య పదములు – పదం 125)**

సారంగపాణి

సారంగపాణినాయిక పల్లిపట్టు వరద నారాయణుని మీది మోహంతో పరితపించింది. మోహ వివిశ అయిన ఈ నాయిక సారంగపాణి సంకల్ప సంజనిత

“. . . . . .
. . . . . .
నాయమా వెతలు బెట్టు టాదాయమా వొంటినుండె
పాయమా నా చెలిమింత హేయమా
. . . . . .
. . . . . .” **(సారంగపాణిపదములు – పదం : 69)**

త్యాగరాజు

త్యాగరాజు నాయిక రిపుభీముడైన రాముణ్ణి వలచింది. వలపు నాశించింది. వల్లభుడి వైముఖ్యం ఆమెలో రేపిన మోహమే కీర్తనగా పల్లవించింది.

“. . . . . .
. . . . . .
మనసున చెలినీకు మరులు గొన్నది గాని
చనువున చేయిబట్టి సంరక్షించవు
. . . . . .
. . . . . .” **(త్యాగరాజు – 3వ సంపుటం ; కీర్తన – 27)**

రామదాసు తప్ప వాగ్గేయకారులందరూ తమనాయికా మోహాన్ని తమకు తోచినట్టు అభివర్ణించడం కనిపిస్తుంది. వీరి నాయికలందరిలోనూ నాయక సమాగమ తపన సమానంగానే దర్శన మిస్తుంది.

నాయికా విరహం

నాయికా నాయకులు పరస్పర ఆకర్షితులౌతారు. వలపు మోహమవుతుంది. మోహం విరహంగా పరణమిస్తుంది. పరిస్థితుల ప్రాతికూల్యం వారి సంయోగాన్ని వాయిదా వేస్తుంది. విరహం వికటిస్తుంది. పరితాపం పరాకాష్టకు చేరుకుంటుంది. నాయకులకు కూడా విరహం తప్పదు. అయితే నాయికల విరహాన్ని మాత్రమే మనకవుల ఎంతో రమ్యంగా చిత్రించారు.

తనదుస్థితికి వగచింది. ఆమె విరహపు సెగ అన్నమయ్య పాటగా పాఠకుల హృన్నవనీతాన్ని ద్రవింపజేసింది.

"చలగాలి వేడేల చల్లేనె కప్పురపు
మలయజము తానేల మండినే
. . . . . .
. . . . . ." **(తాళ్ళపాక కవుల కీర్తనలు – 12 వ సంపుటం కీర్తన – 191)**

పెదతిరుమలయ్య

పెదతిరుమలయ్య నాయిక కాంతుని మొదట చూచి తర్వాత ఎదురు చూచి నాయిక కళ్ళు ఎరుపెక్కాయి. ఆ కళ్ళలో రాగమూ ఉంది. విరహాగ్ని తాపమూ ఉంది. నాయకుని ఎడబాటుతో విపరీతమైన విరహానికి గురైన నాయిక అతడు వచ్చినపుడు తన కోపతాపాల్ని ప్రదర్శించింది.

"కాంతుని దప్పక చూచి కన్నులెల్లా యట్టనాయ
యెంతయినా మానద కాక యిక నేమి సేతునే
. . . . . .
. . . . . ." **(తాళ్ళపాక కవుల సంకీర్తనలు – సంపుటం కీర్తన –)**

చినతిరుమలయ్య

నాయకుని నిర్లక్ష్యం నాయికలో విరహాన్ని రేపింది. నాయిక విరహంతో వేగేటప్పుడు నాయకుడు పట్టించు కోలేదు. తర్వాత తమకంతో వచ్చిన నాయకుని చినతిరుమలయ్య నాయిక నిష్కరోక్తులాడడం సహజ సుందరంగా ఉంది.

" . . . . . .
. . . . . .

వేకపు విరహాన వేగలేక నేను
సోకగ నెదురు చూడగా
తాకి తలచడు తరుణులc గూడి
. . . . . .
. . . . . ." **(తాళ్ళపాక కవుల సంకీర్తనలు – 16వ సంపుటం కీర్తన – 109)**

క్షేత్రయ్య

క్షేత్రయ్య నాయికకు రంగేశుని మీది రాగం విరహానికి గురిచేసింది. ప్రకృతి కూడా పగబట్టినట్టు ఉద్దీపోద్రేకాలను కలిగించింది. పర్యవసానంగా ఆమె విరహావస్థ అనిర్వచనీయమైంది.

ఏమిసేతునే ? కొమ్మా ! ఓయమ్మా !
ఏమి సేతునే ? వెన్నెల కాకలకు – ఎట్లోర్తునమ్మా ! నే
. . . . . .
. . . . . **(క్షేత్రయపదములు – పదం – 21)**

సారంగపాణి

సారంగపాణి సారంగ లోచనకు విరహం విజృంభించింది. దుస్సహమయ్యింది. తన విరహావస్థను ఆమె చెప్పుకున్న వైనం మనోహరం.

"ఏమి సేతు విరహవేదన
యెంతని తాళుకొందునమ్మా
సామి నాపై ప్రేమ మరచె
నామది కెంతో దిగులు దోచె"
. . . . . .
. . . . . ." **(సారంగపాణి పదములు : పదం :45)**

త్యాగయ్య

త్యాగయ్యనాయికలో విరహాభాసం మాత్రమే గోచరిస్తూ ఉంది. తక్కిన వాగ్గేయ కారులందరూ అన్నమయ్యలాగే నాయికా విరహాన్ని ఆవిష్కరించడం గమనార్హం.

కాలంవిలువ

మహనీయులకు కాలం విలువ తెలుసు. తక్కిన వాళ్ళకు కూడా తెలియజేయాలని తహతహలాడుతారు. కాలం విలువ తెలిసిన వాగ్గేయకారులు లోకులకు దానిని తెలియజెప్పే ప్రయత్నం ప్రతి వాళ్ళను ఆలోచింప చేశారు.

అన్నమయ్య

నిర్విరామంగా నీలమేఘశ్యాముణ్ణి భావించి, పాడి పరవశించిన అన్నమయ్యకు సంతృప్తి కలగలేదు. ఏదో విధంగా కాలమంతా వ్యర్థమై పోయిందని వాపోయాడు. ఆయన పశ్చాతాపాగ్నిజ్వాల ఈ కీర్తనలో చోటు చేసుకున్న వైనం గమనార్హం.

ఏడ సూజ్ఞాన మేడ తెలివినాకు
బూడిదలో హోమమై పోయఁగాలము
. . . . . .
. . . . . .
గక్కున శ్రీ తిరువేంకటపతి గానుక
పుక్కిట పురాణములై పోయఁ గాలము (తాళ్ళపాక కవుల సంకీత్రనలు 1వ సంపుటం, కీర్తన 48)

పెదతిరుమలయ్య

ఏమరుపాటు తగదని పెదతిరుమలయ్య హెచ్చరిక చేశాడు.

"ఏమఱకు జీవుడా యే కాలమూ
నేమముతో నుండితేనే నిలుచును కాలము
. . . . . .
. . . . . ."

(తాళ్ళపాక కవుల సంకీర్తనలు - 21 వ సంపుటం ; కీర్తన 270)

చినతిరుమలయ్య

కాలాన్ని సద్వినియోగ పరచుకోవాలని చినతిరుమలయ్య హితవు పలికాడు.

"నిమిష మెడతెగక హరి నిన్నుఁ దలచి
మమత నీ మీదనే మరపి బదుకుట గాక
నిదురచే కొన్నాళ్ళు నేరములఁ గొన్నాళ్ళు
ముదిమిచేఁ గొన్నాళ్ళు మోసపోయి
కదిసికోరినను గతకాలంబు వచ్చునే
మదిమదినె వుండి యేమరక బదుకుట గాక
. . . . . .
. . . . . "

(తాళ్ళపాక కవుల సంకీర్తనలు - 16 వ సంపుటం ; కీర్తన 59)

రామదాసు

అవాంఛనీయ కార్యకలాపాలలో కాలం పాడే పోయిందని రామదాసు ఆవేదన వ్యక్తం చేశాడు. బాల్య, యవ్వన, వృద్ధాప్యాలు తనకు ఉపయోగ పడలేదని ఆయన బాధపడ్డాడు. తన నిస్సహాయతను స్వామికి నివేదించాడు.

“. . . . . .
మొదట నెరుగని తనమున సగమాయువు
నిదురపాలై పోయగా ఓ రామ
పదపడి తక్కిన పదేండ్లు బాల్యత్వమునను
పోయెగా ఓరామ
వదలక యౌవనమున పరభామల
వలల తగుల నాయెగా ఓ రామా
ముదిమిని సంసారాంధ కూపములో జిక్కి
మునిగితేల నాయగా ఓరామా
. . . . . .
. . . . . .” **(రామదాసు కీర్తనలు ; కీర్తన :106)**

త్యాగయ్య

కాలం వృధా అయిపోయంది కాబట్టి ఆలస్యం చేయకుండా శ్రీరాముని భజించమని త్యాగరాజు తన మనసును ఆదేశించాడు. జీవితంలో తారసిల్లే సంఘటనలు కాలాన్ని ఏవిధంగా హరిస్తాయో సుదీర్ఘ వివరణతో బోధ పరిచాడు.

“పొద్దు పొయ్యేని శ్రీరాముని పూని భజించవే ఓమనసా !
సిద్దుర చేత కొన్నాళ్ళు విషయ బుద్ధుల చేత గొన్నాళ్ళు ఓ మనసా !
. . . . . .
. . . . . ” **(త్యాగయ్య 1వ సంపుటం : కీర్తన : 29)**

విషయాలు కాలాన్ని వృధాచేస్తాయని, పారమార్థిక విషయాలు కాలాన్ని సార్థకం చేస్తాయని వాగ్గేయకారుల భావించారు. సారంగపాణి మినహా తక్కిన వాగ్గేయ కారులందరూ కాలాన్ని, దాని మూల్యాన్ని స్మరించి సద్వినియోగ పరచుకోవాల్సిన ఆవశ్యకతను పరోక్షంగా ప్రభోదించారు.

నామమహిమ

పారమార్థిక ప్రస్థానంలో భగవన్నామోచ్చారణకెంతో ప్రాధాన్యం ఉంది. అందరూ తమ తమ ఇష్టదేవతల నామాలను ఉచ్చరించడం, స్మరించడం, జపించడం చేస్తుంటారు. తద్వారా భగవదనుగ్రహం కలిగి భవసాగరం తరించగలరని దృఢవిశ్వాసం. వాగ్గేయకారులు విష్ణునామ విశిష్టతను కొనియాడారు.

అన్నమయ్య

అన్ని నామాలకన్నా హరినామమే అనంత ఫలదమని అన్నమయ్య అభిప్రాయం. అన్ని పాపాలను హరించగలిగేది అనంత శయనుడి నామమేనని అతని అచంచల విశ్వాసం.

"హరినామ మొకటనే అణగెఁబాపములు
వొరసియున్ని నామము బారకున్నవి
. . . . . .
. . . . . ." **(తాళ్ళపాక పదసాహిత్యం ; 3వ సంపుట కీర్తన : 297)**

పెదతిరుమలయ్య

వివిధ విష్ణునామాలతో తాను సాధించిన ఘనతను పెదతిరుమలయ్య తెలియజేశాడు. తనను అనుసరించి తరించవలసిందిగా తక్కిన వారిని పరోక్షంగా ఉద్బోధించాడు. విష్ణునామ విశిష్టతను వివరించాడు.

"శంకమ నీవుసాక్షి చక్రమ నీవు సాక్షి
మకలాడ భుజముల వ్రాసికొంటి మిమ్మును
నారాయణయని పొందితి జీవన్ముక్తి
. . . . . .
. . . . . ."

(తాళ్ళపాక పదసాహిత్యం ; 3వ సంపుట కీర్తన : 297)

రామదాసు

రామనామ మెంతరుచి అని ఆశ్చర్యపడుతూ రామదాసు దానిఘనతను కొనియాడాడు. దేవతలు, ఋషులు దాన్ని ఉపాసించిన తీరు ఉటంకించాడు.

"ఓరామ నీనామ మేమిరుచిరా
శ్రీరామ నీనామ మేమి రుచిరా
కరిరాజ ప్రహ్లాద ధరణి విభీషణుల

గాచిన నీనామ మేమి రుచిరా"

. . . . . .

. . . . . (రామదాసు కీర్తనలు ; కీర్తన : 110)

సారంగపాణి

ఇతరానుష్ఠానాలకన్నా విష్ణునామోచ్చారణే పరమశ్రేష్ఠమని సారంగపాణి భావించాడు.

"అన్నిటికిది సులభమార్గము సుమీ
హరి నామ స్మరణా
. . . . . .
. . . . . ." (సారంగపాణి పదములు; కీర్తన 182)

త్యాగరాజు

త్యాగరాజు రామనామం వల్ల లాభం పొందిన వారిని పేర్కొన్నారు. రాముని చింతంచడం కంటే కూడా రామనామాన్ని ఆశ్రయించడం పరమోత్కృష్టమని భావించాడు.

"మేలు మేలు రామనామ సుఖ – మీ ధరలో మనసా
ఫాలలోచన వాల్మీకాది – బాల నిలజాదులు సాక్షిగ
. . . . . .
. . . . . " (త్యాగయ్య ; రెండవ సంపుటం 16వ కీర్తన)

విష్ణునామ విశిష్టతను వాగ్గేయకారులు వేనోళ్ళకొనియాడారు. చినతిరుమలయ్య మాత్రమెందుకో తన రచనలో దానికి స్థానం కల్పించలేదు.

అన్నమయ్య తరువాతి దాదాపు అందరు తెలుగు వాగ్గేయకారుల రచనల్లోను ఆయన అనుకరణలు కనిపిస్తున్నాయి. వివిధాంశాల మీద అన్నమయ్య లాగే వారు కూడా రచనలు చేశారు. ఆయనలాగే శృంగార భృంగారాన్ని ఆవిష్కరించారు. పారమార్థిక తత్వాన్ని పాఠకుల హృదయాల్లో పల్లవింపజేశారు. ఆలోచిస్తే అన్నమయ్య ప్రభావం తరువాతి వాగ్గేయకారుల మీద బహుముఖీనంగా ఉంది. బహుగాఢంగా వుంది. వ్యాస విస్తరణ భీతితో చాలా వాటిని ఇక్కడ స్పృశించలేదు. ఈ వ్యాసంలో ఒక పెద్దకొండను చిన్న అద్దంలో చూపించే ప్రయత్నం మాత్రమే జరిగింది. దీనిని సహృదయులు గమనింతురుగాక. ప్రజ్ఞామన శ్చక్షువులు, హృదయ చక్షువులు అయిన పాఠకులు ఈ ప్రభావ ప్రభాకరుడి సహస్ర కిరణాలను యథాశక్తిగా గ్రహించి వెలుగును నింపుకొని విరాజిల్లుదురు గాక.

* * *

14. Yorkshire-Rangoli Radio Gosti

- Dr. Veturi Ananda Murty

(Courtesy: Radio Rangoli - Yorkshire).

Om namo Narayanaya

Namaskarams to Padakavitapitamaha Sri Tallapaka Annamacharya.

Master CVV Namaskaram.

Gurudev VPS Namaskaram

Yorkshire Radio Rangoli shrotagalu ellarigu Namma vinayapurvaka namaskaargalu.

Ulagamella irikkindra Tamil Makkalakku ennudaya anbaranda VaNakkamgal

"Endaro mahanubhavulu andariki vandanamulu", and

Salutations to our entire listener Brothers and Sisters in UK, and Lovers of Tallapaka Annamacharya throughout the world!

Thanks to Radio Rangoli Organization and its Presenter Hema Manjunath ji, I am given this opportunity to speak to you in this virtual zoom meeting on the auspicious occasion of the 614th birth anniversary of Sri Annamacharya.

Let me start this presentation by invoking the grace and blessings of Lord Venkateshwara of Tirupati fame.

I also pay my tributes to the Trayee namely, the triple energies like Rik - literature, Sama - music and Yajur - practices.

My padanamaskarams to the earliest known Telugu Composers Tallapaka Annama, Pedda Tirumala and Chinna Tirumala Acharyas of the 15th century. Holy remembrances of their contemporary Karnataka daasa composers like Sripadarayaru, Vyasarayaru and Puranaradaasaru who worked in close collaboration with the Tallapaka composers for the promotion of Vishnu Bhakti in general. To substantiate this point it is enough to cite my Facebook posting sometime back, comparing the Ugabhoga (Sankirtana) of Sripadarayaru with the Rangavitthala mudra "bhushanake bhushana Idu bhushana" with the Sankirtana of Annamacharya found in the TP Sankirtanalu manuscript, with Venkatanatha mudra, having the same Pallavi and song contents "bhushanamulaviyeti bhushanamulu", probably taken after similar thought content of earlier verses of Bhartrihari. Both Sripadarayaru and Annamacharyulu were contemporaries and as such, this similarity in their compositions speak of their mutual willing cooperation and

collaboration in the spread of the then Vishnu Bhakti movement despite all their philosophical differences.

Likewise, there are several such other examples to quote, in between the other Dasara padagalu and the Tallapaaka Sankirtanalu

My pranams to the unparalleled trinity of Researchers of the early 20th century, like -

1. Gurudev Veturi Prabhakara Sastry, who resurrected the name of Annamacharya and his lyrical literature from centuries of oblivion.
2. Sri Sadhu Subrahmanya Sastry who took the task of tracing the history of Tirupati through varied inscriptions at the call of the then Mahant.
3. Sri Rallapalli Anantakrishna Sarma, who composed traditional classical music to the then meagrely available lyrics of Annamacharya with raaga names but not with any notations. Hence, he had to compose his own music in the raga names given, for purposes of devotional presentations.

Lastly, I pay my respects to the TTD (the Tirumala Tirupati Devasthanams), for their untiring efforts in organizing and encouraging research on lyrical literatures and thus preserve and propagate our ancient Heritage Hindu Culture.

Now my Rangoli radio listeners! Please bear with me for any flaws in my talk and allow me to continue my presentation in mixed registers, by occasionally switching over to my mother tongue Telugu, to make you follow easily.

Q (1) - What inspired you?

ముందుగా మా పితృదేవులు, గురుదేవులు వేటూరి ప్రభాకర శాస్త్రిగారి స్మృతికి ప్రణామా లర్పిస్తున్నాను. ఎందుకంటే తాళ్ళపాక వారిని తలచుకొన్నప్పు డల్లా వేటూరివారిని స్మరింపక తప్పదు.

My late father's significant contribution in this lyrical domain prompted my hidden interest and desire to continue research on the Tallapaka family poet (TP) composers. Divine scheme also helped me in changing the course of my academic life, that an Intermediate MPC student like me, took to Telugu Honours course and immediately moved to Osmania University at Hyderabad for obtaining the Ph.D on the TP family poet composers' contribution, which happened to be the very first thesis on the subject.

తాళ్ళపాక అన్నమాచార్యులవారి సంకీర్తన వాఙ్మయం నన్ను ఆకర్షించింది. వారి సంకీర్తనలలోని వైవిధ్యం, భావగాంభీర్యం, భాషా సౌందర్యం, అనితర సాధ్యమైన రచనానిర్మాణంలోని సొబగు, శృంగార అధ్యాత్మ భావాలను తాత్త్వికంగా మేళవించి రసాత్మకంగా తీర్చే పదరచనల్లోని కూర్పు నేర్పు అన్నమాచార్యులవారికే సొంత మనిపిస్తుంది. ఇప్పుడు ఈ సంకీర్తన పదాన్ని పరిశీలించండి.

ఏతదఖిలంబునకు నీశ్వరుండై సకల ।
భూతములలోన దా బొదలువా డితడు ॥

గోపాంగనల మెఱుగు గుబ్బచన్నులమీద
చూపట్టు కమ్మ కస్తురిపూత యితడు ।
తాపసోత్తముల చింతాసౌధములలోన
దీపించు సుజ్ఞాన దీప మితడు ॥

జలధికన్యాపాంగ లలితేక్షణములలో
కలసి వెలుగుచునున్న కజ్జలం బితడు ।
జలజాసనుని వదన జలధి మధ్యమునందు
అలర వెలువడిన పరమామృతం బితడు ॥

పరివోని సురత సంపదల నింపుల చేత
వరవధూతతికి పరవశమైన యితడు ।
తిరువేంకటాచలాధిపుడు తానై యుండి
పరిపాలనము సేయు భారకుం డితడు ॥

The Pallavi and the final Abhoga sections of the above Sankirtana speak about Ishwara, the Almighty indweller in the body, namely Jiva, who takes care of the Soul on Himself.

As Ramayana, the Saranagati Maha Kavya alludes, the attitude of self-surrender to the Almighty is the key for instant protection or realisation.

The relationship between the Jiva and Paramatma is exquisitely expressed in the three subsequent charaNa passages

a. as the light of knowledge to show the path

b. as the life-giving ambrosia released from churning the milky ocean

c. as God, the Almighty Creator and Caretaker.

Structurally, the two pairs of expressions in each passage refer progressively to the erotic and the spiritual sentiments in a top graded poetic diction beautifully.

Q. (2) - What are your memorable recollections?

Ans. It was a divine experience for me to watch the very first Annamacharya Vardhanti Festival (నిర్యాణోత్సవం) at Tirupati, in 1949, which is perpetuated by the TTD, on par with the Aradhana Festivals of Thyagarajaswami at Tiruvayyar .

Similarly, I attended and watched all the Annamacharya Jayanti Festivals (జన్మోత్సవాలు) with interest later, right from the commencement of the Annamacharya Project in 1978.

In particular, I loved attending the 578th Jayanti festival in 1986 conducted on a grand scale as 'Sangitotsavalu', for nine days from May 23rd to 31st May, by our friend Sri Kamisetti Srnivasulu. It was a spectacular treat to Rasikaas. I wish such spectacles are repeated as frequently as possible by the S V Vedic University, TTD.

I wish to recollect and refresh to my mind two or three memories.

1. 1949 was the year when my late father focussed his attention on the "Sankirtanabhandaram" (తాళ్లపాకవారి అర) and the two sculpted human reliefs seen on either side of its entry door, locked up a couple of decades ago, after removing and transporting the artefacts therein to Tirupati. It was he who identified for the first time and made public those twin reliefs as those of Annamacharya (with stretched right hand gAyanamudra) and Pedda Tirumalacharya (with the tambura danDe in the right hand).

   This identification was approved by contemporary scholars, including Sri Rallapalli Anantakrishna Sarma and Sri Gouripeddi Ramasubba Sarma as evidenced from their first edition title cover pages. But these were reversed by later scholars without any regard or reason in their reprints, which is still being contended.

   Father also tried hard to locate the figure of the third composer of the TP trinity in the temple but could not convincingly succeed. But in my subsequent probe in the matter, I realized that Annamacharya (the musali annamayyangaru as mentioned in Kaifiyaths) having attained the status of Alwaracharyas & his murthi was separately installed in their Kalyana Venkateswara Temple, there was no need to alter the twin reliefs as they can still represent Pedda Tirumalacharya and Cinna Tirumalacharya! This is Shilpa dhwani!

   When I put forward this aspect for approval before the revered authority in Agamas, Sri S. K. Ramachandra Rao of Bengaluru, he appreciated and supported my view point.

2. Retrieving and publishing the vital source work "Annamacharyacharitra" of Chinnanna and discussing their probable dates.

అన్నమాచార్య చరిత్రలో అన్నమయ్య "క్రీ.శ. 1424 క్రోధి వైశాఖమాసమున విశాఖానక్షత్రమున జన్మించిరి" అనికలదు. రాగిరేకులలోని (సందిగ్ధంగాతోచే) వాక్య నిర్మాణాన్ని పరిశీలించి నాన్నగారు అన్నమాచార్యచరిత్ర పీఠికలో వారి జన్మం 1424 కా దగుననిరాశారు. నేనూ తొలుత వారి అభిప్రాయంతోనే ఏకీభవించి పరిశీలించాను. కానీ రాగిరేకులలోని ఆవాక్యాన్ని మరో విధంగా అన్వయించుకొని, 1408 అన్నమయ్య జన్మవత్సర మని తిరుమల తిరుపతి దేవస్థానమువారు తీర్మానించిరి. చిరంజీవియైన మన పదకవితాపితామహుని ఆయుష్యం మరో పదహారేళ్లు పెరగడం సంతోషదాయకమే కావడంచేత నేనూ అందుకు అడ్డుచెప్పలేదు. "వైశాఖమాసమున విశాఖానక్షత్రము ప్రాయికముగా పూర్ణిమా తిథికి వచ్చును. కనుక వైశాఖ పూర్ణిమ జన్మతిథిగాగూడ నిర్ణయింపవచ్చును" అన్నారు, తమ పీఠికలో గురుదేవులు ప్రభాకరులు . ఆ ప్రకారము దేవస్థానము వారు తీర్మానించిన మేరకే నేటికినీ తిరుపతిలో అన్నమయ్య జన్మోత్సవాలు జరుగుతున్నవి. అలాగే సంకీర్తన భండారం గోడమీద ఇరువైపులా చెక్కబడిన ఇద్దరు వాగ్గేయకారుల శిల్ప మూర్తులూ అన్నమాచార్య పెద్ద తిరుమలాచార్యులవిగా గురుదేవుల గుర్తింపు. కానీ 'ముసలి' అన్నమయ్యంగారికి ఆళ్వారులతోపాటుగా ప్రత్యేక విగ్రహమే వారి ఆలయంలో ప్రతిష్ఠాపిత మాయెనుగనుక, ఇప్పుడు అవి ('తాళ్లపాకవారి అర' గోడమీది శిల్పాలు) పెద్ద , చిన్న తిరుమలాచార్యుల మూర్తులు కాదగు నని అన్వయించుకోవచ్చును. ఇది శిల్పధ్వనికి ఉదాహరణ.

3. Every Mother in Telugu households knew by heart this popular lullaby "jo Achyutananda Jo Jo Mukunda" as part of Telugu folklore, much before knowing who its author was! It was a pleasant surprise to the Telugu public when it was disclosed in 1948 by Gurudev VPS that it was the composition of Annamacharya in his Introduction to Annamacharyacharitra, published in 1949. Sri VPS noticed some more stanzas of the same folk song in Saraswati Mahal Library around 1918. But this song copied and recorded by Prof. Vissa Apparaogaru(VAR) from an old compilation of ancient book of heritage songs, contained this following additional passage revealing its authorship thus -

"అంగుగా తాళ్ళపాకన్నయ్య చాల । శృంగార రచనగా చెప్పె నీ జోల". When Prof. VAR showed this manuscript to Gurudev VPS, he noticed and disclosed this rare find of JOla by Annamayya which was published by his disciple T. Kondaandaramayya the very next week In the AndhravArapatrika dated 8.9.48 (See అన్నమాచార్యచరిత్ర పీఠిక 61). Later this was blissfully sung by the Carnatic melody queen MS Subbulakshmi Amma.

Q. (3) - How were the (Annamacharya Jayanti / Vardhanti) Festivals celebrated?

Ans. On a grand scale! I thoroughly enjoyed participating in all those Annamacharya festivals held at Tirupati, both as a visitor and on many occasions presented valuable research papers as well, although I didn't publish them all in book form, for my own reasons. (I took a vow that until we bring out all the pending valuable works of my father in print as "Prabhakara Sampurna Granthavali", I shouldn't venture upon printing my own works, which could wait!).

1949 లో శ్రీ ప్రభాకరోపజ్ఞంగానే, ప్రప్రథమంగా జరిగిన అన్నమాచార్య వర్ధంతి ఉత్సవాలు తెలుగుజాతీ , తెనుగు దేశమూ యెన్నటికీ మరువరాని మధుర సన్నివేశాలు! స్వామివారి అనుగ్రహమూ, దేవస్థానమువారి పూనిక, ప్రభాకరుల యోగ సాహిత్య పరిశోధన ప్రజ్ఞా పాటవమూ, రాళ్లపల్లివారి సంగీతసాహిత్య ప్రాభవమూ అద్భుతంగా వెల్లడియైన మహోత్సవ మది. ఆ యేడు దేవస్థానంవారు ప్రకటించిన వంద పేజీలపైని రిపోర్టు చదివితేనే ఒళ్ళు పులకిస్తుంది. అదీ, ఆ తరువాత, సోదరులు శ్రీ కామిశెట్టి శ్రీనివాసులు పెద్ద యెత్తున వారంపాటు తిరుపతిలో నిర్వహించిన అన్నమయ్య నిర్యాణోత్సవమూ చరిత్రలో నిలిచిపోయే ఘట్టాలు.

అట్టి సంగీతోత్సవాలు నేటి నుండైనా తిరిగీ ప్రారంభమై తరచూ గురుదేవుల జననోత్సవ, నిర్యాణోత్సవ సందర్భాలను పురస్కరించుకొని జరగా లని కోరుకొంటున్నాను.

Q (4)- Your father's contribution in finding the Copper Plates (CP)?

Ans. This is a topic to be elaborated! "Finding" the copper plates needs more clarification this day to dispel certain misconceptions in public, causing some friction . 'Finding' in the sense of physical tracking of the CPs in the stone vault uphills, kept under the care of TP poets or the Mahants, was done by the Epigraphy Department of the Devasthanams. The cellar containing the CPs was evacuated and all the copper plates were transported to the Huzur office down-hills for purposes of copying and printing, around 1920s &1930s. The first 3 volumes of TP minor works & sankirtanams and three other of their major poetic works were also published, possibly, haphazardly and not to the satisfaction of the authorities. The attempt was later discontinued.

But in the real sense of 'finding' namely, the significance of the work started really in the beginning of the 20th century by Gurudev VPS and fully accomplished after his joining the service of the Devasthanams in December 1939.

From an obscure hiding place in the Huzur office, where the CPs were lodged in a chaotic condition, they were retrieved by Gurudev VPS. As the HoD of the SVORI Telugu Research Department, Gurudev himself with his newly appointed research assistant and student Sri AV Srinivasacharyulu, took charge of all the available CPs

and worked hard in streamlining and analysing the logistics of the CPs in a manner desirable to research, which was the chief prerequisite to continue further work on them.

Simultaneously, the discovery, retrieval, and publication of "Annamacharya Charitra" added new dimensions in Tallapaka research. Gurudev VPS's masterly Editing and elaborate introduction, heavily loaded with information, to that monumental biographical work, instantly became a source book for further research yielding to a couple of hundred Ph.D dissertations, Based on my late father's work my own first Ph.D thesis (1966), at the University level, served as a torch bearer, paving way to my Post-doctoral research work on the TP Composers' Sankirtanams, diction and their notated music as well, under the Tagore National Fellowship Scheme during 2015-2017.

Q. 5-Your message in Telugu to Rangoli Radio listeners?

Ans. పరిశోధక మిత్రులారా! "కృషితో నాస్తి దుర్భిక్షం" అనే నానుడి మీరు వినే ఉంటారుకదా? చిత్తశుద్ధితో చేసే మన కృషికి ఈశ్వరానుగ్రహం యెల్లప్పుడూ ఉంటుందన్న నమ్మకం నాకుంది. చిత్తశుద్ధీ, కృషీ, ఈశ్వరానుగ్రహమూ ఇవి మూడూ నిండుగా ఉన్నచోట విజయపరంపరలకు ఏ కొదువా ఉండదు. మిత్రులందరికీ, రంగోలి రేడియో బృందంవారికీ శుభం బగుగాక! సర్వే జనాస్సుఖినో భవంతు. శ్రీ వేంకటేశ్వరానుగ్రహ ప్రాప్తిరస్తు!!

* * *

15. 'శ్రీపదార్చన'

అన్నమయ్య ఆధ్యాత్మిక సంకీర్తనలు - ఒక పరిచయం

(తాళ్ళపాక పదసాహిత్యం -సంపుటము-1 ఆధారంగా)

- ఆచార్య కోలవెన్ను మలయవాసిని

శ్రీమదఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీవేంకటేశుని ఆతని ఇల్లాలు అలమేలుమంగాదేవుల అనన్య భక్తుడు తాళ్లపాక అన్నమయ్య. తన జీవితాన్ని స్వామికే ముడుపుకట్టి - వేలకొలది కీర్తనలతో స్వామిని అర్చించి పులకించిన పుణ్యమూర్తి అన్నమయ్య.

గుండెగుడిలో తాను పూజించే స్వామిని నిలుపుకొని, నేళమాళిగ గర్భంలో తాను రచించిన కీర్తనలు భద్రపరచిన మహనీయుడు అన్నమయ్య. ఈతని పుత్రులు, పౌత్రులు, అల్లుడు అందరూ స్వామి సంకీర్తనా కైంకర్యపరులే. తరతరాలుగా స్వామిని సంగీత సాహిత్యాలతో నిత్యం అర్చించిన, అర్చిస్తున్న - కుటుంబం అన్నమయ్యది. అలమేలుమంగను తమ యింటి ఆడపడుచుగా మన్నించి శ్రీ శ్రీనివాసునితో నిత్యకల్యాణం జరిపించడానికి శ్రీకారం చుట్టిన - భక్త కుటుంబం తాళ్లపాకవారిది.

తమ రచనలు రాగిరేకులమీద చెక్కించి భద్రపరచే బృహత్కార్యం చేపట్టిన అన్నమయ్యకు ఆతని పుత్రులకు శిరసువంచి నమస్కరించవలసినదే. ఈ రీతి ప్రపంచవాఙ్మయ రంగంలోనే అపూర్వమైనది.

అన్నమయ్య విశేషభావనా వీధిలో భక్తిపరవశుడై రచించిన కీర్తనలు :

'శ్రుతులైశాస్త్రములై పురాణకథలై సుజ్ఞాన సారంబులై
యతిలోకాగమ వీథులై విపుల మంత్రార్థంబులై నీతులై
కృతులై వేంకటశైల వల్లభరతిక్రీడా రహస్యంబులై
నుతులై తాలుపాక అన్నమయ వచోనూత్న క్రియల్ చెన్నగున్'.

ఇన్ని రీతుల ప్రసిద్ధికెక్కిన సంకీర్తనలను.

శ్రీమాన్ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు - 'తాళ్లపాక వారి పలుకుబళ్లు' - అనే పుస్తకానికి వ్రాసిన పీఠికలో -

'శబ్దం, అర్థం, తాత్పర్యం, వాక్యం, వ్యాకరణం, జాతీయం, దేశీయం, సంగీతం, శృంగారం, పదరచనా పరిణామం, సంకీర్తన భక్తితత్త్వం, సమకాలపు సంఘచరిత్ర నీడలు - ఇత్యాదిగా పలుమొగముల పర్యవేక్షణ యిందు (ఈకీర్తనలయందు) సాగవలసియున్నది." - అని 1971 లో వ్రాసారు.

అన్నమయ్య తన సంకీర్తనలలో - జానపద బాణీలకు, జ్ఞాన పథ వాణిని జోడించి బోధించాడు.

కొండలలో నెలకొన్న పరమాత్మకీ, గుండెలలో కొలువైన అంతరాత్మకీ కూడా మేలుకొలుపులు పాడాడు (1-139)

భావావేశపు చేతులతో స్వామి ఊయలలు ఊపాడు. ఇందిరవడ్డింప స్వామికి ఆరగింపు సౌకర్యం కలిగించాడు.

సంసారం, చిత్తము, మనస్సు - అనే సంబోధనలతో వైరాగ్యభావాలను అందించాడు. చిలుకా! అని సంబోధిస్తూ (1-50) తత్త్వం బోధించాడు. కలియుగాన్ని, మాయనీ సంబోధిస్తూ లోక విషయాలను ఆవిష్కరించాడు. (1-118) నాటి కాలపు చదువుల, నేటి కాలపు చదువుల తీరు తెన్నులు బేరీజు వేసి చూచించాడు (1-91), అప్పు, వడ్డీ, పత్రము వంటి విషయాలను జీవితంలో గమనించుకోవలసిన పద్ధతిని వివరించాడు. (1-469). మానవులందరూ భగవంతుని చేతిలోని ఆటబొమ్మలమనీ - తోలు బొమ్మలాట, సూత్రపు బొమ్మ, బొమ్మలాట వారు అంటూ తన కీర్తనలలో పదే పదే పేర్కొన్నాడు (445, 464)

మరగినసంసారము బొమ్మరిండ్లయాటలివి - 445, చావులు ఁబుట్టుగు లడిసరి దాగిలిముచ్చులు బహురూప. అండనే బహురూపమాడకబోదు - 417, తోలుబొమ్మలాడించే విధానం - 163, ఆటవారిగూడితిరా ఆటవారిఁగూడి అన్నిచోట్ల బొమ్మ లాటలాడించనధికుండవైతివి, తోలుబొమ్మల దొరకొని గడియించి - 163

కులము - భక్తి

అన్నమయ్య తన సంకీర్తనలలో ప్రధానంగా వివరించినది కులం కంటే హరి భక్తి గొప్పదీ అని. కులాన్ని బట్టి మనుష్యుల ఆధిక్యతను గుర్తించరాదని, కులాన్ని మించినది గుణమని నొక్కి వక్కాణించాడు. ఈ రెండు కీర్తనలలో ఈ విషయాన్ని వివరించాడు అన్నమయ్య.

ఏ కులజుడేమి ఎవ్వడైననేమి ఆకాడనాతడే హరినెరిగినవాడు - 292

ఈ కీర్తన చరణాలలో పరనింద సేయనివాడు, సత్యసంపన్నుడు, భూతదయానిధి, ధర్మతత్పరుడైనవాడు, పగలేనివాడు, వేంకటేశు దాసుడైనవాడు, ఏ కులజుడైన ఉత్తముడే అని అన్నమయ్య మాట.

ఎక్కువ కులజుఁడైన హీన కులజుఁడైన

నిక్కమెరిగిన మహానిత్యుఁడే ఘనుఁడు - 318, హరిభక్తి లేని సన్యాసి కంటే తరవిమాలిన అంత్యజాతి కులజుఁడైన నరసి విష్ణునివెదుకునాతడే ఘనుఁడు

హరిభక్తి ఆదరించని సోమయాజికంటే ఏదియును లేని కులహీనుడైన విష్ణుపాదమును సేవించు భక్తుడే ఘనుడు అనే తీర్పు అన్నమయ్యది.

హరిభక్తి ప్రియుడు అన్నమయ్య.

వైష్ణవము : వలపుతేనెవో వైష్ణవము

అన్నమయ్య వైష్ణవమతమును గుండెనిండుగా ప్రేమించినవాడు, వైష్ణవమతాధిక్యతను పదేపదే తన రచనలలో అభివర్ణించాడు. అందరూ వైష్ణవులే అని తీర్మానించాడు. వైష్ణవమును గురించి వర్ణించే సందర్భంలో వలపుతేనెవో వైష్ణవము అన్నాడు.

అన్నమయ్యకు వైష్ణవము 'వలపుతేనె' అంతమధురము ప్రియము కనుకనే – వైష్ణవాచారాలు, శరణాగతి, దాసభక్తి, ప్రపత్తి – విషయాలను వివరించే కీర్తనలు విరివిగా వ్రాసాడు.
నిత్యులుముక్తులు నిర్మలచిత్తులు నిగమాంతవిదులు వైష్ణవులు – 414 వైష్ణవులు కానివారెవ్వరు లేరు విష్ణుప్రభావ మీ విశ్వమంతయుగాన – 36 మదమత్సరము లేక మనసుపే దైపో పదరిన యాసలవాడు వోవైష్ణవుడు. అంతటా ఉన్నారు వైష్ణవాధికులు – 418 ఇహపరమిదియే హరిసేవే – 439 హరియేపరతత్త్వము – 442 ఆతని కైంకర్యమెపో కలకాలము మనకుకాణాచి – 444 వంటి అభిప్రాయాలు గల కీర్తనలు ఈ సంపుటిలో ఉన్నాయి.

అన్నమయ్య సంకీర్తనలలోని విషయవైవిధ్యం విశేషమైనది. కొన్ని కీర్తనల ఎత్తుగడలలో కవి తత్వం పాఠకులకు తెలియవస్తుంది. వేదాంతసారాన్ని చేతవెన్నముద్దలుగా అందించిన వాగ్గేయకారుడు అన్నమయ్య.

ఇలా జీవన సత్యాలను పల్లవులలో పరిమళంప జేసిన అన్నమయ్య స్వామివారితో ప్రత్యక్షంగా నెఱపిన సంభాషణలలో కొన్ని ఆణిముత్యాలు

వివిధ దేవతల వర్ణన

శ్రీ వేంకటేశ్వరుడు సకలదేవతాస్వరూపుడనే భావనగలవాడు అన్నమయ్య. అన్నమయ్య వివిధ దేవతల వర్ణనలు చేసాడు.

వివిధ పురాణాలలో ఆయా దేవుళ్లకు సంబంధించిన గాధలు పేర్కొంటూ రచన చేసాడు. శ్రీ వైష్ణవములో తొలిపూజ విష్వక్సేనునికి. అతడు దేవతల సేనాని అతడు సూత్రవతీ దేవి వల్లభుడు ఆ విషయాలను పేర్కొంటూ వ్రాసిన రెండు కీర్తనలు ఈ సంపుటిలో ఉన్నాయి.

విష్వక్సేనుడు

సూత్రవతీ పతి – శ్రీవిభాప్రతినిధివిసేన మొదలారి
పసిఁడి బద్దలవారు పదిగోట్లు కొలువ
వేంకట విభుసిరులపెన్నిధినీవే – సేనమొదలారి – 255

ఈ కీర్తనలో ప్రస్తుతింపబడిన సూత్రవతీ పతి పేరు చెప్పలేదు అన్నమయ్య. ఆతడు విష్వక్సేనుడు.

నరసింహుడు

అన్నమయ్య దృష్టిలో శ్రీ వేంకటేశుడు శ్రీ నారసింహుడు, శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, శ్రీవిఠలుడు ఒక్కరే అందుకే ఎవరిని కొలచిన నిన్ను కొలుచుటే అన్నాడు. వీరిలో ముఖ్యంగా అహోబలం అన్నమయ్య మనసుకు నచ్చినదీ మంత్రోపదేశం పొందిన క్షేత్రం కావడంతో నృసింహుని కీర్తిస్తూ చాలా కీర్తనలు వ్రాసాడు.

సంస్కృతం లోను, తెలుగులోనూ అన్నమయ్య భక్తితో నృసింహుని వివిధ సంబోధనలతో నుతించాడు.

అన్నమయ్యకు వేంకటేశ్వరుని వలె మనస్సుకెక్కిన దైవం అహోబల నృసింహస్వామి అహోబిలం. అన్నమయ్యకు వేదాంత విద్యనేర్పిన విద్యాలయం. అహోబిలంలోని నవనారసింహమూర్తులను ఒక సంకీర్తనలో కీర్తించి తరించాడు.

నవనారసింహనమోనమో - 453

నృసింహుని – మగసింహము, నరకేసరి, పంచాననం, మానసిమొకము అనే సంబోధనలతో నుతించడంతో పాటు

నృసింహుని - నవరసాలంకారనరకేసరిగా - 477

ఘోరవిదారణనారసింహునిగ (68) అహోబిలముననతి రౌద్రముతో – ఇలయును నభమును నేకరూపమై జలజల గోళ్లు జళిపించిన – వానిని – 85.

నవరసాలంకార నారసింహ ఫాలనేత్రానలప్రబలవిద్యుల్లతా - 259

కేలీవిహార లక్ష్మీనారసింహ ॥ప॥ 281 కీర్తనలో ఓ జో గుణభూయిష్టమయిన రచన – నృసింహుని రౌద్రరూపాన్ని రూపుకట్టిస్తుంది. నిశ్చలనారసింహుని, గుణార్ణవనారసింహుని కూడా వర్ణించాడు.

శరణాగత త్రాణ సౌమ్యనరకేసరిగా - 421

దర్శిస్తాం. అంతేకాదు – శరణాగత సౌమ్య నరకేసరిగా చేసే నేర్పు అన్నమయ్యది.

428. పరిపూర్ణ రుదాద్రి పంచాననం అంటూ పావనం పంచముఖపంచాననం అని పంచముఖ నారసింహుని భావిస్తాడు అన్నమయ్య

436. "నిక్కించీఁగర్ణములు మానిసి మొకము
నిక్కపుకరుణతో మానిసిమొకము
కరములు వేయింటాఁగైకొని యాయుధములు
నగుమోగము నెరపీనీ నవ్వులు మానిసిమొకము"

భీకరుడయిన నరసింహునిలో నవ్వును చూడగలనేర్పు అన్నమయ్యది.

శ్రీరాముడు

నవముగా రామాయణము వ్రాసిన అన్నమయ్య సంకీర్తనలలో రామకథాఘట్టాలు వర్ణింపబడిఉ న్నాయి. ముఖ్యంగా యుద్ధరంగాన్ని వర్ణించే సందర్భంలో ఆయా పాత్రల పలుకులలో నత్తిని, ధ్వన్యను కరణ పదాలను ప్రయోగించి అన్నమయ్య కీర్తనలు వ్రాసాడు.

బాపు దైవమా మా పాలిభవమా
తీపు రాకాసినెత్తురు దీం దోందోం దోందోం దోందోం **।।పల్లవి।।**

చ.1. కాలనేమిపునుకిది కంచువలె లెస్స వాఁగీ
తాళమొత్తరే తత్త తత తత్తత్త
కాలమెల్ల మాభూతగణమెల్ల వీఁడె కాచె
నేలఁబడి నేఁడును ధీం ధీం ధీం ధీం ధీం ధీం ధీం **।।బాపు।।**

314. "దేవ దేవంభజే దివ్య ప్రభావం
రావణాసురవైరి రఘుపుంగవం" అంటూ సంస్కృతంలో రాముని కీర్తించాడు.

సంక్షిప్తంగా రామకథ చెప్పిన కీర్తన - 474

'సీతమ్మ బెండ్లాడె చెప్పఁగొత్తకదవె'

సీతారామకల్యాణం ఎప్పుడు చెప్పినా ఎవరు చెప్పినా కొత్తగా మనోహరంగా ఉంటుందని అన్నమయ్య తీర్పు.

హనుమ

రామసేవాదురంధరుడైన హనుమను అన్నమయ్య కరవుతీరా వర్ణించాడు.

పొంకపుకలశాపుర హనుమంతుడిని - 279, సీతాశోకవిఘాతుని - 366 - వర్ణించడంతో పాటు

హనుమ వీరపరాక్రమం గురించి శ్రీరామునితో వివరిస్తూ అన్నమయ్య ఒక అపురూపమైన కీర్తనవ్రాసాడు.

నేలమిన్ననొక్కఁటైన నీబంటువొక్క
వేలనే యక్షునిఁ దెగవేసిఁనా నీబంటు - ।।పల్లవి।।
ఉంగరమెగరవేసి యుదధిలోఁబడకుండ
నింగికిఁజెయిచాచె నీబంటు - 1-69

అక్షకుమారుని అవలీలగా చంపాడు అని చెప్పడానికి ఒక్క వేలనే యక్షుని 'దెగవేసె! అన్నాడు. ఇక సముద్రలంఘనం చేసే సమయంలో శ్రీరాముడు సీతామాతకు గుర్తుగా చూపడానికి ఇచ్చిన ఉంగరం – ఎగరవేసి సముద్రంలో పడకుండా ఆకాశంవైపు చేయిచాచి పట్టుకున్నాడట. ఈ విశేషాంశం – సంస్కృతాంధ్ర రామాయణాలలో నేను చూచినంత వరకు ఎక్కడాలేదు. ఇది మరి అన్నమయ్య దర్శించి రచించినది కావచ్చు.

శ్రీకృష్ణుడు

తల్లి యశోదకే కాదు. గోపికలకందరికీ బాలకృష్ణుడంటే ఎనలేని ప్రేమ. తల్లియశోదకి కోపం వచ్చి రోలుకి కట్టేసినప్పుడు 'విడిచిపెట్టమంటూ ఆర్తితో – ఇకనుండి అల్లరిచేయడు, నువ్వు కోపగించిభయపెట్టకు అంటూ బ్రతిమాలుతున్న కీర్తన – 57 అన్నమయ్య మాతృహృదయానికి అద్దంపడుతోంది.

58 లో పట్టవసముగాని బాలుణ్ణి, వేదపల్లవపు

వేంకటగిరిపై పాదము మోపిన బాలుడా! అంటూ సంబోధించి పరవశించిపోతాడు.

శ్రీకృష్ణుని చర్యలు అన్నీ వింతగా ఉంటాయి – రుక్మిణీ కల్యాణం, నీలా పరిణయం గురించి చెప్తూ

దిక్కిందరికినైన దేవుఁడు కడు

దెక్కలి కాఁడైన దేవుడు

అంటూ ఇలా అధిక్షేపించిన అన్నమయ్య – 170 వ కీర్తనలో

గోపాంగనల మెఱుఁగు గుబ్బచన్నులమీద

చూపట్టు కమ్మఁగస్తురి పూఁత, ఇతడు అంటాడు.

చాణూరవధ సందర్భంలో బాలకృష్ణుని రౌద్రాన్ని రూపకట్టించిన సంకీర్తన – 211. ఎటువంటి రౌద్రమో యెటువంటి కోపమో తటతట నిరువంక దాఁటీవీఁడే

తోరంపుఁబెను చేతులమల్లచఱచి
దారుణలీలఁబెదవులవుడు కఱచి
కారించి చాణూరుఁగడు భంగపఱచి
వీరుఁడై యెముకలువిఱచీవీఁడే ॥ఎటు॥

చివరకు శ్రీతిరువేంకటేశుఁడై మించి ముసిముసి నవ్వులు ముంచీ వీఁడే – 211

వివిధ తినుబండారాలు బాలకృష్ణుని కళ్లబడకుండా దాచాలనుకున్న బాలులలతోకలిసి వాటిని ఆరగించి

కివ్వకివ్వనవ్వనణకించీజుండీ – 256

శ్రీకృష్ణుని అన్నమయ్య – భావమునఁ బరబ్రహ్మగా, నీలమేఘముపనిషదర్థంగా, తనియని వేదాంతరహస్యంగా, భయములేని పెనుఁబరమపదంగా దర్శించాడు 258. అంతేకాదు

ఆదిమునుల సిద్ధాంజనంగా – పరమునకునుఁదాఁబరమై మెలగిన – వేంకటకృష్ణుని కీర్తిస్తాడు – 261

పాలదొంగవద్ద వచ్చిపాడేరు తమ

పాలిటి దైవమని బ్రహ్మాదులు – అంటూ నారదాదులు, శేషాదులు, సనకాదులు ఆ కృష్ణశిశువును దర్శించిన కీర్తన – 311

'అందరికాధారమైన ఆదిపురుషుఁడీతఁడు
విందైమున్నారగించె విదురునికడనీతఁడు' 351

శ్రీకృష్ణుని – లీలలు చూసికూడా ఆకాలం వారుఎందుకు ఆతని భగవంతుడని తెలుసుకోలేక మోసపోయారో అంటూ అన్నమయ్య – ఆనాటి వారిపై జాలిచూపుతున్నట్లుగా శ్రీకృష్ణుని మహిమలు వర్ణించి తాను తరించి మనలను తరింపచేసాడు – 503

295 లో విశ్వరూప దర్శనం, భగవద్గీతోపదేశం, భారత కథ కలిగించిన శ్రీకృష్ణుని వర్ణన విశేషమయినవి

ఇందిర

ఈ సంపుటిలో ఎనిమిదవ కీర్తన అన్నమయ్య ఇందిరా నామ మిందరికి కుందనపు ముద్ద

అంటూ ఆరంభించాడు. బంగారుముద్దగా భావించిన ఆ ఇందిర అనే నామం, అటు శ్రీమన్నారాయణునకు ఇటు అన్నమయ్యకు కూడా ప్రీతి కరమయినదే. అందుకే పదే పదే ఈ నామాన్ని తన రచనలో తలుచుకున్నాడు అన్నమయ్య.

అందుకే – స్వామికి భోజనం – ఇందిర వడ్డింప నింపుగను – 22,

ఈ పాదమేకదా ఇందిరా హస్తములకితమైనది – 66

ఏ దైవము వురస్థలంబుదనకుమందిరమైన ఇందిర – 100

ఇవి 'ఇందిర'ను భజించిన కీర్తనలు కొన్ని.

అలమేలుమంగ – శ్రీ వేంకటేశుని ప్రియాంగన అలమేలుమంగ

మామకూతురలమేలుమంగ నాచారియు దాను గీముగా నీవేంకటగిరినుండేవాడు – 121, గతియలమేల్‌మంగనాంచారికి బతియగు వేంకటపతిఁదలఁచి – 7, చూడచూడమాణిక్యాలు చుక్కలువలెనున్నవి యీడులేనికన్నులవెయిన చంద్రులు – పల్లవి – 133 అనే కీర్తనలో

స్వామి వివిధ ఆభరణాలను చూబిస్తూ –పక్కనే ఉన్న'చక్కనమ్మ అలమేలుజవరాలదె' – అంటాడు అమ్మ అలమేలుమంగమ్మ మమతలు కురిపించే మహానీయురాలు – అందుకే అన్నమయ్య

మమతలనలమేల్మంగకు సంతత
రమణుడు వేంకటరాయఁడు 354 అంటూ ప్రత్యేకంగా పేర్కొన్నాడు.

దశావతారాలు

అన్నమయ్య కీర్తనలలో దశావతారవర్ణన విశేషంగా కానవస్తుంది. ఈ దశావతారవర్ణనలు. పొడుపు కథల రూపంలో, లోకవృత్త సమన్వయంతో, ఒక భూత భావనతో, ఒక దొంగధోరణిలో ఇలా – దశావతార తత్వాన్ని ఆవిష్కరిచండంలో అన్నమయ్య చేసిన ఊహాకల్పనలు – అనితర సాధ్యమైనవి. పది అవతారాలను ఒకసారి చెప్పిన విధంగా మరోసారి చెప్పకుండా అన్నమయ్య కవిత శాతాధిక అవతారాలు ధరించింది.

ఒకసారి తెలుగుపదాలతో, మరొకసారి సంస్కృతం లో స్వామి చేతిని వర్ణించినా, పాదాన్ని వర్ణించినా దశావతారాలను సాక్షాత్కరింపచేస్తాడు.

చిత్ర చిత్ర పద బంధాలతో, వింతవింత అర్థాలతో, అలంకార సంపదతో వ్రాసిన కీర్తనలలోని శబ్దచమత్కార అర్థచమత్కారాలను గ్రహించినప్పుడు అన్నమయ్యలోని కవి ప్రతిభకు నమస్కరించి – ఆహా! అని ఆనందింపనివారు ఉండరు.

19, 73 – దశావతార – చమత్కారం – పొడుపు కథ, 109 – పొడవైన నల్లని భూతము, 322 – తేదెవో వింతదొంగ, 335 – అందరిబ్రతుకు – 5 చరణాలు, **55 – ఏమి సేయవచ్చుఁ గర్మమిచ్చినమంతే కానలేదు. తాము వేసినంత పట్టుతమకు బోలేదు** –51 రామక్రియ

74. ఎవ్వడో కాని యెఱకఁగరాదుకాదు

దవ్వుల నే వుండు తలఁపులోనుండు ఇలా సాగుతుంది కీర్తన. ఇది పొడుపు కథ పొడిచేపద్ధతి. శ్రోతవిప్పాలి.

192. ఈ కీర్తనలో లోకంలో తల్లిదండ్రులు చేసే కార్యాలు వివరించినట్లు ఉంటుంది. కానీ శ్రీ వేంకటేశుడు తనను లోనపెట్టుకుని మనకు లోనై దాతయుదైవము అయినవానిగా భావనచేసాడు అన్నమయ్య అన్నీ చక్కని తెలుగుపదాలే.

తానేకాకెవ్వరు మాకు దాతయు దైవము తన
లోనఁ బెట్టుకొని మాకు లోనైనవాఁడు **॥ పల్లవి ॥**

చ.1. చదివించి, కూడువెట్టి, జారకుండ నిల్లుగట్టి,
బెదరులేని బుద్ధి పిన్ననాఁడే చెప్పి

యెదిరి నడిగి ద్రవ్య మిదిగొమ్మనుచు నిచ్చి
వదిలమై తమ్ముఁ బాలించువాఁడు ॥తానే॥

మత్స్యావతారంలో వేదాలు ఇచ్చి చదివించాడు. అమృతంపెట్టినది కుర్మావతారంలో వరాహవతారం లో స్వామికి ఇల్లు కట్టుకోవడానికి స్థలం ఇచ్చాడు. బెదురు లేని బుద్ధిచిన్న, నాడే చెప్పి ప్రహ్లాదునికి హరిభక్తిని చిన్నతనంలోనే చెప్పి, ఎదిరినడిగి ద్రవ్యమిది గొమ్మనును = వామనావ తారంలో దానమడిగి తమ్ము పాలించువాడు.

125 – ఎన్నో అవస్థలు పడుతున్న స్వామిని తెలుగు పదాలతో వర్ణిస్తూ – దశావతారాలను సాక్షాత్కరింపచేసే అద్భుతమయిన శబ్ద శక్తికి అర్థశక్తితోడైన అన్నమయ్యలోని రచనా చమత్కారం పాఠకులకు మనోరంజకం కలుగజేస్తుంది.

స్వామీ నీకు ఎన్ని కష్టాలయ్య – నీకెవ్వరూ లేరు యేమి చేస్తావయ్యా అంటూ – అతనికష్టాలు

'కన్నుమూయ బొద్దులేదు కాలుచాఁచనిమ్ములేదు'

కాసేపు విశ్రాంతిగా కళ్లుమునుకు పడుకుందా మంటే లేదు కదా – అంటూజాలిపడుతున్నాడు అన్నమయ్య. మత్స్యావతారవిషయం. చేపకు కన్నుమూసే అవకాశం లేదు. దాని కనురెప్పలు మూత పడవు సహజంగానే. కాలు చాఁచనిమ్ములేదు. కాస్తకాళ్లు చాచుకు పడుకోవడానికి చోటులేదునీకు. అందుకే నీ కాళ్లు నీతో నీలోదాచేసుకుంటావు. కూర్మావతార విషయమిది. తాబేలు తన కాళ్లు, తలకూడా తన లోపలికి దాచుచుకుంటుంది. లోక సామాన్యమైన విషయాన్ని కవిత్వీకరించాడు అన్నమయ్య

వివిధ సేవలు

తిరుమలేశునికి నిత్యము, నిరంతరము ఏవో సేవలు నిర్వహిస్తూ ఉంటారు. స్వామి ఉత్సవ సేవాప్రియుడు.

కీర్తనల్లో స్వామికి జరిపే సేవల వర్ణనలు

మేలుకొలుపులు, మజ్జనక్రియ, ఆరగింపు, ఊయల సేవలు, మంగళహారతులులో చోటు చేసుకున్నాయి. తిరునాళ్లు, యాత్రికులరాక, చక్రాయుధము, అనంతుని వ్రతము, శృంగారకీర్తనలు

మేలుకొలుపు : దీనికే సుప్రభాత సేవ అని కూడా వ్యవహరిస్తారు.

భోగిశయనమును బుసకొట్టెడిని యోగనిద్రపాయును మేల్కొనవే ॥ప॥ – 139

స్వామిది శేషపాన్పు. తెల్లవారింది. శేషుడు మేల్కొని బుసకొడతాడు. నీయోగ నిద్రకు భంగం కలగవచ్చు మేలుకో! అంటూ అన్నమయ్య స్వామి వారిది 'యోగనిద్ర' అని స్పష్టం చేసాడు. అంతేకాదు చీకటి పోవాలంటే సూర్యోదయమై ఎండవ్యాపిస్తే చాలదు స్వామీ! 'నీకనురెప్పలు తెరవక చీకటి దీరదిదే'

నీ రెప్పలు తెరవాలి. నీ రెప్పలు విప్పితేనే కదా సూర్యోదయమయ్యేది. పగటి కన్ను సూర్యుడు, రాత్రి కన్ను చంద్రుడు – నీ కన్నులే కదా.

మజ్జనక్రియ : స్వామివారికి అభిషేక సేవ

సందడి విడువుము సాసముఖా మంధరధరునకు మజ్జన వేళా ॥ పల్లవి ॥ 112

స్నానసమయంలో కూడా ఆదిమునులు, నిత్యాధికుల వేదఘోషణము విడువక సేయుఁడు అని అన్నమయ్య అభ్యర్థన.

భోజనము : ఆరగింపు

స్వామివారిని భోజనకార్యక్రమాన్ని వర్ణిస్తూ అన్నమయ్య – స్వామీ! ఇందిర ఎంతో ఇంపుగా వడ్డిస్తోంది. 1. 22

చిందకయిట్లే భుజించవో స్వామీ! అంటూ వేడుకుంటున్నాడు. ఈకీర్తనలో నాటి వంటకాల పరిమళాలు పాఠకులకు అందించాడు అన్నమయ్య 138వ కీర్తనలో

పంకజాక్షులు సొలసిపలికినగగా

నింకానారగించు మిట్లనే అయ్యా ॥ పల్లవి ॥ అంటూ ఆహ్వానిస్తాడు.

ఊయల – 67

స్వామికి కడువేడుకైన సేవ ఊయలసేవ.

ఆ ఉయ్యాల నిర్మాణవైభవాన్ని, ఊపే భామినుల సొగసునీ ఊపు ఊపుకీ – కమలకునుభూసతికి కదలుకదలుక మిమ్ముఁ గౌఁగిలింపఁగఁజేసెనుయ్యాల! అంటూ ఆనందపడే అన్నమయ్య,

'అలరఁజంచలమైన ఆత్మలందుండనీ

యలవాటు సేసెనీవుయ్యాల' అంటూ ఉయ్యాల స్వామికి చేసినమేలును గుర్తుచేయుడం విశేషం.

స్వామిరథము

స్వామి నిర్వహించిన వివిధ మహత్కార్యాలకు సందర్భాన్ని బట్టి రథాలు అధిరోహించాడు. శ్రీరాముడు రావణునితో యుద్ధంచేసినప్పుడు దేవేంద్రుని రథం ఎక్కాడు.

సీతాదేవితో అయోధ్యకు వచ్చేవేళలో పుష్పకరథం ఎక్కాడు. ఇలా ఏయేరథాలు ఎక్కి కార్యాలు సాధించాడో – దేవదేవుఁడెక్కినదె దివ్యరథము.

మావంటి వారికెల్లమనోరథము – 400 అనే కీర్తనలో దర్శించవచ్చు.

అలాగే తిరువీధులలో ఊరేగే సందర్భంలో స్వామి అధిరోహించిన తేరుల సొగసు 424 కీర్తనలో చూడవచ్చు.

మంగళము

మంగళము గోవిందునకు జయమంగళము గరుడ ధ్వజునకు అంటూ స్వామి ఎన్నో విశేషణాల కీర్తించినా చిట్టచివరగా 'పంకజాకుచకుంభ కుంకుమపంకలోలునకు' అంటే గాని స్వామివారికి తృప్తి కలగదని గ్రహించిన భక్తుడు అన్నమయ్య. అన్నమయ్య నిచ్చలును మరలిమరలి పలికే జయమంగళం శుభమంగళం, కమలారమణికి కమలాక్షునకు మాత్రమే కాదు

'ఇత్తులనత్తల యిరువురకాఁగిటి
జొత్తుల రతులకు శుభమంగళము – 448 ఇదీ అన్నమయ్య 'మార్కు' కవిత

కొండకు వచ్చే యాత్రికులు – 346

తిరుమల కొండకు

'నానాదిక్కులనరులెల్లా
వానలలోననెవత్తురు గదలి
సతులు, సుతులు పరిసరులు బాంధువులు
హితులు గొలువఁగా నిందరును
శతసహస్రయోజన వాసులు
వ్రతముల తోడనె వత్తురు గదలి అంటూ ఏమేమి వస్తుజాలాలతో ముడుపులు మోసుకుని వస్తారో వర్ణించాడు.

తిరునాళ్లు – 368

తిరుమలకొండ మీద జరిగే బ్రహ్మోత్సవాలు గొప్ప తిరునాళ్లు. భూలోకంలోని భక్తజనులేకాక దేవలోకంనుండి హరిహరాదులు, మునులు, సురలు, చంద్రుడు, యముడు, దిక్పతులు, నారద సనకాదులు కూడా తరలి వస్తారు. అలా తరలివచ్చిన వారిని వీడ్కోలు పలుకుతూ వేంకటగిరీశుడు

భోగీంద్రులను మీరు బోయిరండు
వేగనమీఁదటి విభవాలకు – పల్లవి

తిరిగి మీదట తిరునాళ్లకు రండి – అన్నాడు దేవతలతో. ఈ ఉత్సవాల్లో అలసిపోయారు మీమీ ఇళ్లకు ఆనందంగా వెళ్లి రండి అన్నాడు. నారద సనక సనందనాదులతో మాత్రం 'దూరగముగాఁ బోకిట్టే – తరలి రండి – నన్ను ఇదేవిధంగా సేవించండి అంటూ ఆప్యాయంగా ఆహ్వానిస్తున్న వేంకటేశ్వరుని ఈ కీర్తనలో అన్నమయ్య దర్శింప చేసాడు.

అనంతునివ్రతం - 344

అన్నమయ్య కీర్తనలలో ప్రత్యేకంగా పేర్కొన్న వ్రతం అనంతుని వ్రతం. బహుశా అన్నమయ్య కుటుంబీకులు ఈ వ్రతం జరిపే వారేమో!

వేంకటరాముడు, వేంకటకృష్ణుడు, వేంకట నృసింహుడు అనే ప్రయోగాల లాగానే, వేంకటగిరి అనంతుడు కూడా.

ఎదుటి నిధానమువెటుచూచిన నీ
వదె వేంకటగిరియనంతుడా! ।।పల్లవి।। 344

వ్రతం ఏ రోజు ఆచరిస్తారో, కథ ఏమిటో కూడా అన్నమయ్య ఈ కీర్తనలో వివరించాడు. పల్లవిలోనే కాక ప్రతిచరణాంతంలో వేంకటగిరి యనంతుడా! అని సంబోధించాడు భక్తితో.

వివిధ లౌకికాంశాలు

ఈ లోకంలో మానవజన్మ అత్యంత దుర్లభమైంది. అది పూర్వజన్మ సుకృతంవల్ల లభిస్తుంది. భగవంతుడు మానవుణ్ణి బుద్ధిజీవిగా పుట్టించాడు. కాబట్టి తన బుద్ధిని సన్మార్గవర్తినిగా చేసుకోవలసిన బాధ్యత ఉంది. ఆ బాధ్యత సక్రమంగా నెరవేర్చుకోవడానికి కొన్ని విషయాలపరిజ్ఞానం ఎంతో అవసరం. మానవజీవితంలో బాహ్యంగా ధర్మాచరణతోపాటు, అంతరంగంలో జ్ఞానం ఎంతో అవసరం.

మనసు, మాయ, సంసారం, బ్రతుకు, చదువు, శాంతము, విధి, కర్మము, యోగి, మోక్షము వంటి విశేషాంశాలలో ఆధ్యాత్మిక విజ్ఞాన సర్వస్వంగా తన కీర్తనలను రూపొందించాడు అన్నమయ్య. సరళంగా స్పష్టంగా ఆయావిషయాలను వర్ణించిన తీరు విశిష్టమైనది. వాటిని పరిశీలిస్తే

1. శాంతము

మానవుడు జీవితంలో తప్పక అలవరచుకోవలసిని గుణము శాంతము.

చదివియు ఫలమేది శాంతము కలుగుదాకా - 437
నిరతశాంతము కంటె నిజధర్మమెందు లేదు - 443
గుణములెల్ల నిర్గుణముగాక తలకూడదు శాంతంబు - 451
మితిలేని శాంతమను మేటి కైదువఁగాని
కృతకంబు విషయముల గెలుపెరుగరాదు - 303

2. చదువు

మానవుడు బుద్ధిజీవి కనుక - చదువుకోవడం ఆతని ప్రధాన కర్తవ్యం. అయితే ఆ చదువుల తీరుతెన్నులను గమనించిన అన్నమయ్య నాటి చదువులకు కలియుగంలోని చదువులకుగల తారతమ్యాన్ని సరళంగా స్పష్టంగా వివరిస్తూ

'నాఁటికి నాఁడే నా చదువు
మాటలాడుచును మఱచేటి చదువు' – 91 అనే కీర్తన వ్రాసాడు.

చదువు పరమార్థాన్ని గ్రహించ లేకపోతున్నారనే వేదనను తన రచనలలో వ్యక్తీకరించాడు అన్నమయ్య.

శ్రీ వెంకటేశ్వరుని పాదములమీద, పదములమీద కోర్కెలు అతిశయించకపోతే – చదువులు బహువిధాలుగా అనిపిస్తాయి. అన్నమయ్య వ్రాసిన ఈ వెంకటేశ్వరుని పదముల మీద కోరికలున్న వారికి సందేహాలు రానేరావు అనే విషయాన్ని చెప్పక చెప్పాడు.

ఇలా చెప్తూనే చదువలలోనే హరిని జట్టిగొనవలెగాక – 449 అని భక్తులకు దిశానిర్దేశం చేసాడు అన్నమయ్య.

3. మనసు – 337

'మనసు' – నిర్వచించలేని, రూపం లేని ఒక మహాపదార్థం. దాన్ని నిర్వచించడమే కాదు, దాన్ని సంబోధిస్తూ కూడా అన్నమయ్య కీర్తనలు వ్రాసాడు.

ఎండలోని నీడ యీ మనసు

పండుగాయసేయఁబని లేదు మనసు ॥పల్లవి॥ – 337

ఎన్నెన్నో ఉపమానలతో 'మనసు'ను పరిచయం చేసే కీర్తన ఇది. అలాగే – మనసా! అని సంబోధిస్తూ

'పారకు మీ వోమనసా పంతము విడువకు మీ మనసా
పారిన నీవే బడగయ్యెదవు చేరువనాఁడే చెప్పనెమనసా

మనసును సంబోధిస్తూ – మానవులకు హితబుద్ధులు నేర్పే ప్రయత్నం చేసాడు ఈ కీర్తనలో అన్నమయ్య.

4. బ్రదుకు – 348

లోకంలో అందరూ బ్రదుకు సాగిస్తూనే ఉంటారు. అయితే బ్రదుకు అంటే ఏమిటి అని అడిగితే ఏమి చెప్పాలో తెలియనిస్థితే అందరిదీ. కానీ అన్నమయ్య బ్రతుకుతీరుతెన్నులను చక్కనితెలుగులో వివరించి చెప్పాడు.

'ఏటి బ్రదుకు యేఁటి బ్రదుకు వొక్క
మాటలోనే యటమటమైన బ్రదుకు' అనే పల్లవితో ఆరంభించి – పొగకు నోపకమంటఁబొగిలేటి బ్రదుకు' – అంటూ ముగించాడు 348 కీర్తనలో.

'తలపు కామాతురత్వము మీఁద నలవడిన
నిలనెట్టి వారైన నేలాగుగారు ॥ తల ॥

ఓలినిరువురు సతుల నాలింగనముసేయ
లోలుఁడటుగాన నాలుగు చేతులాయ
వేలసంఖ్యలు సతుల వేడుకల రమియింపఁ
బాలుపడె కాన రూపములు పెక్కాయ ॥తల॥ – 105

6. మోక్షం

పదిలమై వేంకటపతి భక్తిగలిగి తాను
తుదిపదంబునకెల్ల దొడవవునపుడే 20
దొరకునా యితని కృప తుది పదంబు – 358

మోక్షము – అనే సంస్కృతపదానికి అన్నమయ్య చక్కని తెలుగు పదాలు తన రచనలో చూపించాడు. తుదిపదము, కడగనుట, కొనకెక్కుట అనేవి. తెలుగు పదాలు లభించినా ఆ'పదం' లభించడం కష్టమే

7. యోగి

ఏయే గుణాలు ఉంటే యోగిగా పరిగణింపబడతాడో ఈ కీర్తనలో అన్నమయ్య వివరించాడు.
వాసివంతువిడిచినవాడే యోగి; యీ ఆసలెల్లా విడిచిన ఆతఁడే యోగి

8. కర్మ

భారతీయులు కర్మసిద్ధాంతాన్ని గౌరవించేవారు. ఎవరు చేసిన కర్మవారు అనుభవించవలసినదే అనే మాట సత్యము.

కర్మము చేసే చేతలు ఇన్ని అన్నీకావు. అందువల్ల కర్మమునే ఆశ్రయించి సంబోధిస్తూ దాని చేష్టల వికారాలను వర్ణిస్తూ అన్నమయ్య వ్రాసిన కీర్తనలో 'కర్మ' నే మన్నించమని వేడుకోవడం విశేసం.

'ఎన్ని బాధలఁబెట్టియే చెదవు నీవింక నెంత కాలము దాఁకఁ గర్మమా
మన్నించుమనుచునీమఱుఁగు చొచ్చితిమి మామాటాలకించవో కర్మమా॥ – 284

కాస్త మేం చెప్పిన మాట విను అంటూ అభ్యర్థించే జీవుని దీనస్థితిని ఈ కీర్తనలో చూడవచ్చు.

తనకర్మమెంత చేఁతయునంతే
గొనగొన్న పనియంత కూలీనంతే ॥పల్లవి॥

ఈ కర్మానుభవం జీవులకే కాదు దేవునికైనా తప్పదు – అంటూ కొన్ని దృష్టాంతాలు చూపిస్తున్నాడు అన్నమయ్య.

"ఎట్టివారికినెల్లనిట్టి కర్మములు మా
యెట్టివారికి నింకనేది తోవయ్య ॥ప॥ – 277

చ. పాముఁజంపినయట్టిపాతకమునఁ బెద్ద
పాముమీఁద నీకుఁ బవళించవలసె
కోమలిఁజంపినకొఱఁతవల్ల నొక్క
కోమలి నెదఁ బెట్టుకొని యుండవలసె ॥ఎట్టి॥

శ్రీకృష్ణుడు బాల్యక్రీడలలో ఒక పామును చంపాడు. ఆ కారణంగా ఆయనకు పాముమీదనే పవళించవలసివచ్చింది. అలాగే పాలు ఇవ్వవచ్చిన స్త్రీని పూతనను గుండెలమీద కొట్టి చంపినందువల్ల మరొక స్త్రీని గుండెలో మీద పెట్టుకోవలసి వచ్చింది. లక్ష్మీదేవిని వక్షస్థలమందు ధరించిన విషయం. మరి శకటాసురుణ్ణి బండిరూపంలోవచ్చిన రాక్షసుణ్ణి విఱిచిన పాపానికి అర్జునుని బండితోలవలసి వచ్చింది. గోవర్ధనగిరి పెఱికి పైకి ఎత్తినందుకు గాను ఈనాడు తిరుమల కొండమీదనే కూర్చోవలసి వచ్చింది.

ఈ అపూర్వమయిన ఆలోచనలన్నీ అన్నమయ్యలోని కవివి.

9. మాయ

రూపంలేని మహావస్తువు మాయ. ఈ మాయను జయించడం అసాధ్యం. మాయ చేయలేని కృత్యాలు లేనేలేవు. ఆమాయను గురించిన ప్రస్తావన అన్నమయ్య కీర్తనల్లో బహుధా విస్తరించి ఉంది.

అరుదరుడు నీ మాయ హరిహరీ
అరసితెలియగరాదు హరిహరీ ॥పల్ల॥ – 480

ఇరవైన యట్టుండు యెఱగనీదీమాయ – 486

మాయకు లోనైనాను – 491

మాయ చేసే పనులను పేర్కొంటూ ప్రత్యేకంగా ఒక కీర్తన రచించాడు అన్నమయ్య – 130

'పరమాత్ముని నోరఁబాడుచును యిరు
దరులుగూడఁగఁదోసి దంచీ మాయ ॥ప॥

బ్రహ్మాండమనే రోటిలో జీవులనే ధాన్యాన్ని పోసి, దుర్మోహమనే రోకలితో, కళ్లుతిప్పుతూ, చేతులు విసరుతూ వేంకటేశుని పాడుతూ జ్ఞానవంతులనే బియ్యంగా చేసి స్వామికి సమర్పిస్తోంది.

'ఆ మాయ శుద్ధవిద్యగామారి, ప్రాణులను విజ్ఞానులుగా చేసి స్వామికి సమర్పించుచున్నట్లు వర్ణింపబడినది' పీఠిక – పే –33.

అన్నమయ్య రచనలో సంవాద గీతాలు ఒక ప్రత్యేకత కలవి. అత్తాకోడళ్ల, బావామరదళ్ల, సంవాదగీతాలు వ్రాయడం సామాన్యం. ఈ సంపుటిలో అన్నమయ్య 'మాయ, విష్ణుభక్తి' సంవాదం అయిదు చరణాలలో విశేషంగా వ్రాసాడు. పాఠకులకు జ్ఞాన సంపదను పంచే కీర్తన ఇది. – 107 వ కీర్తన

10. పరమాత్ముడు

పరమాత్మతత్వాన్ని ఆవిష్కరించిన కీర్తన

భక్తికొలఁదివాఁడే పరమాత్ముఁడు
భుక్తిముక్తిఁదానే యిచ్చు భువిఁ బరమాత్ముఁడు ॥ పల్లవి ॥

చ. పట్టినవారిచేబిడ్డ పరమాత్ముఁడు
బట్టబయటిధనము పరమాత్ముఁడు
పట్టపగటివెలుఁగు పరమాత్ముఁగు
యెట్టనెదుటనే వున్నాఁ డిదె పరమాత్ముఁడు ॥ భక్తి ॥

11. సంసారము

మాయలాగే సంసారం కూడా విచిత్రమయింది. అసలు – 'మాయాసంసారం' అనే మాట తరచువింటూ ఉంటాం. ఆసంసారం గురించి అన్నమయ్య ప్రత్యేకంగా కీర్తనలు వ్రాసాడు. సంసారం అంటే ఏమిటో బోధపరచడానికి ఎన్నో ఉపమానాలు ప్రయోగించాడు.

సంసార సాగరం – దుఃఖమ్

సడిఁబెట్టిఁగటకటా సంసారము చూడ
జడధిలోపలి యీఁత సంసారము ॥ప॥ – 199

ఇదివో సంసారమెంతసుఖమోగాని
తుదలేని దుఃఖమను తొడవు గడియించె ॥ప॥ – 398

చలపాది రోగసంసారము నేడు
బలువైన మందు విష్ణుభక్తి జీవులకు ॥ప॥ – 132

12. వేదాంత పరిభాష

ఓహో దేండేం వొగి బ్రహ్మ మిదియని సాహసమున శ్రుతి చాటెడిని – 396

వేదాంత పరిభాషను వివరిస్తూ అన్నమయ్య ఒక చక్కని కీర్తన వ్రాసాడు.
శ్రుతి – బ్రహ్మము అంటే ఇది అని స్పష్టంగా చెప్తూ చాటింపు వేస్తున్నదట.
పరము, అపరము, ప్రకృతి అనే ఉపాయిం తెలియడమే వివేకం అయితే –
పరము అంటే దేవుడు – అపరము జీవుడు, స్థిరమైన ప్రకృతి దేహములు.
అలాగే – జ్ఞానము, జ్ఞేయము, జ్ఞానగమ్యము,
క్షరము, అక్షరము, సాక్షిపురుషుడు అనే పరిభాషలు వివరించే కీర్తన – 396

ఈ అధ్యాత్మ సంకీర్తనల్లో ఆత్మ, అంతరాత్మ, జీవుడు, జీవితం, కర్మ, మోక్షం వంటి విషయాలు పదేపదే ప్రస్తావింపబడడమే కాక వివరింపబడ్డాయి.

13. విధి

విధి ఎంతటి వారినయినా హీనులుగా దీనులుగా చేయగలదు. ఈ విషయాన్ని పురాణాలలోని వివిధ వ్యక్తులను వారి హీనస్థితిని పేర్కొంటూ వ్రాసిన కీర్తన – 134.

ఎంతసేయఁగలేదు యిటువంటివిధి యభవునంతవానిని భిక్షమడుగుకొనఁజేసి ।। పల్లవి ।।

చంద్రుడు, ఇంద్రుడు, త్రిశంకుడు, నలమహారాజు, ధర్మరాజు, హరిశ్చంద్రుడు, దక్షుడు, దుర్యోధనుడు, బ్రహ్మ, యముడు వీరి వీరి జీవితంలో ఎదురైన భంగపాట్లలను వివరిస్తూ వ్రాసిన ఈ కీర్తనను అన్నమయ్య అద్భుతమైన ముగింపు ఇచ్చాడు.

అదరనీవిధికి విధియగు వేంకటేశ్వరుకృప ।
పడయకుండగ భంగపడక పోరాదుగ ।।

శ్రీ వేంకటేశ్వరుడు 'విధికి విధి' అంటాడు.

14. హరినామం

అన్నమయ్య తన సంకీర్తనలలో బహుధా కీర్తించినది – హరినామ వైభవాన్ని గురించే. ఈ లోకంలో హరినామ సంకీర్తన సాటిలేనిది అని అన్నమయ్య తీర్పు. సంకీర్తనను కీర్తిస్తూ అన్నమయ్య

చాలదా బ్రహ్మ మిది సంకీర్తనం మీకు
జాలెల్ల నడఁగించు సంకీర్తనం ।।పల్లవి।।

చ. సంతోషకరమైనసంకీర్తనం
సంతాప మణఁగించు సంకీర్తనం
జంతువుల రక్షించు సంకీర్తనం
సంతతముఁ దలఁచుఁ దీసంకీర్తనం ।।చాల।।

హరినామ విశిష్టతను వివరిస్తూ

సకల సంగ్రహము సకల సంచయము
అకృతసుకృత మిదిహరినామం ।।పల్లవి।। 349

సకల వేద శాస్త్రముల సారమనీ, సకలమంత్రరాజమనీ సకలపురాణ రసముల మధురమిది అంటూ అపూర్వంగా వర్ణిస్తాడు. ఏ వేళలో అయినా హరినామమే దిక్కు అంటాడు

158–ఆకటివేళల, 205–చాలదాహరి సంకీర్తనం గల మేలిది దీననే మెరసిరిఘనులు

అన్నమయ్య దృష్టిలో ఈ ప్రపంచంలో 'నిజము' ఏది అంటే 'తేనెతీపై తిరువేంకటేశ నిన్ను కానవచ్చినది వొక్కటే నిజము – 149

అన్నమయ్యకు శ్రీ వేంకటేశుడే 'ఇంటివేలుపు'

ఇంటివేలుపు వేంకటేశుగొలువకపరుల

వెంటరుగుట వోడవిడిచి వదరిడుట – 104

మధురభక్తి – శృంగార కీర్తనలలలోనే కాదు – ఆధ్యాత్మిక కీర్తనలలో కూడా వర్ణించాడు అన్నమయ్య.

'ఇక్కడ నీ దాసినైతినింకఁదోయరాదు' – 401 పరమాత్మ ఒక్కడే పురుషుడు. జీవులందరూ స్త్రీలే. అందుకే – తాను 'దాసిని' అంటున్నాడుకవి.

యెల్లగాఁబుట్టించి పెంచే యేలికీతఁడే – 441

అందరికీ అంతరాత్మ కూడా ఇతడే

ఇంతటి మహత్కవిత్వపటుత్వముగల ఈ రచనలనే యెవ్వరు దలచిన ఇహపరమంత్రములందరికి అన్నాడు అన్నమయ్య – 380

అన్నమయ్య పలుకులలోని తేట పరమాత్మ. ఆపరమాత్మను ఆరాధించి, అధ్యయనం చేసి – విబుధ జనుల వలన విన్నంత కన్నంత తెలియవచ్చినంత తేట పరచగలిగాను.

"ఇదిగాక సౌభాగ్యమిదిగాక తపము
యిదిగాక వైభవం బిక నొకటి గలదా!

ఓమ్ నమో వేంకటేశాయ!

* * *

16. తాళ్లపాక సంకీర్తనలు - తి.తి.దే ప్రత్యేక సంపుటం - పరిశోధనాత్మక పరిశీలన

- శ్రీ గంధం బసవ శంకరరావు
తాళ్లపాక వాఙ్మయ పరిశోధకులు

శ్రీహరి పాదాల పుట్టిన పావన గంగ భరతావనిని పవిత్రం చేసింది, సాగర సంగమమై ఇక్ష్వాకు వంశాన్ని తరింపజేసింది. తాళ్లపాక వారి వాఙ్మయ గంగ ఆ శ్రీవేంకటగిరి శిఖర విహారుని, కొండలలో నెలకొన్న కోనేటిరాయుని అభిషేకించింది. ఆ శ్రీహరి పాద తీర్థం మనందరికీ మోక్ష గంగయైనది. (శ్రీహరి పాదతీర్థంబె చెడని మందు, మోహపాశాలు గోసి మోక్షమిచ్చే మందు (సంకీర్తన 263, తాళ్లపాక సంకీర్తనలు). ఈనాడు 'తాళ్లపాక సంకీర్తనలు' తిరుమల తిరుపతి దేవస్థానముల ప్రత్యేక సంపుటంగా తెలుగు వారందరికీ పరిచయమైనది! కాని దీని వెనుకున్న తపన, సాధన, వాఙ్మయ తపస్సు ఓ దీక్ష వలే వ్రత సమానంగా నడచి ఆ శ్రీవేంకటేశ్వరుని కృపకు పాత్రమైనవి.

ఓ ఎనభై ఏళ్ల క్రితానికెళ్తే - తాళ్లపాక వంశస్థుల నుండి 'తాళపత్ర ప్రతి' రూపంలో పదనిధిగా 'తాళ్లపాక సంకీర్తనలు' పేరుతో సంక్రమిస్తున్న సంకీర్తన గుచ్ఛము ననుసరించి శ్రీ తాళ్లపాక వేంకట శేషాచార్యులు గారు కాగితపు ప్రతిని తయారు చేశారు! అది 24-02-1941 న మూలప్రతి ననుసరించి శ్రీవేంకటేశ్వర ప్రాచ్య పరిశోధన సంస్థ అధికారులు నకలు చేశారు (SVORI 6609A&B). మూలప్రతి తిరిగి శ్రీ తాళ్లపాక శేషాచార్యుల గారికి ఇవ్వబడినది. శ్రీవేంకటేశ్వర ప్రాచ్య పరిశోధన సంస్థకు ఆ విధంగా తాళ్లపాక శేషాచార్యుల ప్రతి చేరినది.

తాళ్లపాక శేషాచార్యుల వ్రాతప్రతిలో 289 పాటలు కలవు. అధిక భాగం వేంకట ముద్రతోను, మరికొన్ని కృష్ణ ముద్రతోను కలవు. ఇదిగాక పెద తిరుమలయ్య విరచిత "శ్రీవేంకటేశ్వర సుప్రభాత స్తవం" (ద్విపద) కలదు. ఈ ద్విపద రచన కీ.శే.వేటూరి ప్రభాకరశాస్త్రి గారిచే ఇదివరకు పరిష్కృతమై ప్రకటింపబడియున్ననూ, ఇందు లభించిన దానిలో కొన్ని ద్విపదలు అధికంగా కలవు.

తాళ్లపాక శేషాచార్యుల వ్రాతప్రతిని తొట్ట తొలుతగా గుర్తించినది వేటూరి ప్రభాకరశాస్త్రి గారే! వారు 1949లో అన్నమాచార్య జీవిత చరిత్రను పరిష్కరిస్తూ, సందర్భములకు తగిన సాక్ష్యములకై రాగిరేకులతో పాటు ఈ వ్రాతప్రతినీ ఆశ్రయించారు. ఆవిధంగా ఈ వ్రాతప్రతిలోని ఓ పది సంకీర్తనలను 'అన్నమాచార్య జీవితచరిత్ర' పీఠికలో పరిష్కృత పాఠాలతో ఉదహరించిరి. ఈ పాటలలో రాగిరేకులలో కానరాని "పొడగంటిమయ్య", "కంటి శుక్రవారము", "వేడుకొందామా", "శరణు శరణు సురేంద్రవందిత", ఉండటము , అవి ప్రపంచమంతా పరివ్యాప్తి నొందటం చూస్తున్నాం! అయితే వారు తదనంతర కాలంలో శేషాచార్యుల వ్రాతప్రతి పరిష్కరణకు పూనుకోకపోవటానికి కారణం, అప్పటికి పరిష్కృతములు కావలసిన రాగిరేకులు, అందునున్న పాటలు వేల సంఖ్యలో ఉండటమే! అందునా మొదట రాగిరేకులలోని మొత్తం సంకీర్తనలు ప్రకటితమైతే తప్ప, ఎన్ని కొత్త పాటలు (రాగిరేకులలో లేనివి) ఈ ప్రతిలో కలవో తెలియును.

అయిననూ శ్రీ శాస్త్రి గారి దృష్టి చాలా నిశితమైనది. అందుకే వారు 'అన్నమాచార్య జీవితచరిత్ర పీఠిక', పుట 65లో ఈ విధంగా తెల్పిరి: "క్రీ.శ. 1560కి పూర్వమే కొన్ని సంకీర్తనములు తంజావూరికి చేరి యుండును. అక్కడ సంకీర్తనములన్నియు తిరుపతి రాగిరేకుల మీద నున్నవో లేవో? శేషాచార్యుల వారి తాళపత్ర ప్రతిలోని సంకీర్తనములు గూడ నన్నియు రాగిరేకుల మీది కెక్కినవో లేవో? పెద తిరుమలాచార్యుడు గూడ దినమునకొక సంకీర్తనము చొప్పున తండ్రి యానతిని రచించెను. అవి కొన్ని వేలుండవలెను గదా! కానరావు". శ్రీ శాస్త్రి గారి పరమపదానంతరం మరలా శేషాచార్యుల వ్రాతప్రతి కీ.శే. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ గారిచే పరిశీలింపబడినది. రాళ్ళపల్లి వారు కొత్త పాటల అన్వేషణకు కాక, రాగిరేకులలోని పాఠభేదముల కొరకు, పాదముల సవరణలకు మాత్రమే ఈ ప్రతిని ఉపయోగించినారు. ఈ విషయమును వారు పరిష్కరించిన 4,5 సంపుటముల పీఠికలలో 30-03-1955 మరియు 04-10-1956 సం.లలో తెలియజేశారు.

శ్రీ శాస్త్రి గారి శిష్యులైన శ్రీమాన్ కీ.శే. అర్చకం ఉదయగిరి శ్రీనివాసాచార్యులు గారు తాము పరిష్కరించిన సంపుటాల పీఠికలలో వివిధ ప్రాంతాలలో సేకరించవలసిన తాళ్లపాక వారి కొత్త కీర్తనలను తెలియజేస్తూ, 8వ సంపుటము పీఠికలో "శ్రీతాళ్లపాక శేషాచార్యుల ప్రతి"నుండి, తంజావూరి సరస్వతీ మహలులోని ప్రతినుండి శ్రీవేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాలయము వారు వ్రాయించుకొన్న ప్రతులలోనివి సరి చూచి యిప్పటి రేకులలో కానరాని సంకీర్తనలు ముద్రించవలసియున్నవ"ని 12-03-1961 సం.లోనే తెలియజేశారు! అప్పటికీ రాగిరేకుల సాహిత్యమంతా ప్రకటింపబడలేదు కాబట్టి ఇది కొంత కష్ట సాధ్యమైన విషయమే! ఈ విషయాలను ఆ మహనీయులు నాకు ప్రత్యక్షంగానూ చెప్పారు!

వేటూరి ప్రభాకర శాస్త్రి గారు, రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ గార్ల తరువాత 1953-65 సం.లలో శేషాచార్యుల వ్రాతప్రతిని తమ పరిశోధనలో భాగంగా కొంతమేర ఆచార్య వేటూరి ఆనందమూర్తి గారు పరిశీలించారు. వీరి తర్వాత ఈ వ్రాతప్రతిని పట్టించుకున్న పరిశోధకుల జాడ కానరాదు. ఈ విధంగా ఓ అర్ధ శతాబ్దం "అసూర్యంపశ్య"గా ఉన్న ఈ వ్రాతప్రతిని కార్యకారణముల సర్వమునకూ కర్తయైన శ్రీవేంకటేశ్వరుని అపారమైన అనుగ్రహభాగ్యంతో 29-03-2005న తిరుపతి శ్రీవేంకటేశ్వర ప్రాచ్య పరిశోధన సంస్థ నుండి సేకరించే భాగ్యం నాకు కలిగింది. ఆ వ్రాతప్రతిని, అందులోని సంకీర్తనలను చూసినదే తడవు, ఏదో దివ్యానుభూతి! ఓ పెద్ద నిధి దొరికినంత సంబరం! ఆనందం!! (నా పాలి ఘన నిధానమవు నీవే!) అంతలోనే స్వామి మహిమ వెల్లడి కావడానికి మరో సందర్భం!

తిరుపతి నుండి హైదరాబాదుకు నా తిరుగు ప్రయాణం కూడా రద్దయి, మరలా స్వామి వారి దర్శనానికి ఏర్పాటు జరిగింది. అది ప్రత్యేక దర్శనం! ఆ సందర్భంలో 'శేషాచార్యుల వ్రాతప్రతి' నకలును తిరుమల స్వామి వారి పాదసన్నిధిలో ఉంచి తులసితో అర్చన చేశారు తిరుమల ఆలయ అర్చకులు! ఇది కదా, స్వామి అనుగ్రహ భాగ్యమంటే! అని కనులు ఆనంద బాష్పాలతో, మనసు సంకీర్తనల మధురిమలతో పరవశించాయి!

ఇప్పుడు మరలా నా 'అన్నమయ్య సాహితీ ప్రస్థానంలో' వెనకకి వెళితే, ఇన్ని విశేషాలకు కారణభూతులైన వ్యక్తులెందరో! అందరికీ వందనాలు! వృత్తిచేత నేను హైదరాబాదు 'శాంతా బయోటెక్నిక్స్' ఉద్యోగిని! ఆ సంస్థ అధినేత పద్మభూషణాలంకృతులు డా. కె.ఐ. వరప్రసాద్ రెడ్డి గారు తెలుగు సంస్కృతీ సంప్రదాయాలపై, సంగీత సాహిత్యాలపై ఆదరాభిమానాలు కలిగి, బయోటెక్నాలజీ రంగంలో తెలుగువారి తేజాన్ని భారతీయ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన సేవాభావ సహృదయులు వీరు! సాహిత్యంలో పిపాస కలిగిన నాకు వారు ఉద్యోగమివ్వటమేకాక, ప్రత్యేక సెలవులు మంజూరు చేసి పరిశోధన నిమిత్తం తంజావూరు, శ్రీరంగం, కుంభకోణం, మధురై మొదలైన దక్షిణ దేశ ప్రాంతాలకు సైతం పంపారు! ఈ విధంగా కార్పొరేట్ రంగంలో ఒక ఉద్యోగిని సాహిత్య పరిశోధనలో జీతభత్యాలతో ప్రోత్సహించటం అరుదైన, అసాధారణమైనదే కాక మిగిలిన సంస్థలకు ఆదర్శనీయమైన విషయం! దీని ఫలితమే తంజావూరు సరస్వతీ మహలులో తాళపత్రాలలోని తాళ్లపాక కవుల కీర్తనలను సేకరించటం! అటు పిమ్మట తిరుపతి శేషాచార్యులవారి వ్రాతప్రతిని సేకరించటం!!

ఇక మలిదశలో తిరుపతి శేషాచార్యుల వ్రాతప్రతిని సేకరించటానికి ఆధారభూతమైన అంశాలను 21వ శతాబ్దపు పరిశోధన స్ఫూర్తిగా అందించటం ఆవశ్యకమైన అంశం!

1998 సం.లో తి.తి.దే, అన్నమాచార్య ప్రాజెక్ట్ వారు తాళ్లపాక పద సాహిత్య సంపుటాలను 29 సంపుటాలుగా పునర్ముద్రించి, లభ్యమైన సంకీర్తనలన్నీ సమగ్రంగా ప్రకటించామని తెలియజేశారు! ఈ 29 సంపుటాల పీఠికలన్నీ, అన్నమాచార్య జీవిత చరిత్రను సమగ్రంగా అధ్యయనం చేసిన తరువాత అనేక కొత్త విషయాలు తెలిశాయి.

అందులో ప్రధానంగా ఆసక్తిని కలిగించిన అంశం, తిరుపతి రాగిరేకులలో కాకుండా, ఇతర ప్రాంతాలలో ఉన్న తాళ్లపాక వారి సాహిత్యం! ఆ విషయాన్ని లోతుగా చర్చిస్తే రాగిరేకులలో లభ్యం కానివి, కాలగర్భంలో నష్టం చెందిన రాగిరేకులలోనివి, రాగిరేకులకెక్కక తాళపత్రాలలో మాత్రమే ఉన్నవి ఇలా అనేకమైన రూపాలలో తాళ్లపాక వారి సాహిత్యం దొరకవచ్చును కదా అని ఆలోచన కలిగినది. ఇటువంటి సాహిత్యం తంజావూరు, శ్రీరంగం, అహోబిలం (రంగనాథ స్వామి, నరసిం హ స్వామి ఆలయాలలో కొన్ని రాగిరేకులు లభించాయి), మధురై, కుంభకోణం మొదలైన ప్రాంతాలకు చేరుకున్నట్లు పలు ఆధారాలు లభించాయి! ఇంతేకాక, తాళ్లపాక వంశస్థుల వద్ద పారంపర్యంగా వస్తూ ఉండిన తాళపత్రముల నుండి కాగితపు ప్రతులకెక్కిన సాహిత్యం ఈ శతాబ్దపు పరిశోధనకు మూలద్రవ్యము!

21వ శతాబ్దపు పరిశోధనకు ఆరంభ సూచకంగా 'ప్రథమోపలబ్ధ స్వర సహిత శిలాలేఖము"ను పరిష్కరించిన డా.వేటూరి ఆనందమూర్తి గారే 1998లో "తంజావూరు సరస్వతీ మహలు" నుండి పెద తిరుమలయ్య విరచిత సస్వర ఝంబడ ప్రబంధాలు రెండింటిని, మరికొన్ని తాళ్లపాక వారి పదాలు తంజవూరు, తిరుపతి ప్రాంతాలనుండి సేకరించారు, సేకరిస్తూ వస్తున్నారు!

తాళ్లపాక కవి కుల గురువు అన్నమాచార్యుల కీర్తనల సంఖ్యలో అనుమానం లేదు. అవి ముప్పది రెండు వేలు. శ్రీవేంకటనాథుడు అన్నమయ్య పదహారవ యేట ప్రత్యక్షమై, దినమునకొక్క సంకీర్తన తక్కువ కాకుండా సమర్పించమని ఆనతినివ్వడం, అదే ఆనతిన ఆచార్యుడు స్వామికి నివేదించుట జరిగినది. అన్నమయ్య జీవించిన కాలంలోనే సంకీర్తన రచన చేపట్టిన పెద తిరుమలయ్య తండ్రి పరమపదం పొందినవేళ నుండి శ్రీ స్వామివారు తండ్రి కిచ్చిన ఆజ్ఞ తాను శిరసా వహించాడు. దీనికి పెద తిరుమలయ్య సంకీర్తనల తొలి రాగి రేకు సాక్ష్యంగా నిలుస్తుంది. ఈ విధంగా పెద తిరుమలయ్య విరచిత కీర్తనలు కూడా వేల సంఖ్యలో ఉంటాయి. తరువాత కాలంలో చిన తిరుమలయ్య ఆ మార్గాన్ని అనుసరించాడు. నిశిత దృష్టిని సారిస్తే, తాళ్లపాక కవులవి కీర్తనలు మాత్రమే యాభై వేలకు పైగా నున్నా ఆశ్చర్యపడవలసిన అవసరం లేదు. ఇందులో మనకు లభ్యమైన రాగి రేకులలోని కీర్తనలు పదిహేను వేలు మాత్రమే!

పైన తెలిపినదంతా తామ్రపత్రాల చరిత్ర, అందులో నున్న కీర్తనలున్నూ! మరి తాళపత్రాల చరిత్ర ఏమిటి? అందులోనున్న కీర్తన లేమిటి? తామ్రపత్రాల లోనున్న కీర్తనలే తాళపత్రాలలో ఉన్నాయా? తామ్రపత్రాలు నష్టం చెందగా అ నకలు పాటలు తాళపత్రాలలో ఉన్నాయా? అనే ప్రశ్నలు తాళ్లపాక వాఙ్మయ పరిశోధకులందరికీ మదిలో మెదలవలసిన ప్రాథమిక స్థాయి విషయాలు.

నా పరిశోధనకు పై ప్రశ్నలే ఆలంబన! ఈ విషయాలను సమగ్రంగా పరిశీలించిన పిమ్మట రాగిరేకులలో లేని అనేక కీర్తనలు తాళపత్రాలలో చూడటం జరిగినది. తాళపత్రాల కీర్తనల సేకరణా కార్యక్రమం ఆరంభమైనది. శ్రీరంగం, తంజావూరు, కుంభకోణం, మధురై ప్రాంతాలలో అన్వేషిస్తే తంజావూరు తాళపత్ర గ్రంథాలయంలో తాళ్లపాక వారి పదాలు లభ్యమైనాయి.

తంజావూరి ప్రతిలో 'వెంకట' ముద్రతో ఉన్న తాళ్లపాక వారి 39 అజ్ఞాత కీర్తనలను వెలికి తీయడం జరిగినది. ఈ 39 పదాలతో పాటు రాగిరేకులలో లభించిన మరికొన్ని పదాలూ, 'శ్రీకృష్ణ ముద్ర గల మరికొన్ని పదాలూ, ఈ ప్రతిలో ఉన్నాయి. అప్పటి నా యెరుకను అనుసరించి 'వెంకట ముద్ర గలవి మాత్రమే తాళ్లపాక వారి పదాలుగా భావించి అజ్ఞాత సంకీర్తనలు 39తో పాటు, రాగిరేకులకు ఎక్కి పాఠభేదాలతో ఉన్న 28 పాటలను, రాగిరేకులలో లేక వేటూరి ప్రభాకర శాస్త్రి గారిచే అన్నమాచార్య జీవిత చరిత్ర పీఠికలో ఉదాహృతమైన 2 పాటలను కలిపి మొత్తం 59 సంకీర్తనలుగా లెక్క తేల్చడం జరిగింది. తంజావూరి ప్రతిలో లభించిన సంకీర్తనలన్నీ శృంగార సంకీర్తనలు. ఈ ప్రతిలో మరో విశేషమేమంటే ప్రతి సంకీర్తనకు రాగంతో పాటు తాళం కూడా సూచించబడింది. రాగిరేకులలో వలెకాక, మొదట చరణం వ్రాసి, తరువాత పల్లవి, తరువాత మిగిలిన చరణాలు వ్రాశారు.

ఇక మరలా ప్రస్తుతాంశమైన శేషాచార్యుల వ్రాతప్రతి విషయానికొస్తే –

శేషాచార్యులవారి వ్రాతప్రతిని తిరుపతి నుండి సేకరించిన తరువాత అందులోని సంకీర్తనలను రాగిరేకులలోని సంకీర్తనలతో సరిచూచి, ఈ ప్రతిలోని ఎన్ని సంకీర్తనలు రాగిరేకులలో ఉన్నాయి? అవి

అధ్యాత్మ సంకీర్తనలా? శృంగార సంకీర్తనలా? అచ్చు పడెనా? లేదా? వంటి విషయాలతో ఓ పట్టికను కూర్చటం జరిగింది. ఈ పట్టికయే అనంతరం ఆచార్య వేటూరి ఆనందమూర్తి గారికి అందించటం జరిగింది.(చూ. అక్షర వ్యాసం, ఈ సంపుటం పుట.) "తాళ్లపాక కవుల అజ్ఞాత సంకీర్తనలు" శీర్షికతో ఓ పరిశోధన వ్యాసం రాసి తి.తి.దే వారి సప్తగిరితో (ఏప్రిల్ – మే, 2007) పాటు అనేక ప్రముఖ పత్రికలలో, విశేష సంచికలలో ప్రచురించటం జరిగింది.

వాటిలో ముఖ్యమైనవి కొన్ని.....

1. "వివేచన", పరిశోధన పత్రిక, ఉస్మానియా విశ్వవిద్యాలయం (2006),
2. స్వర్ణోత్సవ సంచిక, శ్రీవేంకటేశ్వర ప్రాచ్య పరిశోధన సంస్థ, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం (2007),
3. తెలుగు వాగ్గేయకారులు: అన్నమయ్య విలక్షణ వ్యక్తిత్వం, ఆంధ్ర సారస్వత పరిషత్ సంచిక (2007)
4. ప్రత్యేక సంచిక, ప్రపంచ తెలుగు సమాఖ్య, జనవరి (2009)
5. ప్రపంచ తెలుగు మహా సభల సంచిక (2012)

ఇక పరిశోధన ప్రసంగాలకొస్తే – ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, పాలమూరు విశ్వవిద్యాలయం, ఆంధ్ర సారస్వత పరిషత్తు, తి.తి.దే అన్నమాచార్య ప్రాజెక్ట్ లలో ఈ వ్రాతప్రతి విశిష్టతను గూర్చి ప్రసంగించటం జరిగింది. ఆంధ్ర సారస్వత పరిషత్ (ఈనాటి తెలంగాణ సారస్వత పరిషత్)లో ప్రసంగించినప్పుడు కీ.శే. ఆచార్య బిరుదురాజు రామరాజు గారు ఈ వ్రాతప్రతిని తమకందిస్తే తమ వ్యయంతో ప్రచురిస్తామన్నారు.

"అన్నమయ్య పదగోపురం" పేరుతో 2013లో కడప ఆకాశవాణి ప్రసారం చేసిన కార్యక్రమంలో "తాళ్లపాక కవుల అజ్ఞాత కీర్తనల" పై ప్రసంగించటం జరిగింది. ఈ కార్యక్రమం అనంతర కాలంలో తిరుపతి, విజయవాడ, హైదరాబాదు వంటి ఇతర ఆకాశవాణి కేంద్రాల ద్వారా కూడా ప్రసారమై విశేష ఆదరణ నొందినది.

భారత కేంద్రప్రభుత్వ ప్రసార సంస్థ, ప్రసార భారతి వారు శేషాచార్యులవారి వ్రాతప్రతిలోని కొన్ని సంకీర్తనలను "అన్నమయ్య అపురూప సంకీర్తన"ల పేరుతో శ్రీమాన్ యస్పీ బాల సుబ్రహ్మణ్యం మరియు శ్రీమతి నిత్యసంతోషిణిలతో గానం చేయించి శ్రవ్య గీత మాలికను విడుదల చేశారు. కొన్ని సంకీర్తనలను కర్ణాటక శాస్త్రీయ సంగీత విద్వాంసులు శ్రీ గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ గార మరియు శ్రీ సత్తిరాజు వేణుమాధవ్ గార్లు స్వరపరిచి గానం చేశారు.

289 సంకీర్తనలు, పెద తిరుమలాచార్యులవారిచే ద్విపద శైలిలో రచింపబడిన 'శ్రీవేంకటేశ్వర సుప్రభాత స్తవము' లను తమ అపారమైన పరిశోధన ప్రతిభతో పరిష్కరించి జాతికి అందించారు ఆచార్య వేటూరి ఆనందమూర్తి గారు!

ఈ వ్రాతప్రతి పరిష్కరణ విషయికంగా – ఓ దశాబ్దానికి మించి వారి పర్యవేక్షణలో వ్రాతప్రతిలోని సంకీర్తనలను పరిశీలించటం, అకారాది క్రమంలో కూర్చటం, తంజావూరు ప్రతులతో సరి చూడటం, రాగిరేకుల సంకీర్తనల పాఠాలు పరిశీలించటం, తుది పాఠాలను అక్షరబద్ధం చేయటం... ఇలా అనేకమైన అంశాల సమాహారంగా కృషి పరిఢవిల్లినది! ఈ క్రమంలో ఓ మూడు పర్యాయాలు బెంగుళూరు వెళ్లి ఆచార్య ఆనందమూర్తి గారి ముఖతః సాగిన పరిష్కరణ యజ్ఞంలో ప్రత్యక్షంగా పాల్గొనటం జరిగింది. ఇంతటి బృహత్తర పరిష్కరణలో సంగీత సాహిత్య నాట్య అలంకార శాస్త్ర సమన్వితమైన అనేకమైన విషయాలను, తాళ్లపాక కవులకు సంబంధించిన చారిత్రక సత్యాలను ఆచార్య ఆనందమూర్తి గారి నుండి నేరుగా తెలుసుకున్నాను. ఇందులకు వారికి శతధా ధన్యవాదాలంటే, కృతజ్ఞతలంటే చాలా చిన్నమాటే కాగలదు! 'నీ నామము వెల సులభము, ఫలమధికము' అని అన్నమయ్య అన్నట్లుగా నా ఆసక్తి అల్పమైననూ,శ్రమ స్వల్పమైననూ ఆనందమూర్తి గారు నా కనుగ్రహించిన జ్ఞాన సంపద అపారమైనది.

పరిష్కరణ దశలో ఆచార్య ఆనందమూర్తి గారు భావి పరిశోధకులకు మూలద్రవ్యమనదగిన అనేక విషయాలను ప్రస్తావించారు. వాటిలో అతిముఖ్యమైనది "భావకోశం". పదాలకు అర్థాలను సాధించటం ఒక ఎత్తయితే – దానిని మించి సమ భావం కల పదాల ఆధారంగా వివిధ సంకీర్తనలలోని భావాన్ని అవగతం చేసుకోవటానికి భావకోశం సాధికారికంగా ఉపయోగపడుతుంది. అందుకు తాళ్లపాక వారి సాహిత్యం ఓ సాగరగర్భం! సంగీత, సాహిత్య రత్నాకరం! తాళ్లపాక వారి పలుకుబళ్లతో రాబోయే కాలంలో ఈ భావకోశం సిద్ధించును గాకని ఆశిద్దాం!

ఇక ఈ ప్రతిలోని కొన్ని సంకీర్తనలు వివిధ భౌగోళిక ప్రాంతాల ప్రస్తావనతో చారిత్రక విషయాలను, ఆలయాలను, అక్కడి దైవతాలను మన ముందు ప్రత్యక్షం గావిస్తున్నాయి! అందులో కొన్నిటిని ఇక్కడ ప్రస్తావన చేయాలి.

1. ఎటువంటి రాజీకమే చెలియ

గోరంట్ల సీమ, మధ్య దేశము (మహారాష్ట్ర ప్రాంతము కావచ్చును) మధురాపురము, కాశ్మీర మండలము, కుంతల రాజ్యము, కుంభకోణము, గోలకొండ వంటి ప్రాంతాల ప్రస్తావన ఈ సంకీర్తన యందు కలదు.

2. కురునూతల చెన్నకేశవ

తాళ్లపాక కవులు అనేక ప్రాంతాలలో వెలసిన చెన్నకేశవుని తమ సంకీర్తనలలో కీర్తించారు. విశేషించి ఈ ప్రతి మూలాన కడప జిల్లా కురునూతల చెన్నకేశవుని గురించి తెలియవస్తుంది.

3. తెరువు వెంట వచ్చే వరదరాజులను మరియు దేవరకే చెల్లెనో దేవరాజ, నీవు కంచిలోని వరదరాజ స్వామిని కీర్తించిన పాటలు

4. శంఖమా పోయివత్తునా చక్రమా పోయివత్తునా ఈ సంకీర్తనలో ఆనాడు తిరుమలలో ప్రసిద్ధమైన "నీడ తిరుగని చింత చెట్టు" ప్రస్తావన కలదు. అన్నమాచార్య చరిత్ర పీఠికలో (పుట. 11) శ్రీమాన్ వేటూరి ప్రభాకరశాస్త్రి గారు చింతచెట్టును గూర్చి ఈ విధంగా ప్రస్తావించారు –

అడిపడిదగ్గఱనే గొప్ప చింతచెట్టు నేడును గలదు. శ్రీ వేంకటేశ సేవాక్రమమున నది ప్రస్తుతి గన్నది. అన్నమాచార్యుడు దీని పేర్కొన్నట్టు లేదు.

చించా మున్నిద్రసుభగాం దివ్యాం తన్మూలత శ్శుభే I

శ్రీనివాసపదాంభుజే స్వసంకల్పాత్ సముత్థితే II

తన్మూలత స్స్వయంవ్యక్తా సరోయోగిముఖానపి I

లక్ష్మీనృసింహం శేషాద్రిం ప్రణిపత్య కృతాంజలిః II – శ్రీవేంకటేశసేవాక్రమః

5. రారా నన్నేలుకోరా తిరువళ్లూరి వీరరాఘవ

తిరువళ్లూరులోని వీరరాఘవుడిని కీర్తించిన పాట

6. చక్రమల్లూరి సౌందరనాథ

శ్రీవైష్ణవ సంప్రదాయంలో విశిష్టమైన దివ్యక్షేత్రాలలో ఒకటి చక్రమల్లూరు. ఇది తిరువళ్లూరుకు సమీపంలో ఉన్నది. ఇక్కడ కొలువైన సౌందరనాథుని పై వెలయించిన శృంగార సంకీర్తనమిది.

ఈ వ్రాతప్రతిలో మరో ముఖ్యాంశం శ్రీకృష్ణ ముద్రతో తాళ్ళపాక వారి పదాలు లభ్యం కావటం! ఇది నూతన పరిశోధనకు తావిస్తున్నది. అలాగే చిన్నన్న కృతంగా భావించే సంకీర్తనలూ ఇందున్నాయి.

పై విషయాలన్నీ తాళ్లపాక కవులపై పరిశోధన గావించదలసిన రసికులకు ఊటబావి!

తాళ్లపాక కవుల సంకీర్తనల కొరకు ఇంకనూ అన్వేషించవలసియున్నది, కొన్ని రాగిరేకులు , తాళపత్ర గ్రంథాలు ఆనాడే తిరుపతి మరియు కడప జిల్లాలోని తాళ్ళపాక వంశస్థుల ఇళ్ల నుండి ఇతర ప్రాంతాలకు తరలినట్లు (చూ. అన్నమాచార్య చరిత్ర పీఠిక పుట. 92 మరియు తాళ్ళపాక పదసాహిత్య సంపుటాలు (8 & 11) పీఠికలు, పరిష్కర్త అర్చకం ఉదయగిరి శ్రీనివాసాచార్యులు) తెలుస్తున్నది, తిరుపతి, అహోబిలం, తంజావూరు, శ్రీరంగం, మధురై, కుంభకోణం, మేలట్టూరు వంటి ప్రాంతాలలో తాళపత్రాలు, మౌఖిక సాహిత్యంలో ఉన్న తాళ్లపాక వారి కీర్తనలను సేకరించవలసిన ఆవశ్యకత ఎంతో యున్నది. నా వంతు

కృషి చేస్తూనే, భావి పరిశోధకులు ఇందుకొరకు ప్రయత్నిస్తారని కొండంత ఆశతో అందులకై ఆ స్వామిని ప్రార్థిస్తున్నాను.

రాగిరేకుల పరిష్కరణతో పోల్చినపుడు శేషాచార్యుల వ్రాతప్రతి పరిష్కరణ కష్టసాధ్యమైన విషయం! అందుకు కారణాలెన్నో, చిక్కుముడులెన్నో, కలగలుపులెన్నో, సందిగ్ధతలెన్నో! తాళపత్రాలలోని సంకీర్తనలను వ్రాతప్రతికి మార్చటం కూడా ఒక కారణం! మూల ద్రవ్యమైన తాళపత్ర ప్రతి కోసం కూడా ప్రయత్నించడం జరిగింది, కాని ఫలితం ఎండమావే! కాని ఎక్కడో ఓ మూల ఆశ! ఎన్నటికైనా దొరకకపోవునా అని! ఆపై భగవదిచ్ఛ!!

శేషాచార్యుల వారి వ్రాతప్రతిలోని సంకీర్తనలు చాలా శైథిల్యం చెందిన రీతిలో నున్నవి. సంక్లిష్టతతో కూడినవి, అనేకచోట్ల కలగలుపులు, చిక్కుముడులతో పెనబడినవి. పరిశోధనలో మరో మాతృక గాని, ఆలంబన గాని లేని కాగితపు ప్రతి యిది. ఇలాంటి వ్రాతప్రతిని 90 సం.ల వయసున సైతం పరిష్కరించి, భావి పరిశోధకులకు స్ఫూర్తిని, ప్రేరణను కలిగిస్తూ, అనేక చారిత్రకాంశాల ప్రస్తావనతో విపులమైన పీఠికతో "సంకీర్తన నైవేద్యం"గా శ్రీవేంకటేశ్వర స్వామి వారికి సమర్పించి, ఆ 'సంకీర్తన ప్రసాదాన్ని', శాశ్వతనిధిగా మనందరికీ అందిస్తున్న ఆచార్య వేటూరి ఆనందమూర్తి గారి పాదపద్మములకు ప్రణతులు సమర్పించటం నా కర్తవ్యం!

చారిత్రకాంశాలతో కూడిన సంకీర్తనలను తాళపత్రాలనుండి సంగ్రహించి, కాగితపు ప్రతిగా రూపాంతరం చేసి ఈ (వి)జ్ఞాన నిధిని మనందరికీ అందించిన శ్రీమాన్ తాళ్లపాక శేషాచార్యులవారికి తెలుగు జాతి, ప్రత్యేకించి అన్నమయ్య పదప్రేమికులు ఋణపడియున్నారు!

ఇక ఇంతటి విశాలమైన వాఙ్మయాన్ని తెలుగు వారందరికీ అందించాలనే దొడ్డ సంకల్పం మాన్యులు శ్రీ డా.వరప్రసాద్ రెడ్డి గారిది. తి.తి.దే పూర్వ శ్రీకార్యనిర్వహణాధికారులైన డా.కె.యస్.జవహర్ రెడ్డి, I.A.S గారి ఆమోదంతో, ఇప్పటి శ్రీకార్యనిర్వహణాధికారులు శ్రీమాన్ ఏ.వి.ధర్మారెడ్డి, I.D.E.S గారి ప్రోద్బలంతో ఈ ప్రత్యేక సంపుటం సాకారమైనది! వీరందరికీ కృతజ్ఞతాపూర్వక నమోవాకములు!

శరణాగతులకు ఆశ్రితకల్పవృక్షమైన ఆ శ్రీవేంకటేశ్వరుని శ్రీపాదాలకు ప్రణమిల్లుతూ, ఆ స్వామి పాదాలనభిషేకించిన శేషాచార్యుల వారి వ్రాతప్రతి సంకీర్తన గంగ శ్రీహరి పాదతీర్థంగా అనతికాలంలోనే అందరికీ అందాలనీ, సంగీత సాహిత్య నాట్య ప్రవచనాలతో పరివ్యాప్తం కావాలని ఆ దేవదేవుణ్ణి వేడుకొంటున్నాను.

ధర నెవ్వరు వేడినా – తగ నందరిని
తిరువేంకటనాథుడవై – వరమిత్తువు వరదరాజ (తాళ్లపాక సంకీర్తనలు – సంకీర్తన 168)

ఈ భగీరథ ప్రయత్నం సాఫల్యం చెంది, ఈనాడు సంకీర్తన గంగతో అవబృథ స్నానం చేస్తున్నందుకు సంతసిస్తున్నాను.

తిరువేంకటాచలాధిపు నిజధ్యానంబు
నరులకును సోమపానంబు గావలదా
పరగ నాతని కృపాపరిపూర్ణజలధిలో
నరుహులై యవబృథంబాడంగ వలదా

(తాళ్ళపాక పదసాహిత్యం, సంపుటం,1– సంకీర్తన 40)

* * *

17. అన్నమయ్య పద వ్యుత్పత్తి - విచారణ

- డా॥ అద్దంకి శ్రీనివాస్

తాళ్ళపాక అన్నమాచార్యులు సుప్రసిద్ధ వాగ్గేయకారుడు. పదకవితా పితామహుడు. ద్రావిడాగమ సార్వభౌముడు ఇత్యాది బిరుదులు ఆయనకు ఉన్నాయి. అసలు పేరు అన్నమాచార్యులు అయినా వ్యవహార నామం అన్నమయ్యగా స్థిరపడింది.

అన్నమయ్య అన్న పేరును చూస్తే ఇందులో ఉన్నవి అన్నీ అచ్చతెలుగు శబ్దాలుగా గోచరిస్తాయి.

అన్న+అమ్మ+అయ్య

ఇందులో మూడూ దేశిశాబ్దలే.

తెలుగువారి పేర్లలో దేశిశబ్దాలైన అన్న (అన) అమ్మ (అమ) అయ్య (అయ) లాంటివి కనిపించడం సర్వసాధారణమైన విషయమే. కానీ తెలుగు పేర్లలో వీటిలో ఏ ఒక్కటో ఉంటుంది. ఇక్కడ అన్నమయ్యలో ఈ మూడూ కనిస్తున్నాయి. ఇది అసాధారణం.

ఉదా॥ నన్నయ్య, తిక్కన, సింగయ ఇత్యాది పేర్లలో అన్న అయ్య లను గమనించవచ్చు.

అమ్మ అనే పదం కేవలం స్త్రీలకు మాత్రమే కాక పురుషులలోనూ రాయలసీమ ప్రాంతంలో నేటికీ వ్యవహారంలో ఉంది.

ఉదా॥ నాయుడమ్మ. ఈ పదం పురుషులకు కూడా ఉంది.

వీటిన్నింటినీ పరిశీలించిన తరువాత అస్సలు ఇప్పుడు అన్నమయ్యలో ఉన్న ఈ పదాలకు అర్థం ఏమిటి? వాటి వెనుక ఉన్న భాషాచారిత్రక విశేషాలు ఏమిటి? అనే ప్రశ్న ఉదయిస్తుంది. ఆ అంశాలను చర్చించడమే ఈ వ్యాసోద్దేశ్యం. అయితే విషయం సులభ గ్రాహ్యంగా ఉండడంకోసం ఈ వ్యాసంలో ముందుగా అన్నమాచార్యులు అన్న పదాన్ని చూద్దాం.

దీనిని - అన్న+మాచార్యులు అని విభాగం చేసుకోవాలి. మాచార్యులతో కూడిన పేర్లు కొన్ని మాత్రమే కనిపిస్తాయి. ఉదా ॥ కృష్ణమాచార్యులు. అలాగే మరో ప్రయోగం - నాగమనాయకుడు. ఇలాంటి వాటిని కూడా ఇలాగే విభాగమే చేసుకోవాలి. నాగ+మనాయకుడు అని.

ఇలాంటి పదాల అర్థాన్ని ఊహించినప్పు కృష్ణమ కు సంబంధించిన ఆచార్యులు కృషమాచార్యులు (కృష్ణమ+ఆచార్యులు), నాగమకు సంబంధించిన నాయకుడు (నాగమ+నాయకుడు) అని మనకు ఒక అర్థస్ఫూర్తి కలుగుతుంది. కానీ అది సరి కాదు. అలా అనుకుంటే - రామాచార్యులు, కూర్మాచార్యులు, వరాహాచార్యులు మొదలైన పదాలలో అమ శబ్దం కనిపించడం లేదు కదా.

కాబట్టి వీటిల్లో ఉన్నది కృష్ణమ (కృష్ణమ్మ) నాగమ (నాగమ్మ) కాదు. ఇందులోని అమ (అమ్మ అనే పదానికి ద్విత్వ రహితం) స్త్రీవాచకం కాదు. మరి ఎందుకు ఇలా ఏర్పడింది? అంటే భాషాశాస్త్ర రీత్యా అనుచిత విభాగం (wrong split) జరిగిందని చెప్పాలి.

ఉదా ॥ సింహాచలం అనే పదాన్ని సింహా+చలం అని అనుచిత విభాగం చేసుకొని చలం చలం అని వ్యవహరిస్తున్నాం కదా. అలాగే – బంగాళాఖాతం అనే పదాన్ని బంగళా ఖాతం అని విడదీస్తున్నాం కదా. అలాగే ఇక్కడ కూడా కృష్ణమ+ఆచార్యులు అనుకోవడంలో తప్పులేదు. అలాగే నాగమ+నాయకుడు కూడా.

అయితే ఇక్కడ ఉన్న అసలు పదం మాచార్యులు కాదు. మహాచార్యులు. మహాచార్యులే మాచార్యులు అయ్యింది. గ్రామ్యోచ్చారణలో పద మధ్యంలో ఉన్న హకాం లోపించడం అందుకు ప్రతిగా పూర్వవర్ణానికి దీర్ఘం రావడం భాషాధ్వని పరిణామంలో సర్వసాధారణమైన విషయమే. దీనినే Loss and Compensation అంటారు.

ఉదా॥ అగ్రహారం > అగ్రారం; పువిహోర > పులోర, ఫలహారం > పలారం మొదలైనవి. ఇలాంటివి ఎన్నో ఉన్నాయి. ఈ నియమాన్ని బట్టి మహాచార్యులు > మాచార్యులు అయ్యింది. ఆయన అసలు పేరు అన్న. దానికి ఈ మహాచార్య సంక్షిప్తరూపమైన మాచార్యులు కలిసి అన్నమాచార్యులు అయ్యింది. అంతేకాదు పూర్వం తొలినాళ్ళలో వ్యక్తుల పేర్లు స్వరూప స్వభావాలను బట్టి ఏర్పడేవి. ఉదాహరణకు నన్నయ్య అంటే మంచివాడు అని అర్థం. తమిళంలో నల్ల అంటే మంచి అని. నల్ల > నన్నగా మారింది. (నలయో రభేదః నేటికీ శ్రీకాకుళం మాండలికంలో లేదు > నేదు అనే రూపాలను గమనించవచ్చు). ఎర్రని వాడు అనే అర్థంలో ఎర్రన. ఇలా ఉండేవి. అలాగే బంధువాచకశబ్దాలు కూడా పేర్లలో కనిపిస్తాయి. అటువంటిదే అన్నయ్య కూడా. అన్నంభొట్లు అన్నావధాన్లు వంటివి నేటికీ మనం చూస్తున్నాం.

ఆ తరువాత కాలంలో పేర్లలోనూ సంస్కృతీకరణ పెరిగింది. ఆపై అట్నుంచి ఇటు రావడమూ అయ్యింది. అంటే సంస్కృతంలో ఉన్నపేర్లకు ద్రావిడీకరణమ జరిగింది. ముఖ్యంగా తమిళంలో ఇది ఎక్కువ. తమిళులు మహాచార్యులు అనే పదాన్ని కూడా ద్రావిడీకరించారు. అందురు ఉదాహరణ – పెరియవాచ్చాన్ పిళ్ళై అనే ఒక వైష్ణవ ఆచార్యుడి నామమే. పెరియవాచ్చాన్ పిళ్ళై తనియన్ శ్లోకం ఒకటి ఇలా ఉంది చూడండి.

శ్రీమత్కృష్ణసమాహ్వాయ
నమో యామునసూనవే,
యత్కటాక్షైకలక్ష్యాణాం
సులభః శ్రీధరః సదా.

"శ్రీ పెరియవాచ్చాన్ పిళ్ళైవారికి 'శ్రీకృష్ణులు' అనే నామం ఉంది. మహా అంటే పెరియ. వాచ్చాన్ అంటే ఆచార్యులు. అని అంటే అసలు లోకంలో మహాచార్యులు ఎవరు? అని ప్రశ్నిస్తే వచ్చే సమాధానం

శ్రీకృష్ణపరమాత్మ అని. అందుకే కృష్ణశబ్దంతోనే ఈ మహాచార్య పదం కూడి ఉంటుంది. కృష్ణం వందే జగద్గురుమ్ అన్నారు కదా. అలాగే శ్రీకృష్ణుడిలా గొప్పగా ఉపదేశం చేసినవారిని కూడా అనంతరం మహాచార్య నామంతో వ్యవహరించడం అలవాటు అయ్యింది. అలా వచ్చిన పదమే పెరియవాచ్చాన్. కాబట్టి ఇది మహాచార్యులకు ద్రావిడీకరణ.

ఇక, "శ్రీమత్కృష్ణసమాహ్వాయ" అంటే "శ్రీమత్ కృష్ణః ఇతి సమాహ్వా యస్య సః" అనే కాకుండా, "శ్రీమత్ కృష్ణస్య సమాహ్వా సమీచీనా ఆహ్వా యస్య సః" అనే విగ్రహంతే శ్రీమత్ కృష్ణుడు అనే సత్యమైన, వాస్తవమైన పేరును కలిగినవారు అనే అర్థాన్ని గ్రహిస్తే – శ్రీకృష్ణ పరమాత్మకు మాత్రమే కల మహాచార్యుడు అనే విశిష్టనామాన్ని కలిగినవారు ఈ యామునాచార్య పుత్రులైన పెరియవాచ్చాన్ అనే అర్థాన్నీ చెప్పవచ్చు.

శ్రీకృష్ణుడనే పేరుకు – అసురులను చంపి భూమి భారాన్ని తీర్చి, భూదేవికి సుఖాన్నీ ఆనందాన్ని కలిగించేవాడు అని అర్థం. ఆ పేరు కంటే అతనికి ఏర్పడిన మహాచార్యుడు అనే పేరే చాలా గొప్పది. "అకల ఇనత్తవర్ అఱియ నెఱియెల్లామెడుత్తురైత్త నిత్తైఇనత్తొరుమూర్ త్తి" (తిరువాయ్ మొ –4–8–6) అన్నారు నమ్మాళ్వార్. శ్రీకృష్ణుడికి గీతోపదేశం చేసిన కారణంగా ఏర్పడిన బిరుదునామమే మహాచార్యుడు. 'గీతాశాస్త్రం' (గీతోపనిషత్) అని పేరు పొందిన 700 శ్లోకాల శాస్త్రాన్ని అనుగ్రహించి మహాచార్యపదాన్ని నిర్వహించే శ్రీకృష్ణుడే కదా గొప్పవాడు. గీతాచార్యుడికి ఆచార్యత్వం చెబితే చాలదా? మహాచార్యత్వం చెప్పాలా? అని మరో ప్రశ్న. వరాహాచార్యులు, కూర్మాచార్యులు, వామనాచార్యులు అని కేవలం ఆచార్య శబ్దంతో చేర్చి వ్యవహరించడం లోకంలో ఉంది. కానీ కృష్ణనామాన్ని కలిగినవారిని చెప్పేటప్పుడు మాత్రం కృష్ణమాచార్యులు అని మహాచార్యశబ్దంతో చేర్చే నిర్దేశించడం శ్రీకృష్ణుడికి ఉన్న మహాచార్యత్వం జగత్ప్రసిద్ధం వల్లనే. ఎందుకంటే శ్రీకృష్ణుడే మహాచార్యుడు. ఆ మాట అన్నది ఒక ఆచార్యుడే. ఆయనే భీష్మాచార్యుడు. భాగవతంలో ఇలా అన్నాడు.

తనవారి చంపజాలక
వెనుకకు పో నిచ్చగించు విజయుని శంకన్
ఘనయోగవిద్య బాపిన
మునివంద్యుని పాదభక్తి మొనయును నాకున్

అర్జునుడికి ఘనయోగవిద్యను చెప్పాడట శ్రీకృష్ణుడు. అలా చెప్పాడు కాబట్టే ఆయన మహాచార్యుడయ్యాడు.

శరీరమే ఆత్మ అనే భ్రమతో ఉన్న అర్జునుడు – నేను యుద్ధం చేయనని యుద్ధభూమి నుండి మరిలిపోతున్నాడు. అప్పుడు ఆ అర్జునుడికి "ఈ శరీరం అచేతనం, ఆత్మ చేతనం. నశించే శరీరం కంటే నశించని ఆత్మ వేరైనది. యుద్ధంలో నువ్వు చంపేది శరీరాన్నే. ఆత్మను కాదు. నువ్వు చంపకపోయినా ఈ శరీరాలన్నీ ఏనాటికైనా నశించేవే. ఇది తెలిసిన జ్ఞానులు దానిని గురించి బాధ పడరు. ఆత్మ ఈ శరీరాన్ని

విడిచిపెట్టి మరో శరీరాన్ని పొంది తీరుతుంది. అందువల్ల నువ్వు వీళ్ళను చంపితే వారికి ఈ పాపపు దేహంనుండి విముక్తి కలుగుతుంది. అందుకైనా నువ్వు యుద్ధం చేయడం అవసరం" అని వివరంగా చెప్పాడు.

ఆత్మ నిత్యం. శరీరం అనిత్యం. ఇలాంటి విషయాలు ఆచార్యుడైతే ఒకటి రెండు శ్లోకాలలో చెప్పేవాడు. కానీ చాలా వివరంగా గీతాశాస్త్రాన్నే పూర్తిగా ఉపదేశించడంవల్ల మహాచార్యుడయ్యాడు శ్రీకృష్ణుడు. ఆ శ్రీకృష్ణమహాచార్యుల నామాన్ని వ్యవహారనామంగా పెట్టుకున్నవారే కృష్ణమాచార్యులు అయ్యారు. అంటే కృష్ణమహాచార్యులు అని అర్థం. ఇప్పటికీ ఉత్తరాదిన కృష్ణమహాచార్యులు అనే వ్యవహారం ఉంది.

ఇక అన్నమాచార్యులు అనే పేరుకు కలిగిన అర్థవిస్తృతిని గమనిద్దాం. మొదట శ్రీకృష్ణుడే మహాచార్యుడు. ఆ తరువాత అంతటి మహోపకారమో మహోపదేశమో చేసిన వారిని కూడా మహాచార్యులు అని వ్యవహరించవచ్చని భావించడం వల్ల ఈ పదం కృష్ణశబ్దానికే కాక తక్కిన వాటికీ వ్యాపించింది.

తాళ్ళపాక అన్నడు అనే ఒక వ్యక్తి – లోకానికి తన సంకీర్తనలద్వారా మహోపదేశం చేసి మహాచార్యుడు అయ్యాడు. అందుకే అన్నమహాచార్యుడు అన్నమాచార్యుడు అయ్యాడు.

ఇప్పుడు అనుచిత విభాగంద్వారా అన్నమ+చార్యుడు అని విభాగం చేసుకొని అన్నమ పదంపై మళ్ళీ దేశ్యనామసూచక శబ్దమైన అయ్యను చేర్చి అన్నమయ్యగా వ్యవహారంలోనికి వచ్చింది.

అన్నమ+అయ్య = అన్నమయ్య.

భగవద్రామానుజుల్లాగా సంపూర్ణమైన కరుణను కలిగి ఉండడమే మహాచార్యత్వానికి సూచకం. పండితులతో, పామరులతో తేడా లేకుండా కృష్ణుడు ఎలా అందరినీ సమాదరించాడో భగవాద్రామానుజులు ఎలా సమానత్వాన్ని పాటించారో అన్నమయ్య కూడా అలాగే కరుణను కలిగి, సర్వజనసమానత్వాన్ని కాంక్షించాడు. కాబట్టి అన్నమయ్య మహాచార్యుడు అయ్యాడు. ఎవరైతే ఆ మహాచార్యత్వాన్ని అనుసరిస్తారో వారికీ ఈ పేరు వచ్చింది. అలా వచ్చిందే కృష్ణమాచార్యులు. తరువాత్తరువాత ఆ పేరు ప్రాచుర్యాన్ని పొంది, మహాచార్యత్వం లేకపోయినా వ్యక్తివ్యవహారనామంగా స్థిరపడిపోయింది. కానీ అన్నమాచార్యులు అనే పేరు మాత్రం ఒక్క అన్నమయ్యకు మాత్రమే స్థిరంగా ఉండిపోయింది. అదీ విశేషం.

* * *

18. అన్నమయ్య కీర్తనలు - సమాజ చిత్రణ

- ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు

శ్రీయుతులు సురవరం ప్రతాపరెడ్డి రెడ్డి ఆంధ్రుల సాంఘిక చరిత్ర వ్రాసారు. ఈ రచనకు వాఙ్మయం ఆధారం. అప్పటికి తాళ్ళపాక వారి సంకీర్తనల ముద్రణ చురుకుగా సాగలేదు. ఈ సంకీర్తనల ముద్రణ ఆరంభదశలో వుంది. సాంఘిక జీవనాంశాలెన్నో ఈ సంకీర్తనల వాఙ్మయంలో కనిపిస్తాయి. అన్నమాచార్యుల సంకీర్తనలు సమకాలిక సాంఘిక జీవనానికి దర్పణం వంటివి. అన్నమాచార్యుల కీర్తనలలో కనిపించే కొన్ని విషయాలు ఆధారంగా ఆనాటి సమాజాన్ని మనం కొంత దర్శించవచ్చు.

జాతర

"ఆంధ్రుల సాంఘిక చరిత్ర"లో సురవరం ప్రతాపరెడ్డి సంఘంలో జాతరకు గల ప్రాధాన్యాన్ని వివరించి అందుకు తార్కాణంగా పాండురంగ మాహాత్మ్యములోని జాతర వర్ణన ఉదాహరించినారు. అయితే ఆ కాలానికి ముందే అన్నమయ్య కీర్తనలలో జాతర వర్ణన వుంది. కొందరు విమర్శకులు తెలిపినట్లు అన్నమయ్య కీర్తనలలోని అనేకాంశాల్ని ప్రబంధకవులు గ్రహించినారు గాని ఎవ్వరూ అన్నమయ్య పేరును పేర్కొనలేదు. దీనికి ప్రధాన కారణం ఆనాటి రాజకీయ పరిస్థితులు. జాతర వర్ణన విషయంలో అన్నమయ్యను రామకృష్ణ కవి అనుసరించిన తీరు గమనింపదగి వుంది.

తాళ్ళపాక అన్నమయ్య "మారుగాళ్ళీయ వద్దు" అన్న ప్రయోగాన్ని గ్రహించి తెనాలి రామకృష్ణ కవి "మారుగా నిచ్చెనకో సుధామధురవాణి" అని వ్రాశాడు. అట్లే అన్నమయ్య "చిచ్చులోన చొరవద్దు" ప్రయోగం ఆధారంగా రామకృష్ణ కవి 'చెందమ్మి కొలనరంజిల్లు నంచమవోలె నిప్పుటెటజరించె నెలతయోర్తు' అని వ్రాశాడు. "సిడిదల వియ్యవద్దు" అన్న అన్నమయ్య ప్రయోగానికి "అంభోదరము క్రింద నసియాడు ఐరావతియు వోలెసిడిక్రవిదెరవయోర్తు బత్తులగు నువాకత్తు మొత్తరి" అని రామకృష్ణ కవి పేర్కొన్నాడు. అట్లే "జీవాల జంపవద్దు" అని అన్నమయ్య ప్రయోగానికి "పశుసమాజి మండలములు చాడముఖ నెత్తుధారలు ఘోరవిపత్తి మిరణ వారుణ ప్రభలు ప్రబలంగన్" అనేది రామకృష్ణ కవి ప్రయోగం. పరిశీలనా దృష్టితో చూస్తే తెనాలి కవి వర్ణనలకు తాళ్ళపాకవారి వర్ణనలే ఆధారమని చెప్పవచ్చు. ప్రబంధాలలో మనకు కనిపించే అనేక సాంఘికాంశాలకు అన్నమాచార్యుల సంకీర్తనలలోని కొన్ని అంశాలు మూలమనిపిస్తాయి. అమ్మవారిని సంతృప్తిపరచి, అమ్మవారి మన్ననల్ని పొందడానికి మారుచేతులు మామూళ్ళివడం, గుండెలు కోసి యివ్వడం, జంతు బలులివ్వడం - హింసాత్మకమైన కైంకర్యాలు ఆనాటి జాతరలోని భాగాలు.

అన్నమయ్య కీర్తనలలోని జాతర వర్ణన తిరుపతి గంగజాతరను తలపిస్తుంది. ఎనుబోతును బలివ్వడం, దాని మెడ తెగి క్రిందపడేలోపల దాని గుండెలు, కాలిగిట్టలు కోయడం జరిగేది. ఆ బలికి ముందు ఆ ఎనుబోతును గుడిచుట్టూ ఊరేగింపుగా తిప్పడం ఆనవాయితి. ఎనుబోతుతోపాటు పొట్టేళ్ళ, మేకపోతులు,

గొఱ్ఱెలు, మేకలు, కోళ్ళు మొదలైన వాటిని బలివ్వడం జరిగేది. ఎంత నిషేధముండినా నేడు కూడా జాతరలో కొన్ని హింసాత్మక కృత్యాలు వాడవాడలోను, ఊరూరులోను జరుగుతూనే ఉన్నాయి. అన్నమయ్య తన స్వగ్రామమైన తాళ్ళపాకలోను, ఆ చుట్టుప్రక్కల గ్రామాల్లోను, తిరుపతిలోను ఈ జాతరలను చూసి ఉంటాడు. అన్నమయ్య వర్ణనలు ఆధారంగా ఆనాటి జాతరల విధానాలను కొంత మనం గుర్తించవచ్చు. అట్లే అన్నమయ్య కాలంనాటికి ఈ జాతరలు బహుళవ్యాప్తిలో ఉండేవని కూడ మనం గ్రహించవచ్చు. ఆనాటి అంశాలను ఈనాడు జరుగుతున్న జాతరలతో పోల్చి మార్పుచేర్పులను గమనించవచ్చు.

బందె

గ్రామాల్లో పశువులు పంటపొలాల్లో పడి పంటను నాశనం చేస్తే క్షేత్రాధికారి ఆ పశువుల్ని గ్రామాధికారికి స్వాధీనం చేస్తాడు. గ్రామాధికారి ఆ పశువుల్ని ఒకచోట వుంచి నిర్ణీత శుంకాన్ని పశువుల ఆసామి చెల్లించిన తరువాత ఆ పశువుల్ని విడిచిపెడతాడు. పశువుల్ని గ్రామాధికారి నిర్బంధించిన స్థలాన్ని 'బందెలదొడ్డి' అని అంటారు. ఈ బందెలదొడ్డి తాళ్ళపాక అన్నమయ్య కాలంలో వారి గ్రామంలోనూ, ఆతడు సంచరించిన స్థలాల్లోనూ ఉండినట్లు ఆతని శబ్దప్రయోగాలాధారంగా తెలుసుకోవచ్చు. ఉదాహరణకు "పసిమి పాపము నేటి బందెమేయుపసరము" (7-107)

"పసరము పంటమాట పాపపు బందెలుదెత్తు (10-23)

బందెలు మేసితివి" (10-227) - ఈ మొదలైనచోట్ల అన్నమయ్య 'బందె' ప్రయోగం చేసి వున్నాడు. కాబట్టి అన్నమయ్య రోజులలో ఇతరుల పొలాల్లో మేసిన పశువులను 'బందెలదొడ్డి'కి తోలే ఆచారముందని తెలుస్తూంది.

కానుకలు : కానుక, కానిక అని ప్రయోగాలు కనబడుతున్నాయి. ఉపాహారమని నిఘంటువర్థం. పెండ్లిల్లలో వధూవరులకి ఇచ్చే బహుమానాన్ని పెళ్ళికానుక అని అంటారు. దేవునికి కానుకలు సమర్పించడం ఆచారం. ఇది వారి వారి శక్తినిబట్టి వుంటుంది. పూలు, పండ్లు, ధనం, కనకం, వస్తు వాహనాదులు దేవునికి కానుకగా అర్పిస్తారు. అన్నమయ్య కీర్తనల్లో తిరుపతి శ్రీ వేంకటేశ్వరుడు దొండపండు, పూలగుత్తి తన ప్రియురాండ్రకిచ్చినట్లుగా వర్ణింపబడి వుంది (15-177). ఆ ప్రియురాండ్రు శ్రీ వేంకటేశ్వరునికి వెలగపండు, టెంకాయ కానుకగా ఇచ్చినట్లు వర్ణితం (12-35) ఈ కానుకల్లో టెంకాయ, పూలు నేటికి కూడ ఉన్నాయి. వెలగపండు, దొండపండు వినాయకచవితి మొదలగు రోజుల్లో తప్ప సామాన్యంగా కానుకలుగా లోపించాయి. కారణం విరివిగా లభించకపోవుటయే కావచ్చు. అన్నమయ్య నాడు ఇట్టి కానుకలుండినట్లు తెలుస్తూంది.

బంగారు

ఇనుమును బంగారంగా మార్చే ప్రయత్నలు ఎప్పటినుండో జరుగుతున్నాయి. వేమన చరిత్రలో సహితం ఈ చర్చ వుంది. అన్నమయ్య కీర్తనల ద్వారా అన్నమయ్య కాలంలో కూడా ఈ నమ్మకమున్నట్లుగా

తెలుస్తుంది. పరుసవేది సహాయంతో ఇనుమును బంగారంగా మార్చడానికి ఆనాటివారు ప్రయత్నించినట్లు (8-190) తెలుస్తుంది. ఇంకా ఇత్తడిపై బంగారు నీరూదుట ఆనాటివారికి కొత్తకాదని "చెంబుమీది కుప్పబొంత (9-1) వల్ల తెలుస్తుంది. మరియు "పాదికెత్తు మెరుగారు బంగారుగుండు" (12-278) అనే ప్రయోగం వల్ల ఆనాటివారు బంగారాన్ని పాతిక విభాగాలుగా తూచి వ్యవహరించేవారని తెలుస్తుంది.

ఆభరణాలు

పూర్వం పురుషులు కూడా ఆభరణాలు ధరించేవారు. కొంతకాలం క్రితం వరకు గ్రామాల్లో పురుషులు చెవులకు ఆభరణాలు ధరించేవారు అట్లే పురుషులు జడవేసి పూలు పెట్టుకొను పద్ధతి కొంతకాలం ముందు కూడా గ్రామాల్లో ఉండేది. అన్నమయ్య కీర్తనలు ఆధారంగా అన్నమయ్య కాలంలో పురుషులు ఆభరణాల్ని ధరిస్తున్నట్లు తెలుసుకోవచ్చు. చుక్కలవలె ప్రకాశవంతాలగు పూసలు (7-15, 10-85) చిరుగంటల మువ్వల గజ్జెలు (12-302) సూర్యచంద్రుల వంటి మొలపూసలు, మొలగంట (11-175) ఆనాడు పురుషులు ధరించే ఆభరణాలుగా తెలుస్తూంది. అట్లే మొలనూళ్ళు (12-297) (12-4) బరువైన మొలనూళ్ళు (4-148) తీగవడ్డాణం (4-35) అనే ఆభరణాలు స్త్రీలు ధరించేవిగా తెలుస్తూంది. ఇంకనూ సంకుచేరులు (7-12) కొత్త ముత్యపుసరులు (4-28) అచ్చపు గుచ్చు ముత్యాలహారాలు (12-302) అనే ప్రయోగాన్ని బట్టి ఆనాడు ముత్యాల యందధిక ప్రీతియున్నట్లు తెలుస్తూంది. ముత్యాలకుచ్చుల విషయం అన్నమయ్య ప్రస్తావించియున్నాడు. ముత్యాలకుచ్చులు (8-164) కుచ్చుల ముత్యాలు (4-108) అనే ప్రయోగాలు గమనార్హాలు. అన్నమయ్య కీర్తనల్లో స్త్రీ పురుషులిరువురూ హస్తాభరణాలు ధరించినట్లు పేర్కొనబడింది. ముత్యాల కంకణాలు (12-304) ఈ ముత్యాల కంకణాలు స్త్రీల హస్తాభరణంగా తెలుస్తూంది. సంధిదండలు, సంకుకడియం (4-108) అనేవి పురుషుల హస్తాభరణాలుగా తెలుస్తుంది. ముంగ ముడువులు, చేమపూకడియాలు (11-2120) అనేవి చిన్నపిల్లల చేతికి వేసే ఆభరణ విశేషం కావచ్చు.

సంత

గ్రామాల్లో సామాన్యంగా సంతలు జరుగుతుంటాయి. రైతులు తాము పండించిన కూరగాయలు ఈ సంతకు తీసుకొనిపోయి అమ్ముతారు. ఈ సంతల్లో కూరగాయలతోపాటు నిత్యావసర వస్తువులూ లభిస్తాయి. ఈనాడు ప్రత్యేకంగా 'టమోటా సంత' అని కొన్ని గ్రామాల్లో జరుగుతూ ఉంటుంది. అట్లే పొట్టేళ్ళ సంత, పశువుల సంత ఈనాడు ఉన్నాయి. ఈ పశువుల సంతనే 'పరస' అనికూడా అంటారు. అన్నమయ్య సంత విషయాన్ని ప్రస్తావించియున్నాడు. "చింతపండు దెచ్చి సంతలో నమ్ము" (4-116) అట్లే అన్నమయ్య 'మైలసంతలు' (5-178) ప్రస్తావన కూడా చేసినాడు.

వృత్తులు

అన్నమయ్య ఆనాటి సమాజంలో వున్న అనేక వృత్తుల్ని గూర్చి ప్రస్తావించియున్నాడు.

వెట్టి

'వెట్టి' శబ్దానికి కూలి లేక చేసెడు పని అని నిఘంటువర్థం. ప్రాచీనకాలంలో గ్రామాధికారి ఆజ్ఞల్ని శిరసావహించి రాత్రింబవళ్ళు విరామం లేకుండా కష్టం చేసేవాడు వెట్టివాడు ఈ పనికి ప్రతిఫలం ఉండదు. నేడీవెట్టి ఎక్కడా లేదు. గ్రామాల్లో అనేక కార్యక్రమాల్లో తోటి, తలారి, చాకలివారు పాల్గొంటూ ఉంటారు కాని వెట్టివాడు కేవలం గ్రామాధికారి ఆజ్ఞను మాత్రమే నిర్వర్తించేవాడుగా తెలుస్తూంది. అన్నమయ్య కీర్తనల్లో గ్రామాధికారి నియోగాల నాచరింపలేక వెట్టి గ్రామాంతరానికి పారిపోగా మరలా వాడిని వెదికి తెచ్చినట్లు వర్ణింపబడింది (11-2/31) మరోచోట (5-11/5) వెట్టిబరువులను మోసినట్లుగా జీవుడు ఈ శరీరాన్ని మోస్తున్నాడని వర్ణింపబడింది. అన్నమయ్య ఈ వర్ణనల ద్వారా నేడు అంతరించిపోయిన ఈ వెట్టి ఆచారం ఒకనాడు ఆంధ్రదేశంలో ఉండేదని తెలుస్తుంది.

దొమ్మరులు

గడసాము చేసి తమ ఆటలతో ప్రేక్షకులకు వినోదాన్ని కలిగించేవారు దొమ్మరులు. వీరు సామాన్యంగా రైతులకు పంటలు చేతికందినప్పుడు గ్రామాలలో విరివిగా తమ ఆటలను ప్రదర్శించి ధాన్యాన్ని సంపాదిస్తారు. ఈ దొమ్మర గడసాములు అన్నమయ్య నాడు ఉండేవని అన్నమయ్య కీర్తనలలో (7-12) వ్యక్తమవుతుంది.

కమ్మరి

గ్రామాల్లో కమ్మరి పనిచేసేవారిని కంసాలి అనికూడా అంటారు. రైతులకు వీరికి విడదీయరాని బంధం ఉంది. నాగలి, గొడ్డలి, పార, కత్తి మొదలైన పనిముట్లన్నీ కమ్మరి తయారు చేసి రైతుకు ఇస్తాడు. పంటలు పండినపుడు రైతులు కమ్మరికి "మేర" పేరుతో కొంత ధాన్యాన్ని ఇస్తారు. సంతలో కూడ పనిముట్లను కమ్మరి విక్రయిస్తూ వుండేవాడు. అన్నమయ్య కీర్తనలలో ఈ కమ్మరి ప్రస్తావన కనిపిస్తుంది. "మన్మథుని చేఖడ్గమునకు వసంతుడను కమ్మరి పదునుపెట్టెను" (13-140) "సానబల్లపై చూపులనే ములుకులకు పదును పెట్టెను ఆ నికషము వలన మోహమను పొడిరాలనది (13-409).

నేతగాండ్రు

గ్రామాలలో వీరిని సాలెవారని, తొగటలు అని పిలుస్తుంటారు. వస్త్రాలు నేయడం వీరి వృత్తి. ఈ నేతగాండ్రు ఆనాడు కూడా ఉన్నారనడానికి అన్నమయ్య "పంచభూతము అనే పలువన్నెల నూలును చంచలమనే గంజిలో ముంచిచీరను నేచియిమ్ము" (5-178) అను ప్రయోగం సాక్షిగా నిలుస్తుంది.

ఓడ వ్యాపారం

అన్నమయ్య సంకీర్తనలు పరిశీలిస్తే అన్నమయ్య కాలంలో ఓడవ్యాపారం సాగుతుండేదని, ఓడవ్యాపారానికి సుంకం చెల్లించడం కూడ వుండేదని తెలుస్తూంది.

"సంసారమనే సముద్రము నందు
దేహమను ఓడవ్యాపారి పాప
పుణ్యములను సరకులతో బూతు
రేవున దిగినట్లు సుంకము నాటి అభ్యర్థనము" (9-35)

అట్లే ప్రతికూల వాతావరణంలో శరీరాన్ని ఓడవలె యథేచ్ఛగా పోనీయాలని ఉంది (11-79) దీన్ని ఆధారంగా ఓడవ్యాపారులు ఎదుర్కొను విపరీత వాతావరణం ఆనాటివారికి సుపరిచితమనిపిస్తుంది. ఉప్పు మొదలైన వాటిని ఎద్దులమీద గాడిదల మీద, ఎనుబోతుల మీద వేసుకొని వచ్చి గ్రామాలలో విక్రయిస్తారు. అన్నమయ్య సంకీర్తనలలో వస్తువుల సంచులను ఎద్దులపై వేసుకొనివచ్చి అమ్మినట్లు (5-307) వర్ణింపబడి వుంది. దీన్నిబట్టి ఇటువంటి వ్యాపారం అన్నమయ్య కాలంలో ఉండేదని తెలుస్తూంది.

వడ్డీవ్యాపారం

అన్నమయ్య వడ్డీవ్యాపారాన్ని గూర్చి కూడా తన సంకీర్తనలతో ప్రస్తావించియున్నాడు. వడ్డీకి డబ్బు పుచ్చుకొన్నప్పుడు పత్రం వ్రాసి యివ్వడం ఆనవాయితి. దానినే ఈనాడు 'బాండు' అని అంటున్నాం. ఈ పత్రం రాయడాన్ని 5-294లో అన్నమయ్య పేర్కొన్నాడు. వడ్డీవ్యాపారంతోపాటు కుదువ వ్యాపారం కూడా ఆనాడు వుండేదని అన్నమయ్య కీర్తన (10-142) ద్వారా తెలుస్తూంది.

అలంకారాలు

అన్నమయ్య కీర్తనల్లో అనేక ఆలంకారిక విశేషాలు మనం గమనించవచ్చు.

స్నానం

ప్రాతఃకాలాన్నే దంతధావనం చేసే అంశాన్ని ప్రస్తావించాడు.

"కమలనాభుడ నీకు గంగాది నదులెల్ల
నమరమొక మర్చనంబాయితముసేసె"

అని అన్నమయ్య పేర్కొన్నాడు. తిరుపతి కొండమీద నిత్యపారాయణం చేస్తున్న శ్రీ వేంకటేశ్వర సుప్రభాతమందైనను కానరాని ఈ ముఖమార్జన ప్రసంగం యిందుండడానికి స్థానిక ఆచారమే కారణం కావచ్చు. ఆనాడు కొందరు స్నానానికి పన్నీరు, పునుగు వుపయోగించినట్లు (8-163) తెలుస్తూంది. జవ్వాది ద్రవ్యాలను కాచి శిరస్సును కడిగినట్లు దానివలన వెంట్రుకల చిక్కు వీడినట్లు (4-35) అన్నమయ్య పేర్కొనియున్నాడు.

అనులేపన

స్నానానంతరం శరీరానికి సువాసనాభరితమైన కస్తూరాదులు ఆనాడుపయోగించినట్లు అన్నమయ్య కీర్తనల వల్ల తెలుస్తూంది. కస్తూరి, గంధం (13-285) పన్నీరు (4-93) తట్టుపునుగు కప్పరము - జవ్వాది (4-15) అనేవి వారు ఆనాడు ఉపయోగించిన అనులేపనాలుగా తెలుస్తూంది.

కొప్పు – తిలకం

అన్నమయ్య కాలంనాటి స్త్రీలు తను వెంట్రుకల్ని కొప్పుగా ముడుచుకొని చేమంతాది పువ్వుల్ని పెట్టుకొన్నట్లు (4–134) తెలుస్తూంది. సవరాలను కూడ వాడినట్లు (2–156) వల్ల గ్రహించవచ్చు. కమ్మని వాసనగల కస్తూరితో (4–35) చంద్రవంక వంటి తిలకాన్ని (15–90) ఆనాటి స్త్రీలు పెట్టుకున్నట్లు గుర్తించవచ్చు. ముఖానికి లత్తుకను పూసుకొనుట (4–28) ఆనాడు కలదని తెలుస్తూంది. వస్త్రాలు – దానిమ్మ పూవు వన్నె కలిగి సున్నితాలైన వస్త్రాల్ని (4–42) స్త్రీలు ధరించినట్లు అన్నమయ్య వివరించాడు.

గృహాలు

గృహాలలో ఆనాటివారు నిలువుటద్దాలను, కమలాల పానుపులను, కలిగివుండేవారని (15–299) తెలుస్తూంది. దోమతెరలను కూడా వాడినట్లు (17–300, 13–251, 17–403) గ్రహించవచ్చు. గృహాలలో చిలుకలను, కోయిలలను, నెమళ్ళనూ పెంచి వాటికి మాటలు, పాటలు నేర్పేవారని (13–506) తెలుస్తూంది. శకునాలను తెలియజేసే జక్కువ పులుగుల్ని కూడ (13–506) అన్నమయ్య వర్ణించియున్నాడు. అన్నమయ్య కలువల వసంతం, వెన్నెల వసంతం, గంధాల వసంతం, మంచినీళ్ళ వసంతం, బంగారు వసంతం, కెందామర వసంతం, ముత్యాల వసంతం – ఈ మొదలైన అనేక వసంతాలను వర్ణించియున్నాడు.

సాంఘిక దృష్టితో అన్నమాచార్య కీర్తనలను సమగ్రంగా పరిశీలిస్తే ఆనాటి తెలుగువారి సాంఘిక, రాజకీయాది వ్యవహారాలు ఎన్నో వెలుగులోనికి వస్తాయి.

* * *

19. అన్నమాచార్యస్వామి వేంకటేశ్వర శతకం

– అవధానప్రాచార్య డా॥ ధూళిపాళమహాదేవమణి

తాళ్లపాక కులోత్తంసం ప్రత్యక్షీకృతదైవతమ్
కీర్తనాభక్తి సంయుక్తం నందకాంశమహం భజే

పదకవితా పితామహులు కడపమండలం తాళ్లపాకగ్రామ సంభూతులైన శ్రీఅన్నమాచార్యస్వామి తన భక్తితో అమ్మనీ, వేంకటనాథుణ్ణీ దర్శించిన మహాత్ముడు. నవభక్తి రీతుల్లో 'కీర్తన' మనే భక్తిని తపస్సుగా చేసుకొన్న మహాతపస్వి ఈ కవి. స్వామి ఆయుధాల్లో 'నందక' అంశతో వీరు అవతరించి నట్లుగా పలువుర అభిజ్ఞుల అభిభాషణ. ఉన్నత కులంలో పుట్టి ఆకులానికే ఆజరామరమైనకీర్తిని ప్రతిష్ఠించిన కీర్తనగంగా గంగాధరుడు అన్నమయ్య.

ఈపేరే చాలా విచిత్రం అన్న+అమ్మ+అయ్య అనే తెలుగునాట ప్రసిద్ధ శ్రేష్ఠతావాచకాలను మూడింటినీ తన పేరులో ధరించి పేరుకే పేరుతెచ్చిన ఘనుడు ఈ పదకవి బ్రహ్మ. 5వ ఏటనే ఉపనయన దీక్షపొందిన ఈ మహనీయుడు నిరంతర తపస్సుగా వేలకీర్తనలకు సృష్టికారకుడై పదకవితాబ్రహ్మ అయ్యాడు. సంగీత సాహిత్యాలనే శారదాదేవి పయోధారల్ని కుత్తుకబంటి త్రాగి లోకానికి ఉదాత్త రమణీయాలైన పదకవితా ప్రాలేయాన్ని మహోన్నత శిఖరంగా లోకానికి అందించిన మహావిద్యాతపస్వి శ్రీఅన్నమయ్య.

పదాల్నేకాక పద్యాల్ని కూడా అందించిన ఈ మహామనీషి "వేంకటేశ్వర శతకాన్ని" మంగా శ్రీనివాసుల దివ్యానుగ్రహంతో మృదులభావబంధురమై, భక్తిసుగంధ వాసనాభూయిష్ఠంగా చేసి దేవ, దేవీ కైంకర్యంచేసి మనకందించారు.

నూరు పద్యాలతో, సరళశైలితో, సుందరోజ్వలమైన రచనా విన్యాసంతో, పరమాత్మ లీలా విలాసాలతో మంగాదేవిని ప్రధానంగా ఉద్దేశించి చెప్పిన 100 పద్యాలు వినేకొద్దీ, వినాలనీ, చదివేకొద్దీ చదవాలనీ అనిపిస్తుంది ఈశతకం.

మకుటం

శతకంలో ప్రతి పద్యానికీ కిరీటంవంటిది మకుటనియమం. ఆ పద్ధతిలోనే ఇందు "వేంకటేశ్వారా! 'అన్న స్వామి నామంతో 4వ పాదంలో చివరగా సంబోధిస్తూ చంపకాల, ఉత్పలాల మేళవింపుతో నూరు పద్యమాలికలు గూర్చి స్వామికి, మంగాదేవికీ అలంకరించారు అన్నమాచార్యులవారు. చిత్రంగా ఈ పద్యాల్లో మొదటి మూడు పాదాల్లోనూ, ఎక్కడో ఒకచోట "అలమేలుమంగ" అన్న అమ్మవారిని సంబోధిస్తున్న మకుటం కూడా నూరు పద్యాల్లోనూ ఉంటుంది. అనగా ఈ శతకం రెండు మకుటాల అలంకారాలతోనడిచిన

విచిత్రమైన కృతి. నిజంచెప్పాలంటే అయ్యవారిలో అమ్మవారిని అంతర్గతంచేసి ప్రతిపద్యమూ నడుపించడం అయ్యింది. అంతేకాదు. అమ్మవారే మొదట ప్రత్యక్షమై కళ్లు తిరిగి, పడిపోయిన సమయంలో మంగమ్మతల్లి తనస్వామి ప్రసాదాన్ని తినిపించి ప్రాణాలు నిలబెట్టింది చిన్న అన్నమయ్యను. ఆ కృతజ్ఞతతో ముందు అమ్మనే తలుస్తూ తరువాత స్వామి స్మరణతో నడుస్తాయి ఇందలి పద్యాలు.

"నను బ్రోవమనీ చెప్పవే...." – అని రామదాసు సీతమ్మ తల్లిని మొరపెట్టుకొన్నట్లే, అన్నమయ్య కూడా అలమేలు మంగను మొరపెట్టుకొన్నాడు బ్రహ్మాదులవలె.

ఓలలితాంగి! యోకలికి! యోయెలజవ్వని! యోవధూటి! యో
గోల! మెఱుంగుచూపుకను గోనల, నోయలమేలుమంగ! మ
మ్మేలిన తల్లి! నీవిభునకించుక మాదెస జూపుమంచు, నీ
పాలికి, జేరి మ్రొక్కుదురు పద్మభవాదులు వేంకటేశ్వరా!

బ్రహ్మాది దేవతలు కూడా సరాసరి శ్రీహరిని వేడుకోడానికి భయపడతారుట. అందుకని మంగమ్మతల్లిని సిపార్సు చెయ్యమంటారుట. అదీ స్వామి వైభవం అంటే.

నిజానికి అన్నమయ్యకూడా వేంకటేశ్వరా! అన్నమకుటం చెప్పినా తానీ శతకాన్ని అలమేలుమంగకే సమర్పించాడు. ఆ మాట స్పష్టంగానే చెప్పాడు చివరి అంకితపద్యంలో.

అమ్మకు తాళ్లపాకఘనుడన్నడు పద్య శతంబు 'జెప్పె గో
కొమ్మని వాక్ప్రసూనముల 'గూరిమితో నలమేలుమంగకున్ అని అర్థపద్యంలో అమ్మకంకితం ఇచ్చి

నెమ్మది నీవు చేకొని యనేక యుగంబులు బ్రహ్మకల్పముల్
సమ్మదమంది వర్థిలుమ జవ్వనలీలల వేంకటేశ్వరా!

అని మరో అర్థంలో స్వామీ! నీవు దీన్ని గ్రహించి చిరకాలం సంతోషంగా ఉండమని ప్రార్థిస్తున్నాడు స్వామిని. నిజమే ఈ సృష్టిలో ప్రతీ అంశమూ, ప్రతి నమస్కారాలూ స్వామివే కదా!

"సర్వదేవ నమస్కారః కేశవం ప్రతిగచ్ఛతి." అన్నది సత్య వచనమే కదా!

స్వామి అనుగ్రహాన్ని చిన్నవయస్సులోనే పరిపూర్ణంగా పొందిన ధన్యుడు అన్నమయ్య. సుమారు 1415వ సం॥లో అమ్మపెట్టిన స్వామిప్రసాదం తిని అమ్మ ఆజ్ఞమేరకు స్వామి కొండలు సాలగ్రామ పర్వతాలుగా భావించి చెప్పులు తీసేసి కొండెక్కి పుష్కరిణిలో స్నానంచేసి స్వామి దర్శనానికి వెళ్లగా అర్చకులు గుడితలుపుల వేసేసి తాళాలు బిగించి ఇంటికి వెళ్లిపోయారు. అపుడన్నమయ్య భక్తి పరవశంలో ఉండి స్వామిపై ఒకశతకం చెప్పాడు. అంతే! తాళాలు విడిపోయాయి. ద్వారాలు తెరుచుకొన్నాయి. అర్చకుడు

ఆ మహిమకు విస్తుపోయి చందన తీర్థప్రసాదాలిచ్చాడు. స్వామి అనుగ్రహాన్ని అలాపొందిన విషయం అంతటా వ్యాపించగా అన్నమయ్య భగవద్భక్తికి అందరూ పరవశించిపోయారు. శతకంలో స్వామిని మొదటి పద్యంలోనే తాను అమోఘమైన సేవ చేస్తానని ఇలా ప్రతిజ్ఞ చేశాడు అన్నమయ్య.

శ్రీసతి, నీల, జాంబవతి, శ్రీయమునాసతి, సత్యభామ, ధా
త్రీసతి, రుక్మిణీరమణి, దేవి ఇలాసతి, వీరంలందఱున్
చేసిన సేవ చేసెదను చేకొను "శ్రీయలమేలుమంగ" నీ
మూసిన ముత్యమై ఉరము ముంగిట చెంగట వేంకటేశ్వరా!

ఇలా 8 మంది వేర్వేరూగా చేసిన సేవలన్నీ స్వామికి తానొక్కడే చేస్తానంటున్నాడు. ఆ అష్టనాయికలు చేసిన సేవలుస్మరిస్తే –

1. పాదసేవ చెయ్యడంలో శ్రీలక్ష్మీప్రథమగణ్యురాలు
2. నీలాదేవి స్వామి ధరించిన నల్లనికాటుకలో లీనమైయుండి భక్తుల పాపాలు స్వామికి కనపడకుండా భక్త రక్షచేస్తుంది
3. జాంబవతి వీణావిద్వాంసురాలు. తానూ అలాగే సంగీతంతో వేల కీర్తనలతో స్వామిని వాక్సేవ చేసింది.
4. యమునా నది బాలకృష్ణుణ్ణి అర్ధరాత్రి గొల్లపల్లికి చేర్చింది. స్వామిని నల్లని సర్పరూపంగా గొడుగు పట్టి సేవించింది. స్వామి కాళియ మర్దనం కోసం 'యమున' లో ఉండగా తన విషజలాన్నివిరిచి స్వామిదేహం ఏమాత్రం కందిపోకుండా సేవించింది. యమునా స్మరణ విషహారకం కూడా.
5. సత్యభామ తాను 'భూ' అంశతో పుట్టడం మూలంగా 'నరకాసురునితో విల్లు పట్టి యుద్ధంచేసి, అతడు 'కన్నతల్లి' అయిన తనపైనే బాణాలు వేసేలా చేసి ఆయుస్సు క్షిణింపఁజేసింది. దాంతో కృష్ణస్వామికి నరకుణ్ణి చంపడం సులభ మయ్యింది.
6. ధాత్రీసతీ "లక్ష్మీపార్వతుల" తపస్సుతో కంటి నీటి బిందువులు నేలపై బడగా, ఆ దివ్య బిందువుల్ని ధరించి ఆమలక వృక్షాన్ని తన నుండి పుట్టించి లోకసేవ చేస్తోంది. విశ్వసేవే విష్ణుని సేవ. సదా విశ్వాన్ని మోస్తూ స్వామి ఉరాన్ని ఎక్కింది.
7. రుక్మీణీ సతి–పరమాత్మను తదేకంగా ఉపాసించి తనను చేపట్టేలాచేసుకొంది. శిశుపాల శిక్షకూ కారణమైంది.
8. ఇలాదేవి ఈమె కూడా స్వామికి అత్యంత ప్రియురాలు. ఈమె మంత్రప్రకారం సంపదలిస్తుంది. 9ఏళ్ల పిల్ల. లోకరక్షకి.

నవే వర్షే ఇలాదేవి లోకసంవర్ధకారిణి!

హరిప్రియే! కామరూపే! దేహి మే ధనమన్వహమ్.

అని పురాణవచనం. ఇలా 8 మంది వివేకవంతమైన విచిత్రమైన సేవల్ని తానొక్కడే చేస్తానంటే స్వామి అనుగ్రహింపడా ? అన్న విధంగానే తన జీవితం స్వామికే అంకితమిచ్చాడు అన్నమయ్య.

ధృష్టనాయకుడు స్వామి

స్వామిని ధృష్టనాయకునిగా చిత్రిస్తూ అన్నమయ్య మనోహరంగా పద్య సేవ చేసాడు 'సాపరాధుడై అలుకనివాడు ధృష్టుడు" అన్నది ఈ శృంగార నాయకుని లక్షణం.

అంబరమెల్ల చంద్రమయ మైనటులా మదనాంకముల్, మెయిన్
పంబిన, నేడవంచు? సిరిపల్కిన, నయ్యలమేలుమంగ పా
దంబుల నాన పెట్టితివి. తమ్మియిగుళ్లని, నీకు బొంకులే
సెంబళమాయె నెవ్వరికి, ఁజెల్లవు రంతులు వేంకటేశ్వరా!

స్వామి ఒంటినిండా నఖక్షతాదులు ఏర్పడ్డాయి. అవి ఎవ్వరి వల్ల ఏర్పడ్డాయని అమ్మవారు గట్టిగా అడిగింది. స్వామి దక్షిణ నాయకుడు కదా! ఎంతమంది కాంతలో స్వామికి. వెంటనే స్వామి ఏమీ తడుముకోకుండా నీపాదాలపై ఒట్టు. ఆ గుర్తులు పద్మాల లేత 'చివుళ్లు' అన్నాడు. ఒంటి మీదకి ఆచిగురులు ఎలా వస్తాయి? అన్న ప్రశ్న మనమే వేసుకొని మంగాదేవి చిగురుటాకుల వంటి పాదాలు ఏకాంత క్రీడలో స్వామి ఒంటికి సోకాయని మనం జవాబు చెప్పుకోవాలి. లక్ష్మికి అదే అర్థం కలగాలనే ఆమె పాదాలపై ఆన అన్నారు గడుసు తనంతో అన్నమయ్య. ఆజగన్నాటక సూత్రధారి మాటవేరు మనస్సు వేరూ అని మంగమ్మ తల్లికి తెలియకపోతే కదా!

మంగాదేవి, శ్రీనివాసుల విశ్వరూపాన్ని వర్ణిస్తున్నాడు అన్నమయ్య మరోపద్యంలో చమత్కారంగా

నెఱినలమేలు మంగకును నీకున్న పద్మభవాండ భాండమే
మెఱసిన బొమ్మరిల్లు, తగుమేడలు మీదటిలోకముల్, ప్రభల్
తెఱలగ మించు నయ్యినుడె దీపము గుజ్జన గూడుచంద్రుడే
తొఱలిన దేవసంఘములె తొత్తులు, బంట్లును వేంకటేశ్వరా!

పోతనగారి వలె అన్నమయ్య అపురూపంగా 'స్వామి' విశ్వ వ్యాపకత్వాన్ని వర్ణిస్తున్నాడు. స్వామిది బ్రహ్మాండాన్ని మించిన దేహం. అందుకే బ్రహ్మాండాలు శ్రీహరికి చిన్నచిన్న బొమ్మరిళ్ల వంటివిట. ఆ బొమ్మరిళ్లకి ఊర్ధ్వలోకాలన్నీ అంతస్థులుట. అనగా 07 అంతస్థుల బొమ్మరిల్లు అది. ఇంటికి దీపారాధన

అవసరం లేదు. నిత్యం ప్రకాశించే సూర్యుడే ఆరని దీపం. ఆ ఇంటికి అపుట్ హౌస్‌లాంటి చిన్నగూడు చంద్రుడు. దేవతల్లో కొందరు బానిసలు గానూ, కొందరు భృత్యులు గానూ చేరి స్వామిని సేవిస్తూ ఉంటారట. ప్రాచీనమైన "భూః పాదౌ...." "ధరసింహాసనమై ...." "రవిబింబంబుపమింప పాత్రమగు..... "మున్నగు శ్లోకపద్యాల్లా భాసిస్తోంది ఈ పద్యం. అలాగని వానికంటే వేరైన పద్ధతిలో వర్ణించడం ఆ ఆచార్యుని నైపుణ్యం.

విశిష్టమైన అద్వైత మార్గంలో నూతన వధూవరులు, లేదా దంపతులు ఎలా ఒకరికి ఒకరు ఉండాలో రమణీయంగా వర్ణించింది ఈ క్రింది పద్యం.

అతడెనేను, నీవనగ నాతడె, 'నీ పలుకే తలంపగా
నాతని పల్కు, నీ హృదయమాతడెపో! అలమేలుమంగ! నీ
చేతిదె సర్వజంతువులు, జీవన మంతయు, నంచు, సన్మని
వ్రాతము సన్నుతించు, ననివారణ నీసతి వేంకటేశ్వరా!

మునిజనులు మంగాదేవిదే పెత్తనం అంతా అంటూ శ్లాఘిస్తూ ఉంటారుట. అంటే సర్వక్రియా శక్తి మంగాదేవి అయితే ఇచ్ఛా జ్ఞానశక్తులు శ్రీనివాసునివి అన్నమాట.

ఇలా ఈ శతకం అంతా సుకుమార భావాలతో వ్యంగ్యవైభవంతో, మాలా వృత్తద్వయంతో మరుగు పడ్డ అలతి అలతి తెలుగు పదాలతో, మధురమైన భక్తి పిల్లవాడు తల్లిదండ్రుల వద్ద చేసే 'మారాం' లాంటి సొగసైన మాటలతో ఎంతగానో అందగిస్తోంది. ప్రతి పద్యమూ మనస్సుతో చదవాలి. ప్రతిపద్యాన్నీ అంతరంగంతో మధించుకొంటూ అమృత భావాన్ని అందుకోగలగాలి పాఠకుడు. స్వామిమిథునాన్ని పరవశంగా ఉపాసించిన ధన్యతపస్వి శ్రీ అన్నమాచార్యులువారు.

సర్వం అలమేలుమంగా శ్రీనివాసార్పణమస్తు.

* * *

20. అన్నమయ్య సంకీర్తనల్లో లోకజ్ఞత

– డా॥ వి.కృష్ణవేణి

శ్రీ వేంకటేశ్వరునికి పదకవితలనే కుసుమాలను సమర్పించిన కారణజన్ములు తాళ్ళపాక అన్నమాచార్యుల వారు (క్రీ.శ ॥ 1408–1503). నిత్యకైంకర్యాలలో 'అన్నమయ్య లాలి' ని కట్టడి చేసి వంశానికే కీర్తి ప్రతిష్ఠలు అందించిన భక్తాగ్రేసరులు అన్నమయ్య. దినమొక సంకీర్తనను రచించి భక్తియోగం గొపతనాన్ని లోకానికి చాటింపు వేసిన ధన్యజీవి అన్నమాచార్యులవారు. అన్నమయ్య 15వ శతాబ్దంలో రచించిన సంకీర్తనలు నేటికీ సజీవంగా మనగలు గుతున్నాయంటే వాటిలోని సంగీత, సాహిత్య ఔన్నత్యం జనులు గ్రహించారని అర్థమవుతోంది. అందుకు కారణం అన్నమయ్య సంకీర్తనల్లోని భక్తి, పారవశ్యం, సమకాలీనత. అంతకుమించి అన్నమయ్య లోకజ్ఞత వీటిల్లో ఇమిడి ఉండటం.

'విశః శ్రేయం కావ్యం' అన్నట్టుగా ప్రజలను ఉద్ధరించేదిలా ఏ సాహిత్యమయినా ఉండాలంటారు ఆలంకారికులు. కవికి ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసం ఉండాలంటారు. లోకాన్ని బాగా చదివినవాడుగా అంటే మనుషుల స్వభావాలను గ్రహించేవాడుగా కవి నేర్పరి కావాలంటారు. ఋషి అయిన వాడే కవికాగలుగుతాడన్నారు. ఇటువంటి లక్షణాలున్నవారు చేసిన రచనలు కాలానికి ఎదురొడ్డి నిలుస్తాయన్నారు.

పై లక్షణాలన్నీ కవి అయిన అన్నమయ్యకు ఉన్నాయి. కనుకనే వీరి సంకీర్తనలు లోకాదరణకు కారణమయ్యాయి.

అయితే యుగకర్తలుగా కవులు చిరస్థాయిగా మిగలాలంటే ఉండవలసిన అద్భుత లక్షణం తమకు తాము ఒక నూతన మార్గాన్ని ఏర్పరచుకోవటం. నలుగురు నడిచే దారిలో కాకుండా, వారే ఒక క్రొత్త పంథాను కనుకొని, నలుగురిని ఆ దారిలో నడిపించగలగటం. అప్పుడే మార్గ దర్శకులుగా, వైతాళికులుగా వీరి స్థానం సమాజంలో మహోన్నతంగా ఉంటుంది.

అన్నమయ్య కూడా ఈ ఘనత సాధించారు. వీరికి పూర్వకవులు నిర్దేశించిన శిష్టకవిత అయిన చంపూ కావ్య పద్ధతిలో అన్నమయ్య తన రచనలు చేయలేదు. ప్రజల మాటలనే బాణీలుగా కట్టి, పదాలతో పాటలకు రూపకల్పన చేశారు. పదసాహిత్యం ప్రజలకు రుచి చూపి పదకవితాపితామహుడయ్యాడు. అలా అని పండితులను విస్మరించలేదు. సంస్కృత పదబంధాలతో కూడిన అనేక సంకీర్తనలను రచించారు.

అన్నమయ్య వైష్ణవ మతాచార్యుడు కావటం వలన దక్షిణాదిన కొలువైన అనేక విష్ణునిగుడులను సందర్శించారు. నరసింహ, చెన్నకేశవ, రామ, కృష్ణులు దేవతలను కీర్తిస్తు అనేక సంకీర్తనలను రచించారు. శతక కర్త మకుట నియమం పాటించినట్లు వివిధ దేవాతా స్తుతి కీర్తనలన్నీ తన కులదైవమయిన శ్రీవేంకటేశ్వరుని నామ మకుటం వలె పూర్తి చేశారు.

హరిదాసు లాగా ఊరూరు తిరిగి కీర్తనలను గానం చేస్తున్న క్రమంలో అన్నమయ్యకు ఆయా ప్రాంతాల ప్రజల కష్టాలు, వ్యామోహాలు, ఇంద్రియ భోగాలకు వశులయిన వారు కనిపించారు. అందుకే తాను గ్రహించిన లోకజ్ఞానాన్ని సమాజానికి అందించాలని సంకల్పించారు అన్నమయ్య. తన బోధనలను భక్తి అనే రసాన్ని జోడించి వైరాగ్యమనే మందుతో ముక్తికి మార్గం పొందే కీర్తనలను జనులతో జతకట్టి పాడారు. అందుకే అన్నమయ్య వారి చాలా సంకీర్తనలు భజన పద్ధతిలో కనిపిస్తాయి.

క్రింది సంకీర్తనం ఉదాహరణగా తీసుకోవచ్చు.

చాలదా బ్రహ్మమిది సంకీర్తనం
జాలెల్ల నడిగించు సంకీర్తనం
సంతోషకరమైన సంకీర్తనం
సంతాప మణగించు సంకీర్తనం
జంతువుల రక్షించు సంకీర్తనం
. . . . . .
. . . . . .
జము బారి విడిపించు సంకీర్తనం
సమబుద్ధి వొడమించు సంకీర్తనం
శమ దమాదుల జేయు సంకీర్తనం
చలువ గడు నాలుకకు సంకీర్తనం
పరవి సంపదలిచ్చు సంకీర్తనం
సరిలేని దిదియెపో సంకీర్తనం (1-343)

ఒకరు పాడుతుంటే, బృందం 'సంకీర్తనం' అంటూ భజనలా గానం చేసేలా ఉంది ఈ కీర్తన. ఇందులో సామాన్యులు మాట్లడుకునే పదాలు ఎక్కువగా ఉన్నాయి. జానపద బాణిలో కూడా ఈ కీర్తనను చూడవచ్చు.

వానకురవాలంటూ పిల్లలు, పొలం పనులు చేసుకొనే వారు పాడుకునే ఈ క్రిందిజానపద గేయాన్ని అనుసరించి అన్నమయ్య పై కీర్తన వ్రాశారనిపిస్తుంది.

వానల్లు కురవాలి వానదేవుడా
వరిచేలు పండాలి వానదేవుడా
నల్లని మేఘాలు వానదేవుడా
సల్లంగ కురవాలి వానదేవుడా

తూరుపు దిక్కున వానదేవుడా
తుళ్ళి తుళ్ళి కురవాలి వానదేవుడా.

ఇందులో 'వానదేవుడా' అనే పదం జానపద గేయ లక్షణమయిన పునరావృత్త పదం.

ప్రజలలోకి సులభంగా తన కీర్తనలను అందించడానికి అన్నమయ్య చూపిన విజ్ఞాతగా దీన్ని అర్థం చేసుకోవచ్చు.

అన్నమయ్య రాయలసీమ ప్రాంతంలో జన్మించినవారు కావడంతో ఆ ప్రాంత మాండలికాలు వీరి సంకీర్తనల్లో విరివిగా కనిపిస్తాయి. రాజుల ప్రాపకం కోసం రచించిన రచనలు కూడా కాకపోవడం వలన వీరి సంకీర్తనల్లో ప్రాంతీయత గుబాళిస్తుంది. ఆ ప్రాంత వాసులు ఇంట్లోని ఆడపిల్లలను చిన్నక్క, పెద్దక్క అని సంబోధిస్తుంటారు. ఈ 'చిన్నక్క' అన్న పదాన్ని గ్రహించి శ్రీమహావిష్ణువు దశావతారాలను వర్ణించిన అన్నమయ్య లోకజ్ఞత ఈ క్రింది కీర్తనలో వ్యక్తమవుతుంది.

సిరుత నవ్వుల వాడు సిన్నెక్కా
వీడు వెరపెరగడు సూడవె సిన్నెక్కా

ఇందులో మత్స్యావతారాన్ని పొలుసుమేని వాడని, కూర్మావతారాన్ని బోరవీపు వాడుగా, వరహాన్ని సెలసు మోరగా, నరసింహుడిని వంకల కోరల వాడిగా అభివర్ణించారు. వామనావతారాన్ని మేటి కురచగా, పరశుడాముడిని మెడమీద గొడ్డలి వాడని బలరామునిసీటకాలవాడని, రామావతారాన్ని ఆడదాన్ని అడవిలో పోగొట్టుకొని రాకాసితో వేటలాడిన వాడుగా కీర్తించాడు. శ్రీకృష్ణుడిని పిల్లనగోవి వాడని జింకలాంటి చూపుల వాడని వర్ణించాడు. పదవ అవతారం కల్కిని వేంకటేశ్వరునిలో చూసుకొని తనతో కూడినాడని గానం చేశారు అన్నమయ్య.

వర్ణాశ్రమ ధార్మలలో ముఖ్యమయినది గృహస్థాశ్రమం. బ్రహ్మచర్య, వానప్రస్థ, సన్యాసాశ్రమాలు గృహస్థాశ్రమాన్ని ఆశ్రయించుకొని ఉంటాయి. గృహస్థుని యొక్క ప్రవర్తన ఋజుమార్గంలో ఉన్నట్లయితే మిగిలిన అన్ని ఆశ్రమవాసులు అదే దారిలో పయనిస్తారు. అందుకే అన్నమయ్య గృహస్థులకు సంసారమెలా వుండాలో తమ కీర్తనలు ద్వారా సున్నితంగా వివరించారు. అన్నమయ్య కూడా సంసారే. కాబట్టి తామరాకు మీద నీటి బొట్టులా ఆ సాగరంలో మునగక, వ్యామోహాలకు లోనుకాకుండు, భక్తి అనే పడవనెక్కి ఒడ్డుచేరాలనే ముక్తి మార్గాన్ని బోధించారు అన్నమయ్య.

ఈ క్రింది కీర్తనలో సంసారికి ఇలా మార్గనిర్దేశం చేశాడు అన్నమయ్య.

సంసారమే మేలు – సకల జనులకు
కంసాంతకుని భక్తి – గలిగితే మేలు

వినయపు మాటల - విద్యసాధించితే మేలు
తనపి యప్పులలోన - దాగకుంటే మేలు
మునుపనె భూమి దన్ను - మోచి దించుకుంటే మేలు
వెనుకొన్న కోపము - విడిచితే మేలు

ఈ విధంగా ఈ కీర్తనలో వినయపు మాటలతో విద్య నేర్చాలని, అప్పులలో తగులకోకూడదని, కోపాన్ని విడిచి పెట్టాలన్నారు. ఇంకొకరి ముందు చెయ్యిచాచి భంగపడకూడదన్నారు. జీవులను చంపకుండా భూతదయ చూపాలన్నారు. భారముతో కష్టాలలో పడకుండా ఉండాలి. ఇతరులను తిట్టరాదన్నారు. పరకాంత వ్యామోహం కూడదన్నారు.

పై తప్పులు చేయకుండా కంసుని సంహరించిన శ్రీకృష్ణుని పై భక్తి కలిగి ఉండాలని పల్లవిలో ప్రబోధించారు. శ్రీవేంకటేశ్వరుని కొలిచి నిశ్చింతులై ఉండాలని కీర్తన చివరలో వెల్లడించారు అన్నమయ్య.

మరికొన్ని కీర్తనలు కూడా ఈ విధంగానే సంసారి బ్రతకవలసిన తీరును అన్నమయ్య వివరించారు.

అప్పులేని సంసారమైన పాటేచాలు
తప్పులేని జీత మొక్క తీరమైన జాలు (1-114)

కొలది పుణ్యపాపాలే - కొంగు రెక్కములు వెట్టి
వెలదెంచి బేరమాడ - వేగిమే రారో (3-170)

ఇలాగ జీవుడెలా బ్రతకాలో చెప్పిన అన్నమయ్యకు చెయ్యవలసిన తక్షణ కర్తవ్యం సంసారిని భగవంతునికి శరణాగతుని చెయ్యటం. అందుకు భక్తి సంబంధమైన కీర్తనలను పుంఖానుపంఖాలుగా రచించారు అన్నమయ్య.

భావము లోనా బాహ్యమునందును

గోవింద గోవింద యని కొలువరో మనసా ॥ (3-561)

బాహ్యాంతరాలలో గోవిందుని నిలువుకోమన్నాడు అన్నమయ్య
కొండలలో నెలకొన్న కోనేటి రాయడు వాడు
కొండలంత వరములు గుప్పెడువాడు (1-151)

ఈ కీర్తనలో కొండలంత వరాలను 'గుప్పుతాడు' అంటూ సంసారికి భగవంతునిపై చూపు మరల్చటానికి చూపిన ఆశగా అర్థమవుతుంది.

అదివో అల్లదివో హరివాసము
పదివేలు శేషుల పడగల మయము (15-460)

అంటూ శేషాచలం కొండ విశిష్టతను వివరించాడు.

కట్టెదుర వైకుంఠము కాణాచయినకొండ
తెట్టలాయ మహిమలే తిరుమలకొండ (1-191)

మునులు, దేవతలు తిరుమల కొండపై వృక్షాలు, వన్య ప్రాణాలుగా తిరుగతూ తపస్సు చేసుకుంటున్నాయని అన్నమయ్య వివరించారు.

తన సంకీర్తనల సారంతో భక్తివైపు మరలిన జీవుడిని వైరాగ్యపు బాట పట్టించకపోతే ఇంత చేసిన శ్రమ వృధాగా తలచాడు లోకజ్ఞుడయిన అన్నమాచార్యుల వారు. అందుకే బాహ్యసుఖాల కోసం వెంపర్లాటం వదిలి పెట్టాలని పరవిద్యను బోధించే కీర్తనలు రచించి, ప్రచారం చేశారు.

కడుపెంత తాగుడుచు కడుపెంత దీనికై
పడనిపాట్ల నెల్ల బడి పొరలనేలా
పరుల మనసుకు నాపదలు గలుగజేయు
బరితాపకరమైన బ్రదుకేలా
సొరది నితరుల మేలు చూచి సైపగలేక
తిరుగుచుండేటి కష్ట దేహ మిది యేలా (1-302)

'కోటి విద్యలూ కూటి కొరకే' నంటూ జానెడుపొట్ట కోసం చేసే కర్మలను ఈ కీర్తనలో ఏకరువు పెట్టాడు అన్నమయ్య.

'పిండికొద్ది రొట్టె' అన్న సామెత లోకంలో బలంగా ఉంది. దీన్ని ముఖ్యాంశంగా తీసుకున్న అన్నమయ్య అల్పబుద్ధులకు, ఘన బుద్ధులకు తేడాలను అద్భుతంగా వివరించారు ఈ క్రింది కీర్తనలో.

ఎంతమాత్రమున ఎవ్వరు దలచిన అంత మాత్రమేనీవు
అంతరాంతరము లెంచి చూడ పిండంలో నిప్పటి యున్నట్లు (2-393)

ఈ కీర్తనను అర్థం చేసుకుంటే పరతత్త్వం అంటే పరవిద్యలోని మర్మం తెలుస్తుందన్నారు.

మరొక అద్భుతమైన అన్నమయ్య లోకజ్ఞతను వెల్లడిచేసే సంకీర్తన 'తెలిసితే మోక్షము....! వెగటు ప్రపంచంలో తత్త్వమతి గొప్పతనాన్ని ఈ కీర్తన వివరిస్తుంది. ఈ పల్లవిని అర్థం చేసుకుంటేచాలు వైరగ్య ఔన్నత్యం తెలుస్తుంది.

తెలిసితే మోక్షము - తెలియకున్న బంధము
కలవంటిది బదుకు - ఘనునికిని.

ఇలాంటి విషయాలు అర్థం చేసుకోలేక అజ్ఞానమనే మాయలో తగులుకొని మునిగితేలుతున్నామని హెచ్చరిస్తున్నాడు ఈ క్రింది సంకీర్తన ద్వారా అన్నమాచార్యుల వారు. 85 లక్షల జీవరాసులలో ఉత్తమమైన

మానవజన్మ ఎత్తి కూడా బంధాలలో, రాగద్వేషాలలో ఇరుక్కొని సతమతం అవుతున్నామని వేదనాభరితంగా రచించిన ఈ కీర్తన మహోన్నతం.

ఎక్కడి మానుష జన్మం బెత్తిన ఫలమేమున్నది
నిక్కము నిన్నే నమ్మితి నీ చిత్తం బికనూ.

మరువను ఆహారంబును మఱువను సంసార సుఖము
మఱువను యింద్రియ భోగము మాధవ నీ మాయా
మఱచెద సుజ్ఞానంబును మఱచెద తత్త్వరహస్యము
మఱచెద గురువును దైవము మాధవ నీ మాయా

విడువను బాపము పుణ్యము విడువను నా దుర్గణములు
విడువను మిక్కిలి యాసలు విష్ణుడ నీ మాయా
విడిచెద షట్కర్మంబులు విడిచెద వైరాగ్యంబును
విడిచెద నాచారంబును విష్ణుడ నీ మాయా

తగిలెద బహులంపటముల తగిలెద బహు బంధంబులు
తగులును మోక్షపు మార్గము తలపున యెంతైనా
అగపడి శ్రీ వేంకటేశ్వర అంతర్యామివై
నగినగి నను నీవే గతి నాకా యీ మాయా (15-38)

అన్నమాచార్యుల వారు 'ఒక్క సంకీర్తనే చాలు. మిగిలినవన్నీ భాండాగారంలో దాచుకో' అంటూ శ్రీనివాసునితో కీర్తన రూపంలో పలికారు. అలా పై 'ఎక్కడి మానుష జన్మం .....' కీర్తనను అర్థం చేసుకొని ఆచరిస్తే చాలు. సకల వేదసారం ఇందులో నిక్షిప్తం చేశారు అన్నమయ్య.

సామాజికునికి పట్టం కట్టి అతనికి మోక్ష మార్గం చూపటమే ధేయంగా పెట్టుకుని అన్నమయ్య సంకీర్తనలను రచించినట్లు అవగాహన కలుగుతుంది. అందుకు కారణం అన్నమయ్య ఎంచుకున్న వారి గురువుల మార్గం.

విశిష్టాద్వైత ఆచార్యులు రామానుజుల వారి మార్గంను అన్నమయ్య ప్రచారం చేశారు. రామానుజాచార్యుల వారు తాము కష్టపడి నెలల తరబడి గురువు వద్దకు తిరిగి నేర్చుకున్న మంత్రాన్ని ప్రజలకు మేలు కలగాలని గోపురం ఎక్కి ప్రచారం చేశారు. తానొక్కడికి నరకం వచ్చినా పర్వాలేదు. ప్రజలందరూ స్వర్గం చేరితే సౌఖ్యమనుకున్నారు. ఆ సద్గురువు బాటలో అన్నమయ్య కీర్తనలను రచించారు.

అన్నమాచార్యుల వారు తమ సంకీర్తనలను జానపద బాణిలో కట్టడానికి మరొక కారణం అన్వేషిస్తే, వీరు బ్రాహ్మణులయినా జీవనం వ్యవసాయ రంగం. పేదరికం, సంసారుల అగచాట్లను చుట్టు ప్రక్కల

చూడటం వలన మోక్ష విద్యకు సామాన్యులు దూరమవుతున్నారని గ్రహించాడు. వైష్ణవ మత ప్రచారకులుగా ఊరూరా తిరగటం వల్ల కూడా జనుల మూఢత్వాలు, వెంపర్లాటలు అర్థమయ్యాయి. తాను సంపాదించిన లోక జ్ఞానాన్ని ప్రజల ముందు సంకీర్తనల రూపంలో అందించి తరించారు అన్నమాచార్యుల వారు. మాటతో కాని పని పాటతో సాధించాలనుకున్నారు.

అంతయు నీవే హరిపుండరీకాక్ష
చెంత నాకు నీవే శ్రీరఘురామ

అంటూ పరవశించిపోయాడు.

ఈ విధంగా ఒక సంకీర్తనను పూర్తిగా అర్థం చేసుకున్నా చాలు అన్నమయ్య లోకజ్ఞత మనకు అర్థం అవుతుంది. మనం కూడా శ్రీనివాసునికి శరణాగతి అంటాము.

* * *

ఆధార గ్రంథాలు

1. అన్నమాచార్య సంకీర్తనామృతము – డా॥ సముద్రాల లక్ష్మణయ్య – తి.తి.దే ప్రచురణలు
2. అన్నమయ్య సంకీర్తన సౌరభం – శ్రీగరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్ – తి.తి.దే. ప్రచురణలు
3. జయ సాహిత్య వ్యాసాలు – డా॥ గార్లపాటి దామోదర నాయుడు – విశ్వశ్రీప్రచురణలు
4. తిరుమల సంకీర్తనలు – తి.తి.దే.ల ప్రచురణలు
5. సప్తగిరి సంకీర్తనలు – తి.తి.దే.ల ప్రచురణలు

21. అన్నమయ్య సాహిత్యంలోని సమాస విశేషములు

– కీ॥ శే॥ శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ

మనప్రాచ్యభాషలలో భాషాంగముగ సమాసములు, ఒక లెక్కకెక్కిన స్థానమును ఆక్రమించుకొన్నవి. కొందరు మహాకవులు దీర్ఘదీర్ఘసంస్కృతసమాసములతో ధారాశుద్ధికి, ధారాసిద్ధికి పేరు గాంచినారు. వారిలో నన్నయ, శ్రీనాథాదులు గురుపీఠమలంకరించినారు. తిక్కనాదులు కొందురు తునుకతునుక పదములతో కవిత్వమల్లి ఆపద్ధతికి ఒకవన్నె చేకూర్చినారు.

తాళ్లపాకకవుల రచనలలో పొడిపొడి తెలుగుమాటలకున్న బిగువు గొప్పది. ఈ పద్ధతికి తిక్కన మూలపురుషుడు. వీరి కాతడే ఆదర్శము. అయినను శయ్యాసౌభాగ్యము సంతరించుటలో సమాసములకున్నవిలువను ఎవ్వరును త్రోయలేరు. ప్రాచ్యభాషలకన్నింటికి మాతృభాషయగు సంస్కృతమున ఈ సమాసవిధి మంచికట్టుదిట్టములతో ఏర్పాటైనది. సంస్కృతవైయాకరణులు చూపిన త్రోవనే తక్కిన ప్రాచ్యభాషలవారు ఆ యా భాషల కనుగుణమగు అలతియలతిమార్పులతో బాటనేర్పరచుకొని సమాసరచనలు సాగించినారు.

సమాససంగ్రహచరిత్ర

విడివిడిగ ప్రయోగింపబడిన ప్రసిద్ధార్థములగు పదములు ఆకాంక్ష, యోగ్యత, సన్నిధుల బలముతో ఒకదానితోనొకటి కలిసి విడివిడిపదములఅర్థము (కర్తృకర్మాదిభావముతో) ఏకమై వాక్యార్థముగ మారుచున్నది. విడివిడిపదముల అర్థమును తెలుపుటకు అభిధావృత్తి చెల్లుచుండగా, ఆ పదముల సమూహార్థమును తెలపుటకు వ్యపేక్షాసామర్థ్యము అనునది సాధకమగుచున్నది. దీనివలన భిన్నభిన్నపదములు సంఘటితార్థములై వాక్యార్థముగా మారును. ఇట్లే కొన్ని పదములు ఒక పదముగా కలిసి అవి తమ ఒంటరితనమును కోల్పోయి సమస్తపదమను పేరుతో రెండు, అంతకు మించినపదములు ఒకే అర్థమును (విశేషణ విశేష్యాదులతో) బోధించుట సమాసమని చెప్పిరి. 'సమ్+ఆసఃన సమాసః అని దీని వ్యుత్పత్తి. చక్కగా పదములను క్రుచ్చుట అనీ, సంగ్రహముగ పదములను క్రుచ్చుట అనీ, సమర్థములై పదములను క్రుచ్చుట అనీ దీనియర్థము కావచ్చు. చక్కగా క్రుచ్చుటచే శ్రుతిరంజనము, సంగ్రహముగా క్రుచ్చుటచే పదలాఘవము, సమర్థములను క్రుచ్చుటచే ఏకార్థీభావము సిద్ధించుచున్నది. ఈ మూడుర్థములు సమాసవిధిలో ప్రధానములే. ఈ మూడును ప్రయోజనములే. ఈ మూడును ప్రయోజనములే. ఇక్కడ ఒకపద మింకొకపదముతో కలసి సమస్తపదమై పరస్పరసంగతార్థమై ఒకే అర్థమును బోధించుటకు ఏకార్థీభావసామర్థ్యము సాధకమగుచున్నది. 'సంగతిః అర్థఃసమర్థఃలేక 'సంసృష్టఃఅర్థఃసమర్థఃఅను వ్యుత్పత్తులతో సమర్థశబ్ద మేర్పడగా 'తస్యభావఃఅను వ్యుత్పత్తితో' సామర్థ్యమ్' అగుచున్నది.

పై పేర్కొన్న వ్యపేక్షాసామర్థ్యము మనకిపుడు చర్చనీయముకాదు. ఏకార్థీభావసామర్థ్యమే మనకు ప్రధానము.

ఈ సామర్థ్యము ఒకశబ్దశక్తియే. ఈ శబ్దశక్తిని ఆధారముగా చేసికొని సమాసవృత్తి, తద్ధితవృత్తి, ఏకశేషవృత్తి, కృద్వృత్తి, సనాద్యంతధాతువృత్తి అని ఐదువృత్తులను వైయాకరణులు పేర్కొన్నారు. సనాద్యంతధాతువృత్తితప్ప తక్కిన నాలుగు తెనుగునకును సమానములే. వృత్తి అనగా శబ్దవ్యాపారము. ఇది విడి విడి పదములను పరస్పరాన్వయముతో కలిపి ఏకార్థీభావమును సంఘటించును. పై పేర్కొన్ననాలుగువృత్తులయందును సమాసాదికార్యములచే లోపించిన విభక్తులయొక్కయు, పదములయొక్కయు అర్థములను స్ఫురింపజేయుచు ఏకార్థీభావమును నిర్దేశించుచున్నది.

ఈ సమాసమును విప్పిచెప్పితే విగ్రహవాక్యము విశేషగ్రహము (విశేషజ్ఞానము)ను కలిగించునదికావున దానికాపేరు. 'రాజపురుషః' ఇత్యాది సమాసములందు' రాజాచాసౌ పురుషః అనియా? 'రాజ్ఞః పురుషః 'అనియా? మనకు కలిగెడిసందేహములను ప్రకరణమున బట్టి ఈ విగ్రహవాక్యము వివరించుచున్నది. సమర్థములైన పదములు అన్నప్పుడు అవి విడివిడిగ ప్రసిద్ధార్థములై యుండుటయే గాక, అవి ఒక దానితో నొకటి కలియుటకు అనువుపడి ఏకార్థీభావమును ప్రతిపాదింపవలెను. 'పద్మనేత్రా' అన్నప్పుడు 'పద్మే ఇవనేత్రే' అను విగ్రహములో పద్మములు ఉపమానములుగా, నేత్రములు ఉపమేయములుగా కవిసంప్రదాయప్రహతమైనయోగ్యత ఉండుటచే అది శిష్టసమాసము. 'కమలమధ్యా' అన్నప్పుడు "కమలమ్ ఇవ మధ్యమ్ యస్యాః" అని విగ్రహించినచో కమలమునకు మధ్యమునకు ఏవిధమైన సాదృశ్యాది సంబంధము లేకుండుటచే పై సమాసము దుష్టమగుచున్నది. కావున సమాసవిధిలో యోగ్యత కూడ ఒక ప్రధానభాగమే. ఈ సంగ్రహచరిత్రకు ఫలము పైపై చర్చింపబోవు సమాసములలో గమనింపగలరు.

తెలుగులో సమాసము

ఇన్ని నియమములతోగూడిన ఈ సమాసరచన తెలుగులో భాషాసంబంధముగ నాలుగుతెరగులై వాఙ్మయమున చెల్లుబడియగుచున్నది. అవి 'సిద్ధ, సాధ్య, ఆచ్ఛిక, మిశ్రమములు' అని. ఇవికాక అర్థ భేదముతో తత్పురుష, బహువ్రీహి, 'ద్వంద్వ, అవ్యయీభావములని ప్రధానముగ నాలుగువిధములుగా విభజింపబడియున్నవి. ఈ తత్పురుషాదులకు లక్షణము సాధారణముగ సంస్కృతశాస్త్రపరిధిలోనిదే. ఈ పేరొన్న అన్ని విభాగములు సుప్రసిద్ధములేకావున నేను మరల వివరింపను.

తెలుగులో అవ్యయీభావము

తెలుగులో అవ్యయీభావసమాసము లేదని కొందరివాదము. సుబంతములు అవ్యయములతో సమసించి సమస్తపదము అవ్యయముగ మారుటయేగదా దీని ప్రధానలక్షణము. సంస్కృతములో కొన్ని అర్థవిశేషములందు కొన్ని అవ్యయములు సుబంతములకు పూర్వోత్తరపదములుగా కూడి సమస్తములై

అవ్యయీభావసమాసము అనుపేరుతో చలామణి యగుచున్నవి. ఉదాహరణము : 'సూపస్య లేశః సూపప్రతి;' 'దిశయోర్మధ్యే అపదిశమ్' ఇత్యాదులు. "క్లీబావ్యయం త్వపదిశం దిశోర్మధ్యే" అని అమరము. తెలుగులో అవ్యయములు సుబంతములతో సమసించి కర్మధారయముగనో, షష్ఠీతత్పురుషముగనో, ఇంకొకవిధముగనో చలామణియగుచున్నవి. ఆ సమస్త పదము అవ్యయముగా నుండుటచే దీనిని అవ్యయీభావమన్నచో తప్పేమి? 'వచ్చునపుడు', 'నారాయణునట్లు', 'సవితృనట్లు', 'వానివలె' ఇత్యాదులు అవ్యయములుకాక మరేమగుచున్నవి? ఇవి సమాసములు కావనుటకు వీలులేదుకదా? 'వచ్చుచున్నట్టి అపుడు' 'నారాయణుని యొక్కఅట్లు' 'సవితృనియొక్కఅట్లు' వానియొక్కవలె' లేక 'వానిన్‌వలె' ఇత్యాదులు, సమస్తములు కాకపోయినచో 'వచ్చు' ధాతుజవిశేషణమునకు అనుప్రయుక్తతచ్ఛబ్దము దేనితో లోపించినట్లు? 'వచ్చుచున్నట్టి అపుడు,' 'నారాయణునట్లు,' 'సవితృనట్లు' అనునపుడు నుగాగమము సమాసవిధిచేతనేగదా. 'వానివలె' అనునపుడు 'యొక్క' లోపింపకుండినచో 'వాని' శబ్దమున కర్థమెట్లు? కావున ఈ విషయమును పండితులు పరిశోధింపగలరు.

అన్వయక్రమము

వ్యస్తపదముయొక్క అర్థముగాని, సమస్తపదముయొక్క అర్థముగాని, మరియొక సమస్తపదముయొక్క అర్థముతో అన్వయింపవలసినప్పుడు, అసమస్తపదముయొక్క సమగ్రార్థముతో అన్వయించునేకాని సమస్తపదముయొక్క ఏకదేశముతో అన్వయింపదు. "పదార్థః పదార్థాంతరేణాన్వేతి నతు పదార్థైకదేశేన" అని నియమము. 'రామః కోదండపాణిః' అన్నపుడు వ్యస్తమైనరామశబ్దార్థము 'కోదండమును పాణియందుగలవాడు' అనుదానితో అన్వయింపవలెనేకాని, 'కోదండపాణి' యనుసమస్తపదముయొక్క ఏకదేశమైన 'కోదండ' శబ్దముతో అన్వయింపరాదు. ఇట్లే 'నీలమేఘశ్యామః' 'కోదండపాణిః' అన్న సమస్తపదములందుగూడ. ఇంతగా నిషేధింపబడిన ఈ ఏకదేశాన్వయము సంస్కృతమునందుగూడ నిత్యసాపేక్షములైన శబ్దముల విషయమున తప్పనిసరి.

"సంబంధిశబ్దః సాపేక్షో నిత్యం సర్వః సమస్యతే
వాక్యవత్సా వ్యపేక్షాహి వృత్తావపి న హీయతే
సముదాయేన సంబంధో యేషాం గురుకులాదినా
సంస్పృశ్యావయవాంస్తేతు యుజ్యంతే తద్వతా సహ"

అని వైయాకరుణులు వాకొన్నారు, 'దేవదత్తస్య గురుకులమ్' అన్నపుడు 'దేవదత్తస్య' అను వ్యస్తపదము, 'గురుకులమ్' అను సమాసమునందు ఏకదేశమైన 'గురు' శబ్దముతో అన్వయించక తప్పదు. 'గురువు' అన్నప్పుడు 'ఎవనిగురువు?' అని ఆకాంక్ష విధిగా కలుగుచున్నది, దానికి 'దేవదత్తస్య' అనునదియే సమాధానము.

1. ఘనురాలు : (సంపు 25-పాట 26)

"ఎంతైనా నాతఁడు నీకు నెక్కుడుగాదా
కాంతుఁడు మన్నించఁగానే ఘనురాలవైతివి ॥ పల్లవి ॥

'ఘన' శబ్దముపై 'ఆలు' శబ్దమును (స్త్రీవాచకము)

జోడించి 'ధీరురాలు' వలె సమసించినాడు. ఇదేమంత పెద్ద సాహసము కాదు.

2. నీయాపెసంది :- (సంపు 24 పాట-126)

"చిత్తగించి చూడవయ్య చిరునవ్వు నవ్వీ నాపె
యిత్తల నీయాపెసఁ (సం?) నెంతవనికో
కొత్తకొత్తచెమటలు గోర నీపైఁ జిమ్మీని
తత్తరాన నది యెట్టితడఁబాటులో ॥ కాన ॥

'నీవు+ఆపె' అని ఈ రెండింటికి మొదల ద్వందము, దానిపై "నీయాపెల యొక్కసంది" అని తత్పురుషము "ద్వంద్వాంతే శ్రూయమాణః శబ్దః ప్రత్యేకమభిసంబధ్యతే" అను నియమముతోపై ద్వంద్వమునకు 'సంది' శబ్దముతో అన్వయము. బహువచన 'ల' గూడ ఎగిరిపోయింది. ఇట్టివానికి

"క॥ చెలిమియు సంభాషణమును
బలిమివివాదంబుఁ ద్రోపుఁ బాడియు దమయం
తలవారితోన తగునధి
కులహీనులతోడనైనఁ గొఱగా దధిపా ...భార-ఉద్యోగ-2-46

అధికులతోడ హీనులతోడ అనిగదా అన్వయము.

క్రీగీతలు గల కవుల ప్రయోగములవంటివి కారణములు కావచ్చు.

3. తననాకింతే : (సంపు 25 - పూట 362)

"కూడి తనచేఁతలకుఁ గోపగింతునో యేమో
యీడనుండి మొక్కితి నాకింతేచాలు
వోడక సారెకు రాఁగా నొగరౌనో తీపౌనో
యేడకేడ తననాకింతే చాలు" ॥ ఏల ॥

ఇక్కడ 'తనయొక్కనాకు' అని విగ్రహించుటకు అవకాశమున్నది. కాని 'తనకు నాకు' అని చెప్పినచో ప్రకరణార్థము పొందుపడినట్లుండునని భావన.

4. తుమ్మిదలు (ల?) బెదరని తోరపుగుంపు (సంపు 24-పాట 239)

"తమ్మివిరి నీలాలు తళుకుమెఱఁగులు
తుమ్మిదలు (ల?) బెదరనితోరపుగుంపు
ఇమ్ముల శ్రీవేంకటేశ యిదె నీపురముమీఁద
నెమ్మదిఁ దావుకొని నిండెను యీసిరులు ॥ అన్ని ॥

'తుమ్మిదలు' అని వ్యస్తముగ విరిచినచో అన్వయము సులభము కాదేమో? 'లు' స్థానమున 'ల' పెట్టుకొన్నచో 'తుమ్మిదలబెదరనితోరపు గుంపు' అని కావచ్చు. కాని దీనికి సమాసమెట్లు? విగ్రహవాక్యమెట్లు? బెదరనితోరమైనగుంపు అని ముందు సమసించుకొని, "తుమ్మిదల" షష్ఠితో తరువాత సమాసము కూర్పవలసియున్నది. 'బెదరనితుమ్మిదలతోరపుగుంపు' అన్నచో సులభముగా తోచును. కాని ఆయన, భక్తిపారవశ్యములో ఆరచనావేగములో-ఆ భాషాస్వాతంత్ర్యములో యతిప్రాసలనిర్బంధముతో ఇట్టిచిల్లరమార్పు లెన్నియైన చేయవలసియున్నది.

5. నీయింతైనవెనకనె : (సంపు 24 - పాట 257)

"యీయలమేలుమంగ నిన్నెవసినవెనకనె
పాయము వచ్చి యీరీతిఁ బరిగినది
చాయల శ్రీవేంకటేశ నీయింతైనవెనకనె
కాయపువిలాసాలగని యైనది ॥ పిన్న ॥

'ఇంతైనటువంటి వెనక' బాగానే వుంది. నీ శబ్దమునకెట్లు? 'నీకు లేక నీవలన ఇంతైన వెనకనే' అని చేసికొనవలెకాబోలు.

6. కైకొన్నవొగిసంచకారు : (సంపు 26-పాట 583)

"వుంకువిచ్చి కైకొన్నవొగిసంచకారు సుమ్మీ
అంకెల నీకొనవేలిఆవుంగరము
పొంకాన నే మెన్నఁడు పూఁచి యిచ్చినది లేదు
లంకెఁ బెట్టుకొంటివి పల్లదా లేలాదేవు ॥ ఐతే ॥

'కైకొన్న' ధాతుజ విశేషణము 'సంచకారు' తో అన్వయింపవలసిన అవసరమెంతైన గలదు. కాని మధ్యలో 'ఒగి' కేమిసంబంధము? క్రమము మొదలైన అర్థములలో ఒగి శబ్దము ప్రసిద్ధము. కొన్ని పట్టులందువలె ఇక్కడ వాక్యాలంకారముగ ప్రయోగింపబడినదేమో?

7. చేతినీపుంగరము : (సంపు 25- పాట 496)

"సీత నీకుఁ జెప్పి పంపి శిరోమణి నీకిచ్చె
నాతల నే మెఱఁగము అదేమాట

చేతినీవుంగరమును శిరసున నెత్తుకొనె
యేతలఁపు లెట్లోనో ఇదిగో మాట

'నీచేతివుంగరము' అనుట సబబు, ఇక్కడ ఉంగరమునకు నీశబ్దసంబంధము అత్యావశ్యకమైనను 'నీచేతివుంగరము' అనుటతో ఆయర్థము దెబ్బతినదు. కాని ముందు చెప్పినట్లు రచనావేగములోని యతిప్రాసలనిర్బంధము ఇట్టివానికి కారణము.

8. సిగ్గుతోఁ బెట్టినయట్టిచెలినీచెక్కిటిచేయి : (సంపు 25-పాట 583)

"సిగ్గుతోఁ బెట్టినయట్టిచెలినీచెక్కిటిచేయి
వెగ్గళపుఁజింతలంటా వెరచితిమే
బగ్గన నీవుయ్యాలపై నూఁగేపయ్యదజారు
నిగ్గుల విరహమంటా నివ్వెరగందితిమే"

ఈ 'అట్టి' అను సాదృశ్యవాచకానుసంధానపదము (అట్టిరాముడు, ఇట్టిరాముడు, ఇట్టివాడు, అట్టివాడు ఇత్యాదియందువలె) ఏదో ఒక విశేష్యమును కోరుచునే యుండును. దీనిని 'చెలి' శబ్దముతో చేర్చినచో అక్కడికి పదము పూర్తియగును. ఈ 'చెలి' శబ్దము ఇంకొకదానితో అన్వయించుటకు వీలులేదు. గతిలేక "నీచెక్కిటిచేయి" లోని 'నీ' శబ్దముతోనే సమసింపవలసియున్నది.

మరికొన్నివింతలు. సమాసమధ్యములో క్రియాపదమిమిడియుండును. ఆ సమాసమధ్యము నుండి క్రియాపదమును ఏరుకొనవలెగాబోలు.

9. జీడిపంటిగింజవంటి చెంగియుండె నీగుణము : (సంపు 25- పా 427)

"గోడఁబూసినసున్నము కూడపెట్టనేరనోప
ఆడుకోలుమాటదప్పెనని యెంచేనా
జీడిపంటిగింజవంటిచెంగియుండె నీగుణము
కోడెమారుని కత్తికి గురిసేనేనా"

ఇక్కడ 'వంటి' అనునది నీగుణముతో కలియవలసినది. మధ్యలో 'చెంగియుండె' అనుధాతువు. ఈ ప్రవాహ వేగమును అడ్డు పెట్టగల వైయాకరణుడెవ్వడు ? లేక చెంగియుండే, అని ధాతుజ విశేషణముగ భావింపవలెనేమో. అయినా 'వఁటికి' ఇబ్బందే. 'వలె' కావలసిందే.

10. అనేకపంతగాఁడవు : (సంపు 24- పాట 136)

"అనేకపంతగాఁడవు అందగాఁడవు
మునుకొన్నమావెంగేలు ముంచుకొనీనా ॥ పల్లవి ॥

దీనిని చూడగనే

"ప్రాయేణ వైయాకరణాః పిశాచాః
ప్రయోగమంత్రేణ నివారణీయాఃʺ

అన్నది జ్ఞాపకమువచ్చి, 'దినవెచ్చము' 'గర్భగుడి' వంటివాని ప్రక్కన దీనికి సింహాసనమివ్వవలసినదే, 'జీవగఱ్ఱ' ప్రాణగొడ్డము' ప్రమాణమైతే "అనేకపంతగాఁడవు" తప్పుచేసేనా?

11. ఒబ్బుద్ధితో : సంపు 24-పాట 529

"ఉండవయ్య ఇఁక నీవు <u>వొబ్బుద్ధితోను</u>
నిండుకొనె నవ్వులెల్లా నేఁడు నా సెలవుల ॥ పల్లవి ॥

ఒక+బుద్ధితో, ఇక్కడ "ఒక" శబ్దమునకు "ఓ" ఆదేశము. దానికి, శాస్త్రములో లేకపోయినా త్రికసంధివచ్చి 'ఒబ్బుద్ధి' కావలెను కాబోలు. అట్లే,

12. నియ్యెడ : (సంపు 26-పాట 200)

నగితిఁ జాలదా నీతో నాలోఁ గోపించుకొనక
మగుడిఁ గమ్మటి నీవే మమ్ము దూరపే
మొగమోడితిఁ జాలదా మొక్కలీఁడ <u>నియ్యెడకు</u>
వొగరులాడ వచ్చేవు వోపము నే మిందుకు ॥ వద్ద ॥

13. నియ్యాన : (సంపు 25 - పాట 488)

"నీకునీకే యాడుకోకు నియ్యాన
కైకొని నేనే నీపై గడియించేఁగానిʺ ॥ పల్లవి ॥

14. నియ్యిచ్చుల : (సంపు 25-పాట 192)

"కొయ్యతనాన నన్నుఁ గూడితి పానుపుపై నీ-
నెయ్యమెల్లాఁ గంటిమి నేఁడే నేము
యియ్యెడ శ్రీవేంకటేశ యిన్నియు నియ్యకొంటిమి
<u>నియ్యిచ్చుల</u> మోవిపయి నింతురా గుఱుతులు ॥ ఏమి ॥

ఇత్యాదులందు క్రీగీతలు గలవు. 'నీ' శబ్దములోని 'ఈ' కారముతో త్రికసంధి సాగించినాడు. ఈ ప్రయోగములు కోకొల్లలుగ గలవు. 'ఆ, ఈ, ఏ' లు సర్వనామములే, నీ శబ్దముకూడ సర్వనామమే.

"ఇదమదసేతద్యత్తచ్ఛబ్దా శ్శబ్దాఇతరాన్వయే బహుళమ్
హ్రస్వం ప్రపద్య దీర్ఘాద్వ్యత్వ ముపర్యక్షరస్య జనయంతి" ....చింతామణి - హలంతపరి 9

ఇత్యాదిశాస్త్రము ఉపలక్షణము మాత్రమేనని మా అన్నమయ్య భావన కాబోలు. 'కట్టకడ' శబ్దమును 'కట్టఁగడగ' వ్రాయుట వీరిపరిపాటి

15. ఎవ్వతోచేఁతలు : (సంపు 25-పాట 333)

"మొగమిచ్చి సారెసారె మోహము చల్లుచు నాతో
నగఁగా నేనూ నట్టె నవ్వేఁగాని
యెగసక్కేలకు నీమై నెవ్వతోచేఁతలు చూచి
సగమై లోలో నిట్టె జడిసీ నాదేహము" ॥ నీకు ॥

ఎవ్వతెయొక్క చేఁతన్ అను విగ్రహవాక్యముతో 'ఎవ్వతె చేఁతన్' అనుదానిపై సందేహార్థకమైన 'ఓ' స్వరముచేరి 'ఏవ్వతె చేఁతనో' కావలసియుండగా 'ఎవ్వతోచేఁతను' లోని సమాసపదముల మధ్య సందేహార్థకస్వరమును జోడించినాడు.

"ఆంధ్రం షడ్వర్ణ పర్యంతం పదం స్యాత్కర్మధారయే"

(అథర్వణ-హలంతము-24)

ఇత్యాదినియమములుకూడ మా అన్నమయ్యదోవ కడ్డమురాలేవు. అట్లే,

16. కలకంటి : (సంపు 12 - పాట 302)

"కలికితనములపోగు కమ్మఁదావులవేఁగు
వలపుతమకములపరవశము పెనుజాగు
కలకంటిబాగు వేంకటపతికిఁ జెలరేఁగు
చెలియ సమరతుల మించినవింతబాగు ॥ మోహం ॥

17. సొన్నాటంకాలు : (సంపు 12 - పాట 304)

"ముదితనడపులలోని మురిపెమే వెయిసేసు
కొదమగుబ్బలతీరు కోటివేలు సేసు
సుదతి బిత్తరిచూపు సొన్నాటంకాలే సేసు
అదరబింబముతీరు ఆరువేలు సేసు ॥ చూడ ॥

18. సేఁతి (చేఁదు) కుత్తికవాఁడు (సంపు 12 - పాట 367)

"సేఁతి కుత్తికవాఁడు సెడకుండ దాఁచిన
పాఁతపెద్దవిల్లు బలువున

నాఁతికొరకు వచ్చి నడిమికి విఱిశిన
శేఁతలాఁడుగదె శినకాటి ॥ జిగరు ॥

ఇత్యాదులు (క్రీగీతలు గలవి) పండితులూహింపవచ్చు.

ఇంతవరకు సమాసవృత్తినిగూర్చి ఏదోకొంత చర్చ సాగింతిని. తత్పురుషాదుల లక్షణములను గూర్చి మన వైయాకరణులు చెప్పిన దానికంటె చెప్పదగిన దేమీలేదు. ఇకపోతె 'ఏకశేషవృత్తి' అన్ని ప్రాచ్యభాషలకు సాధారణమే. జాత్యేకవచనములు, నిత్యబహువచనములు ఆ యా భాషలకు వాటి వాటి సంప్రదాయములతో సుప్రసిద్ధములే.

తద్ధితవృత్తియం దెక్కువగ, కృద్వృత్తియందు పరిమితముగ అన్నమయ్య స్వతంత్రించినాడు. తెలుగునకు అసలే వ్యాకరణము అసమగ్రము, ముందు పేరొన్న సమాసాది నాలుగువృత్తులందు దానిబలము మరీ పరిమితము. ఈ పట్టులందు కవులస్వాతంత్ర్యమునకు పరిమితము లేదు 1. నుమ్మెతః (చింతా–సంధి–70) 2. పరుషే సరళేచైవ సమాసే నుముతో భవేత్, అద్రుతాత్సరళాత్ (అథ–సంధి–23) సూత్రములతో జరుగుసమాససంధులవిషయమున అన్నమయ్య చాలస్వాతంత్ర్యమును ప్రయోగములతో చూపినారు. ఔపవిభక్తిక ప్రత్యయముల విషయమున, ఆ సమాసములవిషయమునా అంతే. ప్రవాహభాషలందు ఈ పద్ధతి తొలగింపరానిది.

* * *

22. అన్నమయ్య సంకీర్తనల్లో శ్రీరాముడు

– డా॥ డి. యువశ్రీ

రామాయణం ఆదికావ్యం. ఆదర్శకావ్యం. అమృత కావ్యం. అనవరత భావ్యం. మానవ జీవన మార్గదర్శక మహోత్కృష్ట గ్రంథం. ఇది మహా పురుషుడైన రాముడిని ఆధారంగా చేసుకొని వెలసింది. రాముడు పురషుడు మాత్రమే కాదు పురుషోత్తముడు కూడా. లోకకళ్యాణం కోసం మహావిష్ణువు ధరించిన అనేకావతారాల్లో 10 అవతారాలు సుప్రసిద్ధాలు. వాటిలో ఏడో అవతారం రామావతారం.

ప్రతి అవతార ప్రయోజనము దుష్టశిక్షణ, శిష్టరక్షణే అయినప్పటికీ రామావతారం దుష్ట శిక్షణ శిష్టరక్షణతో పాటు మానవ జీవన శిక్షణ కోసం, ధర్మ సంరక్షణ కోసం ఉద్దేశించబడింది. రాముడు జన్మించి రాక్షస వధ చేశాడు. అంతటితో అవతార ప్రయోజనం నెరవేరినట్టే. కానీ ఆయన పని పూర్తయ్యిందని వైకుంఠానికి వెళ్ళలేదు. పదకొండువేల వంద సంవత్సరాలు భూమి మీద నివసించాడు. మానవులకు మనుగడ నేర్పడమే ఆయన ఉద్దేశం. ఆయన సాక్షాత్తు మహావిష్ణువయినప్పటికీ, మానవాతీత శక్తులున్నప్పటికీ, మహిమోపేతుడయినప్పటికీ బయట పడలేదు. మానవుడుగానే మసులుకొన్నాడు. గురువులను సేవించడం, తల్లిదండ్రులను పూజించడం, అన్నదమ్ములతో ఆప్యాయంగా మసులుకోవడం, స్నేహానికి ప్రాధాన్యమివ్వడం వంటివి మానవ సహజమైన ఆయన లక్షణాలు. మనిషే దేవుడవుతాడు అనేందుకు చక్కని ఉదాహరణగా రాముడిని తీసుకోవచ్చు. మానవ శిఖామణి అయిన రాముడిని దైవశిఖామణిగా భావించి ఎందరో ఉపాసించారు. ఆ తారకరాముడి కారుణ్యదీప్తిలో ఎందరో తరించారు.

కవయిత్రి మొల్ల రాముడిని ఉపాసించే 'రామాయణం' రచించింది. పోతనామాత్యుడు కూడా రామభక్తి తత్పరుడై తన భాగవతాన్ని రాముడుకే అంకితమిచ్చాడు. తులసిదాసు రామభక్తుడై "రామచరిత మానస్" ను రచించాడు. కంచెర్ల గోపన్న భద్రాచలంలో రామాలయం నిర్మించి రామదాసయ్యాడు. అనేక కీర్తనలు రచించాడు. త్యాగరాజస్వామి రాముడి మీద రచించిన కీర్తనలు కీర్తనీయాలు, రామ సాక్షాత్కారాన్ని కూడా ఈయన పొందాడు. ఈ వరుసలో పేర్కోదగ్గవాడే తొలితెలుగు వాగ్గేయకారుడు తాళ్ళపాక అన్నమాచార్యుడు. తాళ్ళపాక అన్నమాచార్యుడు శ్రీ వేంకటేశ్వరాంకితంగా 32వేల కీర్తనలు రచించాడు. అవి అన్నీ లభించలేదు. లభించిన వాటిలో రాముడికి సంబంధించిన కీర్తనలు పేర్కొదగ్గ విధంగానే కనిపిస్తాయి. వాటిని ఆధారంగా చేసుకొని అన్నమయ్య అంతరంగంలో అధివసించిన అయోధ్య రాముడిని అంతరంగ నేత్రంతో దర్శించి దర్శింపజేయడమే ఈ పత్రపరమావధి.

ఈ ప్రసంగ పత్ర రచనకు నేను తీసుకొన్న అన్నమయ్య సంకీర్తనలు 10. వీటిలో చోటుచేసుకొన్న అంశాలు కూడా పదే అవి.

1. అంత్యప్రాస రామనామం
2. రామ కథా సంగ్రహం
3. ఘనకార్యాలు
4. అవతార విశిష్టత

5. అవతార ప్రయోజనం 6. ఘనత

7. మేలుచేసే గుణం 8. రామబాణ గరిమ

9. రామ ప్రతాపము 10. సవాలు

1. అంత్య ప్రాస రామనామం

రామావతారం ఎంత విశిష్టమైందో రామనామం కూడా అంతే విశిష్టమైంది. కాస్త అధికమనే చెప్పవచ్చు. రాముడు లంకకు వెళ్ళడానికి సముద్రం మీద సేతువు నిర్మించాడు. ఆంజనేయుడు లంకకు వెళ్ళడానికి రామనామాన్ని మాత్రమే ఉపయోగించుకొన్నాడు. ఇది రామనామ విశిష్టతను విశదం చేస్తుంది. పార్వతీదేవికి పరమశివుడు రామనామం గొప్పతనం గురించి అనేకసార్లు చెప్పాడు. అనేక విధాలుగా చెప్పాడు.

శ్లో. "శ్రీరామ రామ రామేతి
రమేరామే మనోరమే
సహస్రనామ తత్తుల్యం
రామనామ వరాననే"

కం. "ఈరేడు జగములందున
నారీమణి విమలరామ నామముచేతన్
జీరబడని ఘనదుర్భర
ఘోరమహాయఘము లేదు కోరివెదకినన్"

తే. "అనవరత రామనామ కీర్తనపరునకు
వెనుకటియఘంబుల దలంచి వెరువవలదు
ఘనత నేనుగునెక్కి కుక్కలను గాంచి
భయపడగ నేల మనుజుడో పంకజాక్షి!"

ఇటువంటి రామనామాన్ని ఉచ్చరించడం ఎవరికైనా హితకరమే. శుభకరమే. ఈ విషయాన్ని మనసులో పెట్టుకొనో ఏమో అన్నమయ్య ఒక కీర్తనలో ప్రతి పాదాంతంలోనూ రామనామ ప్రయోగం చేశాడు. అది అంత్యప్రాసగా అలరారింది. ఈ కీర్తన ఎంత మృదుమధురంగా వుందో మీరే గమనించండి.

కీర్తన. రామా దశరథ రామా నిజసత్య
కామా నమో నమో కాకుత్థ్సరామ ॥ పల్లవి ॥

కరుణానిధి రామ కౌసల్యానందన రామ
పరమ పురుష సీతాపతి రామ

శరధిబంధన రామ సవన రక్షక రామ
గురుతర రవివంశ కోదండ రామ ॥ రామా ॥

దనుజహరణ రామ దశరథ సుత రామ
వినుతామరస్తోత్ర విజయరామ
మనుజావతార రామ మహనియ్యగుణ రామ
అనిలజ ప్రియ రామ అయోధ్యారామ ॥ రామా ॥

సులలితయశ రామ సుగ్రీవ వరద రామ
కలుషరావణ భయంకర రామ
విలసిత రఘురామ వేదగోచర రామ
కలిత ప్రతాప శ్రీవేంకట గిరిరామ ॥ రామా ॥

(అన్నమయ్య అధ్యాత్మ సంకీర్తనలు-సంపుటము : 4 - కీర్తన : 156)

2. రామ కథా సంగ్రహం

రాముడు లోక కళ్యాణం కోసం అవతరించాడు. ఎన్నో ఘన కార్యాలు చేశాడు. చాలా ఇబ్బందులు పడ్డాడు. ఆయన జీవితంలోని ముఖ్యమైన సంఘటనలను పరికిస్తే ఆయన అద్భుత చరిత్ర అవగతమవుతుంది. కొన్ని ముఖ్యమైన సంఘటనలను తీసుకొని అన్నమయ్య ఒక కీర్తన రచించాడు. ఇదే రామ కథా సంగ్రహంగా రవళించింది.

కీర్తన. ఇతఁడే పరబ్రహ్మ మిదియే రామ కథ
శతకోటి విస్తరము సర్వపుణ్య ఫలము ॥ పల్లవి ॥

ధరలో రాముడు పుట్టె ధరణిజఁ బెండ్లాడె
అరణ్యవాసులకెల్లా నభయమిచ్చె
సొరిది ముక్కుజెవులు చుప్పనాతిని గోసె
ఖర దూషణులను ఖండించి వేసె ॥ ఇతఁడే ॥

కినిసి వాలిని జంపి కిష్కింధను సుగ్రీవుని కిచ్చె
వనధి బంధించి దాటె వానరులతో
కనలి రావణ కుంభకర్ణాదులను జంపి
వనితజేకొని మళ్ళి వచ్చె నయోధ్యకు ॥ ఇతఁడే ॥

సౌమిత్రియు భరతుడు శత్రుఘ్నుడు గొలువగ
భూమి యేలె కుశలవ పుత్రులగాంచె

శ్రీమంతుడై నిలిచె శ్రీవేంకటాద్రి మీఁద
కామించి విభీషణులంకకుఁబట్టముగట్టె ॥ ఇతఁడే ॥

(అన్నమయ్య అధ్యాత్మ సంకీర్తనలు – సంపుటము : 4 – కీర్తన : 519)

3. ఘనకార్యాలు

రాముడు చాలా కాలం జీవించాడు. ఎన్నో ఘన కార్యాలు చేశాడు. వాటన్నిటినీ ప్రస్తావించడం సాధ్యమయ్యే పనికాదు. అందువల్ల కొన్నిటిని మాత్రమే తీసుకొని అన్నమయ్య కీర్తించాడు. ఈ కీర్తనలో స్ఫూర్తి ఉంది. కర్తవ్య దీప్తి ఉంది. ఇదే ఆ కీర్తన.

కీర్తన. రామభద్ర రఘువీర రవివంశ తిలక నీ –
నామమే కామధేనువు నమోనమో ॥పల్లవి॥

కౌసల్యా నంద వర్ధన ఘన దశరథసుత
భాసుర యజ్ఞరక్షక భరతాగ్రజ
రాసికెక్కు కోదండ రచన విద్యా గురువ
వాసితో సురలు నిను వడి మెచ్చేరయ్యా ॥ రామ ॥

మారీచ సుబాహు మర్దన తాటకాంతక
దారుణ వీరశేఖర ధర్మపాలక
కారుణ్య రత్నాకర కాకాసుర వరద
సారెకు వేదవిదులు జయపెట్టేరయ్యా ॥ రామ ॥

సీతారమణ రాజశేఖర శిరోమణి
భూతలపుటయోధ్యా పుర నిలయా
యీతల శ్రీ వేంకటాద్రి నిరవయిన రాఘవ
ఘాతన ప్రతాపమెల్ల గడు నిండెనయ్యా ॥ రామ ॥

(అన్నమయ్య అధ్యాత్మ సంకీర్తనలు–సంపుటము : 3 – కీర్తన : 304)

4. అవతార విశిష్టత

మహావిష్ణువు అవనీ సంరక్షణార్థం అనేకావతారాలు ధరించాడు. ప్రతి అవతారానికి ప్రయోజనం వుంది. ప్రత్యేకత ఉంది. రామావతార ప్రత్యేకత గురించి, దాని విశిష్టత గురించి అన్నమయ్య ఆవిష్కరించిన తీరు అద్భుతం. అనితర సాధ్యం. ఈ కీర్తనలో ధ్వనించే రామావతార పరమోత్కృష్టతను గమనించడం ముదావహం.

కీర్తన. రాముడు రాఘవుడు రవికులు డితడు
భూమిజకుబతియైన పురుష నిధానము ॥ పల్లవి ॥

అరయబుత్రకామేష్టియందు బరమాన్నమున
పరగ జనించిన పరబ్రహ్మము
సురల రక్షింపగ నసురల శిక్షింపగ
తీరమై యుదయించిన దివ్యతేజము ॥ రాము ॥

చింతించే యోగీంద్రుల చిత్త సరోజములలో
సంతతము నిలిచిన సాకారము
వింతలుగా మునులెల్ల వెదకి కనేయట్టి
కాంతులc జెన్నుమీరిన కైవల్యపదము ॥ రాము ॥

వేద వేదాంతములందు విజ్ఞాన శాస్త్రములందు
పాదుకొనబలికేటి పరమార్థము
పోదితో శ్రీ వేంకటాద్రిc బొంచి విజనగరాన
ఆదికి అనాదియైన అర్చావతారము ॥ రాము ॥

(అన్నమయ్య అధ్యాత్మ సంకీర్తనలు-సంపుటము : 4 - కీర్తన : 169)

5. అవతార ప్రయోజనం

రామావతార విశిష్టతను రమణీయంగా విశదం చేసిన అన్నమయ్య ఆ అవతార ప్రయోజనాన్ని కూడా అందంగా ఆవిష్కరించాడు. రాముడు భక్తులను ఆదరించాడు. వారికి అనేక శుభాలు కలిగించాడు. దుష్టులైన రాక్షసులను తునుమాడాడు. తద్వారా లోక కళ్యాణం చేకూర్చాడు. ఈ అంశాలన్నింటినీ వరుసగా వివరించే కీర్తన అన్నమయ్య నోటినుండి ఆవిర్భవించింది. ఈ కీర్తన విన్న శ్రోతలే గాక తిరుమలేశుడు కూడా ముగ్ధుడై వుంటాడనడం అతిశయోక్తి కాదు.

కీర్తన. రాముడు లోకాభిరాముడుదయించగాను
భూమిలో వాల్మీకికి పుణ్యమెల్లా దక్కెను ॥ పల్లవి ॥

తటుకన మారీచు తలపై బోయ గర్మము
కుటిల శూర్పనఖ ముక్కున బండెను
పటుకునదెగె దైత్యభామల మెడతాళ్ళు
మటమాయదైత్యులకు మరి నూరూనిండెను. ॥ రాము ॥

తరగె రావణు పూర్వతపముల యాయుష్యము
ఖర దూషణాదులకు కాలము దీరె
గరిమ లంకకు నవగ్రహములు భేదించె
సిరుల నింద్రజిత్తాకు చినిఁగె నంతటను ॥రాము॥

పొరిగుంభ కర్ణునికి పుట్టినదినము వచ్చె
మరలి గండము దాఁకె మండోదరికి
పరగె నయోధ్యకు భాగ్యములు ఫలియించె
చిరమై శ్రీ వేంకటేశు చేతలెల్లా దక్కెను ॥రాము॥

(అన్నమయ్య అధ్యాత్మ సంకీర్తనలు–సంపుటము : 4 – కీర్తన : 520)

6. ఘనత

అన్నమయ్య ఒక కీర్తనలో రాముడి ఘనతను మాత్రమే ఆవిష్కరించాడు. దాశరథి దుష్టులపాలి ఎంత భీకరుడో శిష్టుల పాలి అంత శ్రేయోదాయకుడు. మంచి వారిని రక్షించి వారికి సకల శుభాలనూ అనుగ్రహించాడు. ఇది ఆయన ఘనతను తెలియజేస్తుంది. ఆయనను ఆశ్రయించవలసిన ఆవశ్యకతను అభివ్యక్తం చేస్తుంది. రామకృప నిక్షిప్తమైన ఈ కీర్తన మన కందరికీ చాలా ఉపయోగకరం.

కీర్తన. రామచంద్రుడితడు రఘువీరుడు
కామిత ఫలములియ్యం గలిగె నిందరికి ॥ పల్లవి ॥

గౌతము భార్యాపాలిటి కామధేను వితఁడు
ఘాతలఁ గౌశికు పాలి కల్ప వృక్షము
సీతాదేవీ పాలిటి చింతామణి ఇతడు
యీతఁడు దాసుల పాలియిహపరదైవము ॥ రామ ॥

పరగ సుగ్రీవు పాలి పరమబంధు డితఁడు
సరి హనుమంతు పాలి సామ్రాజ్యము
నిరతి విభీషణుని పాలి నిధానము
గరిమ జనకు పాలి ఘన పారిజాతము ॥ రామ ॥

తలఁప శబరిపాలి తత్వపు రహస్యము
అలరి గుహుని పాలి ఆదిమూలము
కలఁడన్న వారి పాలి కన్ను లెదుటి మూరితి
వెలయ శ్రీ వేంకటాద్రి విభుడితడు ॥ రామ ॥

(అన్నమయ్య అధ్యాత్మ సంకీర్తనలు–సంపుటము : 4 – కీర్తన : 147)

7. మేలు చేసే గుణం

మానవుడికి వుండవలసిన మంచి లక్షణాల్లో ఉపకారం ఉత్కృష్టమైంది. శరీర ధారణే ఉపకారం కోసమని ఒక సంస్కృత కవి తెలియజేశాడు. తనకు తెలియకుండానే ప్రకృతి సమస్తమూ పరోపకారం చేస్తూవుందని అతని అభిప్రాయం.

శ్లో. "పరోపకారాయ ఫలంతి వృక్షాః
పరోపకారాయ దుహంతి గావహ
పరోపకారాయ వహంతి నద్యాః
పరోపకారార్థమిదం శరీరం"

భర్తృహరి సుభాషితాల్లో కూడా ఈ విషయమే చోటుచేసుకోవడం గమనార్హం.

తే. "ద్యుమని పద్మాకరము వికచముగా చేయు
కుముద హర్షంబు గావించు నమృత సూతి
అర్థితుడు గాక జలమిచ్చునంబుధరుడు
సజ్జనులు తారే పరహితాచరణమతులు".

ఉపకారం చేయడంలో ఏ మాత్రం గొప్పతనం లేదు. అపకారం చేసిన వారికి కూడా ఉపకారం చేయడంలోనే గొప్పతనముందని బద్దెన తన సుమతి శతకంలో తెలియజేశాడు.

కం. ఉపకారికి నుపకారము
విపరీతము గాదు సేయ వివరింపంగా
నపకారికి నుపకారము
నెపమెన్నక సేయువాడు నేర్పరి సుమతీ!

రామునిది మొదటి నుంచి ఉపకార గుణమే అపకారం చేసిన వారికి కూడా ఉపకారం చేసిన ఔదార్యం ఆయనది. ఈ విషయాన్నే అన్నమయ్య అద్భుతంగా ఆవిష్కరించాడు.

కీర్తన. రామా దయాపరసీమా అయోధ్యపుర
ధామా మావంటి వారి తప్పులు లోగొనవే ॥ పల్లవి ॥

అపరాధియైనట్టి యాతని తమ్మునినే
కృపజూపితివి నీవు కింకలు మాని
తపియించి యమ్ముమొన దారకు జిక్కినవాని
నెపాన గాచి విడిచి నీవాదరించితివి ॥ రామా ॥

సేయరాని ద్రోహము సేసిన పక్షికి నీవు
పాయక అప్పటి నభయమిచ్చితి
చాయసేసుకొని వుండి స్వామి ద్రోహి
జెప్పనట్టి తోయపుట్టెని మంచితోవనే పెట్టితివి? ॥ రామా ॥

నేరము లెంచవు నీవు నీదయే చూపుదు గాని
బీరవు శరణాగత బిరుదవు నీవు
చేరి నేడు నిలుచుండి శ్రీ వేంకటాద్రి మీఁదఁ
గోరిన వరములెల్లా కొల్ల లొసఁగితివి ॥ రామా ॥

(అన్నమయ్య అధ్యాత్మ సంకీర్తనలు-సంపుటము : 3 - కీర్తన :94)

8. రామబాణ గరిమ

నాకు తెలిసి ఆయుధంతో పాటు మనిషి పేరు ఎక్కడా కనిపించదు. ఒక్క రాముడి విషయంలో తప్ప. రాముడు కోదండరాముడుగా ప్రసిద్ధి వహించాడు. రాముడు ఎంత శక్తిమంతుడో ఆతని బాణం కూడా అంతే శక్తిమంతమని అభిప్రాయం. అందువల్లనో ఏమో అన్నమయ్య రాముడి బాణం గొప్పతనాన్ని వేనోళ్ళ కొనియాడాడు. దాని ధాటికి తట్టుకోలేరని రాక్షసులను హెచ్చరించాడు. తద్వారా చెడ్డవారందరినీ కూడా ఇక్కడ హెచ్చరించినట్లయ్యింది. రాముడు ఎవరెవరి మీద ఎప్పుడెప్పుడు తన వాడి బాణాన్ని ప్రయోగించి వారి అశువులు పుచ్చుకొన్నాడో ఇక్కడ అన్నమయ్య ఒక జాబితాలో తెలియజేశాడు. ఇక్కడ మూడు అంశాలు కనిపిస్తాయి. ఒకటి బాణం గొప్పతనము. రెండు ధర్మాత్ములకు అభయం. మూడు అధర్మాత్ములకు భయం వ్యక్తమయ్యేలా ఈ కీర్తన రూపుదిద్దుకొంది.

కీర్తన. రామునికి శరణంటే రక్షించి బ్రదుక రొ
యేమిటికి విచారాలు యిక దైత్యులాల ॥ పల్లవి ॥

చలమునదాటికి జదిపిన బాణము
లలిమారీచ సుబాహులపై బాణము
మెలఁగి పరశురాము మేట్లేసిన బాణము
తళతళ మెరసీని తలరో యసురలు ॥ రాము ॥

మాయామృగము మీద మరి వేసిన బాణము
చేయి చాచి వాలి నేసిన బాణము
తోయధిమీద నటు తొడిగిన బాణము
చాయలు దేరుచున్నది చనరో దైతేయులు ॥ రాము ॥

తగఁ గుంభకర్ణుని తలద్రుంచిన బాణము
జిగి రావణు బరిమార్చిన బాణము
మిగుల శ్రీవేంకటేశు మేటి పొదిలో నున్నది
పగ సాధించీ నిక బారరో రాకాసులు ॥ రాము ॥

(అన్నమయ్య అధ్యాత్మ సంకీర్తనలు-సంపుటము : 4 - కీర్తన :283)

9. రామప్రతాపము

రాముడు సౌమ్యుడైనప్పటికీ అవసరాన్ని బట్టి తన ప్రతాపాన్ని చూపించాడు. ఆయన ప్రతాపానికి ప్రకృతి, తదితరాలు ఏవిధంగా స్పందించి వుంటాయో అన్నమయ్య అందంగా ఊహించాడు. ఆ ఊహను కీర్తనలో నిక్షేపించి రాముడి కీర్తిని ఆవిష్కరించాడు. రౌద్రం, భీభత్సం, అద్భుతం మొదలైన రసాల మేళవింపు ఈ కీర్తనలో దర్శనమిస్తుంది.

కీర్తన. వినుదిదె రఘుపతి విజయములు
పనుపడి రాక్షస బాధలుడిగెను ॥ పల్లవి ॥

కులగిరులదరెను కుంభిని వడఁకెను
యిల రాముడు రథమెక్కినను
కలఁగె వారిధులు కంపించె జగములు
బలు విలునమ్ములు వట్టినను ॥ విను ॥

పిడుగులు దొరిగెను పెనుగాలి విసరె
తొడిబడి బాణము దొడిగినను
ముడివడె దిక్కులు మొగిసె దిగ్గజములు
యెడపక రావణు నేసినను ॥ విను ॥

చుక్కలు డుల్లెను స్రుక్కె భూతములు
తొక్కి యసురతల దుంచినను
గక్కన శ్రీవేంకటగిరి నిలువగ
అక్కజమగు శుభమందరి కొదవె ॥ విను ॥

(అన్నమయ్య అధ్యాత్మ సంకీర్తనలు-సంపుటము : 4 - కీర్తన : 518)

10. సవాలు

అన్నమయ్య ఒక వైపు రాముడి గొప్పతనాన్ని ప్రస్తావిస్తూనే అటువంటి లావరి తన ఇంద్రియాలను, మనసును, దుర్గుణాలను అణగదొక్కలేడాయని రాముడికి సవాలు విసిరాడు. ఈ కీర్తనను ప్రతి ఒక్కరూ నేర్చుకొని పాడుకోవడం ఎంతయినా అవసరం అనిపిస్తుంది.

కీర్తన. రామా రామ భద్ర రవి వంశ రాఘవ
యేమి యరుదిది నీ కింతటి వానికిని ॥ పల్లవి ॥

నాఁడు రావణు తలలు నరికిన లావరివి
నేఁడు నాపాపములు ఖండించరాదా
వాఁడి ప్రతాపము తోడ వారిధి గట్టిన నాటి
వాఁడవిట్టె నామనోవార్ధి గట్టరాదా ॥ రామా ॥

తనిసి కుంభ కర్ణాది దైత్యుల గెలిచితివి
కినిసి నాయింద్రియాల గెలువరాదా
యెనసి హరునివిల్లు యెక్కుపెట్టి వంచితివి
ఘనము నాదుర్గుణము కడు వంచరాదా ॥ రామా ॥

వరుస విభీషణుడు శరణంటే గాచితివి
గరిమ నే శరణంటి గావరాదా
తొరలి శ్రీవేంకటేశదొడ్డ కొంచ మెంచనేల
యిరవై లోకహితాన కేదైనా నేమీ ॥ రామా ॥

(అన్నమయ్య అధ్యాత్మ సంకీర్తనలు-సంపుటము :2 - కీర్తన :437)

అన్నమయ్య వేంకటేశ్వర భక్తుడు. విష్ణుభక్తుడు. స్మార్తం నుంచి శ్రీవైష్ణవానికి వచ్చిన మహాజ్ఞాని. ఈయన వేంకటేశ్వర రూప విష్ణువునే గాక అతని పలు అవతారాలకు సంబంధించి కూడా అనేక కీర్తనలు రచించాడు. అందులో భాగంగానే రామావతారానికి సంబంధించి కూడా రమణీయ కీర్తనలు అనేకం రచించాడు. వాటిలో కొన్నింటిని మాత్రం ఇప్పుడు మీ ముందుంచడం జరిగింది. ఇది కొండను అద్దంలో చూపించేపనే. ఈ కొండను అద్దంలో చూస్తూనే అసలైన కొండను పట్టుకొని ఆనందించడం తద్వారా తరించడం మనందరి పని.

* * *

23. తాళ్ళపాక పదకవుల సంకీర్తనలు - కాలం విలువ

- డా॥ తొండాటి రాజశేఖర్

ప్రపంచ జీవరాశుల సముదాయంలో మానవ జీవితం ఉత్తమమైంది. కానీ పరిమితమైంది. ఈ మానవుని పరిమిత జీవితంలో తాను ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి చేరుకోవడానికి ప్రయత్నం చేయాలి. ఆ ప్రయత్నానికి అవసరమైన ఉపకరణమే జీవితకాలం. పరిమితమైన జీవితకాలంలో ఉన్నత లక్ష్యాన్ని సాధించినపుడే జీవిత సార్థకత ఏర్పడుతుంది. ఆ సార్థకత సాధనలో మానవునికున్న ప్రధాన వనరు 'కాలం'. కాలాన్ని సద్వినియోగం చేసుకుంటే ఉన్నత లక్ష్యాన్ని సులభంగా సాధించవచ్చు. ఈ సందర్భంలో చాణుక్యుడు చెప్పిన శ్లోకం పరిశీలనార్హమైంది.

కాలః పచతి భూతాని, కాలః సంహరతే ప్రజాః
కాలః సుప్తేషు జాగర్తి, కాలోహి దురతి క్రమః

సమస్త ప్రాణుల్ని, జగత్తును నడిపించేది, హరించేది కాలమే. సమస్త సృష్టిస్థితిని వినాశనం చేయగలిగింది కూడా కాలమే. బలవత్తరమైన కాల ప్రభావాన్ని ఎవరు అతిక్రమించలేరు అంటాడు చాణుక్యుడు. కాలం అంత బలీయమైనది. కాబట్టి విలువైన కాలాన్ని సద్వినియోగం చేసుకుంటే ఉన్నతులవుతారు. దుర్వినియోగం చేసుకుంటే పతనమవుతారు. నిరుపయోగం చేసుకుంటే విలువైన జీవితం వృథా అవుతుంది. ఏదైనా మానవుల చేతుల్లోనే ఉంది.

ప్రతిమనిషికి కాలం ఒక వరం. మానవుడు ఏదైనా సాధించలేని సందర్భం వచ్చినపుడు 'నాకు కాలం కలసి రావడం లేదు' అని వాఖ్యానించడం సహజం. అలా అనిన మానవుడికి కాలం విలువ అర్థం కాలేదని అర్థం చేసుకోవాలి. కాలాన్ని సద్వినియోగం చేసుకోలేని అసమర్థుడిగా అర్థంచేసుకోవాలి. ప్రతివ్యక్తీ అనంతమైన కాలస్వరూప విన్యాసాన్ని, విలాసాన్ని గుర్తించి తన జీవితానికనుగుణంగా మలచు కోవడమే. 'వ్యక్తిత్వ వికాసం' అంటే కాల సద్వినియోగంలో మానవుడు ప్రభావవంతంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. కర్తవ్య దీక్షతో పనిచేయాలి. ముందుచూపు, మేధాశక్తి, నైపుణ్యం, ఊహాశక్తి, పట్టుదల, కృషి లాంటి సద్‌లక్షణాలు కలిగిన వారికి కాలం విలువ తెలుస్తుంది.

మరీ ముఖ్యమైన విషయం ఏంటంటే కాలం దైవ స్వరూపం. దైవస్వరూపమైన కాలాన్ని మనం నిర్లక్ష్యం చేస్తే అది మనల్ని పతనం చేస్తుంది. కాబట్టి కాలం విలువను తెలుసుకోవాలి. వర్తమాన కాలాన్ని ఒడసి పట్టుకొని భవిష్యత్తుకు బాటలు నిర్మించు కోవాలి. స్థూలంగా అందరూ కాలం, సమయం అనే పదాలను ఒకే అర్థంలో వాడతారు. కానీ సూక్ష్మంగా ఆలోచిస్తే కాలం వేరు. సమయం వేరు. కాలమనేది పరణామంకు సంబంధించింది. సమయం వ్యవధిని సూచిస్తుంది.

ఇలా కాలం విలువను వ్యాఖ్యానిస్తూపోతే కాలం ఎంత అనంతమైనదో అంత విస్తృతిని మించిపోతుంది. కనుక ఈ పత్రం తాళ్ళపాక కవులైన అన్నమాచార్యులు, పెదతిరుమలాచార్యులు, చిన తిరుమలాచార్యులు తమ సంకీర్తనల్లో కాలం విలువను ఎలా వివరించారో, కాలాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలని ప్రభోదించారో తెలపడం ఈ వ్యాసోద్దేశం.

తెలుగు సాహిత్యంలో తాళ్ళపాక కవులది ప్రత్యేక స్థానం. 'తాళ్ళపాక కవులది కొంత. తక్కినకవులది కొంత' అనే నానుడి మనకు ఉండనే ఉంది. వారి కుటుంబం పదకవితలతో తెలుగు సాహిత్యంలో పరిమళాలు అద్ది శ్రీవేంకటేశ్వర స్వామికి అర్పించిన తీరు అనిర్వచనీయమైంది. రోజుకొక్క సంకీర్తనకు తక్కువ గాకుండా శ్రీవారి కోసం అన్నమయ్య తన జీవితకాలంలో 32000 కీర్తనలు రాశాడంటే ఆ మహనీయుడు కాలాన్ని ఎంతగా సద్వినియోగం చేసుకున్నాడో మనం అర్థం చేసుకోవచ్చు. ఆ కీర్తనలను రచించడంలో ఆయన వేసుకున్న ప్రణాళిక, దాని ద్వారా ఉన్న కాలాన్ని సద్వినియోగం చేసుకున్నతీరు మనం గమనించవచ్చు. అయినాసరే అన్నమయ్య తన జీవితంలో కాలం సద్వినియోగం చేసుకోలేక పోయానని చింతించాడు. కాలం అంతా బూడిదలో పోసిన నెయ్యిలాగా సద్వినియోగం కాలేదని వాపోయాడు.

"ఏడ సుజ్ఞాత వేడ తెలివినాకు
బూడిదలో హోమమై పోయఁ గాలము

ఇదె మేలయ్యెడి నాకదె మేలయ్యెడినని
కదిసిన యాసచే గడవలేక
యెదురు చూచి చూచి యెలయించి యెలయించి
పొదచాటు మృగమై పోయెఁ గాలము

ఇంతట దీరెడి దుఃఖమంతట దీరెడినని
వింత వింత వగలచే వేగివేగి
చింతయు వేదనలఁ జిక్కువడచు నగ్ని
పొంతనున్న వెన్నయై పోయెఁ గాలము

యిక్కడ సుఖము నాకక్కడ సుఖంబని
యెక్కడికైనా నూరకేగి యేగి
గక్కున శ్రీతావేంకటపతి గానక
పుక్కిటి పురాణములై పోయెఁ గాలము

కాలం అనేది ఒక నిరంతర ప్రవాహం లాంటిది. అది ఎవరి కోసం ఆగదు. " " అనే ఆంగ్ల సూక్తి కాలం విలువను సూచిస్తోంది. 'నాకు అది మేలు చేస్తుంది ఇది మేలు చేస్తుందని' వ్యర్థమైన కోరికలతో

పరుగులెత్తితే కాల హరణం తప్ప మరే విధమైన మేలు కలగబోదని అన్నమయ్య సంకీర్తన తెలియజేస్తోంది. అత్యాశలతో అనంతకోటి కోరికలతో మనసు నిలకడ లేకుండా తిరిగే వారికి బాధలు, వేదనలు తప్ప మరే ప్రయోజనం కలగదని అలాంటి వారి జీవితం అగ్నితో కలసిపోయే వెన్నలాగా హరించుకు పోతుందని చక్కగా తెలియజేశాడు. ఈ విషయాలను గ్రహించలేని వివేక హీనులైన మానవులు కొందరు వ్యర్థమైన కార్యకాలాపాలతో కాలాన్ని వృథా చేసుకుంటున్నారు. కాలాన్ని వృథా చేయడమంటే మన జీవితాన్ని వృథా చేసుకోవడమనే అసలైన విషయాన్ని గ్రహించలేక పోతున్నారు. కాబట్టి మంచి పనులకు జీవితాన్ని ఉపయోగించుకొని, సార్థకం చేసుకోవాలి.

తాళ్ళపాక కవుల వంశంలో అన్నమాచార్యుల తర్వాత అతని కుమారుడు పెదతిరుమలయ్య పేర్కొనదగినవాడు. తండ్రికి తగిన కుమారుడు. పెదతిరుమలయ్య కూడా తండ్రి బాటలోనే నడిచి శ్రీవేంకటేశ్వర స్వామి మీద సంకీర్తనలు వెలయించాడు. ఈయన కీర్తనల్లో కూడా కాలం విలువను తెలియజేసే కీర్తనలు ఉన్నాయి. మానవుడు జీవితకాలంలో దీపముండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలని లేదంటే వ్యర్థ జీవుడుగా మిగిలిపోతాడని తెలియజేశాడు. లౌకిక జీవితంలో మానవుడు సుఖభోగాలకోసం పడరాని పాట్లు పడడం సమంజసం కాదని సూచించాడు.

"ఏమఱకు జీవుడా యే కాలమూ
నేమముతో నుండితేనే నిలుచును కాలము

కడిగి జూజ మాడితేఁ గడచీని కాలము
నడుమ వేటలాడితే నడచీని కాలము
జడియుచు నిద్రించితే జరగీని కాలము
నిడివి హరిఁ గొల్చితే నిండుకుండుఁ గాలము

సతుల సంగడి నున్న సమసీని కాలము
వెతలఁ బొరలినామ వెళ్ళీని కాలము
సతతము దొంగిలినా చనిపోయాఁ గాలము
ప్రతియై యుండితేను వసమౌను కాలము

పాలు మావి వుండినాను పరివోవుఁ గాలము
కూళ గోష్టినుండి నాను కొంచపడుఁగాలము
. . . . . .
. . . . . ."

సృష్టిలో కాలగతిని ఎవరూ ఆపలేరు. మనం ఏ పని చేస్తున్నా ఆ పని పూర్తి అయినప్పటికీ, పూర్తి కానప్పటికీ కాలం మాత్రం ఆగదు. తన మానాన తను వెళ్తుంది. పాలు మారి పుడుకున్న, అనవసర

విషయాలు చర్చించుకున్న, బాధలతో బాధపడుతున్నా, భార్యలతో సంతోషంగా గడుపుతున్న, నిద్రతో ఉన్న, జూదమాడుతున్నా, సప్తవ్యసనాల పాలైనా కాలం తన దారిన తానుపోతుంది. దానిని కాలక్షేపం అంటారు. కాలాన్ని వృధాచేసుకుంటున్నామని మానవుల గ్రహించాలి. అయితే కాలాన్ని గురించి నియమంతో ఉంటే మాత్రం ఆ కాలం ఉపయోగపడుతుంది. అలాంటప్పుడు కాలం నిలుస్తుందని అంటే కాలం ప్రయోజనం చేకూర్చిందని భావించవచ్చు. ఇంకా పెదతిరుమాలాచార్యులు 'వ్రతియై' ఉంటే కాలం నిలుస్తుందిని అంటారు. కాలం పట్ల నిష్ఠను పాటించాలని అప్పుడే కాలం వశమవుతుందని ఆయన సూచిస్తున్నాడు.

తాళ్ళపాక కవులందరూ హరిని సేవించే కాలం సార్ధకమైన కాలంగా అభివర్ణించారు. అన్యథా వెచ్చించే కాలం నిరర్ధకమైనదిగా నిర్వచించారు. హరిస్మరణీతరాల కోసం కాలాన్ని వృథా చేసిన కాలం తిరిగిరాదని హెచ్చరించారు. తాళ్ళపాక కవులలో మూడవ తరానికి చెందిన కవి పండితుడు, సంకీర్తనా కారుడు చిన తిరుమలయ్య కాలం విలువ తెలియజేసే ఒక సంకీర్తన వెలయించాడు.

"నిమిష మెడతెగక హరినిన్నుఁ దలచి
మమత నీ మీదనే మరిపి బదుకుట గాక

నిదురుచే కొన్నాళ్ళు నేరములఁ గొన్నాళ్ళు
ముదిమిచే, గొన్నాళ్ళు మోసపోయి
కదిసి కోరికను గతకాలంబు వచ్చునె
మదిమదినె వుండి యేమరక బదుకుట గాక

కడుఁ దనయులకుఁ గొంత కాంతలకు నొక కొంత
వెడ యాసలకుఁ గొంత వెట్టిసేసి
అడరి కావలెనన్న నందు సుఖమున్నదా
చెడక నీ సేవలే సేసి బదుకుట గాక

ధనము వెంటాఁదగిలి ధాన్యంబునకుఁ దగిలి
తనవారిఁ దగిలి కాతరుడైనను
కనుగలిగి శ్రీ వెంకటనాథ కాతువె
కొనసాగి నిన్ను నే కొలచి బదుకుట గాక

మానవుని లౌకిక జీవితంలో ఐహిక సుఖాల వలన కాలం వృధాతప్ప ప్రయోజనం లేదని, వ్యర్థమైన కోరికలు దుఃఖానికి మూల హేతువులు గాక మరొకటి కాదని చినతిరుమలయ్య సంకీర్తన ద్వారా గ్రహించవచ్చు. అనవసరమైన సోమరితనం వలన వచ్చేనిద్ర, తప్పులు చేసుకుంటూ సాగిపోయే జీవితం, వృద్ధాప్యంలో ఏమిచేయలేక ఇతరుల సహాయం కోసం ఎదురుచూపులు ఇలా సాగిపోయే జీవితంలో

గడిచిపోయిన కాలం ఎంత వెదికినా, ఎదురు చూసినా తిరిగిరాదు. అందుకే చినతిరుమలయ్య 'కదసి కోరినను గతకాలంబు వచ్చునె' అని ప్రశ్నించాడు. దీనికి సమాధానంగా తన కీర్తనలోనే సమాధానమిస్తూ 'మది మదినే వుండి యేమరక బదుకుట గాక' అని హెచ్చరికలు జారీ చేశాడు. జీవితంలో ఏమరు పాటు లేకుండా బ్రతకాలన్నాడు. మనస్సును ఇతర వ్యాపకాలపై మరల్చకుండా ఏకాగ్రత చిత్తుడై మనసును మనసులోనే వుంచుకోవాలని హితువు పలికాడు.

ఈ విధంగా తాళ్ళపాక కవుల్లో మొదటి మూడు తరాలకు చెందిన అన్నమాచార్యులు, పెదతిరుమలాచార్యులు, చినతిరుమలాచార్యులు కాలం విలువను గుర్తించి పదకవిత్వంలో దానిని విశదీకరించారు. కాలం విలువను నొక్కిచెప్పారు. కాలం దుర్వినియోగమయ్యే తీరును తమ సంకీర్తనల్లో వివరించారు. కలియుగ ప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వర స్వామిని సేవించడానికి, ఈ కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అప్పుడు కాలం సద్వినియోగం అవుతుందని పేర్కొన్నారు. కానీ వారి సంకీర్తనలు దైవోపాసనపట్ల సాగినప్పటికి ఆ తాళ్ళపాక పదకవులు కాల సద్వినియోగం గురించి ఆణిముత్యాల్లాంటి సూచనలు కొన్నిచేశారు. కాలం సద్వినియోగం చేసుకొనే వాళ్ళకు నియమంపై నిష్ఠ ఉండాలని సూచించారు. 'నీ శ్రేయోనియమం విన' అంటారు. నియమం లేకపోతే శ్రేయస్సు కలగదు. ఒక పద్ధతి ప్రకారం ప్రణాళికను వేసుకొని కాలాన్ని సద్వినియోగం చేసుకొవాలి. 'ప్రతి మెతకు నీకు లెక్క చెప్పాలి ప్రతిక్షణం లాభం చేకూర్చాలి' అనే సామెత లోక వ్యవహారంలో వుంది. అంతగానియమ నిష్ఠ ఉన్నప్పుడే ప్రతి నిమిషం లాభం చేకూరుస్తుంది. కనుక కాలం విలువ తెలిసినవాడు భౌతిక, ఆధ్యాత్మిక జీవితాలను సమన్వయం చేసుకొని ముందుకు సాగి చరిత్రలో నిలిచిపోతారనడానికి తాళ్ళపాక పదకవులు జీవితాలను ఉదహరించవచ్చు. ఎందుకంటే కాలాన్ని సద్వినియోగం చేసుకొని తాము నమ్మిన దైవాన్ని కొలిచారు. ఆ దైవం కోసం సంకీర్తనలు వెలయించి మెప్పించారు. సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. తామూ తరించారు. కాబట్టి కాలం కంటేమించిన ధనం లేదు. కాలం అనేది ఒక వెలకట్టలేని పదార్థం. మానవులు కాలాన్ని వ్యర్థంగా ఉపయోగించుకొనరాదు.

* * *

ఆధార గ్రంథాలు

1. తాళ్ళపాక పదకవుల సంకీర్తనలు – తి.తి.దే ప్రచురణలు
2. భగవద్గీత – శ్రీ శుక బ్రహ్మాశ్రమప్రచురణ
3. తాళ్ళపాక కవుల కృతులు – ఆచార్య వేటూరి ఆనందమూర్తి.

24. అన్నమయ్య - వైష్ణవ భక్తితత్వం

- విశ్రాంత ఆచార్య కట్టమంచి మహాలక్ష్మి

అన్నమయ్య కులరీత్యా అద్వైతి. అద్వైతం శంకరాచార్యులవారి సిద్ధాంతం. దైవానుగ్రహం వలన, అన్నమయ్య వైష్ణవాన్ని స్వీకరించాడు. శ్రీరామానుజాచార్యుల వారి విశిష్టద్వైతాన్ని అనుసరించాడు. బ్రహ్మంసత్యం లోకం మాయ అనే తత్వానుండి, ప్రపంచం, బ్రహ్మంలోని భాగమే అనే సిద్ధాంతానికి కట్టుబడ్డాడు.

ఘన విష్ణుడనే ముని స్వప్నంలో శ్రీవేంకటేశ్వరుడు ప్రత్యక్షమై అన్నమయ్య తిరుమలకు వచ్చాడని, నువ్వు నాకు బదులుగా వానికి ముద్ర ధారణ గావించమని చెప్పి, అదృశ్యమయ్యాడు. స్వామి ఆనతి శిరసావహించి, అన్నమయ్యను వెలితి పట్టి, వేద మార్గానుసారంగా శంఖ, చక్రాంకితుని జేసి, పంచసంస్కృతులు గావించాడు, ఘన విష్ణుడు.

శంఖ చక్రధారణ పవిత్రతను అన్నమయ్య కీర్తించాడు.

"..... నదు లొల్లవు నాస్నానముకడు
నదరయునాకస్నానయు
ఇరువంకల నీయెచిన ముద్రలు
ధరించుటే నా స్నానము"

వైష్ణవులకు బాహ్యలక్షణాలల్లో ప్రధానమైంది.

ఊర్ధ్వపుండ్రధారణ.

"ఉదుటున దన సకలో పాయంబులు
వదలుటపో నిజవైష్ణవము
యెదుటను శ్రీవేంకటేశ్వర నామము
వదనము చేర్చుట వైష్ణవము."

పరమవైష్ణవాన్ని గూర్చి గూడ విన్నవించారు.

"ఉపాయాంతరము లొల్లక భక్తి చేపట్టె
యెపుడూ తీర్థ ప్రసాదేచ్ఛతోడ
నిపుణత శ్రీవేంకటేశ్వరుడేగతియని
పరిశుద్ధి నుండుటే పరమవైష్ణవము"

అనన్య భక్తితో స్వామి తీర్థ ప్రసాదాలను స్వీకరిస్తూ స్వామికి శరణాగతుడై పరిశుద్ధమైన మనస్సుతో ఉండడమే పరమవైష్ణవము అని అన్నాడు.

"విష్ణోరిదం వైష్ణవమ్" ఇదివేదసమ్మతమైన ధర్మం. శ్రీరామానుజాచార్యులు ఈ ధర్మాన్ని దక్షిణ భారతదేశంలోసుసంపన్నం చేశారు. ఉభయ వేదాంత పారీణులైన అన్నమాచార్యులు వారిది విస్తృత వైష్ణవం అని పండితుల అభిప్రాయం.

"చెప్పినట్టు సేసితేను చేరిదేహమే చుట్టము
తప్పులు లేనిది యైతే ధర్మమే సొమ్ము
దేవుడు గలడని మదిలో దెలియుటె జన్మఫలము
దేవుడుగలడని నమ్మి అతడ్ని ఎప్పుడూ తలచుకోవడమే భాగ్యము".

"శ్రీవైష్ణవ ధర్మము దప్పక చెలునుట వైభవము".

వైష్ణవధర్మాలను తప్పకుండా అనుసరించాలని, కర్మమూలం కాయమని, ధర్మమూలం ఆత్మ అని గ్రహించడంతో పాటు, ఆరిలి రెండింటికి హరి యొక్కడే అని గుర్తించాలంటాడు అన్నమయ్య,

"ఈ మర్మం తెలిసిన వాడె మనుజుడు" అన్నది అన్నమయ్య తీర్పు.

ధర్మమూలమైనది దైవికముగాబట్టి, అన్నమయ్య ధర్మాలను వెతుక్కొంటు తిరుగుతుంటె 'దాసులు' స్వామి ధర్మాన్ని ఉద్బోధించారట.

ఆ పైన శ్రీవేంకటేశ్వర దాసత్వమే అన్నమయ్యకు ప్రధాన ధర్మంగా మారింది.

బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే అన్న అన్నమయ్య.....

"ఎక్కువకులజుడైన హీనకులజుడైన
నిక్కమెరిగిన మహానిత్యుడే ఘనుడు
వేదములు చదివియును విముఖుడైన, హరిభక్తి
యాదరించని సోమయాజి కంటె,
యేదియునులేని కులహీనుడైనను విష్ణు
పాదములు సేవించు భక్తుడే ఘనుడు
పరమమను వేదాంత పఠన దొరికియు సదా
హరిభక్తిలేని సన్యాసికంటే
సరవి మాలిన యంత్యజాతి కులజుడైన
నరసి విష్ణుని వెదకు నాతడే ఘనుడు" అని కులరాహిత్యాన్ని ప్రకటించాడు.

అయినా విష్ణుమూర్తిని వెదకవలసిన పనిలేదు

ఎందుకంటె అతడు.....
నిత్యాత్ముడైయుండె నిత్యుడై వెలుగొందు

సత్యాత్ముడైయుండి సత్యమైతానుండు
ప్రత్యక్షమైయుండి బ్రహ్మమైయుండు.

సత్యం పలికేవారి ఆత్మలో స్వామి వుంటారు అని కచ్చితంగా సెలవిచ్చాడు అన్నమయ్య.

స్వామి ఘనతను వేనోళ్లపోగుడుతూ.....
కొలిచిన వారికల్ల కోరినవరాలిస్తారు,
తలచిన వారికెల్ల ధన్యులను చేస్తారు.

అనాథనాథుడు, అధికుడు, ఆపద్బాంధవుడు స్థితప్రజ్ఞుడు, అకారణ బంధువుగా పేర్కొన్నారు.

వైష్ణవుడుగా జీవించాలంటే కొన్ని విలక్షణమైన లక్షణాలుండాలంటాడు.

కోరికలుడుగుచు గురినిన్నటిపై
వైరాగ్యము పోవైష్ణవము.
సారెకు గోపము జలమును దన్వ
వారించుట వోవైష్ణవము
ముడివడి యింద్రి యముల కింకరుడై,
వడబడనిదేపోవైష్ణవము.

వైష్ణవ ధర్మాలు అబ్బాలన్నా, వైష్ణవుడిగా జీవించాలన్నా, తప్పనిసరిగా భక్తుడుకొన్నింటిని అలవర్చుకోవాలి.

"వివిధేంద్రియ విషయ విముఖుడుగాదేని యావలవైష్ణవ ధర్మమిది యబ్బదు దేహపు ఇంద్రియాలను దేహమందే అణ చేసినప్పుడే దేహము తోనే తాను దేవుడట.

అవిరిళంబగు దేహానుసరణములేక
భవ మాత్రమున సుకృత ఫలమబ్బదు".

అన్నమయ్య శ్రీవేంకటేశ్వర స్వామి కటాక్షంతో పొందిన అనుభవాలు కోకొల్లలు.

"నీ గరి త్రోవ మొగసాలకు రాగానే జీవిత గమ్యం తెలిసింది".

"నీ తిరుపతిలో ఒక రాత్రి నిద్ర చేయగానే కాలాను గుణంగా ఏర్పడే దెబ్బలన్నీ పూడిపోయాయి,

నీ మంత్ర జపం ఎంచుకున్నప్పుడే, చిత్రగుప్తడి లెక్కలు గడిచె....."

"శ్రీ వేంకటేశ్వర స్వామిని శరణంచే అడరి వైకుంఠము మాయరచేతనిలిచే", అని వైష్ణవ భక్తి విశిష్టతను చాటాడు అన్నమయ్య.

"హరియను రెండు అక్షరములు హరియించును
బాతకములు నంబుజనాభా".

గోవిందలో మూడక్షరాలు
నారాయణలో నాలుగక్షరాలు

వెంకటేశ్వర యనేది వేదపంచాక్షరాలు పాపాలను పటాపంచలు చేస్తాయి.

"ఆకటవేళ అలపైన వేళలను,
తేకువ (సందేహము), హరినామమే దిక్కు మరిలేదు"
కొరమాలయున్నవేళ కులము చెడిన వేళ చెఱవడి
వొరులచే జిక్కిన వేళ (కరమాలినవేళ = లేవలేని స్థితిలో)
మఱచి తప్పిన నైన మఱిలేదు తెఱుగు
ఆపద వచ్చినవేళ ఆరడి బడిన వేళ
పాపపు వేళల భయపడిన వేళ
వోపినంత హరినామమొక్కడే గతిగాక
మాపుదాకాపోలిన మరిలేదు తెరను
సంకెలబెట్టిన వేళ చంపబలిచినవేళ
అంకిలిగా నప్పుల వారాగిన వేళ
వెంకటేశు నామమే విడిపించ గతిగాక

మనకే ఇబ్బంది కల్గినా హరినామమే మనల్ని కాపాడు తుందని అన్నమయ్య విశ్వసించాడు. అన్నమయ్యకు అన్నీ అంతా విష్ణుమయమనే తోస్తుంది.

హరియవతారాలే యఖిలదైవతలు
హరిలోనివే బ్రహ్మాండములు
హరినామమే అన్నిమంత్రములు
హరిహరి హరి యనవో మనసా
విష్ణుని మహిమలె విహితకర్మములు
విష్ణుడొక్కడే విశ్వాంతరాత్తుడు

వైష్ణవము అతి ప్రాచీనమైనది, నారదాది మహర్షులు ఆచరించినది.

అన్నమయ్య దృష్టిలో
వైష్ణవులు గానివారెవ్వరు లేరు

విష్ణుప్రభావ మీ విశ్వమంతయుగాన
అంతయు విష్ణు మయంబట మరిదేవ
తాంతరములు గలవననేలా
భ్రాంతి, బొంది యీభావము భావించి
నంతనే పుణ్యులవుట దప్పదుగాన
యెవ్వరి తలచిన నేమి
అవ్వలివ్వల శ్రీహరి రూపుగానివా
రెవ్వరు లేరని యెరుక దోచినజాలు
వైష్ణవ ఆగమ జ్ఞానానికి ఈ సంకీర్తన నిదర్శనం.

భగవద్గీత .....

"భూమిలోన చొచ్చి సర్వభూత ప్రాణులనెల్ల
దీమసాననే మోచేటి దేవుడను నేను
దీపనాగ్నినై బీవదేహముల యన్నములు
తీవుల నరగించేటి దేవుడను నేను
యేపున నిందరిలోని హృదయములోన నుండు
దీవింతు దలపు మరిపై దేవుడనేను
వేదములన్నింటి చేతవేదాంత వేత్తల చేత
ఆది నేనెరగ దగిన యాదేవుడను.
అని కృష్ణుడు అర్జునినితో సెలవిచ్చిన విషయం
అన్నమయ్య సంకీర్తనాయుతంగా వెల్లడి చేశాడు.

స్వామి ఘనతను పరి పరి శ్లాంఘించడం అన్నమయ్య వైష్ణవభక్తికి పరాకాష్ఠ.

"స్వామి సహస్ర లోచన సంతతవినుత
సహస్ర ముఖ శేషశయన
సహస్ర కరకోటి సంపూర్ణతేజా
సహస్ర దివ్య చక్రాయుధా
అనంతచరణ సర్వాధారాధేయ
అనంతకర దివ్యాయుధా....."

వైష్ణవుడిని సులభంగా గుర్తించవచ్చంట, మద మత్సరములు లేక, ఈర్ష్యా ద్వేషములులేని మనస్సుకలిగి, పేదైనా తృప్తితో జీవిస్తు ఆశలు లేనివాడు, వైష్ణవుడు.

విచ్చల విడిగా తిరిగి, ఏమైనాచెడు కార్యాలు చేసి, తినడానికి త్రాగడానికి ఇవ్వక దూషించి, ఎటువంటి వారినైన తూలనాడి దుర్మార్గుల చెంతచేరి, ఆశలు కలిగి వుండని వాడు వైష్ణవుడు".

వైష్ణవుల ధనంగా పేర్కొన్న విషయాలు.....

"జ్ఞానమే మాకు ధనం, సర్వవేదముల సొమ్ము
పూనిన వైరాగ్యమెవుంబళి
ఆనిన గురుసేవలు ఆడుబిడ్డలు నాకు
అచ్యుత నామమేపో అధికధనము"

దీక్షపుచ్చుకున్న వైష్ణవుని మనస్సు.....

సహజమైన వైష్ణవాచార వర్తనుల సహజవాసమే మాసంధ్య

అతిశయంబగు హరిసంకీర్తనమే
సతతంబును మాసంధ్య
యతి రామానుజ మతమేనాకును
చతురత మెరసిన సంధ్య ॥
పరమ భాగవత పాదసేవనమే
సరవినెన్న మా సంధ్య
సిరివరు మహిమల చెలువొందగనే
సరకి వినుటె మాసంధ్య

స్వామి మహిమలు వినడం, భాగవతుల పాదసేవనం వంటివి అన్నమయ్యకు నిత్యకృత్యాలని చెప్పొచ్చు పాదసేవన భక్తి అన్నమయ్య కట్టుబడి వుండి.... విష్ణుదేవుని పాదములే విద్యా బుద్ధీ మాకు అని అన్నాడు.

"వైష్ణవుల మైత్రి యింత వదలని కర్మమా!
గోవిందుని పాదములే కోరి యిహపరములు
దేవదేవుని పాదములే దిక్కును దెసయు మాకు
భావముతో నిలిపితి బాయరూపములు
రూపి పాదములే మాకు అన్నపానభోగములు
పరమాత్ముని పాదాలే పాదే పంచాను మాకు

శరణంటే యెందైనా జనరో దుఃఖములు
అనంతుని పాదములే ఆయుష్య భాగ్యములు".

ఎందరో చెప్పగా వింటి యెవ్వరికైనా విష్ణుడే కందువ కలవాడు మోక్షమివ్వగానర్త యనగా.....

అప్పటి వింటి లోకములన్నిటికి హరియే కప్పి రక్ష కత్వానకు కర్తయననా, గంపక్రింది కోళ్లులాగా కప్పి రక్షిస్తాడని విష్ణుమూర్తిపై అన్నమయ్య సంపూర్ణ విశ్వాసం కలిగి వున్నాడు.

"నీ కథా మృతము నానిరత సేవననాకు
చేకొనుట సకల సుఖ సేవనం బటుగాన
ఇదియె మంత్ర రాజము నాకు నేపొద్దు,
నిదియె వేద సంహిత పాఠము
ఇదియే బహు శాస్త్ర మెల్ల జదువుటనాకు
ఇదియే సంధ్య నాకిదియె జపమటుగాన
ఇదియే బ్రహ్మ విద్యోపదేశము నాకు
ఇదియె దుఃఖవిరహిత భేషజము నాకు
ఇదియె ఉపని షద్వాక్య పద్ధతిగాన
ఇదియె దానఫలమియ్య జాలునునాకు
ఇదియె తపవిరహకర్మము
ఇదియె తిరువేంకటేశ్వరుని సంస్మరణ సుఖమునాకు" అని అన్నమయ్య సంతృప్తి చెందాడు.

నీ రూపు భావించలేము నిక్కపు శ్రీవేంకటేశ అరయ నీనామ జపమన్నిటా సులభము వైష్ణవులకు "ఓం నమో నారాయణ" అనే మంత్ర పంచ సంస్కార దీక్ష ఇస్తు గురువు ఉపదేశిస్తారట

నారదుడు నారాయణ మంత్రాన్ని, ప్రహల్లాదుడు నారసింహమంత్రాన్ని, విభీషణుడు రామ మంత్రాన్ని, ధ్రువుడు వాసుదేవ మంత్రాన్ని, అర్జునుడు కృష్ణ మంత్రాన్ని, శుకుడు విష్ణు మంత్రాన్ని, పఠించి తరించినట్టు కీర్తించాడు. తన కబ్బిన వెంకటేశు మంత్రం వెన్నెల వంటిదని సంతసాన్ని అన్నమయ్య వెలిబుచ్చాడు.

"హరి భక్తివోడ ఎక్కినట్టి వారేగాని తరగు మొరగులను దాటలేరెవ్వరు"

"కోటి జన్మములు యెత్తిన ముక్తికికొన
మొదలు మేమియు కానరాదు".
సంసారకర్త వార్ధి ఈదినా కానరాదు
స్వర్గాది లోకములు కోరివెదికినా కనపడని ముక్తి

గాటుపు కేశవ భక్తి గలిగితె – కైవల్య మతిగాక
వచ్చని అన్నమయ్య స్పష్టం చేశాడు.

వేదాంత వేద్యుడు, విశ్వరూపుడు ఆది మధ్యాంత రహితుడు, నాదప్రియుడు పరమ పురుషుడు, భవబంధహరుడు, పరమపావన మూర్తిని ప్రసన్నం చేసుకోవాలంటే, శ్రవణం, కీర్తనం, పాదసేవనం, అర్చనం, వందనం, నామస్మరణ, దాస్యం, సఖ్యం, ఆత్మ నివేదనం అనే భక్తి మార్గాల్లో ఏదో ఒక మార్గాన్ని అనుసరిస్తూ హరిభక్తి అనేవలపొంది నప్పుడే గదా వైష్ణవుడౌట అన్నది, అన్నమయ్య సంకీర్తనల సారాంశం.

భుక్తికావాలన్న ముక్తికావాలన్న
శ్రీహరే శరణ్యం.....
భక్తితో కొలిచే వారికి స్వామే దాసుడు.....

ఓం నమో వేంకటేశ్వరాయ

* * *